అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సోమవారం 08-07-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 189
Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar
14 పేజీలు వెల : 6.50



బోనమెత్తిన గోల్కొండ

ఘనంగా జాతర షురూ

శ్రీ జగదాంబిక అమ్మవారికి భక్తుల మొక్కులు

పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రులు, స్పీకర్

అలరించిన పోతురాజుల విన్యాసాలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాలు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఆషాఢమాసంలో నిర్వహించే ఈ బోనాల జాతర ఆదివారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. తొలి బోనం(బంగారు బోనం) .. గోల్కొండ కోటలోని శ్రీజగదాంబిక మహంకాళి(ఎల్లమ్మ) అమ్మవారికి ఆలయ కమిటీ సమర్పించడంతో జాతర షురూ అయ్యింది. జగదాంబికా అమ్మకు ప్రత్యేక పూజల అనంతరం అనేక ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో బోనాలను సమర్పించారు. ఈసారి కుమ్మర్ల బోనం పేరుతో భారీగా మహిళలతో 500 బోనాలను అమ్మకు అర్పించారు. ఇక రాష్ట్ర ప్రభుత్వం తరపున దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, స్పీకర్ ప్రసాద్ కుమార్, మేయర్ విజయలక్ష్మి హాజరై అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం లంగర్‌హౌస్ నుంచి గోల్కొండ వరకు తొట్టెలు, బోనాల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఊరేగింపు మధ్యాహ్నం 1.30 గంటలకు కోటలోని బడాబజార్‌లో ఉన్న ఆలయ పూజారి ఇంటికి చేరుకుంది. పూజారి ఇంట్లో ఉన్న ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కంకణధారణతో కోటలోకి ...13లో



కమ్యూనిస్టులు లేకుండా దేశం లేదు

ఇండియా బ్లాక్‌తో రాజ్యాంగాన్ని రక్షించుకోగలిగాం..


విగ్రహ ఆవిష్కరణలో తమ్మినేని

కష్టాలు, కన్నీళ్లున్నంత కాలం ఎర్రజెండా ఉంటుంది

మతోన్మాద విధానాలను తిప్పికొట్టేది కమ్యూనిస్టు ఉద్యమమే : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

కొత్తగూడెంలో ఎర్రబోయిన లింగయ్య స్మారక భవనం ప్రారంభం

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

కమ్యూనిస్టులు లేకుండా దేశం లేదని, కష్టాలు, కన్నీళ్లు ఉన్నంత కాలం ఎర్రజెండా ఎక్కడికీ పోదని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో సింగిల్ పార్టీగా బీజేపీకి 370 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మార్చేదని తెలిపారు. కాంగ్రెస్‌తో సహా లౌకిక, ప్రజాస్వామ్యశక్తులతో ఏర్పడిన ఇండియా బ్లాక్ బీజేపీని నిలువరించి రాజ్యాంగాన్ని రక్షించుకో గలిగిందన్నారు. ఖమ్మం జిల్లా ఖమ్మం అర్బన్ మండలంలోని కొత్తగూడెం గ్రామ శాఖ ఆధ్వర్యంలో నిర్మించుకున్న ఎర్రబోయిన లింగయ్య స్మారక భవనం సీపీఐ(ఎం) కార్యాలయాన్ని ఆదివారం తమ్మినేని ప్రారంభించారు. అంతకుముందు గ్రామంలోని 13, 14 డివిజన్‌లలో నిర్వహించిన ర్యాలీలో పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికంగా మూడు చోట్ల ఏర్పాటు చేసిన సీపీఐ(ఎం) జెండాలనూ ఆవిష్కరించారు. పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం నాయకులు ఎర్రబోయిన గోవింద్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో తమ్మినేని ప్రసంగించారు. మతోన్మాద విధానాలను తిప్పికొట్టేందుకు కమ్యూనిస్టు ఉద్యమం ప్రజల్లోకి ఎంత చొచ్చుకుపోతే అంతమంచిదని అన్నారు. ఓట్లు, సీట్ల సంఖ్య ఎలా ఉన్నా కమ్యూనిస్టులు లేకుండా దేశం బతికి బట్టకట్టలేదని స్పష్టంచేశారు. భూమి పంచాలని, కూలీ పెంచాలని, ఎస్సీ, ఎస్టీలు, స్త్రీలకు హక్కులు కల్పించాలని పోరాడేది కమ్యూనిస్టులు మాత్రమేనని తెలిపారు. ఎర్రబోయిన లింగయ్య వంటి ఆదర్శ కమ్యూనిస్టు పేరు ఈ భవనానికి పెట్టడం గర్వకారణమన్నారు. కాగ్, సీబీఐ, ఎలక్షన్ కమిషన్ వంటి రాజ్యాంగ ...13లో

తక్కువ ఖర్చు.. ఎక్కువ ఆయకట్టు

అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులకు ప్రాధాన్యత

వచ్చే మార్చి నాటికి పూర్తి చేయాలని నిర్ణయం

ఆరు ప్రాజెక్టులపై సర్కారు ప్రత్యేక దృష్టి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో అసంపూర్తిగా ఉన్న పలు సాగునీటి ప్రాజెక్టులను వీలైనంత తొందరగా వినియోగంలోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పించారు. ఇప్పటికే ఖర్చుపెట్టి, గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన ప్రాజెక్టులను వీలైనంత త్వరగా రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని కీలక నిర్ణయం తీసుకున్నారు. వీటిలో తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు సాగునీటిని అందించే ప్రాజెక్టులపై సీఎం ప్రత్యేక దృష్టి పెట్టారు. ఆ మేరకు అటు గోదావరి బేసిన్‌తో పాటు ఇటు కృష్ణా బేసిన్‌లో అర్థాంతరంగా ఆగిపోయిన ప్రాజెక్టుల వివరాలన్నీ ఇరిగేషన్ ఇంజినీర్ల నుంచి తెప్పించుకున్నారు.

ఇందులో భాగంగా గోదావరి బేసిన్‌లో ఉన్న నీలం వాగు, పింప్రి ప్రాజెక్టు, పాలెం వాగు, మత్తడి వాగు, ఎస్సారెస్పీ స్టేజీ 2, సదర్మట్ ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాలని నిర్ణయించారు. ఈ ప్రాజెక్టులకు సంబంధించి పనులు పూర్తి చేసేందుకు దాదాపు రూ.241 కోట్లు ఖర్చవుతుందనీ, దాదాపు 48 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందుతుందని ఇరిగేషన్ విభాగం అంచనాలు రూపొందించింది. తక్కువ నిధులతో పూర్తయ్యే ఈ ప్రాజెక్టుల పనులను వీలైనంత తొందరగా చేపట్టాలనీ, వచ్చే ఏడాది మార్చి నాటికి వందకు వంద శాతం పూర్తి చేయాలని నిర్ణయం తీసుకున్నారు. అందుకు వీలుగా లక్ష్యాలు నిర్దేశించుకోవాలనీ, సమగ్ర ప్రణాళిక తయారు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. నీలంవాగు ద్వారా మంచిర్యాల జిల్లా, పింప్రి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ ద్వారా నిర్మల్ జిల్లా, పాలెం వాగుతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మత్తడివాగుతో ఆదిలాబాద్ జిల్లా, ఎస్సారెస్పీ స్టేజీ 2తో వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, జనగాం, సూర్యాపేట జిల్లాలకు, సదర్మట్ ప్రాజెక్టుతో నిర్మల్ జిల్లాలోని రైతులకు సాగునీరు అందుతుంది.

రైతులకు సాగునీటిని అందించాలంటే ఆయకట్టు భూములకు నీళ్లను పారించే డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థలపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వం పదేండ్లలో చేపట్టిన ప్రాజెక్టులన్నీ బ్యారేజీలు, పంప్ హౌజులకే పరిమితమయ్యాయి. భారీగా అప్పులు ...13లో

నేడు ఏపీకి సీఎం రేవంత్

మాజీ సీఎం వైఎస్ఆర్ జయంతి వేడుకలకు హాజరు 13లో..


వివరాలు 5లో..

జగన్నాథ రథయాత్రలో సీఎం రేవంత్‌రెడ్డి

యుద్ధాలను సృష్టిస్తున్నది అగ్రరాజ్యమే

అమెరికా గుప్పెట్లో మోడీ

ఆయుధాల అమ్మకంతోనే ఆ దేశ మనుగడ : పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడికి నిరసనగా

ఐప్సో ధర్నాలో వక్తలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'ప్రపంచంలో శాంతి లేకుండా చేసేది అమెరికానే. దాని మనుగడే ఆయుధాల అమ్మకంతో ముడిపడి ఉంది. ఎక్కడో ఒక దగ్గర యుద్ధాన్ని సృష్టించి ఆయుధాలు అమ్ముకుని సొమ్ము ...2లో



మాట్లాడుతున్న సారంపల్లి మల్లారెడ్డి

ప్రభాకర్ భూమికి శాశ్వత పరిష్కారం చూపెడతాం

ఆత్మహత్యకు పురిగొల్పిన వారిని వదిలిపెట్టం

రైతు పిల్లల చదువుకు ప్రభుత్వ సాయం : డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క


రైతుకుటుంబంతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి

నవతెలంగాణ-బోనకల్ (చింతకాని)

భోజడ్ల ప్రభాకర్ భూమికి శాశ్వత పరిష్కారం చూపెడతామని, ఆ కుటుంబానికి తగిన న్యాయం చేస్తామని మధిర ఎమ్మెల్యే, డిప్యూటీ ...13లో

టీజీపీఎస్సీ గ్రూప్-1 ప్రిలిమ్స్ ఫలితాలు విడుదల

మెయిన్స్‌కు 31,382 మందికి అర్హత



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

టీజీపీఎస్సీ గ్రూప్-1 ప్రిలిమ్స్ ఫలితాలు విడుదలయ్యాయి. టీజీపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌లో ఫలితాలను అందుబాటులో ఉంచారు. తుది కీతో పాటు రిజల్ట్స్‌ను టీజీపీఎస్సీ ఒకేసారి విడుదల చేసింది. అభ్యర్థులు తమ లాగిన్‌లోకి వెళ్లి చెక్ చేసుకోవచ్చు. గ్రూప్-1 మెయిన్స్‌కు 31,382 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. అక్టోబర్ 21 నుంచి 27 వరకు మెయిన్స్ పరీక్షలు నిర్వహించనున్నట్టు టీజీపీఎస్సీ కార్యదర్శి డాక్టర్ ఇ.నవీన్ నికోలస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మెయిన్స్ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లను పరీక్షలకు ఒక వారం ముందు డౌన్ లోడ్ చేసుకోవచ్చని సూచించారు.

నిరుత్సాహపడొద్దు : సీఎం

ప్రాథమిక పరీక్షలో విజయం సాధించలేకపోయిన అభ్యర్థులు నిరుత్సాహపడవద్దని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. జీవితంలో లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం, దాని కోసం ప్రయత్నించడం, విజయం సాధించే వరకు ప్రయత్నాన్ని విరమించకపోవడం ఒక వ్యాపకంగా పెట్టుకున్న వారు ఎప్పటికైనా విజయ తీరాలను చేరుతారని పేర్కొన్నారు. అలాగే గ్రూప్ 1 మెయిన్స్‌కు అర్హత సాధించిన 31,382 మందికి సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ట్వీట్ చేశారు. గ్రూప్ 1 మెయిన్స్‌లో విజయం సాధించాలని ఆకాంక్షించారు.

తెలంగాణ నుంచి టీడీపీని వేరు చేయలేరు

త్వరలో రాష్ట్రంలో పార్టీకి పునర్వైభవం

రెండు తెలుగు రాష్ట్రాలు.. నాకు రెండు కండ్లు

- రాష్ట్రాలుగా విడిపోయినా.. తెలుగు జాతి ఒక్కటే
- హైదరాబాద్‌లో టీడీపీ చేసిన అభివృద్ధినే కొనసాగించిన కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు
- విభజన సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకుంటాం : తెలంగాణ టీడీపీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో అధినేత చంద్రబాబు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

"తెలంగాణ ప్రజల నుంచి తెలుగు దేశాన్ని వేరు చేయలేరు. తెలుగు జాతి ఉన్నంత వరకు టీడీపీ ఉంటుంది. తెలంగాణలో పార్టీకి మళ్లీ పునర్వైభవం వస్తుంది. రెండు తెలుగు రాష్ట్రాలు... నాకు రెండు కండ్లు. రాష్ట్రాలుగా విడిపోయినా తెలుగు జాతి ఒక్కటే. ఈ గడ్డపై పుట్టిన ఇద్దరు మహనీయులు తెలుగు ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేశారు. ఒకప్పుడు మదరాసి అని పిలిచే దశ నుంచి తెలుగు వారికి గుర్తింపు తెచ్చిన నాయకులు నందమూరి తారక రామారావు అయితే, ఆర్థిక సంస్కరణల రూపశిల్పి పీవీ నర్సింహరావు అయినందుకు గర్వంగా ఉంది." అని తెలుగుదేశం పార్టీ అధినేత, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ...13లో


బెలూన్లను ఎగరేస్తున్న ఏపీ సీఎం చంద్రబాబు



కేరళలో డిజిటల్ విద్య భేష్

అది అన్ని దేశాలకూ మోడల్

ఎడ్‌టెక్ నమూనాపై యూనిసెఫ్ ప్రశంసలు

డిజిటల్ విద్యకు సంబంధించి కేరళ ప్రభుత్వం తీసుకున్న చర్యలను (ఎడ్‌టెక్) యూనిసెఫ్ ప్రశంసించింది. ఇది భారత్‌లోని ఇతర రాష్ట్రాలకే కాకుండా వర్ధమాన, సంపన్న దేశాలకు కూడా ఓ నమూనాగా నిలిచిందని యూనిసెఫ్ ఇండియా అధ్యయనం తెలిపింది. దీనికి సంబంధించిన నివేదికను ప్రచురించారు.

తిరువనంతపురం : అక్షరాస్యతలో అగ్రభాగాన ఉన్న కేరళ..విద్యారంగంలో సమూల మార్పులతో ముందుకెళ్తోంది. దేశ,విదేశాల్లోనూ కేరళ చదువు గురించి చర్చించుకునే స్థాయికి ఎదిగింది. తాజాగా యూనిసెఫ్ కేరళలోని పినరయి సర్కారును ప్రశంసించింది. విద్యాబోధన జరుగుతున్న తీరుపై సంతృప్తి వ్యక్తం చేసింది. యూనిసెఫ్ ఇండియా విద్యా నిపుణురాలు ప్రమీలా మనోహరన్ నుంచి కేరళ విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి రాణీ జార్జ్ అధ్యయన నివేదిక ప్రతిని అందుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి పినరయి విజయన్, సాధారణ విద్యా శాఖ మంత్రి వి.శివకుట్టి హాజరయ్యారు. విద్యకు సంబంధించిన మౌలిక సదుపాయాలు, సాంకేతిక పరిజ్ఞానం (కైట్) కార్యక్రమాన్ని కేరళ అమలు చేస్తోంది. రాష్ట్రంలోని 2,174 ఉన్నత పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ నేపథ్యంలో యునిసెఫ్ ఇండియా అధ్యయనం కైట్ కార్యక్రమంపై దృష్టి సారించింది. ఈ అధ్యయనం పది సిఫారసులు చేసిందని అధికార ప్రకటనలో తెలియజేశారు. కేరళలో కైట్ ఆధ్వర్యంలోని ఎడ్‌టెక్ నమూనా కార్యక్రమం లాభాలు ఆశించే అమ్మకందారులపై ఆధారపడడం లేదు. దీనిని ఇతర ప్రాంతాలలో కూడా అమలు చేయవచ్చునని నివేదిక తెలిపింది. ఓపెన్-సోర్స్ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి కేరళ రూ.3,000 కోట్లు ఆదా చేసిందని చెప్పింది. కైట్ కార్యక్రమాన్ని ...13లో



ఫార్మసీ హబ్‌గా హైదరాబాద్

గతేడాది రూ.1.83 లక్షల కోట్ల ఫార్మా ఎగుమతులు

అమెరికాకే రూ.67 వేల కోట్ల ఉత్పత్తులు

ఇండియన్ ఫార్మసూటికల్ 73వ కాంగ్రెస్‌లో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హైదరాబాద్ ఫార్మసీ హబ్‌గా మారినందుకు ఎంతో సంతోషంగా ఉందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి చెప్పారు. భారతీయ ఫార్మా ఉత్పత్తులు నాణ్యతలో, అన్ని విధాలా ఉత్తమమైనవని రుజువైందన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో జరుగుతున్న ఇండియన్ ఫార్మాసూటికల్ 73వ కాంగ్రెస్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇందులో ఫార్మా రంగానికి చెందిన 50 వేల మంది అనుభవజ్ఞులు పాల్గొన్నారు. వారినుద్దేశించి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్ ...13లో


ఫార్మా కాంగ్రెస్‌లో మాట్లాడుతున్న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి



ఆదివాసీ గిరిజనులను గాలికొదిలేసిన ప్రభుత్వాలు

- సీఎం సొంత జిల్లాలోనే ఐటీడీఏ పీఓ పోస్టు ఖాళీ
- ఈశ్వరమ్మ ఘటన, నాగన్న మృతిపై పోలీసుల దర్యాప్తు అంతంతే
- విద్యా, వైద్య, ఉపాధిని మరిచాయి : ఆదివాసీ అధికార రాష్ట్రీయ మంచ్ జాతీయ నేత మిడియం బాబురావు

నవతెలంగాణ-కొల్లాపూర్ రూరల్

ఆదివాసీ గిరిజనులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గాలికొదిలేశాయని ఆదివాసీ అధికార రాష్ట్రీయ మంచ్ జాతీయ నేత మాజీ ఎంపీ మిడియం బాబురావు అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలోని మొల్లచింతలపల్లి గ్రామంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు శివ వర్మ అధ్యక్షతన.. చెంచు మహిళ ఈశ్వరమ్మ ఘటన, నాగన్న మృతిపై విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. చెంచులకు ఇచ్చిన భూముల్ని చెంచేతరులు బలవంతంగా లాక్కుంటున్నా.. ప్రభుత్వం కండ్లప్పగించి చూస్తుందే తప్ప వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. ముల్లచింతలపల్లిలో ఈశ్వరమ్మపై జరిగిన ఘటన దీనికి నిదర్శనమన్నారు. ఈశ్వరమ్మ ఘటన, నాగన్న మృతిపై పోలీసుల దర్యాప్తు నామమాత్రంగా జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం సొంత జిల్లాలోనే ఐటీడీఏ పీఓ పోస్టు ఖాళీగా ఉండటం సిగ్గు చేటన్నారు. చెంచు పేటల్లో విద్యార్థులకు అంగన్వాడీ కేంద్రం, హెల్త్ సెంటర్ లేదని, దానివల్ల పోషకాహారమందక రక్తహీనతతో అనేక మంది చనిపోతున్నారని వాపోయారు. అన్ని డిపార్ట్‌మెంట్లను ఐటీడీఏ పరిధిలోకి తీసుకురావాలన్నారు. చెంచులకు 10 ఎకరాల భూమి, సొంత ఇంటి నిర్మాణం, రూ.5లక్షల వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా ప్రధాన కార్యదర్శి వర్దం పర్వతాలు, కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.శ్రీనివాస్, ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సచిన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు భీమ్‌రావు, సహాయ కార్యదర్శి బండారు రవికుమార్, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు అశోక్, సీఐటీయూ నాయకులు ఈశ్వర్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.శ్రీనివాస్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.తారా సింగ్, చెంచు సేవా సంఘం అధ్యక్షులు వెంకటేష్, కార్యదర్శి వెంకటస్వామి, కోశాధికారి మల్లయ్య, సలహాదారులు శివ తదితరులు పాల్గొన్నారు.

కేవ్ బార్ అండ్ పబ్‌పై పోలీసుల దాడి

- 55 మందికి డ్రగ్స్ పరీక్షలు
- 24 మందికి పాజిటివ్
- వివరాలు వెల్లడించిన మాదాపూర్ డీసీపీ వినీత్



నవతెలంగాణ-మియాపూర్

రంగారెడ్డి జిల్లా రాయదుర్గం పీఎస్ ఖాజాగూడలోని కేవ్ బార్ అండ్ పబ్‌పై శనివారం రాత్రి నార్కోటిక్స్, ఎస్ఓటీ పోలీసులు దాడి నిర్వహించారు. ఈ దాడిలో 55 మందిని అదుపులోకి తీసుకుని డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా.. 24 మందికి పాజిటివ్ వచ్చింది. వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను గచ్చిబౌలిలోని మాదాపూర్ డీసీపీ కార్యాలయంలో డీసీపీ వినీత్ ఆదివారం మీడియాకు వెల్లడించారు. కేవ్ బార్ అండ్ పబ్‌లో ఫారెస్ట్ సైకడాలిక్ థీమ్‌తో పార్టీ నిర్వహించారు. ఇందులో పాల్గొనే వారికి ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఆహ్వానం అందుతుంది. వారికి ప్రత్యేకమైన కోడ్ ఉంటుంది. సైకడాలిక్ థీమ్‌లో ఎలక్ట్రానిక్ మ్యూజిక్ హై పిచ్‌లో ఉంటుంది.. డ్రగ్స్ తీసుకున్న వారు మాత్రమే ఆ మ్యూజిక్ ఎంజాయ్ చేయగలరు. సామాన్యులు అంతటి డెసిబెల్స్ శబ్దాన్ని వినలేరు. అయితే ఈ పార్టీలో 55 మంది పాల్గొన్నారు. పక్కా సమాచారం తెలుసుకున్న నార్కోటిక్స్, ఎస్ఓటీ, రాయదుర్గం పోలీసులు పబ్‌పై సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 55 మందినీ అదుపులోకి తీసుకుని డ్రగ్స్ పరీక్షలు నిర్వహించారు. వీరిలో 24 మందికి పాజిటివ్ వచ్చింది. ఈ పార్టీకి హాజరైన వారిలో ప్రముఖ కంపెనీల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, విద్యార్థులు ఉన్నారు. డీజే ఆపరేటర్ అబ్దుల్ అయూబ్, గౌరంగ్, పబ్ మేనేజర్ ఆర్. శేఖర్‌ను అదుపులోకి తీసుకున్నారు. నలుగురు పబ్ ఓనర్లలో ఒకరిని అదుపులోకి తీసుకోగా మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. 24 మందిపై ఎన్‌డీపీఎస్ సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం పబ్‌ను మూసేస్తున్నట్టు డీసీపీ వినీత్ తెలిపారు. ఈ నేపథ్యంలో అన్ని పబ్‌లను తనిఖీ చేస్తామన్న ఆయన ఎవరు డ్రగ్స్ సరఫరా చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డ్రగ్స్ పట్ల యువత, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అయితే ఈ కేసులో పోలీసులు పొంతనలేని సమాచారం వెల్లడించినట్టు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ పార్టీకి వచ్చిన ప్రతి ఒక్కరూ డ్రగ్స్ తీసుకునే రావాలని నిర్వాహకులు చెప్పినట్టు పోలీసులు తెలపగా.. పాల్గొన్న 55 మందిలో 24 మందికి మాత్రమే డ్రగ్స్ పాజిటివ్ రావడం ఏంటనే ప్రశ్న వినిపిస్తున్నది. అయితే కొంతమందిని కావాలనే ఈ కేసు నుంచి తప్పించారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు మీడియాకు వివరాలను వెల్లడించినప్పుడు ఈ పార్టీలో పాల్గొన్న వ్యక్తులు డ్రగ్స్ తీసుకోకపోతే లైవ్ మ్యూజిక్ సౌండ్ భరించడం కష్టమని వారే చెప్పడం కొసమెరుపు.

హైదరాబాద్‌లో భారీగా బంగారం పట్టివేత

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్‌లో భారీ ఎత్తున బంగారాన్ని డీఆర్ఐ అధికారులు పట్టుకున్నారు. వివరాల్లోకెళ్తే.. కోల్‌కత్తా నుంచి హైదరాబాద్‌కు బస్సులో ఇద్దరు వ్యక్తులు అక్రమంగా బంగారం తరలిస్తుండగా వారిని డీఆర్ఐ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 3,982.25 గ్రాముల బంగారాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. ఈ బంగారం విలువ సుమారు రూ.2 కోట్లు విలువ ఉంటుందని అధికారులు వెల్లడించారు.

మహిళా కౌలు రైతు ఆత్మహత్య

నవతెలంగాణ-పర్వతగిరి

వర్షాలు లేక రెండుసార్లు విత్తనాలు నాటినా మొలకెత్తకపోవడంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలన్న మనస్తాపంతో మహిళా కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన హన్మకొండ జిల్లా వర్ధన్నపేట మండలంలోని గుబ్బేటి తండాకు చెందిన బానోతు కములమ్మ(35) భర్త రాంధన్‌లు తిర్మలాయపల్లి శివారులో గత నాలుగేండ్లుగా 9 ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. ఈ ఏడాది కూడా 20 రోజుల కిందట పత్తి గింజలు నాటారు. వర్షాలు లేక మొలకెత్తకపోవడంతో మళ్ళీ రెండోసారి పెట్టారు. అయినా ఫలితం లేకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై శనివారం కమలమ్మ పురుగుల మందు తాగింది. దాంతో భర్త రాందస్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం పరిస్థితి విషమించి మృతి చెందింది. భర్త ఫిర్యాదు మేరకు వర్ధన్నపేట ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వం ద్వారా మృతురాలి కుటుంబానికి సాయం అందించాలని స్థానిక తండా వాసులు కోరుతున్నారు.

సీపీఐ(ఎం) కార్యాలయానికి ఎంపీ రఘురాంరెడ్డి

విజయానికి సహకరించినందుకు సీపీఐ(ఎం)కు కృతజ్ఞతలు

- అభినందించిన ఖమ్మం జిల్లా కమిటీ
- ఎంపీ దృష్టికి ప్రధాన సమస్యలు



నవతెలంగాణ-ఖమ్మం ప్రాంతీయప్రతినిధి

ఎన్నికలప్పుడు తనకు మద్దతునిచ్చి భారీ విజయానికి సహకరించినందుకు సీపీఐ(ఎం)కు ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం సీపీఐ(ఎం) జిల్లా కార్యాలయం సుందరయ్య భవన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన్ను పార్టీ జిల్లా కమిటీ శాలువా కప్పి సన్మానించింది. అనంతరం సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడారు. ఖమ్మం పార్లమెంట్ సభ్యునిగా అత్యధిక మెజార్టీతో గెలుపొందిన రామసహాయం రఘురాంరెడ్డిని అభినందించారు.

ఇండియా బ్లాక్‌లో భాగంగా మతతత్వ బీజేపీని ఓడించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గెలు పునకు తమ పార్టీ సంపూర్ణ మద్దతిచ్చిందని తెలిపారు. ఖమ్మం ఎంపీగా రఘురాంరెడ్డి జిల్లాలో ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తారని ఆశిస్తున్నామని తెలిపారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా అందే నీరు జిల్లాలో ఉన్న రైతులందరికీ ఉపయోగపడేలా ఉండటంతోపాటు పాలేరు వరకు అందించేందుకు కృషి చేయాలని కోరారు. సూర్యాపేట-దేవరపల్లి, అమరావతి-నాగ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ హైవేల్లో భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం విషయంలో నేషనల్ హైవేస్ అథారిటీస్ అధికారులతో సంప్రదించి మెరుగైన ప్యాకేజీ అందించాలని కోరారు.ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి మాట్లాడుతూ.. తన గెలుపును అందరి విజయంగా భావిస్తానని తెలిపారు. ఎన్నికల వరకే తాను కాంగ్రెస్ మనిషినని, గెలిచిన తర్వాత ప్రజల మనిషినని తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు తన వంతుగా లోక్‌సభలో గళం విప్పుతానని అన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానని, ఏ సమస్య వచ్చినా నేరుగా కలిసి విన్నవించుకోవచ్చని అభయమిచ్చారు. జిల్లాలో అందరినీ కలుపుకొని వారితో మాట్లాడి అక్కడున్న సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. జిల్లాలో గిరిజన యూని వర్సిటీ, కేంద్రీయ, నవోదయ విద్యాలయాలతో ఇతర అంశాలపైనా దృష్టి సారిసామన్నారు. కార్మికులు, కర్షకులు ఎదుర్కొం టున్న అనేక సమస్యలను అధ్యయనం చేసి పరిష్కరిస్తాననీ హామీ ఇచ్చారు. ఈ కార్య క్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, కాంగ్రెస్ నాయకులు మిక్కి లినేని నరేంద్ర, సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు ఎం.సుబ్బారావు, పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రం, కళ్యాణం వెంకటేశ్వరరావు, చింతలచెర్వు కోటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు మాదినేని రమేష్, యర్రా శ్రీనివాసరావు, మెరుగు సత్య నారాయణ, నందిపాటి మనోహర్, పిన్నింటి రమ్య, ఎస్.కె.బషీరుద్దీన్, ఆర్.ప్రకాష్, బండారు రమేష్, పారుపల్లి ఝాన్సీ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలి

- వన మహోత్సవాన్ని ప్రారంభించిన మంత్రి సీతక్క : విద్యార్థులతో కలిసి మంత్రి, కలెక్టర్ భోజనం



నవతెలంగాణ-ములుగు

వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లాలో నాటిన ప్రతి మొక్క సంరక్షణకు ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవాలని, మొక్కల పెంపకం, సంరక్షణలో నాణ్యత పెరగాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అలియాస్ అనసూయ అన్నారు. ఆదివారం మంత్రి సీతక్క జాకారం సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజ, డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్‌తో కలిసి మొక్కలు నాటి వన మహోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మంత్రి, కలెక్టర్ విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పర్యావరణ సమతుల్యత, మొక్కల పెంపకం, పచ్చదనం ప్రాముఖ్యత విద్యార్థి దశ నుంచే పిల్లలకు తెలియాలనే ఉద్దేశంతో పాఠశాల వద్ద వన మహోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని మొక్కలను నాటడంలో పెద్ద లక్ష్యాలను ఏర్పాటు చేసుకోకుండా, తక్కువ మొక్కలు నాటినప్పటికీ వాటిని వంద శాతం సంరక్షించాలని అన్నారు. జిల్లా కేంద్రంలో ప్రజలకు అవసరమైన పూల మొక్కలు, కుండీల్లో పెంచే మొక్కలు అందించే అవకాశాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. పచ్చదనం పెంచేందుకు చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమాన్ని ఉద్యమంలా కొనసాగించాలని, రాజకీయాల కతీతంగా అందర్నీ కలుపుకొని పనిచేయాలని కోరారు. వర్షం కోసం ఆకాశం వైపు కాకుండా మొక్కల వైపు చూసే పరిస్థితి రావాలని, ఎక్కువ అటవీ ప్రాంతం, మొక్కలు, చెట్లు ఉన్న ప్రాంతాల్లో సమృద్ధిగా వర్షపాతం ఉంటుందని తద్వారా వ్యవసాయానికి సాగునీరు అందుతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోనే ములుగు జిల్లాలో 76-77 అటవీ శాతం ఉందని దీని ద్వారానే జిల్లాలో ఎక్కువ వర్షపాతం నమోదవుతుందని తెలిపారు. కురిసిన వర్షపు నీటిని నిల్వ చేయడం కోసం చెరువులు, కుంటలతో పాటు అటవీ ప్రాంతంలోనూ చెక్‌డ్యాముల నిర్మాణం జరగాలని సూచించారు. ములుగు ప్రాంతాన్ని మున్సిపాలిటీగా ఏర్పాటు చేసే ఫైల్ గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉందని, అలాగే త్వరలోనే మల్లంపల్లి మండల ఏర్పాటు, ఏటూరు నాగరం రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని తెలిపారు.విద్యార్థులు మంచిగా చదువుకొని సివిల్ సర్వీసెస్, సాఫ్ట్‌వేర్, డాక్టర్ ఇలా వివిధ ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని తెలిపారు. వసతి గృహాల్లోని విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని అన్నారు. వానాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలని, ఈగలు, దోమల వల్ల వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ.. ప్రస్తుత సంవత్సరం జిల్లాలో 13.40 లక్షల మొక్కలు నాటేందుకు కార్యాచరణ రూపొందించామని, వంద శాతం నాటిన మొక్కల సంరక్షణకు ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. కరెంటు పోల్ దగ్గర, రోడ్డుకు సమీపంలో మొక్కలు నాటొద్దని సూచించారు. ఈ సమావేశంలో సోషల్ వెల్ఫేర్ ఆర్సీఓ విద్యారాణి, డీఆర్డీఓ శ్రీనివాస్ కుమార్, డీఎస్పీ రవీందర్, తహసీల్దార్ విజయ భాస్కర్, ఎంపీడీఓ రామకృష్ణ, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నైతిక బోధనలకే బాబాలను పరిమితం చేయాలి

- వారి ఆస్తుల లెక్క తేల్చాలి
- ఆధ్యాత్మికత పేరుతో వ్యాపారాలా? : మానవ వికాస వేదిక అధ్యక్షులు బి.సాంబశివరావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశంలో బాబాలను నైతిక బోధనలకే పరిమితం చేయాలని మానవ వికాస వేదిక అధ్యక్షులు బి.సాంబశివరావు డిమాండ్ చేశారు. ఆదాయ పన్ను శాఖ ద్వారా వారి ఆస్తుల లెక్క తేల్చాలని కోరారు. ఆధ్యాత్మికత పేరుతో జరుగుతున్న వ్యాపారాలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరముందని తెలిపారు. ఆధ్యాత్మికత, సంస్కృతి రెండూ వేర్వేరు అంశాలని స్పష్టం చేశారు. హత్రాస్ దురంతం నేపథ్యంలో ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో 'మూఢ నమ్మకాల నిరోధక చట్టం ఆవశ్యకత' అనే అంశంపై వెబినార్ నిర్వహించారు. ఈ వెబినార్‌లో సాంబశివరావుతో పాటు విజ్ఞానదర్శిని అధ్యక్షులు టి.రమేశ్ మాట్లాడారు. ఎస్వీకే కార్యదర్శి ఎస్.వినయకుమార్ సమన్వయం చేశారు. సాంబశివరావు మాట్లాడుతూ దేశంలో రకరకాల మూఢ నమ్మకాలు ప్రజలను బాధితులుగా మారుస్తున్నాయని తెలిపారు. నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో గణాంకాల ప్రకారం ప్రతి ఏటా వేలాది మంది బాధితులవుతున్నారని చెప్పారు. కేంద్రంలో మూఢ నమ్మకాల చట్టం తెచ్చి బాబాలు, స్వామీజీలపై నియంత్రణ పెట్టాల్సిన అవసరముందని సూచించారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక యూనివర్సిటీల స్థాయిల్లోనూ మూఢ నమ్మకాలను ప్రోత్సహించేలా కోర్సులను ప్రవేశపెడుతోందని విమర్శించారు. రమేశ్ మాట్లాడుతూ దేశంలో వివిధ రాష్ట్రాల్లో ఒకట్రెండు మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా చట్టాలున్నాయని తెలిపారు. మొత్తం మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా సమగ్రంగా చట్టం రావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. కర్నాటక, మహారాష్ట్రలో మూఢ నమ్మకాల నిరోధక చట్టం తెచ్చినట్టుగా తెలంగాణలోనూ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఇదే విషయంపై ప్రభుత్వాన్ని మూఢ నమ్మకాల నిరోధక చట్టం సాధన సమితి ద్వారా కలువనున్నట్టు తెలిపారు. మతాల పేరుతో జరుగుతున్న మోసాలపై పోరాడుతున్న హేతువాదులు, నాస్తికులతో ఆయా మతాల్లో ఉన్న భక్తులు కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు.

నాటో ఎజెండాగా మారిన యుద్ధం

- హంగేరియన్ ప్రధాని విక్టర్ ఓర్బన్



నాటో తన శాంతియుత రక్షణాత్మక స్వభావాన్ని యుద్ధ పిపాసిగా మార్చిందని హంగేరియన్ ప్రధాన మంత్రి విక్టర్ ఓర్బన్ పేర్కొన్నాడు. అమెరికా నేతత్వంలోని మిలిటరీ కూటమి ఉక్రెయిన్ యుద్ధాన్ని మరింత తీవ్రతరం చేసే చర్యలు చివరికి రష్యాతో ప్రత్యక్ష సైనిక ఘర్షణకు దారితీస్తాయని, ఇది విపత్కర పరిణామాలకు దారితీస్తుందని ఉక్రెయిన్ వివాదంలో పాశ్చాత్య ప్రమేయాన్ని తీవ్రంగా విమర్శించే హంగేరీ నాయకుడు పదేపదే హెచ్చరించాడు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో శుక్రవారంనాడు ఓర్బన్ మాస్కోలో చేసిన ఆకస్మిక పర్యటనలో సమావేశమయ్యాడు. ఓర్బన్ శాంతి పరిరక్షక మిషన్‌లో ఉన్నాడని హంగేరియన్ ప్రధాన మంత్రి కార్యాలయం స్పష్టం చేసింది. ఉక్రెయిన్ వివాదాన్ని శాంతియుతంగా పరిష్కరించడానికి సంభావ్య మార్గాలపై పుతిన్, ఓర్బన్‌ల మధ్య చర్చ జరిగింది. మాస్కో, కీవ్ స్థానాలు చాలా దూరంలో ఉన్నాయని చర్చల అనంతరం ఓర్బన్ అంగీకరించాడు. అయినప్పటికీ " మేము ఇప్పటికే అత్యంత ముఖ్యమైన దశను తీసుకున్నాము. శాంతి కోసం మా ప్రయత్నాన్ని కొనసాగించడానికి కట్టుబడి ఉన్నాము" అని ఓర్బన్ ప్రకటించాడు. వారం ప్రారంభంలో హంగేరియన్ ప్రధాన మంత్రి కీవ్ చేరుకున్నారు. అక్కడ అతను ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్స్కీతో సమావేశమయ్యాడు. తక్షణం కాల్పుల విరమణ చేసి, చర్చలను ప్రారంభించాలని ఓర్బన్ సూచించాడు.తన మాస్కో పర్యటన రోజున, ఓర్బన్ రాసిన ఒక వ్యాసం న్యూస్‌వీక్‌లో ప్రచురించబడింది. ఇందులో ఆయన 1999 నుండి హంగరీ సభ్య దేశంగా ఉన్న నాటోకు సంబంధించిన తాజా ధోరణులను ప్రస్తావించాడు. అనేక నాటో కార్యకలాపాలు, కార్యక్రమాలలో బుడాపెస్ట్ యొక్క చురుకైన భాగస్వామ్యాన్ని, అలాగే బ్లాక్ యొక్క 2 శాతం రక్షణ వ్యయ లక్ష్యంతో తన సమ్మతిని దీనిలో అతను నొక్కి చెప్పాడు. 25 సంవత్సరాల క్రితం తన దేశం చేరిన నాటో శాంతి సంరక్షణ, రక్షణ కోసం నిలిచిన సైనిక కూటమి అని ఓర్బన్ పేర్కొన్నాడు. అయితే, "ఈనాడు శాంతికి బదులుగా యుద్ధాన్ని ఎజెండాగా మార్చి కయ్యానికి కాలుదువ్వే కూటమిగా నాటో మారింది "అని ఓర్బన్ తనవిచారాన్ని వ్యక్తం చేశాడు. ప్రపంచంలోని ఇతర భౌగోళిక రాజకీయ ప్రాబల్య కేంద్రాలతో సైనిక ఘర్షణ ఆవశ్యకత లేదా అనివార్యత కోసం నాటోలోని కొన్ని శక్తులు పని చేస్తున్నాయి అని హంగరి ప్రధాని అన్నాడు.అనేక సభ్య దేశాలు ఇటీవల ఉక్రెయిన్ యుద్ధంలో నాటో పాల్గొనాలనే కాంక్షతో ఉన్నాయని ఆయన పేర్కొన్నాడు. ఫిబ్రవరి చివరలో ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ ఉక్రెయిన్ యుద్ధంలో ఫ్రెంచ్ దళాల మోహరింపును తోసి పుచ్చలేమని చెప్పాడు. అతని సూచన జర్మనీ, ఇతర సభ్య దేశాల నుండి విమర్శలను ఎదుర్కొన్నప్పటికీ, ఫ్రెంచ్ దేశాధినేత అనేక సందర్భాలలో వివాదాస్పద ప్రకటనలను రెట్టింపు చేశాడు. మే నెలలో, ఎస్టోనియా, పొరుగున ఉన్న లిథువేనియా లాజిస్టికల్, ఇతర నాన్-కాంబాట్ మిషన్ల కోసం ఉక్రెయిన్‌కు దళాలను పంపడానికి తమ సంసిద్ధతను సూచించాయి. నాటో తన పంథాను మార్చుకోకపోతే అది అనివార్యంగా పతనం అవుతుందని ఓర్బన్ రాసిన వ్యాసంలో విస్పష్టంగా ప్రకటించాడు.

యుద్ధాలను సృష్టిస్తున్నది అగ్రరాజ్యమే



(మొదటిపేజీ తరువాయి)

చేసుకోవటం దాని లక్ష్యం. అందుకే అది శాంతికి వ్యతిరేకం. ఒక్క మాటలో చెప్పాలంటే అదో యుద్ధ పిపాసి. పెట్టుబడి, ఆధిపత్యం కోసం జరిగే యుద్ధాల వల్ల ప్రపంచంలో కోట్లాది మంది అమాయక ప్రజలు బలవుతున్నారు' అంటూ పలువురు వక్తలు విమర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం(ఐప్సో) ఆధ్వర్యాన ఇందిరా పార్కు వద్ద "పాలస్తీనాకు మద్దతుగా నిలబడదాం- ప్రపంచ శాంతికి పోరాడుదాం" అంటూ ధర్నా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ యాదవరెడ్డి అధ్యక్షత వహించారు. సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు, మైనార్టీ ఫైనాన్స్ కమిషన్ చైర్మెన్ కొత్వాల్ అబిదుల్లా, టీజేఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం, సీపీఐ ఎగ్జిక్యూటివ్ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, ఐప్సో రాష్ట్ర నాయకులు జి రఘుపాల్ తదితరులు మాట్లాడారు. మల్లారెడ్డి మాట్లాడుతూ పెట్టుబడిదారులు తమ లాభాల కోసం శాంతిని విచ్ఛిన్నం చేస్తున్నారని చెప్పారు. శాంతి..శాంతి అంటూ చేసే నినాదాలు వారి లాభాపేక్షకు ఎక్కడ విఘాతం కలిగిస్తాయోనని ఆందోళన చెందుతున్నారని వివరించారు. అమెరికా కేవలం ఆయుధాల అమ్మకం మీదనే ఆధారపడి బతుకుతుందనీ, అందుకే ప్రపంచంలో ఎక్కడో ఒక చోట యుద్ధాలను సృష్టిస్తున్నదని చెప్పారు. ప్రపంచ శాంతి దానికి గిట్టదని విమర్శించారు. పాలస్తీనాపై అమెరికా అండదండలతో ఇజ్రాయిల్ సాగిస్తున్న యుద్ధం అమానుషమన్నారు. పాలస్తీనాలోని సుమారు 38వేల మందికి పైగా ప్రజలను ఇజ్రాయిల్ హతమార్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ అమెరికా భాగస్వామిగా ఉండి, యుద్ధాన్ని ఆపేందుకు కృషి చేస్తున్నట్టు ఫోజులిస్తుందని విమర్శించారు. ఆ దేశాన్ని శవాల దిబ్బగా చేస్తున్నా..మోడీ ఎందుకు ఖండించటం లేదని ప్రశ్నించారు.కూనంనేని ప్రసంగిస్తూ పాలస్తీనా మీద ఇజ్రాయిల్ దాడులను ఖండిస్తున్నామన్నారు. ఈ విషయంలో ప్రతి ఒక్కరూ స్పందించాలని కోరారు. అందరూ మాకెందుకులే అనుకుంటే ప్రపంచంలో ఈ మాత్రం శాంతి కూడా ఉండేది కాదన్నారు. మా కుటుంబాన్ని మేం చూసుకుంటాం, లేదా మా గ్రామాన్ని మేం చూసుకుంటామనుకుంటే సరిపోదన్నారు. ప్రపంచ ప్రజలంతా పాలస్తీనా, ఇజ్రాయిల్ అంశంపై స్పందించాలన్నారు. దేశాన్ని పాలిస్తున్న పాలకులు (బీజేపీ) ఈరోజు పాలస్తీనాను విచ్ఛిన్నం చేస్తుంటే స్పందించడం లేదన్నారు. మోడీ, బీజేపీ హిట్లర్ మూసలో ఉన్నారని విమర్శిం చారు.కోదండరామ్ మాట్లాడుతూ పాలస్తీనాపై ఇజ్రాయిల్ ఏకపక్షంగా చేస్తున్న టువంటి దాడుల ఫలితంగా అక్కడ విద్యార్థులు, యువకులు, నాగరికత దేశ భవిష్యత్తు మొత్తం నేలమట్టమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పాలస్తీనా గత కొన్ని దశాబ్దాలుగా తమ దేశాన్ని స్వతంత్ర్య దేశంగా ప్రకటించాలని పోరాడు తున్నదనీ, ఈ క్రమంలో ఐక్యరాజ్యసమితి మధ్యే మార్గంగా కొన్ని తీర్మా నాలు చేసినప్పటికీ ఇజ్రాయిల్ వాటిని అమలు చేయకపోగా పాలస్తీనా పాఠశాలలు , దవాఖానాల మీద బాంబుల వర్షం కురిపిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్, రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కేవీఎల్, ప్రధాన కార్యదర్శి జి నాగేశ్వరరావు, కాచం సత్య నారాయణ, ఐప్సో నాయకులు జేకే శ్రీనివాస్, పశ్యపద్మ, విమలక్క, ఎంఏ మాజీద్, అప్సాబేగం , నాగేందర్ ప్రసాద్, రవి కిరణ్, ఉమా మహేశ్, ప్రేమ్ పావని, రామరాజు, యమునా గౌడ్ , గురుబచనం సింగ్, లాక్మా నాయుడు , తదితరులు పాల్గొన్నారు.

ప్రైమరీ స్కూళ్లలో ప్రధానోపాధ్యాయ పోస్టులు మంజూరు చేయాలి : డీటీఎఫ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రతి ప్రాథమిక పాఠశాలకూ ప్రధానోపాధ్యాయ పోస్టులు మంజూరు చేసి ఎస్జీటీలందరికీ ప్రమోషన్లకు అవకాశమిచ్చి భర్తీ చేయాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డీటీఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.సోమయ్య, టి.లింగారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం హైదరాబాద్‌లోని డిక్కీహౌస్‌లో ఆ యూనియన్ రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ప్రతి ప్రాథమిక పాఠశాలకు ప్రధానోపాధ్యాయ పోస్టులు మంజూరు చేసి డీఈడీ, బీఈడీ అర్హతలు గల సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు అందరికీ ప్రమోషన్ కు అవకాశం కల్పించాలనీ, ఇటీవల జరిగిన పదోన్నతుల్లో మిగిలి పోయిన పోస్టులకు వెంటనే ప్రమోషన్ కౌన్సిలింగ్ చేపట్టాలని వారు కోరారు. గతంలో మాదిరిగా ప్రతినెలా ప్రమోషన్లు ఇవ్వాలని విన్నవించారు. నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి పాఠశాలకూ స్వచ్ఛ కార్మికులను నియమించాలనీ, పాఠశాలల కరెంటు బిల్లులు ప్రభుత్వమే చెల్లించాలని కోరారు.

విద్యార్థులకు సరిపడ స్కూల్‌డ్రెస్సులు, పాఠ్య పుస్తకాలు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో అధ్యాపకజ్వాల ప్రధాన సంపాదకులు డాక్టర్ ఎం.గంగాధర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.శాంతన్, వి.రాజిరెడ్డి, వి.రేణుక, టి.శ్రీశైలం, చాపబాబు, రాష్ట్ర కార్యదర్శులు ఎస్.భాస్కర్, జె.రామస్వామి, ఎ. శ్రీనివాసరెడ్డి, బి.శ్యామ్, అకడమిక్ సెల్ కన్వీనర్ డా.బి. రామకృష్ణ, అధ్యాపక జ్వాల సంపాదకులు జి. కళావతి, ఆడిట్ కమిటీ కన్వీనర్ పి.ఈశ్వర్ రెడ్డి, సభ్యులు బి.సదానందం, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలి

- విద్యా వాలంటీర్లను నియమించాలి : టీఎస్‌సీపీఎస్ఈయూ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేస్తూ ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులతో పలు పాఠశాలల్లో ఉన్న ఉపాధ్యాయ ఖాళీలను తాత్కాలిక సర్దుబాటు చేయాలనీ, ఖాళీలను విద్యా వాలంటీర్లతో భర్తీ చేయాలని తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మ్యాన పవన్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో 1,947 మంది ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా, 2162 మంది ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా, 5,870 మంది స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు పొందారని తెలిపారు. దీంతో చాలా పాఠశాలల్లో ఉపాధ్యాయ కొరత ఏర్పడిందనీ, 25,036 ఉపాధ్యాయుల స్థానంలో చాలా వరకు రిలీవర్లు రాలేదనీ, దీంతో అక్కడే పనిచేయాల్సి వస్తున్నదని పేర్కొన్నారు. పదవీ విరమణ పొందుతున్న, దీర్ఘకాలిక, ప్రసూతి సెలవుల్లో ఉన్నవారి స్థానంలో తాత్కాలిక ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని కోరారు.

డీఎస్‌కు శ్రద్ధాంజలి

- మాజీ ఎంపీ ధర్మపురి శ్రీనివాస్ సంస్మరణ సభలో..

నివాళులర్పించిన రాజకీయ ప్రముఖులు



నవతెలంగాణ-శేరిలింగంపల్లి

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని సంధ్య కన్వెన్షన్‌లో టీపీసీసీ మాజీ అధ్యక్షులు, మాజీ ఎంపీ ధర్మపురి శ్రీనివాస్ సంస్మరణ సభ ఆదివారం నిర్వహించారు. శ్రీనివాస్ కుమారుడు, ఎంపీ ధర్మపురి అరవింద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు హాజరై డీఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. డీఎస్‌తో తమకు ఉన్న సంబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ప్రజలకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నేత బండారు దత్తాత్రేయ, ఎంపీలు డికే అరుణ, ఈటల రాజేందర్, రాఘునందన్‌రావు, కాంగ్రెస్ నేత చిన్నారెడ్డి, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, కేవీపీ రాంచంద్రరావు, లోక్‌సత్తా అధినేత జయప్రకాశ్ నారాయణ, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత్‌రావు, కార్పొరేటర్లు, ఇతర ప్రముఖులు, నిజామాబాద్ నియోజకవర్గ ప్రజలు పాల్గొన్నారు.

అప్పులు చేసి.. తిప్పలు పడి

నీట్ పేపర్ లీక్‌తో ఆశలు ఆవిరి

పిల్లల వైద్య విద్య కోసం లక్షలాది కుటుంబాల కష్టాలు

- అభ్యర్థులపై మానసికంగా.. కుటుంబాలపై ఆర్థికంగా దెబ్బ
- విద్యావేత్తలు, నిపుణుల ఆందోళన





న్యూఢిల్లీ : నీట్-యూజీ పేపర్ లీక్, పీజీ పరీక్షల రద్దు అంశం దేశవ్యాప్తంగా గత కొన్ని రోజులుగా చర్చల్లో ఉన్నది. నీట్ పరీక్షల్లో మంచి ర్యాంకును తెచ్చుకొని.. ఉన్నత కళాశాలలో సీటును సంపాదించి.. వైద్య విద్యను అభ్యసించి తాము కన్న కలలను సాకారం చేసుకోవాలని లక్షలాది మంది విద్యార్థులు భావించారు. ఇటు విద్యార్థుల తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను డాక్టర్లుగా చూడాలనే ఆశతో ఎంతో శ్రమకోర్చారు. పిల్లల పుస్తకాలు, కోచింగ్ ఫీజుల కోసం ఖర్చులకు సైతం వెనకాడలేదు. డబ్బులు సర్దుబాటు కాకపోయినా.. అప్పు చేసి మరీ తమ పిల్లల బంగారు భవిష్యత్తు కోసం ఖర్చు చేశారు. అయితే, తీరా చూస్తే.. నీట్-యూజీ పరీక్షాపత్రం లీకైందని వార్తలు రావటం, ఆ అంశం సుప్రీంకోర్టుకు వెళ్లటంతోతో ఇటు విద్యార్థులు.. అటు వారి తల్లిదండ్రులు తీవ్ర షాక్‌కు గురయ్యారు.



ఈ లీక్ అంశం.. విద్యార్థులను మానసికంగా తీవ్రంగా కుంగదీసిందని విద్యావేత్తలు, మానసిక నిపుణులు అంటున్నారు. అటు.. విద్యార్థుల తల్లిదండ్రులనూ ఆర్థికంగా ఇబ్బందులకు గురి చేసిందని చెప్తున్నారు. "తల్లిదండ్రులు జీవితకాల పొదుపులను ట్యూషన్‌లు, కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌లు, స్టడీ మెటీరియల్‌లలో పెట్టుబడి పెడతారు. తరచుగా లక్షల రూపాయల అప్పులు చేస్తున్నారు. చాలా తక్కువ ఆదాయ కుటుంబాలు మెడికల్ కాలేజీ అడ్మిషన్ల కోసం టాప్ నీట్ స్కోర్ కోసం రేసులో ఆర్థిక కష్టాల్లోకి నెట్టబడ్డాయి" అని చెప్తున్నారు. ఇప్పుడు, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) నిర్వహించే పరీక్షలు, పునఃపరీక్షల చర్యలతో.. ఈ కుటుంబాలు పాత రుణాల చెల్లింపుల ఊబిలో, కొత్త వాటి భారంలో మునిగిపోతున్నాయని విశ్లేషకులు అంటున్నారు. "నాకు సామర్థ్యం లేదు. కానీ నాకు ఆశయం ఉన్నది. మా ఊరిలో మనుషులు అబ్బాయిలకు కూడా చదువు చెప్పరు. నా జీవిత సంపాదన, పొదుపు మొత్తాన్ని నా కుమార్తె నీట్ ప్రిపరేషన్‌లో పెట్టాను. ఇప్పుడు నేను వ్యవస్థ ద్వారా మోసపోయాను"అని నీట్ అభ్యర్థిని తండ్రి ఒకరు అన్నారు. సదరు విద్యార్థిని 12వ తరగతి వరకు ప్రతి తరగతిలో అగ్రస్థానంలో ఉన్నది.

ఆమె తండ్రి నిరక్షరాస్యుడు. వైద్యరంగం గురించి పెద్దగా తెలియదు. కళాశాలలో ఎలా అడ్మిషన్ పొందాలి అని ప్రజలను అడిగేవాడు. వైద్యులు డాక్టర్లు ఎలా అవుతారో తెలుసుకోవటానికి అతను రోగిలా నటిస్తూ క్లినిక్‌లను కూడా సందర్శించాడు. అయితే, ఇప్పుడు నీట్ పరీక్ష పేపర్ లీక్ అంశం అయనను తీవ్ర బాధలోకి నెట్టేసింది.

"నా దగ్గర పుస్తకాలు ఉన్నన్ని బట్టలు కూడా లేవు" అని.. ఆయన కూతరు తన నీట్ స్కోర్‌కార్డ్‌ని పట్టుకుని చెప్పింది. నీట్-యూజీ పరీక్షల్లో ఆమె 720 మార్కులకు 631 మార్కులు సాధించింది. పైన చెప్పినట్టు ఇలా లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లింద్రులు నీట్ పేపర్ లీక్ మిగిల్చిన శోకంలో ఉన్నారు. అయితే, ఇదంతా ప్రభుత్వ ఉదాసీన వైఖరి కారణంగానే జరిగిందని పలువురు విమర్శిస్తున్నారు.

ఐదేండ్ల క్రితం 12 లక్షల మంది విద్యార్థులు నీట్‌కు దరఖాస్తు చేసుకోగా, ఈ ఏడాది దాదాపు 24 లక్షల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. పెరుగుతున్న పోటీతో, ఎక్కువ మంది విద్యార్థులు కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌లలో చేరుతున్నారు. "మేము ప్రతి సంవత్సరం అడ్మిషన్ల సంఖ్య పెరుగుదలను చూస్తున్నాము. పేద కుటుంబ నేపథ్యాల నుంచి వచ్చిన దాదాపు 90 శాతం మంది వ్యక్తులు ఫీజు డిపాజిట్ కోసం ఈఎంఐకి ప్రాధాన్యతనిస్తారు. దీని కోసం వారు చేసే అప్పు.. వారి కలను మించిపోతున్నది" అని ఒక కోచింగ్ ఇన్‌స్టిట్యూట్ ఫ్యాకల్టీ సభ్యుడు చెప్పాడు.

మంచి ర్యాంక్ వచ్చినా.. నిరాశే!

అమృత్‌సర్‌లోని తన ఇంటిని విడిచిపెట్టిన తర్వాత.. 20 ఏండ్ల అన్ష్ అరోరా రెండేండ్ల పాటు ఢిల్లీలో నీట్ సన్యాసిలా జీవించాడు. రోజుకు 14-15 గంటలు చదువుకున్నాడు. తన పాఠ్యపుస్తకాల్లో తన మొత్తం సమయాన్ని ధారపోశాడు. "నా రోజులన్నీ ఒకేలా ఉండేవి. నా పుస్తకాలు, విషయాలు మాత్రమే మారుతున్నాయి. నేను నా కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌కి 2 కిలోమీటర్లు నడిచి వెళ్లేవాడిని. దీంతో రూ. 10 ఆదా చేసుకోగలిగేవాడిని" అని అరోరా చెప్పారు. చివరకు ఆయన అంకితభావం కారణంగా.. 610 మార్కులు సాధించగలిగాడు. పేపర్ లీక్ అంశం తనను షాక్‌కు గురి చేసిందని సదరు విద్యార్థి చెపాప్పడు. అరోరా 2020లో 10వ తరగతి పూర్తి చేసినప్పటి నుంచి ఈ పరీక్షకు సిద్ధమవుతున్నాడు. ఆటోరిక్షా డ్రైవర్‌గా తన తండ్రి కొద్దిపాటి పొదుపు, సంపాదనలో చాలా వరకు అనారోగ్యంతో ఉన్న తన సోదరుడి వైద్య చికిత్స కోసం ఖర్చయ్యేదని చెప్పాడు. కోటాలో కోచింగ్ లేకుండా నీట్ క్లియర్ చేయడం అసాధ్యమని అందరూ తనను పట్టుబట్టారని అరోరా చెప్పాడు. అయితే, తన కుటుంబం దానిని భరించలేకపోయిందని వివరించాడు. "మా ఇంట్లో తిండికి కూడా డబ్బులు లేవు. నా కోచింగ్ ఫీజులో సగం నా బంధువులు స్పాన్సర్ చేశారు. ఇప్పుడు వారు నా కుటుంబాన్ని నా కోసం వారి డబ్బును వృధా చేశారని ఎగతాళి చేస్తున్నారు. మంచి స్కోరు సాధించిన తర్వాత కూడా నేను ఓడిపోయినట్టు భావిస్తున్నాను' అని అరోరా అన్నారు.

విద్వేష ప్రచారంలో 'మీమ్స్'

- ప్రత్యర్థులను కించపరచడమే లక్ష్యం
- 'పప్పు' మీమ్ ద్వారా రాహుల్‌ను దెబ్బతీసే ప్రయత్నం
- తప్పుడు కథనాలు వండి వార్చారు
- హద్దులు చెరిపేసిన సామాజిక మాధ్యమాలు



న్యూఢిల్లీ : సామాజిక మాధ్యమాలు మానవ జీవితంపై ఎంతో ప్రభావం చూపుతున్నాయి. ఈ వేదికలు...ముఖ్యంగా సోషల్ మీడియా ద్వారా వివిధ రంగాలకు చెందిన వారు తమ అనుభవాలను, అభిప్రాయాలను పంచుకుంటున్నారు. అవి మనకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. అయితే దురదృష్టవశాత్తూ సోషల్ మీడియా విద్వేష ప్రచారానికి కూడా వేదికగా మారుతోంది. రాజకీయ పార్టీలు తమ ప్రత్యర్థులపై దాడి చేయడానికి సోషల్ మీడియాను వాడుకుంటున్నారు. ప్రతిపక్ష నాయకులను లక్ష్యంగా చేసుకొని మీమ్స్‌ను ప్రచారం చేయడానికి డిజిటల్ వేదికలను ఉపయోగించుకుంటున్నారు.

రాజకీయ ప్రచారాలకు మీమ్స్‌ను ఓ సాధనంగా వాడుకోవడం ఇటీవలి కాలంలో ఎక్కువగా జరుగుతోంది. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో మీమ్స్ ప్రముఖ పాత్ర పోషించాయి. వ్యంగ్యంతో కూడిన వ్యాఖ్యలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. అయితే ఇలాంటి మీమ్స్ వ్యక్తిగత దాడులకు ఉపయోగపడుతున్నాయి. రాజకీయ పార్టీలు సోషల్ మీడియా ద్వారా తమ సిద్ధాంతాలను, లక్ష్యాలను ప్రచారం చేసుకోవడానికి బదులు ప్రతిపక్ష నాయకులను కించపరిచేలా వ్యంగ్య చిత్రాలను ప్రదర్శించడం, వారిపై వ్యంగ్యాస్త్రాలు సంధించడం రొటీన్ అయిపోయింది.

రాహుల్ లక్ష్యంగా...

ఇటీవల సోషల్ మీడియాలో వచ్చిన 'పప్పు' మీమ్‌నే తీసుకుందాం. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని లక్ష్యంగా చేసుకొని ఈ మీమ్‌ను రూపొందించారు. ప్రత్యర్థులను అవమానించడానికి, కించపరచడానికి 'పప్పు' అనే పదాన్ని వాడతారు. అమాయకుడు, తెలివి తక్కువ వాడిని పప్పు అని పిలుస్తారు. రాహుల్ గాంధీని అసమర్థుడిగా, అనుభవం లేని వ్యక్తిగా చూపేందుకు బీజేపీ, దాని మద్దతుదారులు పప్పు మీమ్‌ను ప్రచారంలోకి తెచ్చారు. ఫేస్‌బుక్, ఎక్స్, వాట్సప్ వంటి సామాజిక మాధ్యమ వేదికలలో పప్పు అనే పద ప్రయోగానికి విశేష ప్రచారం లభించింది. రాహుల్‌ను ఎద్దేవా చేయడానికి మీమ్స్‌ను సాధనంగా వాడుకున్నారు. ఆయన రాజకీయ విశ్వసనీయతను దెబ్బతీయాలని చూశారు.

రాహుల్ వ్యతిరేక ప్రచారం రోజులు గడిచేకొద్దీ ఊపందుకుంది. మొదట్లో ఏవో వ్యంగ్య విమర్శలు చేస్తున్నారని అనుకున్నారు కానీ ఆ తర్వాత తప్పుడు వార్తలు, అవమానకరమైన వ్యాఖ్యలు ప్రచారంలోకి వచ్చాయి. 2014, 2019 ఎన్నికల్లో కూడా రాహుల్ గురించి అసత్య వార్తలు ప్రచారం చేశారు. ఎన్నికల ప్రచారంలో అవమానకరమైన ప్రసంగాలు చేశారని, ఆయనకు రహస్య బ్రిటన్ పౌరసత్వం ఉన్నదని...ఇలా రకరకాలుగా తప్పుడు కథనాలను వండి వార్చారు. ఈ తప్పుడు వార్తా కథనాలు యాదృచ్ఛికంగా వచ్చినవి కావు. రాహుల్‌పై ప్రజలు విశ్వాసం కోల్పోయేలా చేయడానికి ఉద్దేశించిన వ్యూహాత్మక సాధనాలు. పప్పు అనే పదం ఏదో వ్యంగ్యం కోసం వాడినది కాదు. అది ద్వేషభావాన్ని వ్యాపింపజేయడానికి వాడిన పదం.

స్వేచ్ఛ పేరుతో...

రాజకీయ విమర్శలు సంప్రదాయ మీడియాకే పరిమితమై పోయాయి. ప్రసంగాలు, పాత్రికేయుల సమావేశాలకు మాత్రమే అందులో చోటు లభిస్తోంది. సామాజిక మాధ్యమాలలో ప్రచారం హద్దుల రేఖను చెరిపివేసింది. జర్నలిజంలో 'స్వేచ్ఛ' పేరిట విద్వేష ప్రచారం తారాస్థాయికి చేరింది.

నాయకులు సైతం...

ఈరోజు సామాజిక మాధ్యమ వేదికలు రాజకీయ వ్యంగ్యానికి ప్రజాస్వామ్యం అనే ముసుగు వేశాయి. రాజకీయ నేతలు సైతం మీమ్స్ సృష్టికర్తలుగా మారారు. డిజిటల్ ప్రచారాలు చేస్తున్నారు. ఈ ధోరణి 2019లోనే కన్పించింది. బీజేపీకి చెందిన ప్రముఖ నేతలు ప్రజాదరణ కోసం మీమ్స్‌ను తయారు చేయడం మొదలు పెట్టారు. ఇన్‌స్టాగ్రామ్ వినియోగదారులు సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి బహిరంగంగానే మద్దతు తెలిపారు. 'మోడీకీ పరివార్' వంటి హాష్‌ట్యాగ్‌లతో ప్రచారం చేశారు. అదే సమయంలో ప్రత్యర్థి పార్టీలకు చెందిన నాయకుల పేరు ప్రతిష్టలను దెబ్బతీయడానికి ప్రయత్నించారు. మీమ్స్ యుద్ధానికి ఇన్‌స్టాగ్రామ్ వేదికగా మారింది. రాజకీయ పార్టీలు యువ ఓటర్లను ఆకర్షించడానికి చేయాల్సిన ప్రయత్నాలన్నీ చేశాయి. వ్యక్తిగత దాడులకు మీమ్స్‌ను పెద్ద ఎత్తున వాడుకున్నారు. ఆధునిక రాజకీయాల్లో సోషల్ మీడియా, మీమ్స్ ప్రభావాన్ని తోసిపుచ్చలేము. అవి ఎన్నికల ఫలితాలను సైతం ప్రభావితం చేస్తున్నాయి.

చర్చలు జరపకుండానే అమలు

- అది ఆహ్వానించదగిన మార్పు కాదు : బీఎన్ఎస్‌పై నోబెల్ పురస్కార గ్రహీత అమర్త్యసేన్


(ఫైల్)

శాంతినికేతన్ : ఐపీసీ స్థానంలో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)ను తీసుకురావడం హర్షించదగిన మార్పుగా తాను భావించడం లేదని నోబెల్ పురస్కార గ్రహీత, ప్రముఖ ఆర్థికవేత్త అమర్త్యసేన్ తెలిపారు. చట్టం అమలులో భాగస్వాములయ్యే వారందరితో విస్తృతంగా చర్చించకుండానే దీనిని తీసుకొచ్చారని, అందుకే ఇది ఆహ్వానించదగిన మార్పు కాదని ఆయన చెప్పారు. శాంతినికేతన్‌లో అమర్త్య విలేకరులతో మాట్లాడుతూ నూతన చట్టాలను అమలు చేసే ముందు విస్తృతంగా చర్చించాల్సిన అవసరం ఉన్నదని అన్నారు.

'చట్టాన్ని అమలు చేసే ముందు భాగస్వాములందరితో విస్తృతంగా చర్చలు జరిపారని చెప్పడానికి ఆధారాలేవీ లేవు. భారత్ వంటి పెద్ద దేశంలో అన్ని రాష్ట్రాలు ఒకే రకమైన సమస్యలను ఎదుర్కోవు. ఉదాహరణకు మణిపూర్, మధ్య ప్రదేశ్ రాష్ట్రాల్లో సమస్యలు ఒకేలా ఉండవు' అని అమర్త్య చెప్పారు. మెజారిటీ ఉన్నది కదా అని అన్ని పక్షాలతో చర్చలు జరపకుండా చట్టంలో మార్పులు చేసేందుకు జరిపే ఏ ప్రయత్న మైనా ఆహ్వానించదగిన , మంచి పరిణా మం కాబోదని ఆయన తెలిపారు. ఎన్నికల ఫలితాలపై అడిగిన ప్రశ్నకు సమాధాన మిస్తూ హిందూత్వ బ్రాండ్ రాజకీయాలను ప్రజలు కొంతమేర తిప్పికొ ట్టారని వ్యాఖ్యా నించారు. దేశంలో నిరుద్యోగ సమస్య అధికంగా ఉన్నదని, విద్య, ఆరోగ్య రంగాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయని అమర్త్యసేన్ చెప్పారు. నూతన విద్యా విధానం-2020లో కొత్తదనమేమీ లేదని ఆయన వ్యాఖ్యానించారు.

సూరత్‌లో భవనం కూలి.. ఏడుగురు మృతి

- శిథిలాల కింద చిక్కుకున్న క్షతగాత్రులు
- 15 మందికి తీవ్ర గాయాలు.. ఆస్పత్రుల్లో చికిత్స
- అక్రమ నిర్మాణమని తేల్చిన అధికారులు



గాంధీనగర్ : గుజరాత్‌లోని సూరత్‌లో బిల్డింగ్ కూలిన ఘటనలో మృతుల సంఖ్య ఏడుకు చేరింది. మరి కొంత మంది శిథిలాల కిందే చిక్కుకున్నారు. 2017లో ఈ బిల్డింగ్‌ని అక్రమంగా నిర్మించినట్టు అధికారులు తేల్చారు. ఇంకా సహాయక చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. ఏడుగురి మృతదేహాల్ని అధికారులు వెలికి తీశారు. మధ్యాహ్నం 3 గంటలకు ఈ ఘటన జరిగిందని అధికారులు చెప్పారు. మరో ఏడుగురు శిథిలాల కిందే చిక్కుకున్నట్టు అనుమానిస్తున్నారు. అప్పటికే కూలిపోయే దశలో ఉన్న భవనం...వర్షాల కారణంగా మరింత కుంగిపోయిందని స్థానికులు, అధికారులు వెల్లడించారు. ఈ అపార్ట్‌మెంట్‌లో మొత్తం 30 ఫ్లాట్‌లున్నాయి. వీటిలో చాలా వరకూ ఖాళీగానే ఉన్నాయి. పైగా ఈ బిల్డింగ్‌ని అక్రమంగా నిర్మించారని తేలింది. 2017లో ఈ అపార్ట్‌మెంట్‌ని కట్టారు. స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేపట్టినట్టు అధికారులు గుర్తించారు. ఈ ఘటనలో 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం వాళ్లకు చికిత్స అందిస్తున్నారని చెప్పారు.

అయితే..ఈ బిల్డింగ్ కూలిన సమయంలో చాలా మంది వరకూ బయట పనులకు వెళ్లారు. ఫలితంగా ప్రాణనష్టం తప్పింది. లేదంటే ఎక్కువ మంది చనిపోయి ఉండే వారని అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. నైట్‌షిఫ్ట్ చేసి వచ్చి కొందరు నిద్రిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. బిల్డింగ్ కూలిన వెంటనే స్థానికులు ఉలిక్కిపడ్డారు. అధికారులకు సమాచారం అందించారు. లోపల నిద్రిస్తున్న వాళ్లు శిథిలాల కింద చిక్కుకుపోయారు. 8 ఏండ్ల క్రితం కట్టిన బిల్డింగ్ ఇప్పటికే కూలిపోయే దశకు వచ్చేసింది. ప్రస్తుతం ఈ ఘటనపై అధికారులు విచారణ కొనసాగిస్తున్నారు. అక్రమ నిర్మాణం కావటంతో దీనిపై మరింత దృష్టి సారించారు. ఇకపై ఇలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటామని వెల్లడించారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని వెలికి తీసేందుకు ఇంకా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. "మొత్తం 30 ఫ్లాట్‌లున్న ఈ అపార్ట్‌మెంట్‌లో కేవలం 5 ఫ్లాట్స్ తప్ప మిగతావన్నీ ఖాళీగానే ఉన్నాయి. దగ్గర్లోని ఫ్యాక్టరీల్లో వీళ్లంతా పని చేసుకుంటారు. రెస్క్యూ ఆపరేషన్ మొదలు పెట్టగానే శిథిలాల కింద చిక్కుకున్న వాళ్లు గట్టిగా కేకలు పెట్టారు. వాళ్ల ఏడుపులూ వినిపించాయి. అప్పటికప్పుడు ఓ మహిళను రక్షించాం. మరికొందరు శిథిలాల కిందే ఉన్నారు. వాళ్లను వెలికి తీసేందుకు ప్రయత్నిస్తున్నాం" అని అధికారులు తెలిపారు.

నా భూమిని ఆక్రమించాడు

- అనుచరుల కోసం గదిని నిర్మించాడు
- భోలే బాబాపై రాజస్థాన్ రైతు ఆరోపణ


ఆక్రమణకు గురైన భూమి

అల్వార్ : ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్‌లో నారాయణ్ సర్కార్ హరి అలియాస్ భోలే బాబా నిర్వహించిన ప్రార్థనా సమావేశంలో తొక్కిసలాట జరిగి 122 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ వార్తతో రాజస్థాన్‌లోని అల్వార్ జిల్లా సహాజ్‌పురా గ్రామం ఒక్కసారిగా ఉలిక్కి పడింది. ఎందుకంటే భోలే బాబాకు ఈ ప్రాంతంతో సంబంధం ఉంది. బాబా సూరజ్‌పాల్ జాతవ్ పేరుతో ఆయన ఇక్కడ కొంతకాలం గడిపారు. కోవిడ్ సమయంలో భోలే బాగా ఇక్కడి ఆశ్రమంలో పది నెలల పాటు ఆశ్రయం పొందారు. ఆ సమయంలో తరచుగా సత్సంగ్‌లు నిర్వహించారు. దూర ప్రాంతాల నుండి వేలాది మంది భక్తులు ఈ కార్యక్రమానికి హాజరయ్యే వారు. ఆశ్రమం కోసం గ్రామానికి చెందిన దేవీరామ్ తన భూమిని విక్రయించారు. అయితే తనకు చెందిన అదనపు భూమిని భోలే బాబా బలవంతంగా ఆక్రమించారని, అందులో ఆయన అనుచరులకు గదిని నిర్మించారని దేవీరామ్ ఆరోపించారు. 2008-09లో సుమారు ఒకటిన్నర బిఘాల (బిఘా అంటే 0.619 ఎకరాలు లేదా 24.78 గుంటలు) భూమిని బాబా కమిటీకి అమ్మానని, 2010లో అక్కడ ఆశ్రమ నిర్మాణం మొదలైందని ఆయన చెప్పారు. అప్పటి నుండి ఆశ్రమంలో సత్సంగ్‌లు నిత్యకృత్యమయ్యాయి. వివిధ ప్రాంతాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో రావడం మొదలు పెట్టారు.

అయితే స్థానికులను ఆశ్రమంలోకి అనుమతించలేదని సహాజ్‌పురా గ్రామస్థులు ఆరోపించారు. మహిళలు, బాలికలకు మాత్రం ఎలాంటి అడ్డంకులు ఉండేవి కావు. ఇతర ప్రాంతాల నుండి వచ్చే వారికి, మహిళలకు ఆశ్రమ ద్వారాలు తెరిచి ఉంచుతారు. దీనిపై స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేశారు. హత్రాస్‌లో 122 మంది చనిపోవడానికి బాబాయే కారకుడని, ఆయనను వెంటనే అరెస్ట్ చేసి నిర్బంధించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.


నీట్ సిలబస్ తగ్గటమే పెద్ద కారణం

- కచ్చితమైన నీట్ స్కోర్‌లపై ఎన్‌టీఏ వెల్లడి

న్యూఢిల్లీ : సిలబస్‌లో గణనీయమైన తగ్గింపు కారణంగా అండర్ గ్రాడ్యుయేట్ నేషనల్ ఎలిజిబిలిటీ-కమ్-ఎంట్రన్స్ టెస్ట్(నీట్-యూజీ) 2024లో 61 మంది విద్యార్థులు కచ్చితమైన 720/720 స్కోర్‌లను సాధించారని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) సుప్రీంకోర్టుకు వివరించింది. "61 మంది అభ్యర్థులు కచ్చితమైన స్కోర్ చేయటంలో అత్యంత ప్రముఖమైన అంశం.. సిలబస్‌లో తగ్గింపు. ఇది అభ్యర్థులు కోర్ కాన్సెప్ట్‌లపై దృష్టి పెట్టటానికి, మహమ్మారి కారణంగా చదువును పూర్తి చేయటంలో సవాళ్లను ఎదుర్కొన్న విద్యార్థులపై ఒత్తిడిని తగ్గించడానికి దోహదపడింది" అని ఎన్‌టీఏ వివరించింది. 2023లో హాజరైన అభ్యర్థుల సంఖ్య 20,38,596 కాగా, 2024లో హాజరైన అభ్యర్థుల సంఖ్య 23,33,297కి పెరిగిందని వివరించింది. విద్యార్థుల పట్ల ఉన్న ఆందోళనకు వ్యక్తీకరణగా గత సంవత్సరంతో పోలిస్తే 2024లో సిలబస్‌ను తగ్గించినట్టు పరీక్షా ఏజెన్సీ తెలిపింది. "సిలబస్ గత సంవత్సరంతో పోల్చితే సుమారు 22 శాతం నుంచి 25 శాతం తగ్గించబడింది. తగ్గింపు విద్యార్థులపై అధ్యయనాల భారాన్ని గణనీయంగా తగ్గించింది. సిలబస్, సమర్థవంతంగా, సమగ్రంగా పరీక్షకు సిద్ధం చేయటంలో అభ్యర్థులకు ప్రయోజనం చేకూర్చింది.

అంతేకాకుండా, 2024లో అధిక శాతం పెరగడానికి మరొక కారణం ఏమిటంటే, ప్రశ్నపత్రాలు సార్వత్రికంగా ఉపయోగించే మరియు దేశవ్యాప్తంగా విద్యార్థులకు అందుబాటులో ఉండే పుస్తకాలపై ఆధారపడి ఉంటాయి. అందరూ అభ్యర్థులు, వారి భౌగోళిక లేదా సామాజిక-ఆర్థిక నేపథ్యాలతో సంబంధం లేకుండా విజయం సాధించడానికి సమాన అవకాశం కల్పించేలా ఈ వ్యూహం అమలు చేయబడింది" అని ఎన్‌టీఏ వివరించింది. కోచింగ్ సంస్థలపై ఆధారపడటాన్ని తగ్గించటమే ప్రధాన లక్ష్యాలలో ఒకటి అని పేర్కొన్నది. " ఈ కారణంతో నీట్ 2024లోని ప్రశ్నపత్రాలు సమతుల్యంగా ఉన్నాయని వివరించింది. నిర్దిష్ట ఎంపిక పరీక్షా కేంద్రాల నుంచి విద్యార్థులు అధిక మార్కులు స్కోర్ చేశారనే ఆరోపణలను పూర్తిగా నిరాధారమైనదని ఎన్‌టీఏ కొట్టిపారేసింది.

భారత్ లో అసమానతలు



ప్రాంతీయంగా, సామాజికంగా ఆందోళన కలిగిస్తున్న పరిస్థితులు

- పట్టణ-గ్రామీణ ప్రాంతాల మధ్య పెరుగుతున్న అంతరం
- ప్రాథమిక సౌకర్యాలు, సామాజిక భద్రత వంటి అంశాల్లో కనిపిస్తున్న తేడా
- దేశంలోని పరిస్థితులపై మేధావులు, నిపుణుల ఆందోళన

న్యూఢిల్లీ : మోడీ పాలనలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మధ్య అసమానతలు తీవ్రంగా పెరుగుతున్నాయి. ప్రాథమిక సౌకర్యాలు, సామాజిక భద్రత వంటి పలు అంశాల్లో ఈ తేడాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని నిపుణులు, మేధావులు అంటున్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య పెరుగుతున్న ఈ విభజనలను తగ్గించటానికి ప్రాంతీయ అసమతుల్యతలను పరిష్కరించటం, సమ్మిళిత ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించటం, సామాజిక భద్రతను బలోపేతం చేయటం, విద్యలో పెట్టుబడులు పెట్టటం, భారతీయ సమాజంలోని అన్ని వర్గాలకూ సమాన అవకాశాలను పెంపొందించటం వంటివి చాలా అవసరమని నిపుణులు, మేధావులు సూచిస్తున్నారు. సెంటర్ ఫర్ న్యూ ఎకనామిక్స్ స్టడీస్ (సీఎన్ఈఎస్) పరిశోధకులు రూపొందించిన 'యాక్సెస్ (ఇన్) ఈక్వాలిటీ ఇండెక్స్' నివేదిక పలు అంశాలను వెల్లడించింది. యాక్సెస్ (ఇన్) ఈక్వాలిటీ ఇండెక్స్ అధ్యయనం భౌగోళిక ప్రాంతాలు, సామాజిక సమూహాలు రెండింటిలోనూ భారతదేశాన్ని పీడిస్తున్న అసమానతలపై చర్చిస్తుంది.

భారత్‌లో 68 కుటుంబాలు ఉన్న జనాభాలో దాదాపు 70 శాతం మంది గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. అయితే 32 శాతం కుటుంబాలతో కూడిన జనాభాలో 29.2 శాతం మంది పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్నారు.

ప్రాథమిక సౌకర్యాలను పరిశీలించినప్పుడు ఈ విభజన ప్రత్యేకంగా కనిపిస్తుంది. జల్ జీవన్ మిషన్ వంటి ప్రభుత్వ కార్యక్రమాలు సురక్షితమైన తాగునీటిని అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, కేవలం 22.5 శాతం గ్రామీణ కుటుంబాలు ఏడాది పొడవునా నీటిని పొందుతున్నాయి. అయితే పట్టణ ప్రాంతాల్లో ఈ సంఖ్య 58.9 శాతంగా ఉన్నది. పారిశుధ్యం విషయంలోనూ రెండు ప్రాంతాల మధ్య అసమానతలు కనిపిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో 68.8 శాతంతో పోలిస్తే.. 80 శాతం పట్టణ గృహాలకు మరుగుదొడ్లు అందుబాటులో ఉన్నాయి. అయినప్పటికీ, పరిమిత మౌలిక సదుపాయాలు, భౌగోళిక తీరు, పేదరికం వంటి సవాళ్లు గ్రామీణ వర్గాలకు మరుగుదొడ్ల భద్రతను మరింత కష్టతరం చేస్తాయి.శుభ్రమైన వంట ఇంధనానికి అంతరం విస్తరించింది. దాదాపు అన్ని పట్టణ కుటుంబాలు (92శాతం) శు భ్రమైన వంట ఇంధనాన్ని ఉపయోగించుకుంటాయి. అయితే గ్రామీణ కుటుంబాల్లో సగం (49.8 శాతం) మాత్రమే అలా చేస్తున్నాయి. ఆసక్తికరంగా, మొబైల్ ఫోన్ వినియోగం రెండు ప్రాంతాలలో దాదాపు సమానంగా ఉన్నది. ఇది గ్రామీణ ప్రాంతాల్లో 93.3 శాతం, పట్టణాల్లో 96.6 శాతంగా ఉన్నది. అయితే, ఇంటర్నెట్ స్వీకరణను చూసినప్పుడు డిజిటల్ విభజన స్పష్టంగా కనిపిస్తున్నది. పట్టణ ప్రాంతాల్లో 64.6 శాతంతో పోలిస్తే గ్రామీణ నివాసితులలో కేవలం 41 శాతం మందికి ఇంటర్నెట్ సదుపాయం ఉన్నది.సామాజిక గుర్తింపు విషయానికొస్తే.. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు చెందిన 50 శాతం కంటే తక్కువ కుటుంబాలు ఏడాది పొడవునా నల్లా(కుళాయి) నీటిని పొందటానికి స్థిరమైన సౌకర్యాన్ని కలిగి ఉన్నాయి. ముఖ్యంగా, ఎస్టీ జనాభాలో కేవలం 19.5 శాతం మందికి మాత్రమే ఏటా పైపుల ద్వారా నీటికి తగినంత యాక్సెస్ ఉన్నది. హౌసింగ్‌లో.. దాదాపు 50 శాతం కుటుంబాలు క్యాటగిరీతో సంబంధం లేకుండా.. మొదటిసారిగా ఇంటిని కొనుగోలు చేయటం, నిర్మించటం వంటివి చేశాయి. ఈ గణాంకాలు అంతరాలను తగ్గించటానికి, అన్ని సామాజిక సమూహాలకు సమానమైన నీరు, పారిశుధ్యం, గృహాలు అందేలా చేసే అవసరాన్ని నొక్కి చెప్తాయి.

గ్రామీణ తల్లులు (75.4 శాతం మంది)తో పోలిస్తే పట్టణ ప్రాంత తల్లులు (84.6 శాతం మంది) ప్రసవానంతర సంరక్షణను పొందుతున్నారు. ఆరోగ్య బీమా కవరేజ్, బాల్య వ్యాధి నిరోధక టీకాల విషయంలో గ్రామీణ ప్రాంతాలు పట్టణ ప్రాంతాలను అధిగమించాయి. ఆరోగ్య బీమా కవరేజ్ రేటు గ్రామీణ ప్రాంతాల్లో 42.4 శాతం, పట్టణ ప్రాంతాల్లో 38.1 శాతం, బాల్య వ్యాధి నిరోధక టీకాలు గ్రామీణ ప్రాంతాల్లో 57.0 శాతం, పట్టణ ప్రాంతాల్లో 43.1 శాతంగా ఉన్నాయి.

భారత్‌లోని వివిధ సామాజిక సమూహాలలో కార్మికుల జనాభా నిష్పత్తి(డబ్ల్యూపీఆర్), నిరుద్యోగిత రేటు(యూఆర్)పై సమర్పించిన గణాంకాలు ఉపాధి అవకాశాలు, నిరుద్యోగంలో ఉన్న అసమానతలను నొక్కి చెబుతున్నాయి. ముఖ్యంగా, ఎస్టీలు 51 శాతంతో వద్ద సాపేక్షంగా అధిక డబ్ల్యూపీఆర్‌ను కలిగి ఉన్నారు. ఇది శ్రామికశక్తిలో నిమగ్నమైన గణనీయమైన నిష్పత్తిని సూచిస్తుంది. అయినప్పటికీ 18 శాతం యూఆర్.. నిరంతర నిరుద్యోగ సవాళ్లను సూచిస్తుంది. దీనికి విరుద్ధంగా.. ఎస్సీలు తక్కువ డబ్ల్యూపీఆర్ (41 శాతం), అధిక యూఆర్ (32 శాతం) రెండింటినీ ఎదుర్కొంటారు. ఓబీసీలలో అధిక డబ్ల్యూపీఆర్ (42 శాతం)ని ప్రదర్శిస్తుంది. కానీ ఇప్పటికీ 33 శాతంతో గణనీయమైన యూఆర్‌ను కలిగి ఉన్నది. జనవరి 2022 నాటికి, మొత్తం పని చేసే పోలీసులలో ఎస్సీలు 15.99 శాతం మంది (జనాభాలో 16 శాతం వాటా), ఎస్టీలు 11.77 శాతం మంది, ఓబీసీలు 30.79 శాతం మంది ఉన్నారు. అయితే, ఈ పరిశోధనలు ప్రభుత్వాలు, అధికారుల నుంచి లక్ష్య విధానాలు, సహకార చర్యల అవసరాన్ని నొక్కి చెబుతున్నాయని మేధావులు, నిపుణులు అంటున్నారు. దురదృష్టవశాత్తు, కేంద్రంలోని మోడీ సర్కారు మాత్రం కేవలం రాజకీయాలకు మాత్రమే పరిమితమవుతూ.. దేశ ప్రయోజనాలను గాలికి వదిలేసిందని ప్రతిపక్ష పార్టీల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నవతెలంగాణ దర్వాజ 4
సోమవారం 8-7-2024 || హైదరాబాద్

వర్షాకాలంలా చెడుకురుస్తున్నప్పుడు!

ఎవరో ఒక మనిషి అత్యవసర పత్రంతో వెళ్లినప్పుడు,
అక్కడి వాళ్లంతా వెళ్లిపోయివుంటే
ఆఫీసు మూసేసి వుంటే!
రానున్న వరదల గురించి
ఏదో ఒక కొత్త భాషలో
ఒక మనిషి నగరవాసులను హెచ్చరించి వుంటే
ఎవ్వరికి అస్సలే అర్థం కాకుండా వుంటే!
ఒక బిచ్చగాడు ఐదోసారి ఆ తలుపుతట్టాడు
గతంలో నాలుగుసార్లు అదే ఇంటివాళ్లు ఏదో పెట్టారు
ఈసారి మాత్రం అతను ఆకలితోనే తిరిగి వెళ్లివుంటే!
ఎవరో ఒకతని గాయంలోంచి రక్తం కారుతుంటే
డాక్టర్ కోసం ఎదురు చూస్తూవుంటే
ఆ గాయంలోంచి రక్తం కారుతూనే వుంటే!
అదే విధంగా మనకెంతో కీడు జరిగిందని
చెప్పుకుంటూనే వుంటాము!
మన మిత్రులను చంపుతున్నారని మొదటిసారి వినగానే
మనమంతా అరిచాం కేకలు వేశాం...
అయినా వందలాది మందిని చంపేశారు,
మళ్లీ వేలాదిమంది హత్య జరిగినప్పుడు
రక్తపాతం - విధ్వంసం ఆగిన మాటే లేదు
అంతటా నిశ్శబ్దపు దుప్పటి పరుచుకుంది!
చెడు ఎటు చూసినా వర్షాకాలంలా కురుస్తుంటే
అసలు ఎవ్వరు కేకలు వేయరు - 'ఇదంతా ఆపండి'...
నేరాలన్నీ వరసగా సాగిపోతుంటే
అవేవీ కనపడకుండా పోయినప్పుడు
యాతనను భరించే స్థాయిని మించగానే
అరుపులు వినరానట్టు/ వేసవిలో వానలా
అరుపులు కేకలు కూడా నిశ్శబ్దంగానే కురుస్తాయి!!

జర్మనీ మూలం : బెర్టోల్ట్ బ్రెక్ట్
అనుసృజన : నిఖిలేశ్వర్, 9177881201

తర్జుమా తరంగిణి

శిలల వాస్తవం

ప్రాణం లేని వస్తువుల స్వభావం గురించి
నిశ్శబ్ద వాతావరణంలో యోచిస్తుంటావు నువ్వు
మెల్లగా ఖాళీ బుర్రవు అవుతావు
రెండు స్థలాలు ఒకదానివైపు మరొకటి ప్రయాణిస్తాయి
అవి కలిసిన చోట నువ్వు కరిగిపోయి మాయమౌతావు
నువ్వు ప్రాణం లేని వస్తువులలో ఒకటిగా మారాక
ప్రాణి తాలూకు కొత్త మార్గమొకటి నెలకొంటుంది
రాయీ, దాని నీడా సైతం చేతనను పొందుతాయి
నువ్వు రాయితో మాట్లాడితే
నీ స్వగతం బావురుమనిపించేలా మారి,
పనికిరాని పొరగా మేనుమీద పేరుకుపోయి,
నీ కంఠస్వరం నీకే కొత్తగా వినిపిస్తుంది
నువ్వు మూగబోతావు,
రెండు మౌనాలు ఒకదానిలోకి ఒకటి ప్రవహిస్తాయి
ఆపైన రాయిలో ఐక్యం అవుతావు నువ్వు
రాయినీడ తాలూకు మూన్నాళ్ల జీవితాన్ని వీక్షిస్తూ
దాని రూపురేఖలనూ చీకటి గాఢతనూ గమనిస్తావు
కాంతితో తలపడకుండా చివరిదశకు చేరుతుంది ఆ నీడ
కళ్లు మూసుకొని, రెండు కాంతిపుంజాలు
ఐక్యమవడాన్ని చూస్తావు నువ్వు
నువ్వూ రాయీ దాని నీడా కలిసి
ఉమ్మడిగా ప్రాణం పోసుకుంటాయి

ఆంగ్లమూలం: మధు కైలాస్, తెలుగు సేత: ఎలనాగ

'తల'ఉన్నవాడు



విషయం ఇష్టం లేకపోతే అతను తల అడ్డంగా ఊపి
కాదంటాడు అంగీకరించలేనంటాడు
విషయం నచ్చితే ఇష్టమయితే
తల నిలువుగా ఊపి అవునంటాడు
ఆనందం ప్రకటిస్తాడు
ఒక్కోసారి అవుననీ కాదనీ అనకుండా
తలని అడ్డంగా నిలువుగా అడ్డదిడ్డంగా వూపుతాడు
అది అర్థం చేసుకునే సహనమూ
సానుభూతి కరువయిన ఈ తల లేని లోకం
'ఏ గూంగా దిఖ్తాహై.. లేకిన్...'
అంటూ తలకూ చేతులకూ గొలుసులు బిగిస్తుంది
మూగతనం అంటే మాటలు లేకా కాదు
రాకా కాదు అనుకుంటూ తలున్నవాడు
ముసి ముసిగా నవ్వుకుంటాడు

- వారాల ఆనంద్

చదవాల్సిన పుస్తకం గోల్కొండ చరిత్ర



- గుడిపాటి, 9490099327

తెలంగాణ సాహిత్య అకాడమి చేసిన మంచి పనుల్లో ఒకటి 'హిస్టరీ ఆఫ్ గోల్కొండ' ను పునర్ముద్రించడం (Reprinted). అకాడమి ఏర్పాటయిన తొలినాళ్ళలోనే ఈ పుస్తకాన్ని ముద్రించే ఆలోచన చేసి, ప్రచురించినందుకు నందిని సిధారెడ్డిని, ఏనుగు నరసింహారెడ్డిని అభినందించాలి. ఇది మొక్కుబడిగా చెబుతున్నమాట కాదు, ఈ పుస్తకానికి ఉన్న విలువను, ప్రాధాన్యాన్ని గుర్తించి ప్రచురించినందుకు వారిని మెచ్చుకోవాలి.

దక్కన్ హిస్టరీలో గోల్కొండ చరిత్రకు చాలా ప్రాధాన్యముంది. ఈ చరిత్ర మీద సాధికారికంగా వెలువడిన గ్రంథం - 'హిస్టరీ ఆఫ్ గోల్కొండ'. గ్రంథ రచయిత అబ్దుల్ మజీద్ సిద్ధిఖి. ఈ రచయిత గురించి తెలుసుకోవాలని శోధించాను గానీ నెట్‌లో మాత్రం ఎలాంటి సమాచారం దొరకలేదు. ఎందుకంటే ఇంతటి విలువైన గ్రంథం రచించిన రచయిత గురించి తెలుసుకోవడం పాఠకుల బాధ్యత. ఏళ్ళ తరబడి రేయింబవళ్ళు ఈ పుస్తకం కోసం రచయిత ఎంతో శ్రమ చేశారు. ఈ పుస్తకం 1939 సంవత్సరంలో ఉర్దూలో 'తారీఖ్-ఏ-గోల్కొండ' పేరుతో ముద్రితమైంది. అంటే రచయిత మొదట దీనిని ఉర్దూలో రాశారు. తరువాత రచయితనే స్వయంగా ఆంగ్లంలోకి అనువాదం చేశారు. ఉర్దూలో ఆదరణ లభించినప్పటికీ ప్రపంచవ్యాప్తంగా గోల్కొండ చరిత్ర గురించి తెలియాలంటే పుస్తకం ఆంగ్లంలోకి వెళ్ళాలని ఆయన తలపోశారు. కనుకనే తానే స్వయంగా అనువాదానికి పూనుకున్నారు. 1956 జూన్‌లో ఈ పుస్తకం ఆంగ్లంలో వెలువడింది.


ఈ పుస్తకం చదివిన రూప్ కుమార్ అనువాదం చేయకుండా ఉండలేకపోయారు. తను అనువాదం చేసిన రాత ప్రతులను చూసిన నాకు ఎంతో ఆశ్చర్యం కలిగింది. కొన్ని పేజీలు చదవగానే తెలుగులో ఈ పుస్తకం ఎపుడో రావలసి ఉండింది కదా అనిపించింది. ఎట్టకేలకు కొన్నాళ్ళ కిందట తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ 330 పేజీల గోల్కొండ చరిత్ర పుస్తకాన్ని ప్రచురించింది. గోల్కొండ రాజ్య వ్యవస్థాపకుడైన సుల్తాన్ కులీ కుతుబ్ షా మొదలు చివరి కుతుబ్ షాహి రాజైన అబుల్ హాసన్ వరకు చరిత్ర చిత్రీకరించబడింది. ఈ పుస్తకాన్ని ఇంగ్లీషులోకి తీసుకు వస్తున్నపుడు మూల రచయిత అబ్దుల్ మజీద్ సిద్ధిఖి చెప్పిన ఈ కింది మాటలు గమనార్హం:

"1939 లోని నా రచనను ఆంగ్ల భాషలో తర్జుమా చేసి ప్రచురించడానికి పదిహేడేళ్ళ కాల వ్యవధి పట్టింది. ఈ పుస్తకం బాగా ప్రాచుర్యంలోకి వచ్చినందుకు సంతోషం కలిగినా భారతదేశం, ఇంకా విదేశాలలోని ఆంగ్లం తెలిసిన పండితులకు, పాఠకులకు అందలేదనే విషయం తెలిసి, ఆంగ్ల భాషలో దీని అనువాదం తీసుకు రావాల్సిన అవసరం అనివార్యమైంది. ఇతర పనుల్లో మునిగిపోవడం వలన అనువాద కార్యక్రమం పూర్తిగా రూపుదాల్చడానికి చాలా కాలమే పట్టడం కాస్త విచారం కలిగించే విషయం. వాస్తవానికి ఒక పుస్తకాన్ని, ఒక భాష నుండి మరో భాషలోకి అనువదించడమంటే మానసిక వేదనకు గురి కావడమే. కలం, కాగితం మీద పెట్టగానే అనువదించడంలో వెచ్చించిన సమయాన్ని ఒరిజినల్ వర్క్ కోసం శ్రమిస్తే మరింత సమాచారం అందుబాటులోకి వస్తుంది. సమయం వృథా కాదు అన్న భావన దీనికి కారణం. అంతేగాక, ఒక భాషకున్న విశిష్టత, దాని ఆత్మను మరో భాషలోకి అనువదించడం నిజానికి కష్టతరమైన పని. అయినప్పటికీ అవసరమైన మార్పులతో, అదనపు సమాచారంతో 'దక్కన్ చరిత్ర' పై మక్కువ గల వారి కోసం ఆంగ్లానువాదం తీసుకురావడం జరిగింది".

ఈ పుస్తకం చాలా అనాయసంగా చదివిస్తుంది. ఆసక్తికరంగా చదివిస్తుంది. ఒక అధ్యాయాన్ని చదివాక మరో అధ్యాయంలోకి వెళ్ళాలన్న ఉత్సుకత పాఠకుల్లో కలుగుతుంది. ఇది అనువాదకుని ప్రతిభ వల్ల సాధ్యమైంది. అయితే ఇంత సరళంగా అనువదించడంలో రూప్ కుమార్ అనన్య శ్రమ వుంది. రూప్ కుమార్ డబ్బీకార్ వృత్తిరీత్యా జియాలజిస్టు. శాస్త్రవేత్త. వృత్తిరీత్యా దేశమంతా పర్యటించారు. అనేక భాషలతో, అనేక ప్రాంతాలతో సంబంధం ఉన్న మనిషి. ముఖ్యంగా భాషల పైన, సంస్కృతుల పైన, విభిన్న ప్రాంతాల భౌగోళిక వైవిధ్యం పైన ఉన్న కాంక్ష వల్ల తనలో పరిశీలనాసక్తి ఎక్కువ. అంతేగాక హిందీ, ఉర్దూ, అరబిక్ భాషల గురించి తెలుసు. హిందీ నుంచి తెలుగులోకి, తెలుగు నుంచి హిందీలోకి అనువాదాలు చేస్తుంటారు. ఇక ఇంగ్లీషులో రాయడంలో వారి ప్రతిభ అనన్యం. 'హిస్టరీ ఆఫ్ గోల్కొండ'ని తెలుగులోకి అనువాదం చేయడం రూప్ కుమార్‌కు సాధ్యం కావడానికి అతని జీవిత నేపథ్యం, సాహిత్య నేపథ్యం, విస్తృత అధ్యయనశీలత, పర్యాటకుడయి ఉండడం కలిసి వచ్చింది. ఎందుకంటే కేవలం ఇంగ్లీషు తెలిసినంత మాత్రాన ఈ పుస్తకం అనువాదం చేయడం సాధ్యం కాదు. ఉర్దూ, అరబిక్, పర్షియన్ భాషలతోనూ పరిచయం మాత్రమే కాదు, ఎంతో కొంత పట్టు ఉండాలి. ఉర్దూ చదవడం రూప్ కుమార్‌కు తెలుసు. కనుక మూల రచయిత డిక్షన్‌ను పట్టుకోగలిగారు. అందువల్ల గోల్కొండ చరిత్ర చదువుతుంటే అనువాదంలా అనిపించదు. నిజంగా ఒక కాల్పనిక రచన పట్ల ఎలాంటి ఉత్సాహం కనబరుస్తామో అలాంటి కుతూహలం చూపుతూ చదువుతాం.

"గోల్కొండ, భారతదేశ చరిత్రకారుల దృష్టిని కర్షించలేకపోవడం విచారించదగిన విషయం. భారతదేశపు మేధావుల చేతిలో దీనికి సంపూర్ణ న్యాయం జరగలేదు. పరిమితులు వున్నా, గోల్కొండ రాజ్యానికి తనకున్న పరిధుల్లో వనరులకు, చారిత్రక, సాంస్కృతిక సంపదలకు కొదవలేదు. అందుచేత భారత ఉపఖండంలోని చరిత్రలో దీనికి ప్రముఖ స్థానం వుంది.

ఈ పుస్తకం ఎందుకు చదవాలంటే దక్కన్ చరిత్రలో గోల్కొండ రాజ్యం ఎంతో ముఖ్యమైంది. ఈనాటి వర్తమానానికి తగిన మూలాలు గోల్కొండ చరిత్రలో ఉన్నాయి. మొత్తం భారతదేశంలో కుతుబ్ షాహీల పాలనా చరిత్రకు ప్రత్యేక ప్రాధాన్యం వుంది. తెలంగాణ చరిత్ర వారి



చరిత్ర, గోల్కొండ చరిత్రతో గాఢంగా ముడిపడి వుంది. ఉత్తర భారతదేశ దాడులను ప్రతిఘటిస్తూ తనదైన ప్రత్యేకతతో అలరారింది గోల్కొండ రాజ్యం. అందుకని ఈ రాజ్యం గురించి తెలుసుకోవాలి. అందుకోసమే గోల్కొండ చరిత్రని చదవాలి. ఈ పుస్తక మూల రచయిత మాటల్లో చెప్పాలంటే... "గోల్కొండ, భారతదేశ చరిత్రకారుల దృష్టిని కర్షించలేకపోవడం విచారించదగిన విషయం. భారతదేశపు మేధావుల చేతిలో దీనికి సంపూర్ణ న్యాయం జరగలేదు. పరిమితులు వున్నా, గోల్కొండ రాజ్యానికి తనకున్న పరిధుల్లో వనరులకు, చారిత్రక, సాంస్కృతిక సంపదలకు కొదవలేదు. అందుచేత భారత ఉపఖండంలోని చరిత్రలో దీనికి ప్రముఖ స్థానం వుంది. కొత్త పాలనా సిద్ధాంతాలను ప్రవేశపెట్టింది. జీవన శైలిలో కొత్తదనాన్ని సృజించింది. ఇప్పటికీ దక్కన్ సామాజిక జీవనంలో వీటి సాంస్కృతిక ఆనవాళ్ళు స్పష్టంగా కనిపిస్తాయి. ఈ రాజ్యం ప్రారంభ దశ నాటి నుండి మధ్య తూర్పు దేశాలలోని ప్రజలకు సుపరిచితం. రాజకీయ వేత్తలను, మేధావులను, వర్తకులను, వృత్తి కళాకారులను అమితంగా ఆకర్షించిన దేశం". దక్కన్ పీఠభూమిలో కీలకమైన రాజ్యంగా ఎదిగింది గోల్కొండ. నాటి పాలనా సిద్ధాంతాల వెలుగు రేఖల ప్రభావం వర్తమాన తెలంగాణ మీద కూడా ఉంది. కనుక తెలంగాణ గురించి మాట్లాడేవారు, తెలంగాణ గురించి మాట్లాడే కవులు, రచయితలు, కళాకారులు, జర్నలిస్టులు గోల్కొండ చరిత్ర చదవాలి. ఈ పుస్తకం చదవకపోతే దక్కన్ పీఠభూమి గురించి తెలంగాణ గురించి మీకు ఏమీ తెలియనట్లే. ఈ పుస్తకాన్ని డిగ్రీ, పిజి సిలబస్‌లో రెఫరెన్స్ కోసం పెట్టాలి. ఈ విషయమై సంబంధిత వ్యక్తులు ఆలోచిస్తే మంచిది. ముందుగా కనీసం వారు చదివితే సంతోషం. మరీ ముఖ్యంగా మూల రచయిత అబ్దుల్ సయ్యద్ సిద్ధిఖి గురించి తెలుసుకొని ఎవరయినా వ్యాసాలు రాస్తే బాగుంటుంది. డాక్టర్ రూప్ కుమార్ డబ్బీకార్ తెలుగు అనువాదంలోని ఈ పుస్తకం రవీంద్రభారతి, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ వారి వద్ద దొరుకుతుంది. 330 పేజీల పుస్తకం కేవలం 300 రూపాయలే. ఇంగ్లీషు లోని 'హిస్టరీ ఆఫ్ గోల్కొండ' పుస్తకం కూడా తెలంగాణ సాహిత్య అకాడమి వారి వద్ద లభిస్తుంది.

అన్నవరం దేవేందర్ 'గ్రేయిన్ చైన్స్' ఆవిష్కరణ

అన్నవరం దేవేందర్ ఆంగ్ల అనువాద కవితా సంపుటి 'గ్రెయిన్ చైన్స్' ఈ నెల 14న ఉదయం 10 గంటలకు కరీంనగర్ ఫిలింభవన్‌లో ఆవిష్కరణ జరుగుతుంది. ఇందులో బి.నరసింగరావు, డా॥ నలిమెల భాస్కర్, ఎనిశెట్టి శంకర్, జీవీ శ్యాంప్రసాద్‌లాల్, నగునూరి శేఖర్, పొన్నం రవిచంద్ర, సవ్యసాచి, గాజోజు నాగభూషణం, నంది శ్రీనివాస్, బూర్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొంటారు.

- మాడిశెట్టి గోపాల్, 9440238852

నల్లకొడిసె వన్నెకాడు పుస్తకావిష్కరణ

నాగిళ్ల రమేష్ కవిత్వం 'నల్లకొడిసె వన్నెకాడు' పుస్తకావిష్కరణ ఈ నెల 14 వ తేదీ 6 గంటలకు రవీంద్రభారతి మినీహాల్‌లో జరుగుతుంది. ఈ సభకు కవి యాకూబ్, కె.శివారెడ్డి, డా॥కోయి కోటేశ్వరరావు, నాగిళ్ల సదానందం, జబ్బు వెంకటేష్, డా॥మామిడి హరికృష్ణ, పల్లిపట్టు నాగరాజు, వనపాకల దిలీప్, తగుళ్ల గోపాల్, పేర్ల రాము, నరేష్ కుమార్ సూఫీ, గుర్రాల అనూష, లిఖిత్ కుమార్ గోదా హాజరవుతారు.

'వీధిచుక్కలు' కవితాసంకలనం ఆవిష్కరణ

సాహితీకిరణం సౌజన్యంతో శ్రీమతి కొసరాజు సామ్రాజ్యం సంపాదకత్వంలో ప్రచురించిన 'వీధిచుక్కలు' కవితాసంకలనం ఆవిష్కరణ ఈనెల14వ తేదీ హైదరాబాద్ మోహన్‌నగర్‌లోని కొసరాజు ఆర్తి & జాహ్నవి మెమోరియల్ ట్రస్ట్ హాల్లో జరుగుతుంది. ఇందులో యస్.వి.రామారావు, రమణ వెలమకన్ని, వై. రామకృష్ణారావు, గుదిబండి వెంకటరెడ్డి, పొత్తూరి సుబ్బారావు, పొత్తూరి జయలక్ష్మి, పెద్దూరి వెంకటదాసు, డా॥పి.లలితవాణి పాల్గొంటారు. ఈ సందర్భంగా 'కన్నవారి కలలు పిల్లల బాధ్యతలు' అనే అంశంపై నిర్వహించే కవి సమ్మేళనంలో అనేక మంది కవులు, కవయిత్రులు పాల్గొంటారు. - పొత్తూరి సుబ్బారావు

'అన్వేషణ' ఆవిష్కరణ సభ

తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ సౌజన్యంతో డా॥తూర్పు మల్లారెడ్డి సాహిత్య వ్యాసాల సంపుటి 'అన్వేషణ' ఆవిష్కరణ సభ ఈ నెల 12వ తేదీ సాయంత్రం 6 గంటలకు రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్లో జరుగుతుంది. ఈ సభకు డా॥నందిని సిధారెడ్డి, డా॥నళేశ్వరం శంకరం, డా॥వి.శంకర్, డా॥ఏనుగు నరసింహారెడ్డి, డా॥మామిడి హరికృష్ణ, బైస దేవదాస్, కందుకూరి శ్రీరాములు, డా॥బెల్లంకొండ సంపత్‌కుమార్ హాజరవుతారు.

- తెలంగాణ రచయితల సంఘం

శ్రీశ్రీ స్మారక కథల పోటీ -2024

సింహప్రసాద్ సాహిత్య స్వర్ణోత్సవ సందర్భంగా 'రొట్టెముక్క, అరటి తొక్క, బల్ల చెక్క' అంశాలపై మహాకవి శ్రీశ్రీ స్మారక కథల పోటీ నిర్వహిస్తున్నారు. మూడు కథలకు మూడు బహుమతులు వుంటాయి. కథ 3-8 పేజీలు వుండాలి. 50 సంవత్సరాల లోపు వారు మాత్రమే కథలను ఆగస్ట్ 20వ తేదీ లోపు Ch. Siva Rama Prasad (Vanisri), Swagruha apartments, C- block, F-2, opp. KPHB, Kukatpally, Hyderabad -500072. చిరునామాకు పంపాలి. సెల్: 9390085292. - సింహప్రసాద్

'సారంగి' నవలకు రజనిశ్రీ సాహిత్య పురస్కారం

జాతీయ సాహిత్య పరిషత్ కరీంనగర్ జిల్లా శాఖ ఇచ్చే రాష్ట్రస్థాయి రజనిశ్రీ సాహిత్య పురస్కారం గాను 2024 సంవత్సరానికి చుండూరు సీత 'సారంగి' నవల ఎంపికైంది.

ఈ దురాచారానికి.. ఇంకెప్పుడు చరమగీతం?



డా. చిటికెన కిరణ్ కుమార్, 9490841284

ప్రపంచవ్యాప్తంగా 258 మిలియన్ల కంటే ఎక్కువ వితంతువులు ఉన్నప్పటికీ వితంతువులు చారిత్రాత్మకంగా మన సమాజాలలో కనిపించకుండా, మద్దతు లేకుండా లెక్కించబడకుండా మిగిలిపోయారు. సాయుధ పోరాటాలు, స్థానభ్రంశం, వలసలు, కోవిడ్-19 మహమ్మారి పదివేల మంది స్త్రీలను కొత్తగా వితంతువులుగా చేసింది.

అనిశెట్టి రజిత ప్రధాన సంపాదకత్వంలో వెలువడిన 'భారతదేశంలో వితంతు వ్యవస్థ' సంకలనంలో- సామాజిక సాహిత్య వ్యాసాలు, వ్యక్తిత్వాలు, కథనాలు వివిధ కోణాలలో పరిశీలించి వితంతుల జీవితాల గాథలను సవివరంగా రచయితలు తెలియజేశారు.

దేశ వ్యాప్తంగా స్త్రీల పట్ల జరిగే హింసలు ప్రస్తావించబడినపుడు ఎక్కడా ఆ పట్టికలో 'వితంతు స్త్రీల' అగచాట్ల గురించిన మాటనేది ఉండక పోవటం, శతాబ్దాల దేశ చరిత్రలో స్త్రీలు 'సతి' మంటల నుండి 'వైధవ్యపు' చెరల దాకా చేసిన చేస్తున్న ప్రయాణం దుర్భరమైన, అమానవీయమైన అనేక పరిస్థితులను పరిశీలనలోకి తీసుకొని రుద్రమ ప్రచురణలు, వరంగల్ విమెన్ లీటరరీ కలెక్టివ్ 'భారతదేశంలో వితంతు వ్యవస్థ' సామాజిక, సాహిత్య వ్యాసాలు, వ్యక్తిత్వాలు, కథనాలు, నివేదికలతో రెండు సంవత్సరాల కృషిని 450 పుటల సంకలనంగా ప్రచురించారు.

డాక్టర్ తెన్నేటి విజయచంద్ర రాసిన వైధవ్యం - బ్రాహ్మణీయ పితృస్వామ్య వ్యవస్థ - భావనా దృక్పథాలు సామాజిక వ్యాసంలో.... కులం, జెండర్, బ్రాహ్మణీయ పితృస్వామ్యం-వితంతు వ్యవస్థ చారిత్రక మూలాలను తెలియజేస్తూ స్త్రీని శారీరకంగా, మానసికంగానే కాక, సామాజికంగా, నైతికంగా, ఆర్థికంగా బానిసగా, ఒక దోపిడీ వస్తువుగా మార్చిన వితంతు వ్యవస్థ నిర్మితీ, భావనను సంపూర్ణంగా అర్థం చేసుకోవాలంటే ఈ వ్యవస్థకి ప్రధాన మూలాలైన కులవ్యవస్థ, జెండర్ వీటి నుండి ఆవిర్భవించిన బ్రాహ్మణీయ పితృస్వామ్య వ్యవస్థ భావజాల చారిత్రక నేపథ్యం ప్రస్తావించడం అవసరమని బ్రాహ్మణీయ భావజాలం నుంచి ఆవిర్భవించిన దురాచారాలలో వితంతు వ్యవస్థ ఒకటని తెలిపారు.



అనిశెట్టి రజిత రాసిన లింగ వివక్షతలో అంతర్భాగమే వితంతువులపై వివక్షత వ్యాసంలో... మన దేశంలో ప్రజా విధానం మరియు ఆర్థికాభివృద్ధి కోణాల నుండి. వితంతువుల సమస్యను ముఖ్యమైనదిగా తీసుకొని అధ్యయనం చేయడం అవసరం. వితంతువులకు అండగా ఉండటం కోసం వారిది సామాజిక సమస్యగా పరిగణించి విధానపరంగా, ప్రజా చైతన్యం దృష్ట్యా కదలిక తేవాల్సిన అవసరం వుంది.

ఆధిపత్య పితృస్వామ్యం నిర్మాణంలో వైధవ్యాన్ని స్త్రీ సామాజిక మరణంగా భావించడం సంఘాచారంగా వస్తున్నది. కొన్ని రాష్ట్రాల్లో వైధవ్యం పొందిన స్త్రీని భర్త సోదరునికి పునర్వివాహం చేసే ఆచారం కూడా ఉన్నది. ఈ రెండు ఆచారాలు వితంతువు అయినందుకు ఆ స్త్రీ ప్రమేయంగానీ ఇష్టాయిష్టాలకు నిమిత్తంగానీ లేకుండానే ఆమెపై రుద్దబడతాయని వివరించారు.

డాక్టర్ బి. విజయలక్ష్మి రాసిన వితంతు వివక్ష-చట్టబద్రత వ్యాసంలో... చట్ట భద్రత గురించి ప్రస్తావిస్తూ... ఎన్ని చట్టాలున్నా అమలు పెద్ద బలహీనత. 1856లో వితంతు పునర్వివాహ చట్టం వచ్చింది. 1956లోని హిందు వారసత్వము చట్టం కొన్ని మార్పులు చేసింది. వితంతు స్త్రీ తన తండ్రి వాటాలో లభించే వారసత్వ హక్కులో ఎలాంటి మార్పూ లేదని వివరించారు.

డాక్టర్ కొమర్రాజు రామలక్ష్మి రాసిన 'తంత్రులు తెగిన వీణను సవరిస్తే'.. వ్యాసంలో సంగమం నవలను వివరించారు.

సామాజిక సమస్యలు ముఖ్యంగా మహిళా సమస్యల దృష్టికోణంలో కథలు, నవలలు రాస్తున్న రచయిత్రి సోమంచి శ్రీదేవి నవల 'సంగమం'. పితృస్వామ్య భావజాలం వేళ్ళూని ఉన్న భారతీయ సమాజంలో ఒక వితంతు మహిళ పునర్వివాహం, దాని పర్యవసానాలు ఇతివృత్తంగా సాగిన నవల 'సంగమం'. ఆచారాల పేరిట స్త్రీలను అన్నింటా అవమానపరుస్తూ, వాళ్ళ ఆత్మగౌరవాన్ని కించపరుస్తూ హింసించడం మన సంస్కృతా? ఇదేనా సంప్రదాయమంటే? భార్య చనిపోయిన మగవాడికి లేని ఆంక్షలు, కట్టుబాట్లు, ఆక్షేపణలు భర్తను కోల్పోయిన స్త్రీకి మాత్రం ఎందుకు? అంతేకాదు ఆ స్త్రీ భర్తలేడన్న కారణంగా 'వితంతువు' అనే ప్రత్యేక పదంతో పిలవబడుతూ ఈ సమాజం నుండి పరాయీకరించబడటం అన్యాయమేగా, ఈ సమస్యను సామాజిక కోణం నుండి చూసి ఆ భావజాలాన్ని ప్రశ్నిస్తూ సమాజాన్ని చైతన్యీకరించే బాధ్యత మనందరిపైనా లేదా? అని ప్రశ్నించారు.

తమ్మెర రాధిక రాసిన 'శ్రీపాద కథల్లో వితంతువులు' వ్యాసంలో... 1891లో జన్మించిన శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి బ్రాహ్మణ కుటుంబాలను ఇతివృత్తంగా తీసుకొని రాసిన కథలను గుర్తు చేస్తూ... అగ్రహారాలల్లో ఐదు సంవత్సరాల ఆడపిల్లలకు వివాహాలు చెయ్యడం ఆనాటి సాంప్రదాయం. రజస్వల అయ్యిందని లోకానికి తెలియడం అనేది ఆ రోజులలో మరణ సాదృశ్యం లాంటిదే. ఎందుకంటే వ్యక్తురాలయిన పిల్లని పెళ్ళి చేసుకోవడం పరువు తక్కువ అని భావించేవారని వారి రచనలలో తెలియజేశారు.

బొమ్మకంటి కృష్ణకుమారి రాసిన 'వీరేశలింగం పంతులు సంస్కరణ ఉద్యమాలు' వ్యాసంలో 1848లో జన్మించిన ఏకసంథాగ్రహి అయిన కందుకూరి వీరేశలింగం పంతులు జీవితంలోని సంఘ సంస్కరణ ఉద్యమాలలో అనేక విషయాలను తెలియజేశారు.

కొలిపాక శోభ రాసిన 'బతుకు చితి' కథనంలో అమ్మలక్కలు లేని పెత్తనం ఎత్తుకొని పుట్టింటి వారు గాజులు (వెండివో బంగారువో కలిగితే) తేవాలని, తెల్ల చీర కూడా తెచ్చి చీకటిలోనైనా వెలుగులోనైనా ఎవ్వరి కంటపడకుండా (కనిపించనీయకుండా) ముసుగువేసి అయి బొట్టు, గాజులు, మట్టెలు తీసెయ్యటం... ఒకవేళ కాదు కూడదని అడ్డు చెప్పినా, అట్లాగే ఉంచితే కీడు అని మనస్సులో భీతిని నింపుతారు. అదేపనిగా చెవిలో జోరీగ లెక్క మాట్లాడుతూ అవన్నీ జరుపుతుంటే ఇంకా నా ప్రాణం పోకుండా ఎందుకు మిగిలి ఉందని మనస్సు చితికి ఛిద్రుపాలైంది. నిర్వహ్యంగా చాదువు, సాంప్రదాయం కొనసాగింది. ఇలా వైధ్యవ్యపు జీవితంలో నెలకొన్న పరిస్థితులను తెలిపినారు.

దేశ వ్యాప్తంగా స్త్రీల పట్ల జరిగే హింసలు ప్రస్తావించబడినపుడు ఎక్కడా ఆ పట్టికలో 'వితంతు స్త్రీల' అగచాట్ల గురించిన మాటనేది ఉండక పోవటం, శతాబ్దాల దేశ చరిత్రలో స్త్రీలు 'సతి' మంటల నుండి 'వైధవ్యపు' చెరల దాకా చేసిన చేస్తున్న ప్రయాణం దుర్భరమైన, అమానవీయమైన అనేక పరిస్థితులను పరిశీలనలోకి తీసుకొని రుద్రమ ప్రచురణలు, వరంగల్ విమెన్ లీటరరీ కలెక్టివ్ 'భారతదేశంలో వితంతు వ్యవస్థ' సామాజిక, సాహిత్య వ్యాసాలు, వ్యక్తిత్వాలు, కథనాలు, నివేదికలతో రెండు సంవత్సరాల కృషిని సంకలనంగా ప్రచురించారు.

అప్పట్లో 'సతి' పేరుతో భర్త చనిపోయిన స్త్రీని దహనం చేసే దురాచారం ఉండేది. సతిని 1829 డిసెంబర్లో బ్రిటిష్ ఇండియా తొలి గవర్నర్ విలియం బెంటింగ్ దీనిని రద్దు చేశారు. ఆయన బెంగాల్ గవర్నర్ జనరల్‌గా ఉండేవారు సతిపై 49 మంది సీనియర్ సైన్యాధికారులు, ఐదుగురు జడ్జిల అభిప్రాయాలను ఆయన సేకరించారు. ఆ తర్వాత బ్రిటిష్ పాలనపై మచ్చలా కనిపిస్తున్న దీన్ని రద్దు చేసేందుకు సమయం ఆసన్నమైందని భావించి రద్దు చేశారు.

భర్త మరణించిన ఆడవారికి మళ్ళీ పెళ్ళి చేసి కొంతమంది చిన్న వయసులోనే బాలికలను కన్యాశుల్కం మీద ఆశతో అప్పట్లో వృద్ధులకిచ్చి వివాహం జరిపించే వారు. అందువల్ల ఆ బాలికలు తొందరగా వితంతువులు అయ్యేవారు. అప్పటి సాంఘిక పరిస్థితుల ప్రకారం వారు వివక్షను ఎదుర్కొనే వారు. వారికి పునర్వివాహం చేయడం ద్వారా వారి జీవన విధానాన్ని మెరుగుపరచడమే ముఖ్యోద్దేశం. బ్రహ్మ సమాజాన్ని స్థాపించి సాంఘిక దురాచారాలపై పోరాడిన రాజా రామ్మోహన్‌రాయ్ కృషి వల్ల సతీసహగమనానికి చట్టపరంగా అడ్డుకట్ట పడింది. అతని ఆశయాలు కొనసాగిస్తూ ఈశ్వరచంద్ర విద్యాసాగర్ వితంతు వివాహాల కోసం కృషి చేశారు.

'భారతదేశంలో వితంతు వ్యవస్థ'- సామాజిక సాహిత్య వ్యాసాలు, వ్యక్తిత్వాలు కథనాలు సంకలనం నందు డా.మెట్టా ఉషారాణి, డా తెన్నేటి విజయచంద్ర, కాత్యాయని విద్మహే, పి జ్యోతి, కె వీణారెడ్డి, వేముగంటి శుక్తిమతి, షహనాజ్ బేగం, మెట్టు రవీందర్, డా.బండారి సునీత, తిరునగిరి నవత, కందాల శోభారాణి, శాంతి, డా. తిరునగరి దేవకీదేవి, కొండేపూడి నిర్మల, కొండవీటి సత్యవతి, బి అంజనీదేవి, సుమిత్రాదేవి, స్వరాజ్యం వెంకటరమణమ్మ, ఈరగాని బిక్షం, ఎ్మఆర్, అన్వేషి తదితరుల వ్యాసాలతో దురాచార వైధవ్యపు వ్యవస్థకు చరమగీతం ఎప్పుడంటూ, ముత్తయిదువులని, పుణ్యస్త్రీలని, వితంతువులని స్త్రీలని విభజించే దుర్మార్గ సంస్కృతిని వ్యతిరేకిస్తూ కలాలు కదిపారు.

వితంతు స్త్రీలు పనిచేస్తున్న చోట వృత్తి బాధ్యతలు నిర్వహణలో వాళ్ళు ఎదుర్కొంటున్నటువంటి కష్టాలు వివిధ రకాలుగా ఉన్నాయి. వారిని చూసే తీరుతెన్నుల్లో అనేక కోణాల్లో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

ఈ పుస్తకంలో మహిళ, వితంతువుగా ఎదుర్కొంటున్న అనేక రకాలయిన సమస్యలకు ప్రముఖ సామాజిక సాహిత్య రచయిత్రులు రాశారు. అనిశెట్టి రజిత ప్రధాన సంపాదకురాలుగా డా॥కొమర్రాజు రామలక్ష్మి, చందనాల సుమిత్ర, తమ్మెర రాధికలు సంపాదకవర్గంగా వ్యవహరించారు. ఏ వరంగల్ ఉమెన్ లిటరరీ కలెక్టివ్ దీనిని ప్రచురించింది.



ఎస్ఐ శ్రీనివాస్ మృతి

కులవివక్ష, వేధింపులు తట్టుకోలేక గత నెల 30న ఆత్మహత్యాయత్నం

- మృతదేహంతో జాతీయ రహదారిపై మాజీ ఎమ్మెల్యే పెద్ది, కుటుంబ సభ్యుల రాస్తారోకో
  మృతికి కారణమైన అధికారులను విధుల నుంచి తొలగించాలంటూ డిమాండ్
- అశ్వారావుపేటలో దళిత సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో, స్టేషన్ ముట్టడి
- స్వగ్రామంలో అంత్యక్రియలు పూర్తి

నవతెలంగాణ-అశ్వారావుపేట/ నల్లబెల్లి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండల ఎస్ఐ శ్రీరాముల శ్రీనివాస్ ఆదివారం ఉదయం మృతి చెందారు. సీఐ, మరో నలుగురు సిబ్బంది కుల వివక్ష, వేధింపులు తట్టుకోలేక గత నెల 30వ తేదీన మహబూబాబాద్ సమీపంలో గడ్డి మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శ్రీనివాస్ సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించి ఆదివారం ఉదయం తుదిశ్వాస విడిచాడు. 2014 బ్యాచ్‌కు చెందిన ఎస్ఐ శ్రీను వరంగల్ జిల్లా, నల్లబెల్లి మండలం నారక్కపేట వాసి. ఈయనకు తల్లి రాజీరమ్మ, సోదరులు, భార్య కృష్ణవేణి, పాప, బాబు ఉన్నారు. శ్రీను చివరిగా ఇచ్చిన వాంగ్మూలంలో.. సీఐ జితేందర్, సిబ్బంది సన్యాసి నాయుడు, శుభాని, శేఖర్, శివ నాగరాజుల వేధింపులే తన ఆత్మహత్యాయత్నానికి కారణమని చెప్పారు. వారు ఎప్పుడూ తనతో గొడవ పడుతూ సక్రమంగా చేసే పనులను చేయకుండా అడ్డుపడుతూ తక్కువ కులం వాడినని హీనంగా చూసేవారని తెలిపారు. సీఐ కూడా స్టేషన్ సిబ్బంది చెప్పే మాటలే నమ్మేవారని, ఈ విషయాలపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని అన్నారు. శ్రీనివాస్‌ను వేధింపులకు గురి చేసిన వారిపై అతని భార్య కృష్ణవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, ఎస్ఐ స్వగ్రామమైన వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని నారక్కపేట గ్రామంలో శ్రీరాముల శ్రీనివాస్ అంత్యక్రియలు నిర్వహించారు. ఈ అంతక్రియల్లో నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, నల్లబెల్లి మాల మహానాడు జిల్లా అధ్యక్షులు సాదు నర్సింగరావు, ముఖ్య సలహాదారులు మోటూరు రవి, జిల్లా ప్రధాన కార్యదర్శి కోతి విష్ణు, ఇతర దళిత సంఘాల నాయకులు, పోలీసు శాఖ సిబ్బంది డీసీపీ రవీందర్, ఏసీపీ కిరణ్ కుమార్, డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, సీఐలు, ఎస్ఐలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఐ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి : మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

శ్రీనివాస్ స్వగ్రామం నారక్కపేటకు మృతదేహం రాగానే దళిత సంఘాల నాయకులు, కుటుంబ సభ్యులు జాతీయ రహదారిపై మృతదేహంతో రాస్తారోకో నిర్వహించారు. శ్రీనివాస్ మృతికి కారకులైన సీఐ జితేందర్‌రెడ్డి, స్టేషన్ సిబ్బందిని వెంటనే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి.. ఆందోళన జరుగుతున్న ప్రాంతానికి చేరుకొని వారికి మద్దతు తెలుపుతూ పాల్గొన్నారు. అనంతరం పెద్ది మాట్లాడుతూ.. ప్రభుత్వ తీవ్ర పని ఒత్తిడి, ఉన్నతస్థాయి అధికారుల వేధింపులు తట్టుకోలేకనే ఎస్ఐ శ్రీరాముల శ్రీనివాస్ మృతి చెందారని, దీనికి ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలన్నారు. శ్రీనివాస్ కుటుంబానికి కోటి రూపాయల తక్షణ పరిహారం అందించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

దళిత సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో, స్టేషన్ ముట్టడి

ఎస్ఐ శ్రీను మృతి విషయం తెలుసుకున్న స్థానిక దళిత సంఘాలు.. నియోజక వర్గ కేంద్రం మూడు రోడ్ల ప్రధాన కూడలిలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రాస్తారోకో నిర్వహించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌ను ముట్టడించి సంబంధిత సిబ్బందిని విధులు నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఇన్‌చార్జి సీఐ కరుణాకర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు కలపాల మంగరాజు, తగరం రాంబాబు, ముద్దా పిచ్చయ్య, కొలికిపోగు వెంకటేశ్వరరావు, జక్కుల రాంబాబు, కేశవ్ గౌడ్, నార్లపాటి మహేష్, తగరం రాం నివాస్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస్ కుటుంబానికి న్యాయం చేస్తాం : కొత్తగూడెం ఎస్పీ

ఎస్ఐ శ్రీనివాస్ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రాజీవ్ రంజన్ హామీ ఇచ్చారు. శ్రీనివాస్ మృతదేహాన్ని తన స్వగ్రామానికి తీసుకొచ్చి జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తుండగా ఎస్పీ అక్కడకు చేరుకుని ఆందోళనను విరమింపజేశారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో ఎస్పీ మాట్లాడుతూ.. శ్రీనివాస్ మృతికి కారుకులైన వారిని వదిలే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వంతో మాట్లాడి కుటుంబానికి అందాల్సిన ఎక్స్‌గ్రేషియాను అందిస్తామని, ఆయన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు. ఆయన వెంట డీసీపీ రవీందర్, ఏసీపీ కిరణ్ కుమార్, డీఎస్పీ ఎస్.కె అబ్దుల్ రెహమాన్, సీఐలు, ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

సీఐ జితేందర్, నలుగురు సిబ్బందిపై క్రమశిక్షణా చర్యలు:

తన భర్త ఆత్మహత్యాయత్నానికి సీఐ జితేందర్, సిబ్బంది సన్యాసి నాయడు, శుభాని, శేఖర్, శివ నాగరాజులే కారణం అంటూ ఎస్ఐ శ్రీను సతీమణి కృష్ణవేణి సికింద్రాబాద్ మార్కెట్ పోలీస్ స్టేషన్‌లో మూడ్రోజుల క్రితం ఫిర్యాదు చేశారు. అక్కడి పోలీస్‌లు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి మహబూబాబాద్ పోలీసులకు పంపారు. దాంతో సీఐపై అట్రాసిటీ కేసు నమోదు చేయడమే కాకుండా ఆయన్ను అశ్వారావుపేట నుంచి బదిలీ చేసి వరంగల్ ఐజీపీ కార్యాలయానికి అటాచ్ చేశారు. మరో నలుగురు సిబ్బందిని ఎస్పీ కార్యాలయం కొత్తగూడెంకు అటాచ్ చేసారు. అశ్వారావుపేటకు ఇన్‌చార్జి సీఐగా కరుణాకర్ వ్యవహరిస్తున్నారు.

ఎస్ఐ శ్రీను మేనత్త రాజమ్మ మృతి

ఎస్ఐ శ్రీను మృతి విషయం తెలిసి గుండెపోటుతో తన మేనత్త మృతి చెందారు. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం నాచినపల్లికి చెందిన రాజమ్మ తన మేనల్లుడు శ్రీనివాస్ మరణ వార్త విని ఒక్కసారిగా కుప్పకూలి పోయారు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రాణాలు విడిచారు. దాంతో వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. రాజమ్మకు భర్త ఐలయ్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఎస్ఐ మృతి విషాదకరం : ఎమ్మెల్యే ఆదినారాయణ

ఎస్ఐ శ్రీను మృతి విషాదకరమని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఆయన మృతికి సంతాపం ప్రకటించి, కుటుంబానికి సానుభూతి తెలిపారు. ప్రభుత్వం ఎస్ఐ కుటుంబాన్ని ఆదుకుంటుందని తెలిపారు.

నేడు, రేపు భారీ వర్షసూచన !

- పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరిక జారీ చేసిన వాతావరణశాఖ.

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో వచ్చే ఐదు రోజులు పాటు తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురవడంతో పాటు సోమ, మంగళవారాల్లో పలు జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో నిర్మల్, నిజామాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, వరంగల్, హన్మకొండ, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, భద్రాద్రి కొత్తగూడెం, జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో హెచ్చరికను జారీ చేసింది. మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం పడే సూచనలున్నాయి. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముంది. జీహెచ్ఎంసీ పరిధిలో వచ్చే 48 గంటల పాటు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం, రాత్రి సమయాల్లో చిరుజల్లులు కురిసే సూచనలున్నాయి. రాష్ట్రం మీదుగా నైరుతి రుతుపవనాలు చురుగ్గా కొనసాగుతున్నాయి.

తొమ్మిదేండ్లుగా ప్రయత్నం.. కనికరించని కేంద్రం

- ఏర్పాటు కాని మరమగ్గాల క్లస్టర్
- కేంద్రం నిర్ణయంపై నేతన్నల ఎదురుచూపు



నవతెలంగాణ - సిరిసిల్ల

రాష్ట్రంలో మరమగ్గాల వస్త్రోత్పత్తిలో రాజన్న సిరిసిల్ల జిల్లాది ప్రథమ స్థానం. కానీ ఇక్కడి పరిశ్రమల్లో ఉత్పత్తి అవుతున్న వస్త్రం జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌లో పోటీ పడలేక పోతున్నది. దీనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారం చాలా అవసరం. దాని కోసం సిరిసిల్లలో సమగ్ర పవర్ లూమ్ క్లస్టర్ డెవలప్‌మెంట్ స్కీమ్ (సీపీసీడీఎస్) కింద మెగా పవర్ లూమ్ క్లస్టర్ ఏర్పాటుకు తొమ్మిదేండ్లుగా జరుగుతున్న ప్రయత్నాలు కొలిక్కి రావడం లేదు. గత ప్రభుత్వంలో అప్పటి రాష్ట్ర మంత్రి కేటీఆర్, కేంద్ర జౌళిశాఖ అప్పటి మంత్రి స్మృతి ఇరానీని కలిసి అనేకసార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపోయింది.

రాష్ట్రవ్యాప్తంగా 35వేల మరమగ్గాలు ఉండగా వాటిలో 29వేలు రాజన్న సిరిసిల్ల జిల్లాలోనే ఉన్నాయి. వీటిపై గతంలో రోజుకు 13.20లక్షల మీటర్ల పాలిస్టర్, 6.60 లక్షల మీటర్ల కాటన్ వస్త్రోత్పత్తి జరుగుతోంది. జిల్లా కేంద్రంలో వస్త్రోత్పత్తి పరిశ్రమల ద్వారా 80శాతం మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతున్నారు. దేశవ్యాప్తంగా వస్త్రోత్పత్తి రంగంలో వస్తున్న ఆధునికతను ఇక్కడి పరిశ్రమ వర్గాలు అందిపుచ్చుకోలేక పోతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానికంగా మరమగ్గాల ఆధునీకరణ, నైపుణ్యం, మౌలిక వసతుల కొరత అధికంగా ఉంది. ఈ సమస్యలతో దేశంలోని మిగతా ప్రాంతాల్లోని మరమగ్గాల పరిశ్రమతో ఇక్కడి పరిశ్రమ పోటీ పడలేక పోతుంది. ఫలితంగా జిల్లాలో ఉత్పత్తి అవుతున్న వస్త్రం జాతీయ, అంతర్జాతీయ స్థాయి మార్కెట్లలో గుర్తింపునకు నోచుకోవడం లేదు. సొంతంగా తయారుచేసి ఉత్పత్తులు బహిరంగ మార్కెట్‌లో ఇతర బ్రాండ్లతో పోటీ పడలేకపోతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తే సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభం నుంచి బయటపడే అవకాశం ఉంది.

సీపీసీడీఎస్ ఏర్పాటు చేస్తే..

రాష్ట్రంలో చేనేత మరమగ్గాల కార్పొరేషన్లు వేర్వేరుగా ఏర్పాటు చేశారు. సీపీసీడీఎస్ ఏర్పాటుకు గత ప్రభుత్వం రూ.993.65కోట్ల అంచనా వ్యయంతో ప్రణాళికను రూపొందిం చింది. మొదటి విడత కేంద్రం వాటాగా రూ.49.84కోట్లు కేటాయించాలని అప్పటి మంత్రి కేటీఆర్ నాటి కేంద్ర జౌళిశాఖ మంత్రికి విజ్ఞప్తి చేశారు. జిల్లాలో మెగా పవర్‌లూమ్ క్లస్టర్‌ను ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతంలో మరమగ్గాల పరిశ్రమపై ఆధారపడ్డ వేలాది కుటుంబాలకు శాశ్వత ప్రయోజనం కలుగుతుంది. మహారాష్ట్రలోని ఈరోడ్, బివండీ ప్రాంతాల్లో కేంద్రం 2009-10, 2012-14లో సీపీసీడీఎస్‌ను ఏర్పాటు చేసింది. ఆయా ప్రాంతాల చుట్టూ పది కిలోమీటర్ల పరిధిలో వస్త్రోత్పత్తి అనుబంధ పరిశ్రమలు విస్తరించాయి. ఇందులో చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రాయితీలు లభిస్తాయి. ఫలితంగా పరిశ్రమ సామర్థ్యం పెరుగుతుంది. అనుబంధంగా అత్యాధునిక ప్రాసెసింగ్, సైజింగ్, నూలు, డయింగ్, మార్కెటింగ్ కేంద్రం ఏర్పాటుకు అవకాశం ఉంటుంది. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో వస్త్రోత్పత్తి రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఇక్కడి మరమగ్గాలను ఆధునీకరించడం, వీపణిలో నూలు, రసాయనాల ధరలపై స్థానికంగా యజమానులకు, కూలీలకు అవగాహన కల్పించడంలో సీపీసీడీఎస్ ఉపయోగపడుతుంది. రాష్ట్రంలో తొలి టెక్స్‌టైల్ పార్కు సిరిసిల్లలోనే ఉంది. కేంద్రం అనుమతిస్తే ఇందులో ప్రత్యేకంగా స్థలం కేటాయించనున్నారు. దీనికోసం పెద్దూరు సమీపంలోని ఆపెరాల్ పార్క్, గ్రూపు వర్క్ షెడ్ పక్కన అవసరమైన స్థలం ఉంది. వస్త్రోత్పత్తి పరిశ్రమకు సేవలందించిన అన్ని రకాల పరిశ్రమలు ఒకేచోట ఉంటాయి. వేలాది మంది కార్మికులకు ఉపాధి భద్రత ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో చర్చించి సిరిసిల్ల నేతన్నలకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉంది.



దళిత ఎస్ఐ ఆత్మహత్యపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్ వెస్లీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దళిత ఎస్ఐ శ్రీరాములు శ్రీనివాస్ ఆత్మహత్యపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య పార్కు వద్ద నిర్వహించిన నిరసన ధర్నాలో వెస్లీ మాట్లాడుతూ చట్టాలు అమలు చేసే స్థానాల్లో ఉన్న పోలీసు శాఖలో కుల వివక్ష, వేధింపులు ఉండటం వల్లే ఎస్సై ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. ఆయన 25 రోజుల కిందటే తాను ఎదుర్కొన్న వివక్ష వేధింపులపై జిల్లా ఎస్పీకి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసు ఉన్నతాధికారులు సరైన సమయంలో స్పందించకపోవడం వల్లే ఎస్సై ఆత్మహత్య చేసుకున్నారని చెప్పారు. సీఐ జితేందర్ రెడ్డి, కొందరు కానిస్టేబుళ్ల వేధించటం వల్లే ఆయన మనస్తాపానికి గురయ్యారని తెలిపారు. ఈ సంఘటన పై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించాలని డిమాండ్ చేశారు. పోలీసు శాఖలో జరుగుతున్న కుల వివక్ష, వేధింపులపై ప్రక్షాళన చేపట్టాలని సూచించారు. పోలీసుల శాఖలోనే కుల వివక్ష కొనసాగితే గ్రామ సీమల్లో సాధారణ దళితుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయడంలో రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులు, ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం ప్రకాష్ కరత్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం కృపాసాగర్, ఎన్ బాలపీరు,బి సుబ్బారావు, గంధం మనోహర్, బి చెన్నయ్య, మల్కయ్య, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రమోషన్లలో మిగిలిపోయిన

లెఫ్ట్ ఓవర్ ఖాళీలు భర్తీ చేయాలి

స్కావెంజర్లను వెంటనే నియమించాలి

- విద్యుత్ బకాయిలు మాఫీ చేయాలి
- ప్రభుత్వ పాఠశాలలకు జీరో బిల్లు సదుపాయాన్ని కల్పించాలి : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

ప్రమోషన్లలో మిగిలిపోయిన లెఫ్ట్ ఓవర్ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని యూటీఎఫ్ భవన్‌లో జిల్లా అధ్యక్షులు ఎడ్ల సైదులు అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. విద్యాశాఖలో చాలాకాలంగా ఎదురుచూస్తున్న బదిలీలు, ప్రమోషన్లను, సమర్థవంతంగా, అన్ని కోర్టు కేసులను పరిష్కరించి వేగంగా, విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే నాటికి జరిపించినందుకు ప్రభుత్వానికి, విద్యాశాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. అయితే స్కూల్ అసిస్టెంట్ కేటగిరీలో ఒకే ఉపాధ్యాయునికి రెండు లేదా మూడు పోస్టుల్లో ప్రమోషన్‌కు అర్హత ఉన్నందున ప్రమోషన్ల తర్వాత నాన్‌జాయినింగ్ పోస్టులు చాలా మిగిలిపోయాయని అన్నారు. వీటిని కూడా ప్రస్తుత ప్రమోషన్ లిస్ట్‌నే కొనసాగిస్తూ అన్ని ఖాళీలను ఈ నెలలోనే భర్తీ చేసేందుకు ప్రభుత్వం చొరవ తీసుకొని కృషి చేయాలని కోరారు. అదేవిధంగా కొన్నేండ్లుగా రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్లు, సర్వీస్ పర్సన్లు లేక శుభ్రత కొరవడిందన్నారు. గ్రామపంచాయతీలు, ప్రభుత్వ పాఠశాలల శుభ్రతను పట్టించుకోవట్లేదని, పాఠశాలలు ప్రారంభమై నెల కావొస్తున్నందున ప్రతి పాఠశాలకు సర్వీస్ పర్సన్‌ను లేదా స్కావెంజర్‌ను వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యుత్ బకాయిలు భారీగా పెరిగిపోయాయని, ప్రభుత్వం వాటిని మాఫీ చేసి ప్రతి ప్రభుత్వ పాఠశాలకు జీరో ఎలక్ట్రిక్ బిల్ సదుపాయాన్ని కల్పించాలని కోరారు. రాష్ట్రంలోని రెసిడెన్షియల్, మోడల్, కస్తూర్బా గాంధీ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం చొరవ తీసుకొని పరిష్కరించాలని తెలిపారు. కస్తూర్బా పాఠశాలలో పనిచేస్తున్న సీఆర్టీలకు మినిమం బేసిక్ పే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి ఎం.రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు చాలా తక్కువగా ఉందన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థుల తల్లిదండ్రులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ పాఠశాలపై నమ్మకం కల్పించినట్టయితే తల్లిదండ్రులు విద్యార్థులను క్రమంగా బడికి పంపిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో పలు తీర్మానాలను ఆమోదించారు. అన్ని పాఠశాలలకు వెంటనే స్కావెంజర్లను నియమించాలని, 5000 పీఎస్ హెచ్ఎం పోస్టులను వెంటనే అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. మిగిలిపోయిన గెజిటెడ్ హెడ్మాస్టర్, స్కూల్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయాలని, పండిట్, పీఈటీ పోస్టులకు అప్ గ్రేడేషన్ పూర్తయినందున మిగిలిన పోస్టులను కామన్ సీనియార్టీ ప్రకారం నింపాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ళ వెంకటేశం, ఉపాధ్యక్షులు బక్కా శ్రీనివాసాచారి, ఉపాధ్యక్షులు బడుగు అరుణ, కోశాధికారి నర్రా శేఖర్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు సీహెచ్.అరుణ, జిల్లా కార్యదర్శులు సిహెచ్. రామలింగయ్య, ఎం. శ్రీనివాస్ రెడ్డి, గేర నరసింహ, రాసమల్ల రమాదేవి, నలపరాజు వెంకన్న, ఎం. మురళయ్య, యాదగిరి, సంస్కృతిక కమిటీ కన్వీనర్ గిరి యాదయ్య, ఆడిట్ కమిటీ కన్వీనర్ పల్లా మధుసూదన్ రెడ్డి, అకాడమిక్ కమిటీ కన్వీనర్ పగిడిపాటి నరసింహ, అన్ని మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యావాలంటీర్లను నియమించాలి

- ఎస్జీటీలను రిలీవ్ చేయాలి
- పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించాలి : టీపీటీఎఫ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సీఎం ఇచ్చిన హామీ మేరకు విద్యావాలంటీర్లను నియమించి బదిలీ అయిన ఎస్జీటీలను వెంటనే రిలీవ్ చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వై.అశోక్ కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లో టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించాలని కోరారు. మ్యూచువల్ టీచర్లకు బదిలీలు చేపట్టాలని విన్నవించారు. ప్రైమరీ స్కూళ్లల్లో హెచ్ఎం పోస్టులను మంజూరు చేయాలనీ, నాలుగు డీఏలను విడుదల చేసి పీఆర్సీ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. బీఈడీ అర్హత కలిగిన ఎస్జీటీలకు పదోన్నతులు కల్పించాలని విన్నవించారు. మిగిలిన ఖాళీల్లో అర్హతల గల ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించాలన్నారు. నూతన పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి మాట్లాడుతూ.. జీవో 317తో ఉపాధ్యాయులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆ సమస్యను పరిష్కరించాలని కోరారు. నైట్ వాచ్‌మెన్లను, బడి గంట కొట్టడానికి నాలుగో తరగతి ఉద్యోగులను వెంటనే నియమించాలని విన్నవించారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు నన్నెబోయిన తిరుపతి, డి.శ్రీనివాస్ కార్యదర్శులు ఎ.భుజంగరావు, కె.భోగేశ్వర్, ఎం. రాములు, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి స్వేచ్ఛను హరించే చట్టాలు

న్యాయ వ్యవస్థను నిర్వీర్యం చేసేలా పోలీసులకు అధికారం

- దేశద్రోహం పేరిట ఇచ్చిన నిర్వచనం రాజ్యాంగ విరుద్ధం
- "మూడు క్రిమినల్ చట్టాల అమలు- పర్యవసానాలు - ప్రమాదాలు" సెమినార్‌లో ఐలూ రాష్ట్ర అధ్యక్షులు, స్టేట్ బార్ కౌన్సిల్ సభ్యులు కొల్లి సత్యనారాయణ
- ఎలాంటి చర్చ లేకుండా ఏకపక్షంగా అమలు : సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు



నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన మూడు క్రిమినల్ చట్టాలు అత్యంత దుర్మార్గమైనవని ఐలూ రాష్ట్ర అధ్యక్షులు, స్టేట్ బార్ కౌన్సిల్ సభ్యులు కొల్లి సత్యనారాయణ అన్నారు. ఈ చట్టాలన్నీ వ్యక్తిగత స్వేచ్ఛను సైతం హరించి వేస్తాయని తెలిపారు. సీపీఐ(ఎం) ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ అధ్యక్షతన సుందరయ్య భవనంలో ఆదివారం నిర్వహించిన 'మూడు క్రిమినల్ చట్టాల అమలు- పర్యవసానాలు - ప్రమాదాలు' సెమినార్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. మూడు చట్టాలకున్న శిక్షను పదేండ్లకు పొడిగించటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఐపీసీ, సీఆర్పీసీ, ఎవిడెన్స్ యాక్ట్‌లను భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సంహిత, భారతీయ సాక్షి సంహితగా మార్చడంతో పాటు కఠినమైన శిక్షలు అమలు చేస్తున్నారన్నారు. ఈ చట్టాల మార్పు వెనుక క్రమేణా ఇతర దేశాల నుంచి తీసుకొచ్చిన చట్టాల పేరుతో మొత్తంగా రాజ్యాంగాన్ని మార్చాలనే కుట్ర దాగుందని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థను తొలగించి, ప్రతిపక్షాల వాక్ స్వాతంత్ర్యాన్ని హరించి వేస్తారన్నారు.

దేశద్రోహం, రాజద్రోహం పేరుతో సెక్షన్ 152లో చేసిన మార్పుతో దేశ ఐక్యత, సమగ్రతను దెబ్బతీశారనే పేరుతో పదేండ్లపాటు శిక్షించే అధికారం ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాథమిక హక్కులకు సైతం ఇది భంగం కలిగిస్తుందన్నారు.

మారణాయుధాలతో తిరగకూడదనే చట్టాన్ని సైతం రద్దు చేశారని తెలిపారు. వ్యక్తిగత ప్రైవసీని హరించేలా చట్టం చేశారన్నారు. పోలీసులకు విస్తృత అధికారాలు ఇవ్వటం సరికాదన్నారు. వాహన ప్రమాద కేసులో విధించే శిక్షలు భయానకంగా ఉన్నాయని చెప్పారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ లొంగిపోతే ఐదేండ్లు, లేదంటే పదేండ్ల శిక్ష విధిస్తారన్నారు. ఇప్పటికే కోర్టుల్లో కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ చట్టాలతో మరింతగా న్యాయస్థానాలపై భారం పడుతుందన్నారు.సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. పార్లమెంట్‌లో కానీ, న్యాయవాదులతో కానీ ఎలాంటి చర్చ లేకుండానే కొత్త చట్టాలను అమల్లోకి తెచ్చారని విమర్శించారు. పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛను హరించే ఈ మూడు చట్టాలను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. న్యాయవ్యవస్థను నిర్వీర్యం చేసే అధికారం పోలీసులకు ఇవ్వడాన్ని తప్పుబట్టారు. దేశద్రోహం పేరిట ఇచ్చిన నిర్వచనం రాజ్యాంగ విరుద్ధమమన్నారు. దర్యాప్తు పేరుతో వ్యక్తిగత స్వేచ్ఛను హరించటం సరికాదన్నారు. ఈ సెమినార్‌లో ఐలూ రాష్ట్ర కార్యదర్శి మందడపు శ్రీనివాసరావు, జిల్లా బార్ కౌన్సిల్ కార్యదర్శి చింతనిప్పు వెంకట్, ఐలూ జిల్లా కార్యదర్శి నల్లమల నవీన్ చైతన్య, రాష్ట్ర నాయకులు మీసాల వెంకటేశ్వర్లు, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై. విక్రమ్, కళ్యాణం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



అన్ని మతాల సంప్రదాయాలనూ గౌరవిస్తాం

- జగన్నాథ రథయాత్రలో సీఎం రేవంత్ రెడ్డి

నవతెలంగాణ - ముషీరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం అన్ని మతాల సంప్రదాయాలనూ గౌరవిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఇస్కాన్ దేవాలయం ఆధ్వర్యంలో జగన్నాథ రథయాత్ర ఆదివారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియం నుంచి నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ వరకు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ రథయాత్రను ఎన్టీఆర్ స్టేడియం వద్ద ముఖ్యమంత్రి ప్రారంభించి జగన్నాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. పూరి జగన్నాథ రథయాత్రలో పాల్గొనడం సంతోషకరంగా ఉందన్నారు. రథయాత్ర నిర్వహణలో పాలుపంచుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని తెలిపారు. జగన్నాథుడి శోభాయాత్ర నిర్వహిస్తూ ఇస్కాన్ మంచి కార్యక్రమాలు చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందరి కోసం పనిచేస్తూ ప్రతి మతాన్ని గౌరవిస్తున్నదని తెలిపారు. ఇస్కాన్ ప్రార్థనలతో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. మానవసేవే మాధవ సేవ అని సందేశాన్ని వ్యాప్తి చేయాలని కోరారు. సమాజంలో మార్పు కోసం చేసే ప్రతి కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ ప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆస్పత్రిలో అన్ని సౌకర్యాలూ కల్పిస్తాం

- పేదలకు ఇబ్బంది లేకుండా ఆధునాతన వైద్యం : వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ



నవ తెలంగాణ - మహబూబ్ నగర్

ఆస్పత్రిలో అన్ని సౌకర్యాలూ కల్పిస్తామని, రాష్ట్రంలోని పేదలందరికీ ఇబ్బంది లేకుండా ఆధునాతనమైన, మెరుగైన వైద్యం అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న 1000 పడకల జనరల్ ఆస్పత్రి నిర్మాణ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.జీవన్, రాష్ట్ర మౌలిక సదుపాయాల సంస్థ ఇంజనీరింగ్ అధికారి నిర్మాణ వివరాలను మ్యాప్ ద్వారా వివరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఈఏడాది చివరిలోగా ఆస్పత్రి నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించేందుకు సిద్ధం చేస్తామని తెలిపారు. ఈ ఆస్పత్రిలో వెయ్యి పడకలతో పాటు అదనంగా డాక్టర్లు, సిబ్బంది, టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు ఇతర సిబ్బందితో కలిసి అదనంగా సుమారు 600 మందిపైగా అవసరం ఉంటుందన్నారు. ప్రభుత్వం అదనపు సిబ్బంది నియామకంకు చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. అలాగే, గద్వాల, నారాయణ పేట, నాగర్ కర్నూల్ జిల్లాల్లోని మెడికల్ కాలేజీలతో పాటు పీహెచ్‌సీ, సబ్ సెంటర్, ఏరియా ఆస్పత్రులు, బోధన ఆస్పత్రుల్లో అన్ని సౌకర్యాలు కల్పించనున్నట్టు తెలిపారు. ఈ నెల 9న ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అభివృద్ధిపై ప్రజాప్రతినిధులు, జిల్లా యంత్రాంగంతో ముఖ్యమంత్రి సమీక్షా సమావేశం నిర్వహించనున్నారని, దీంట్లో సాగునీటి ప్రాజెక్టులు, విద్య, వైద్య రంగం, పర్యాటక రంగ అభివృద్ధిపై చర్చించనున్నట్టు తెలిపారు. మంత్రి వెంట మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూధన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి, ఎస్పీ డి.జానకి, అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, ఎస్.మోహన్‌రావు, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా.కృష్ణ తదితరులు ఉన్నారు.

పారదర్శకంగా బదిలీలు చేపట్టాలి

- ఫోకల్, నాన్ ఫోకల్ స్పష్టతనివ్వాలి : ప్రభుత్వ ఫార్మాసిస్టుల సంఘం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉద్యోగుల బదిలీలను పారదర్శకంగా చేపట్టాలని తెలంగాణ ప్రభుత్వ ఫార్మసిస్టుల సంఘం కోరింది. ఈ మేరకు సంఘం అధ్యక్షులు కె.శంకర్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నప్పుడల్లా ప్రతి ఏడాది బదిలీలు జరిగి ఉద్యోగులందరికీ సమాన అవకాశాలు వచ్చాయని గుర్తుచేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న కాలంలో పారదర్శకత లేక ఉద్యోగులకు అన్యాయం జరిగిందని తెలిపారు. 2018లో రంగారెడ్డి జిల్లాలో జరిగిన బదిలీల్లో పట్టణ ప్రాంతంలో పని చేసే వారికి తిరిగి పట్టణ ప్రాంతంలో అవకాశాలిచ్చి గ్రామీణ ప్రాంతాల వారిని విస్మరించారని చెప్పారు. మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి బదిలీలు చేపడుతున్న క్రమంలో తమకు న్యాయం జరుగుతుందని గ్రామీణ ఉద్యోగులు ఎదురు చూస్తున్నారని తెలిపారు.



చంద్రబాబును కలిసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు టీడీపీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబునాయుడిని కలిశారు. బీఆర్ఎస్‌కు చెందిన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఆదివారం చంద్రబాబు నివాసానికి వెళ్లి ఆయనతో భేటీ అయ్యారు. అయితే ఇది కేవలం ముఖ్యమంత్రి అయిన సందర్భంగా చంద్రబాబునాయుడికి అభినందనలు తెలిపేందుకే వెళ్లామని ఎమ్మెల్యేలు తెలిపారు. అయితే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వరుసగా ఆపార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇద్దరు ఎమ్మెల్యేలు చంద్రబాబును కలవడం చర్చనీయాంశంగా మారింది. మరోవైపు జూబ్లీహిల్స్ ఎన్టీఆర్ భవన్‌లో టీడీపీ తెలంగాణ శాఖ నాయకత్వాన్ని ఉద్దేశించి చంద్రబాబు మాట్లాడుతూ తెలంగాణ ప్రజల నుంచి టీడీపీని వేరు చేయలేరనీ, రాష్ట్రంలో పునర్వైభవం సాధిస్తామని ధీమా వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.

తుమ్మల కూడా...

రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా ఏపీ సీఎం చంద్రబాబును కలిశారు. ముఖ్యమంత్రి అయిన సందర్భంగా కేవలం ఆయన్ని అభినందించేందుకు మర్యాదపూర్వకంగా కలిసినట్టు తెలిపారు. అదే సమయంలో ఏపీ-తెలంగాణ రాష్ట్ర రహదారుల నిర్మాణంపై చంద్రబాబుతో మాట్లాడినట్టు చెప్పారు.

ముగిసిన క్యూబా కమ్యూనిస్టు పార్టీ ప్లీనరీ

- దేశం ఎదుర్కొంటున్న సవాళ్లపై దృష్టి



హవానా: క్యూబా కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ 8వ ప్లీనరీ సమావేశం శుక్ర, శనివారాల్లో రెండు రోజులపాటు హవానాలో జరిగింది. క్యూబా రపిబ్లిక్ అధ్యక్షుడు, పార్టీ మొదటి కార్యదర్శి మిగుయెల్ డియాజ్ కానెల్ బెర్మ్యుడెజ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ, ప్రభుత్వ పనితీరును సమీక్షించారు. 2021 ఏప్రిల్‌లో జరిగిన పార్టీ 8వ మహాసభ తరువాత నిర్వహించిన ఎనిమిదో ప్లీనరీ ఇది. వక్రీకరణలు సరిదిద్దడం, ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించడానికి ప్రభుత్వ అంచనాల అమలు తీరుతెన్నులు, అలాగే ఆహార ఉత్పత్తిలో సాధించిన పురోగతి, ఆహార సార్వభౌమాధికారం, పోషకాహారం, విద్య, చట్టాల అమలు వంటి పలు అంశాలపై చర్చ జరిగినట్లు అధ్యక్షుడు కానెల్ తెలిపారు.

అవినీతి సొమ్ముతో పార్టీ ఫిరాయింపులు

- కేసీఆర్‌పై మంత్రి జూపల్లి ఫైర్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అవినీతి సొమ్ముతో పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించారని మంత్రి జూపల్లి కృష్ణారావు మాజీ సీఎం కేసీఆర్‌పై ఫైరయ్యారు. ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని విమర్శించారు. మాజీ మంత్రి నిరంజన్ రెడ్డికి రాహుల్ గాంధీకి లేఖ రాసే అర్హత లేదన్నారు. ఆదివారం హైదరాబాద్ అసెంబ్లీలోని సీఎల్పీ మీడియా పాయింట్‌లో ఎమ్మెల్యే ఈ. శంకర్‌తో కలిసి మంత్రి విలేకర్లతో మాట్లాడారు. కేసీఆర్ నిర్వాకంతోనే పదవులు పోయాయని గులాబీ పార్టీ నేత నిరంజన్‌రెడ్డి లేఖ రాయాలని సూచించారు. ఆయన కృష్ణా నదిని కూడా ఆక్రమించుకున్నారని ఆరోపించారు. ఆయన అవినీతి అక్రమాలపై ప్రభుత్వం విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటుందని అన్నారు. ప్రధాన మంత్రి పదవి కాళ్ల దగ్గరికొచ్చినా సోనియా, రాహుల్ గాంధీ వదులుకున్నారని గుర్తు చేశారు. రాహుల్ గాంధీ గురించి మాట్లాడే నైతిక హక్కు బీజేపీ, బీఆర్ఎస్ నాయకులకు ఉందా? అని ప్రశ్నించారు. ఆ రెండు పార్టీలు అంబేద్కర్ ఆశయాలను కాలరాస్తున్నాయని విమర్శించారు. గతంలో 12మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లో చేర్చుకోలేదా? అని ప్రశ్నించారు. ఆ రెండు పార్టీల నాయకులకు ఏమీ విలువలున్నాయని చెప్పారు. బీజేపీతో చీకటి ఒప్పందం చేసుకుని కాంగ్రెస్‌ను కూల్చాలని చూస్తున్నారని ఫైరయ్యారు. రాజ్యాంగాన్ని నిలబెట్టడం కోసమే తమ ప్రయత్నమని పేర్కొన్నారు. ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విలువల గురించి మాట్లాడటం దయ్యాలు, వేదాలు వల్లించినట్టు ఉందన్నారు. వారి అభీష్టం మేరకే ఆ పార్టీని వీడి ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని తెలిపారు. విభజన సమస్యల పరిష్కారానికే ఇరు రాష్ట్రాల సీఎంలు సమావేశమయ్యారని గుర్తు చేశారు.

అల్ట్రాటెక్ ఫ్యాక్టరీలో ఘోరం

ఏపీలో బాయిలర్ పేలి ఇద్దరు కార్మికులు మృతి

- మరో 14 మందికి గాయాలు
- వారిలో ఐదుగురి పరిస్థితి విషమం
- బాధితులకు అండగా నిలవాలని ఏపీ సీఎం ఆదేశం



జగ్గయ్యపేట: ఎన్‌టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం బూదవాడలోని ఆదిత్య బిర్లా గ్రూపునకు చెందిన అల్ట్రాటెక్ బాలాజీ సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా దారుణం చోటుచేసుకుంది. బాయిలర్ పేలి అధిక ఉష్ణోగ్రతతో కూడిన మెటీరియల్ మీదపడడంతో ఇద్దరు కార్మికులు మృతి చెందారు. మరో 14 మంది తీవ్రంగా గాయపడ్డారు. బాధితులకు అండగా నిలవాలని ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. ఆదివారం ఉదయం పది గంటల సమయంలో చోటుచేసుకున్న ఈ ప్రమాద ఘటనకు సంబంధించి తోటి కార్మికుల కథనం ప్రకారం... ప్రీ హీటర్ నిర్వహణలో లోపం కారణంగా బాయిలర్ పేలింది. దీనిద్వారా 1,300 డిగ్రీల ఉష్ణోగ్రతతో క్లింకర్, కిలన్ సరఫరా అవుతుంది. ఈ బాయిలర్‌కు సమీపంలో పనిచేస్తున్న కార్మికులపై ఈ మెటీరియల్ పడింది. దీంతో, 16 మంది తీవ్రంగా గాయపడ్డారు. వారిని విజయవాడలోని ఆంధ్రా, మణిపాల్ ఆస్పత్రులకు తరలించారు. బూదవాడ గ్రామానికి చెందిన అవుల వెంకటేష్ (37), పరిటాల అర్జునరావు (38) మణిపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారు. మరో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రుల్లో బూదవాడ గ్రామానికి చెందిన బాణావత్ స్వామి, వేముల సైదులు, గుగులోతు గోపి నయక్, గుగులోతూ బాలాజీ, ధారావత్ వెంకటేశ్వర్లు, బాణావతి సైదా, బీహార్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వివేక్ సింగ్, నాగేంద్ర సూరజ్ సింగ్, శుభం సోని, గుడ్డు కుమార్, దినేష్ కేశ్‌లాష్, రవికుమార్ విశ్వకర్మ, అరవింద్ యాదవ్ ఉన్నారు. క్షతగాత్రుల్లో ఏడుగురు విజయవాడ ఆంధ్రా ఆస్పత్రిలోనూ, మరో ఏడుగురు మణిపాల్ ఆస్పత్రిలోనూ చికిత్స పొందుతున్నారు.

యాజమాన్య నిర్లక్ష్యమే కారణం



ఫ్యాక్టరీలో సిమెంట్ తయారు చేసే క్రమంలో లైమ్ స్టోన్, ఐరన్ ఓర్, రెడ్ సాయిడ్ మిశ్రమాన్ని అత్యంత ఉష్ణోగ్రతతో పైప్ ద్వారా సరఫరా చేస్తారు. రెండు నెలలుగా పైప్‌లైన్ లీకు అవుతోందని, రక్షణ చర్యలు తీసుకోవాలని కార్మికులు యూనిట్ హెడ్ శివరావు దృష్టికి అనేక పర్యాయాలు తీసుకెళ్లారు. అయినా, పైప్‌లైన్ మార్చకుండా యాజమాన్యం నిర్లక్ష్యం వహించడం వల్ల ప్రమాదానికి దారితీసిందని కార్మికులు అంటున్నారు. గతంలోనూ ఈ ఫ్యాక్టరీలో ప్రమాదాలు జరిగాయని, వాటిని బయటకు రానీయకుండా యాజమాన్యం కప్పిపెట్టిందని వారు చెబుతున్నారు.

ఫ్యాక్టరీ వద్ద పోలీస్ బందోబస్తు

యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా తమ వారు ప్రమాదానికి గురయ్యారని తెలవడంతో వందలాది మంది గ్రామస్తులు ఆగ్రహంతో ఫ్యాక్టరీ వద్దకు చేరుకున్నారు. ఫ్యాక్టరీ అడ్మినిస్ట్రేషన్ బ్లాక్‌పై దాడి చేశారు. డిసిపి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు ఫ్యాక్టరీ వద్దకు చేరుకొని బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఏసీపీ రవికిరణ్ మాట్లాడుతూ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశామని, గాయపడిన వారిని మెరుగైన చికిత్సకు తరలించామని తెలిపారు. నందిగామ ఆర్‌డీఓ రవీంద్రరావు ఈ ఫ్యాక్టరీని పరిశీలించారు. ఇద్దరు కార్మికులు మృతి చెందిన సమాచారం తెలుసుకొన్న గ్రామస్తులు ఫ్యాక్టరీని ముట్టడించడానికి ప్రయత్నించారు. వారిని పోలీసులు అడ్డుకున్నారు.

ఏపీ సీఎం ఆరా

ప్రమాద ఘటనపై ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆరా తీశారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. క్షతగాత్రులకు అందుతున్న వైద్యంపై సీఎంఓ అధికారులతో మాట్లాడి తెలుసుకున్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఘటనకు కారణాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాధిత కుటుంబాలకు కంపెనీ నుంచి పరిహారం అందేలా చూడడంతోపాటు ప్రభుత్వం నుంచి కూడా సహాయం అందిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు.

యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి : సీఐటీయూ

ఈ ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపించి ఫ్యాక్టరీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు డిమాండ్ చేశారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులను ఆయనతోపాటు సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్‌సిహెచ్ శ్రీనివాస్, ఎ.వెంకటేశ్వరరావు, జిల్లా నాయకులు డివి కృష్ణ పరామర్శించారు. సంఘటనకు దారి తీసిన పరిస్థితులను కార్మికుల కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని, గాయపడిన కార్మికులందరినీ మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రికి వెంటనే తరలించాలని డిమాండ్ చేశారు.

రూ.50 లక్షల చొప్పున నష్టపరిహారం : సీపీఐ(ఎం) డిమాండ్

ఈ ప్రమాదం పట్ల సీపీఐ(ఎం) ఏపీ రాష్ట్ర కమిటీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం రూ.50 లక్షల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు సీపీఐ(ఎం) ఏపీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గాయపడిన వారికి ప్రభుత్వమే మెరుగైన వైద్యం అందించాలని, గాయపడిన తీవ్రతను బట్టి నష్టపరిహారాన్ని అందించాలని, ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ జరిపి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గాయపడిన వారిని సీపీఐ(ఎం) ఏపీ బృందం ఆస్పత్రికెళ్లి పరామర్శించింది.

న్యాయసంహిత చట్టాలు రాజ్యాంగ విరుద్ధం



- సమీక్ష కోసం సుప్రీంకోర్టులో ప్రత్యేక బెంచ్ ఏర్పాటు చేయాలి
- తెలంగాణ హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు వీ రఘునాథ్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన న్యాయసంహిత మూడు చట్టాలు రాజ్యాంగ విరుద్ధంగా ఉన్నాయని సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది, తెలంగాణ హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు వీ రఘునాథ్ అన్నారు. అసోసియేషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్ (ఏపీసీఆర్) తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో 'కొత్త నేర చట్టాలు' అంశంపై అవగాహనా కార్యక్రమం ఆదివారంనాడిక్కడి మదీనా ఎడ్యుకేషన్ సెంటర్‌లో జరిగింది. దీనికాయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. కొత్త క్రిమినల్ చట్టాల్లో పోలీసులకు అధికారాలు అపరిమితంగా ఇచ్చారనీ, దీనివల్ల రాజ్యహింస పెరిగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఐపీసీ ప్రకారం నేరస్తులను పోలీసులు అదుపులోకి తీసుకుంటే 15 రోజుల్లో కోర్టులో హాజరపర్చాలనీ, కానీ కొత్త క్రిమినల్ చట్టాల ప్రకారం 60 నుంచి 90 రోజుల వరకు పోలీసులు నిందితులను తమ అదుపులో ఉంచుకొనే అధికారాలు కల్పించారని వివరించారు. ఇది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని చెప్పారు. అలాగే నిందితులకు బేడీలు వేయడంపై పాత చట్టాల్లో కొన్ని నిబంధనలు ఉన్నాయనీ, కొత్త చట్టాల్లో వాటిని తొలగించేసి, పౌర సమాజ ప్రతిష్టను దెబ్బతీసేలా రూపొందించారని తెలిపారు. న్యాయస్థానం దోషులకు శిక్షలు విధిస్తే, వాటిని తగ్గించే, రద్దు చేసే అధికారాలను ప్రభుత్వాలకు ఇచ్చారనీ, దీనివల్ల న్యాయవ్యవస్థ ప్రతిష్ట దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21కి వ్యతిరకంగా న్యాయసంహితలోని 14, 19 ఆర్టికల్స్ ఉన్నాయన్నారు. ఈ చట్టాలు అమలైతే, అప్రజాస్వామికం పెచ్చరిల్లి, లింగ, కుల వివక్షలు పెరుగుతాయని చెప్పారు. అలాగే కొత్త చట్టాలు వాక్ స్వాతంత్ర్యం, భావప్రకటనా స్వేచ్ఛ, జీవించే హక్కులను కాలరాస్తున్నాయనీ, ఇది కూడా రాజ్యాంగ విరుద్ధమైన అంశాలేనని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టులో 90 శాతం న్యాయమూర్తులు ఉన్నత తరగతులకు చెందిన వారనీ, కొత్త చట్టాల అమలైతే, మైనార్టీలు ప్రమాదంలో పడతారని హెచ్చరించారు. భారత రాజ్యాంగంలోని హెబియస్ కార్పస్ ఆర్టికల్ 32 ఇకపై కోర్టులో ప్రాముఖ్యతను కోల్పోతుందనీ, టాడా, ఉపా వంటి కఠిన చట్టాల్లో మరణ శిక్షకు తొలి ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుందనీ, ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 19కి విరుద్ధమని చెప్పారు. న్యాయసంహితలోని మూడు చట్టాల్లోని లోపాలను ఎత్తి చూపుతూ హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో న్యాయవాదులు పిటీషన్లు దాఖలు చేయాలని సలహా ఇచ్చారు. అదే సమయంలో ఈ లోపాలను సమీక్షించేందుకు సుప్రీంకోర్టు నేతృత్వంలో ప్రత్యేక బెంచ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అదే సమయంలో రాజ్యాంగ విరుద్ధంగా ఉన్న చట్టాలను రద్దు చేయాలని కోరుతూ రాష్ట్రపతి, ప్రధాన మంత్రి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖలు రాయాలని పిలుపునిచ్చారు. హైకోర్టు న్యాయవాది మహ్మద్ సనాఉల్లాఫర్హాన్ మాట్లాడుతూ రాజ్యాంగ విరుద్ధమైన క్రిమినల్ చట్టాల వల్ల సామాన్య ప్రజలు, నిరపరాధులు నానా అవస్థలు పడతారనీ, పోలీసులకు అపరిమిత అధికారాలు ఇవ్వడం సరికాదన్నారు.

జరిమానాలు మొత్తాన్ని కూడా భారీగా పెంచారనీ, దీనివల్ల సమాజంలో ఆర్థిక అంతరాలు మరింత పెరుగుతాయని విశ్లేషించారు. కార్యక్రమానికి ఏపీసీఆర్ రాష్ట్రశాఖ ఉపాధ్యక్షులు డాక్టర్ జిలుకర శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యులు సుమైరా నసీర్ రసూల్‌ఖాన్, ఆకుల అనంతసేన్ రెడ్డి, డాక్టర్ ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

టీఎంసీ ఎంపీ మెహువా మొయిత్రాపై ఎఫ్ఐఆర్

న్యూఢిల్లీ : టీఎంసీ ఎంపీ మెహువా మొయిత్రాపై ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సిడబ్ల్యూ) చైర్‌పర్సన్ రేఖాశర్మపై అవమానకరమైన వ్యాఖ్యలు చేసారనే అభియోగాలతో ఈ ఎఫ్ఐఆర్ నమోదయింది. ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్‌లో తొక్కిసలాట ప్రాంతం సందర్శనకు వచ్చిన రేఖాశర్మపై ఎంపీ ఈ వ్యాఖ్యలు చేశారు. రేఖాశర్మకు ఇతరులు గొడుగు పట్టుకోవడం ఉన్న వీడియోను ఉద్దేశిస్తూ.. రేఖాశర్మ తన గొడుగును ఎందుకు పట్టుకోలేదని కొంత మంది సోషల్ మీడియాలో ప్రశ్నించారు. దీనికి స్పందిస్తూ 'ఆమె (రేఖాశర్మ) చేతులు తన బాస్ పైజామాను పట్టుకోవడంలో బిజీగా ఉన్నాయి' అని ఎంపీ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఈ వ్యాఖ్యలపై ఈ నెల 5న ఢిల్లీ పోలీసులకు ఎన్‌సీడబ్ల్యూ ఫిర్యాదు చేసింది. అలాగే చర్యలు తీసుకోవాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు కూడా లేఖ పంపింది. 'మొయిత్రా వ్యాఖ్యలు అవమానకరమైనవి. పరువునష్టం కలిగించేవి' అని కమిషన్ ఒక ప్రకటనలో విమర్శించింది. బిజెపి కూడా ఈ వ్యాఖ్యలపై దాడికి దిగింది. టీఎంసీ నుంచి మొయిత్రాను 'బర్తరఫ్' చేయాలని డిమాండ్ చేసింది.

బిఎండబ్ల్యూ ఢీకొని గృహిణి మృతి



ముంబై : వేగంగా వస్తున్న బీఎండబ్ల్యూ కారు దంపతుల స్కూటర్‌ను ఢీకొనడంతో ఓ మహిళ మృతి చెందింది. ముంబైలోని వర్లీలో తెల్లవారుజామున 5.30 గంటలకు కావేరీ నకవా అనే మహిళ ప్రమాదంలో మరణించింది. కొలివాడ ప్రాంతానికి చెందిన దంపతులు చేపలు కొనుక్కొని స్కూటర్‌పై సాసూన్ డాక్ నుంచి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. శివసేన నేత కుమారుడి కారు ప్రమాదానికి కారణమని స్థానిక మీడియా పేర్కొంది. వేగంగా వచ్చిన బీఎండబ్ల్యూ కారును ఢీకొట్టింది. దీని ప్రభావంతో బైక్ బోల్తా పడి భార్యాభర్తలు కారు బానెట్‌పై పడిపోయారు. బోనెట్‌పై నుంచి దూకడంతో భర్త గాయాలతో బయటపడ్డాడు. కానీ అతని భార్య బోనెట్‌లో పడి తప్పించుకోలేకపోయింది. 100 మీటర్లు ఈడ్చుకెళ్లినట్లు కూడా వార్తలు వచ్చాయి. కారు డ్రైవర్ పారిపోయాడు. కావేరిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించినా ప్రాణాపాయం తప్పలేదు. భర్త చికిత్స పొందుతున్నాడని కేసు దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు. నివేదికల ప్రకారం, కారులో శివసేన నాయకుడు రాజేష్ షా కుమారుడు ఉన్నారు.

మందలించాడని టీచర్ ను కత్తితో పొడిచాడు

దిస్పూర్ : తక్కువ మార్కులు వచ్చాయని మందలించిన ఉపాధ్యాయుడిని ఓ విద్యార్థి కత్తితో పొడిచి హత్య చేశాడు. అసోంలోని శివసాగర్ జిల్లా కేంద్రంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ప్లస్ వన్(ఇంటర్ మొదటి సంవత్సరం) చదువుతున్న విద్యార్థి తరగతి గదిలో కెమిస్ట్రీ పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయుడు రాజేష్ బారుహ్ బెజవాడ (55)ను కత్తితో పొడిచాడు. తీవ్రంగా గాయపడిన ఉపాధ్యాయుడిని ఆస్పత్రికి తరలించగా మృతి చెందాడు. విద్యార్థి హత్యను వినియోగించిన కత్తిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

గాజాలోని ఐరాస స్కూల్‌పై ఇజ్రాయిల్ దాడి

- 16 మంది మృతి..50 మందికి గాయాలు



గాజా : తొమ్మిది నెలలు దాటుతున్నా.. గాజాపై ఇజ్రాయిల్ దారుణ దాడులు ఆగడం లేదు. పైగా మరింతగా పెరుగుతున్నాయి. తాజాగా శనివారం గాజాలోని పలు ప్రాంతాలపై ఇజ్రాయిల్ దారుణంగా దాడులకు పాల్పడింది. ప్రధానంగా ఐక్యరాజ్య సమితి నిర్వహించే పాఠశాలపై ఇజ్రాయిల్ చేసిన దాడుల్లో 16 మంది మరణించారు. మరో 50 మంది తీవ్రంగా గాయపడ్డారు. మధ్య గాజాలోని న్యూసెరాత్ ప్రాంతాంలో ఉన్న అల్-జావ్ని పాఠశాలలో వేలాది మంది నిరాశ్రయులు తలదాచుకుంటున్నారు. సాయుధులు ఈ పాఠశాలలో దాక్కొన్నారనే అనుమానంతో ఇజ్రాయిల్ వైమానిక దాడులు జరిపింది. హమాస్ అధికారుల సమాచారం ప్రకారం దాడుల సమయంలో ఈ పాఠశాలలో సుమారు 7 వేల మంది తలదాచుకుంటున్నారు. దాడులతో ఒక్కసారిగా ప్రజలంతా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరుగులు తీశారని తెలిపింది. మృతుల్లో ఎక్కువ మంది చిన్నారులు, మహిళలు, వృద్ధులు. గాయపడిన వారిని ఆసుపత్రులకు తరలించినట్లు తెలిపింది. ఎలాంటి హెచ్చరికలు లేకుండా పాఠశాలపై ఇజ్రాయిల్ దాడులు చేయడం ఇది నాలుగోసారి అని అధికారులు తెలిపారు. 'పాలస్తీనా ప్రజలపై మారణహోమంలో భాగంగా శత్రువు చేసిన కొత్త ఊచకోత' అని హమాస్ అధికారులు ఈ దాడిని ఖండించారు. ఐరాసకు చెందిన యుఎన్‌ఆర్‌డిబ్ల్యుఎ ద్వారా పాలస్తీనా శరణార్థుల కోసం ఈ పాఠశాల నడుస్తోందని హమాస్ అధికారిక పత్రికా కార్యలయం తెలిపింది. గాయపడిన వారిలో కూడా ఎక్కువ మంది చిన్నారులే అని వెల్లడించింది.

ఏ ప్రాంతమూ సురక్షితం కాదు..

ఇజ్రాయిల్ తాజా దాడితో పాలస్తీనాలో ఏ ప్రాంతమూ సురక్షితం కాదని మరోసారి వెల్లడయింది. మధ్యవర్తుల చొరవతో కాల్పుల విరమణపై చర్చలకు అంగీకరించిన ఇజ్రాయిల్ మరోవైపు దాడులు మాత్రం కొనసాగిస్తూనే ఉంది. శనివారం మధ్య గాజాలోనే ఉన్న యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ గోదాముపై కూడా ఇజ్రాయిల్ దాడులు చేసింది.

ఈ దాడిలో ఇద్దరు కార్మికులు మరణించినట్లు యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ తెలిపింది. అయితే దాడి జరిగిన ప్రాంతం నుంచి మరో తొమ్మిది మృతదేహాలు తమ ఆసుపత్రికి వచ్చినట్లు అల్-అక్సా ఆస్పత్రి ప్రకటించింది. ఇజ్రాయిల్ దాడులు ప్రారంభమైన నుంచి ఇప్పటి వరకూ 194 మంది కార్మికులు మరణించినట్టు యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ తెలిపింది. అలాగే శనివారం నుసిరత్‌లోని ఒక భవనంపై జరిపిన దాడిలో ముగ్గురు జర్నలిస్టులతో సహా 10 మంది మరణించారని వైద్య సిబ్బంది తెలిపారు.

'బ్రేక్'ఫాస్ట్..!

ఊసెత్తని ప్రస్తుత ప్రభుత్వం

- ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారం పథకానికి
- గత ప్రభుత్వం శ్రీకారం
- ఎదురు చూస్తున్న పేద విద్యార్థులు

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న నిరుపేద విద్యార్థుల ఆకలి తీర్చేందుకు ప్రవేశ పెట్టిన 'సీఎం అల్పాహార పథకం' అటకెక్కింది. గత ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు విజయదశమి కానుకగా ప్రభుత్వ పాఠశాలల్లో ఈ పథకానికి శ్రీకారం చుట్టింది. తొలి విడతగా 'అక్షయ పాత్ర' ద్వారా జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఈ పథకాన్ని ప్రారంభించింది. ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతోపాటు ఉదయం అల్పాహారం అందించింది. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఓటమి పాలవడం, పదో తరగతి వార్షిక పరీక్షల నేపథ్యంలో ఉదయం పరీక్షలు, మధ్యాహ్నం తరగతులు ఉండటంతో తాత్కాలికంగా ఈ పథకానికి బ్రేక్ పడింది. ఆ తర్వాత పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించడంతో పూర్తిగా నిలిచిపోయింది. జూన్ 12వ తేదీ నుంచి పాఠశాలలు పునర్ ప్రారంభమైనా.. అల్పాహారం పథకం తిరిగి ప్రారంభం కాకపోవడంతో పేద విద్యార్థులు ఎదరు చూస్తున్నారు.

గైర్హాజరును తగ్గించేందుకు..

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న వారిలో మెజార్టీ పిల్లలు పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారే. ఆర్థిక స్తోమత లేకపోవడంతో పాటు తల్లిదండ్రులు ఇతర పనుల్లో బిజీగా ఉండటంతో ఉదయం వేళ వారికి ఇంట్లో అల్పాహారం సిద్ధం చేయలేని పరిస్థితి.

ఉదయం 9 గంటలకే తరగతులు ప్రారంభం అవుతుండటంతో మెజార్టీ పిల్లలు ఏమీ తినకుండానే స్కూల్‌కు వస్తూ మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఖాళీ కడుపుతోనే ఉండేవారు. ఉదయం నుంచి ఏమీ తినకపోవడంతో వారికి కడుపునొప్పి, గ్యాస్టిక్ సమస్యలు ఉత్పన్నమవుతుండేవి. తరచూ గైర్హాజరుకు కారణమవుతుండేది. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడంతో పాటు వారి ఆరోగ్యాన్ని కాపాడాలనే ఉద్దేశంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం అల్పాహార పథకాన్ని అమలుల్లోకి తీసుకొచ్చింది.

సరిహద్దు రాష్ట్రమైన తమిళనాడులో అమల్లో ఉన్న ఈ పథకాన్ని తెలంగాణలోనూ అమలు చేయాలని భావించింది. ప్రతిరోజూ ఉదయం 8.30 నుంచి 9 గంటల మధ్యలో పాఠశాలకు వచ్చిన ప్రతి విద్యార్థికీ రోజుకో రకమైన అల్పాహారం అందించేవారు.



ఖాళీ కడుపుతో విద్యార్థులు..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మొత్తం 505 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, వీటిలో ఒకటి నుంచి పదో తరగతి వరకు దాదాపు 90వేలకు పైగా విద్యార్థులు చదువుతున్నారు. సీఎం అల్పాహార పథకంలో భాగంగా వీరికి రోజుకో వెరైటీ ఫలహారం అందించడం ద్వారా ప్రభుత్వంపై ఏటా దాదాపు రూ.200 కోట్ల మేర భారం పడుతుంది. అయినా ఖర్చుకు వెనుకాడకూడదని నిర్ణయించి అల్పాహార పథకాన్ని అమల్లోకి తీసుకు వచ్చింది. దాంతో ఉపాధ్యాయవర్గాలు, విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లోనూ హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. కాగా, వేసవి సెలవులు ముగిసి జూన్ 12న పాఠశాలలు పునర్ ప్రారంభమైనా ఉదయం అల్పాహారం తిరిగి ప్రారంభం కాలేదు. దాంతో నిరుపేద విద్యార్థులకు పస్తులు తప్పడం లేదు. పథకాన్ని ఎప్పుడు ప్రారంభిస్తారనే అంశంపై కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారుల్లో స్పష్టత లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

ఆదేశాలు వస్తే అమలు చేస్తాం



ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అల్పాహారం అందించే విషయమై ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి ఆదేశాలు అందలేదు. ఆదేశాలు వస్తే కచ్చితంగా అమలు చేస్తాం. ఈ పథకానికి బడ్జెట్ విడుదలైన వెంటనే ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అల్పాహారం అందించేందుకు ఏర్పాట్లు చేస్తాం.

- విజయకుమారి, డీఈఓ, మేడ్చల్-మల్కాజిగిరి

అల్పాహారం అందించాలి



ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ఉదయం అల్పాహారం అందించాలి. గత ప్రభుత్వ పథకాలను ప్రస్తుత ప్రభుత్వం అమలు చేయకపోవడం సరికాదు. అన్ని పాఠశాలల్లో ఉదయం టిఫిన్ అమలు చేయాలి. లేదంటే రాబోయే రోజుల్లో ఉద్యమిస్తాం.

రాథోడ్ సంతోష్, ఎస్ఎఫ్ఐ, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి

మేయర్ పారిజాత నర్సింహారెడ్డికి సన్మానం



నవతెలంగాణ-బడంగ్‌పేట్
టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి.. ఇండోనేషియాకు వెళ్లి అంతర్జాతీయ మేయర్ల ఫోరం-2024 అవగాహన సదస్సును దిగ్విజయంగా పూర్తి చేసుకొని స్వదేశానికి తిరిగి వచ్చారు. ఈ సందర్భంగా బాలాపూర్‌లోని మేయర్ నివాసంలో ఆదివారం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు కాలనీవాసులు మేయర్ పారిజాత నర్సింహారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి, పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. తర్వాత ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు.

డీకే అరుణకు కొలన్ శంకర్‌రెడ్డి శుభాకాంక్షలు



నవతెలంగాణ-బడంగ్‌పేట్
బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీగా డీకే అరుణ ఎన్నికైన శుభ సందర్భంగా హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకులు, మాజీ సింగల్ విండో చైర్మెన్ కొలన్ శంకర్ రెడ్డి బృందం ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెను పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మానించి, ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నాగోల్‌లో దొంగల బీభత్సం

40 తులాల బంగారం, లక్ష రూపాయల నగదు చోరీ



నవతెలంగాణ - నాగోల్
నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలోని జైపూర్ కాలనీ గోల్డెన్ విల్లా గేటెడ్‌లో శనివారం అర్ధరాత్రి దొంగలు బీభత్సం చేశారు. రెండు విల్లాలలో తలుపులు పగలగొట్టి 40 తులాల బంగారం, లక్ష రూపాయల నగదును చోరీ చేశారు. నాగోలు సీఐ సుధీర్ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. గోల్డెన్ విల్లా గేటెడ్‌లోని విల్లా నెంబర్ 89లో ఉండే పురుషోత్తం రెడ్డి తన కుటుంబ సభ్యులతో తీర్థయాత్రకు వెళ్లారు. దీంతో శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు ఆ విల్లా ఇంటి తలుపులను పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. రోజులాగే విల్లాలో పనిచేసే పని మనుషులు ఉదయం పని కోసం వెళ్లి పగలగొట్టిన తలుపులను చూసి వెంటనే గేటెడ్ కమ్యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ వారికి సమాచారం అందించారు. గేటెడ్ కమ్యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ వారు ఈ ఘటనపై పోలీసులకు సమాచారం అందించడంతో వెంటనే ఘటనా స్థలానికి డీసీపీ ప్రవీణ్ కుమార్, ఏసీపీ కృష్ణయ్య గౌడ్‌తో కలిసి అక్కడికి చేరుకొని పరిసరాలను పరిశీలించారు. ఈ గేటెడ్ కమ్యూనిటీలో సీసీ కెమెరాలను తనిఖీ చేయడంతో అవి పనిచేయడం లేదని తెలిసింది. గేటెడ్ కమ్యూనిటీ లోని విల్లా నెంబర్ 89 విల్లాతో పాటు 22 నెంబర్ గల విల్లాలో కూడా తలుపులను పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. చోరీ ఘటన గురించి తెలుసుకున్న 89 నెంబర్ విల్లాలో ఉండే పురుషోత్తం రెడ్డి ఆదివారం ఇంటికి చేరుకున్నారు. ఇంట్లో దాచి ఉంచిన 40 తులాల బంగారు ఆభరణాలు, లక్ష రూపాయల నగదును ఎత్తుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అదేవిధంగా విల్లా నెంబర్ 22లో కూడా దొంగతనానికి యత్నించారు. ఘటనా స్థలంలో జాగిలాల తోపాటు, క్లూస్ టీంలతో ఆధారాలను సేకరిస్తూ స్పెషల్ టీం పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

సెల్ టవర్ నిర్మాణానికి అనుమతులు ఇవ్వొద్దు



- కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్ రెడ్డి

నవతెలంగాణ - వనస్థలిపురం
జనావాసాల మధ్య సెల్ టవర్‌కు అనుమతులు ఇవ్వొద్దు అని కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి అన్నారు. హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని ద్వారకమైనగర్ కాలనీలో జనావాసాల మధ్య సెల్ టవర్ నిర్మిస్తున్నారని కాలనీ వాసులు సమాచారం ఇవ్వడంతో కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి సెల్ టవర్ నిర్మిస్తున్న ఇంటి వద్దకు వచ్చి కాలనీవాసులతో కలిసి ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ జనావాసాల మధ్య సెల్ టవర్ నిర్మిస్తే ప్రజలకు రేడియేషన్ వలన పలు వ్యాధుల వచ్చే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సెల్ టవర్ నిర్మిస్తున్న వీధిలో చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులు, హార్ట్ పేషంట్లు ఉన్నారని, వారి ఆరోగ్యాలకు పెను ప్రమాదం ఉందని అన్నారు. కావున వెంటనే సెల్ టవర్ పర్మిషన్ రద్దుచేసి, నిర్మాణ పనులను వెంటనే ఆపాలని కోరుతూ టౌన్ ప్లానింగ్ ఏసీపీకి, సీసీపీకి ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. లేనిపక్షంలో కాలనీ వాసులతో కలిసి సెల్ టవర్‌ను తొలగించే వరకూ పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసనలో కాలనీ అధ్యక్షుడు ప్రభు లింగం, కార్యదర్శి ప్రవీణ్, కాలనీ సంక్షేమ సంఘం జనార్దన్, శ్రీధర్ రాజు, శ్రీధర్ రెడ్డి, క్రిష్ణ, సాగర్, సరస్వతి, ఉమా యాదవ్, శ్రీదేవి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం

- ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి



నవతెలంగాణ-తుర్కయంజాల్
కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ 19వ వార్డులోని ఈస్ట్ సూరజ్ నగర్ కాలనీలో నూతన కమిటీ హాల్‌ను రాష్ట్ర రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మెన్ మల్లారెడ్డి రాంరెడ్డితో కలిసి ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుర్కయంజాల్ మున్సిపాలిటీ అతి వేగంగా అభివృద్ధి చెందుతుందని, గత ప్రభుత్వం మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించలేదని విమర్శించారు. అనంతరం ఈహ కన్స్ట్రక్షన్ వారు నూతనంగా ఏర్పాటు చేసిన అపార్టుమెంట్ బ్రోచర్ ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో టి సాట్ సీ ఈ ఓ బోధన పల్లి వేణుగోపాల్ రెడ్డి, టెస్ కాబ్ వైస్ చైర్మెన్, డీసీసీబీ చైర్మెన్ కొత్తకుర్మ సత్తయ్య, మున్సిపల్ వైస్ చైర్మెన్ గుండ్లపల్లి హరిత ధన్ రాజ్ గౌడ్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం

- జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్

నవతెలంగాణ-ఎల్బీనగర్
వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, దోమల నివారణ కోసం చర్యలు తీసుకుంటున్నామని ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ దోమలు నివారణ కోసం ప్రజలు సహకరించాలని కోరారు. ప్రజలు తమ ఇండ్లల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. అంతేకాదు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. దోమలు నివారణ కోసం జీహెచ్ఎంసీ అన్ని చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో హయత్ నగర్ డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య, ఎంటమాలజిస్ట్ రజిని, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ - ఎల్బీనగర్
ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్, డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాల వద్ద బత్తిన సుధాకర్ మాదిగ ఎల్బీనగర్ నియోజకవర్గం ఇంచార్జి ఆదివారం ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు కొమ్ము శేఖర్ మాదిగ, రాజ మాదిగ, లింగం మాదిగ, బస్తీ అధ్యక్షులు మౌలాలి మాదిగ, సురేష్ మాదిగ, నాయకులు యాదగిరి మాదిగ, మహర్షి మాదిగ, నాగరాజ్ మాదిగ, రాజు మాదిగ, నరసింహ మాదిగ, సాయి, గోపి, రవి బుచ్చన్న, ఆదాము నరేష్, అడివయ్యా, రంగయ్య శ్రీరాములు, ఏలియా ఆదాము, గురునాథ్ పాల్గొన్నారు.

నవతెలంగాణ-హయత్ నగర్



ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించి 30 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఈ మేరకు ఆదివారం మేడి పాపయ్య నాయకత్వంలో రవీంద్రభారతిలో ఘనంగా సదస్సు జరుపుకుంటున్న సందర్భంగా.. మన్సూరాబాద్ డబుల్ బెడ్ రూంలో జెండా ఆవిష్కరించారు. తర్వాత రవీంద్ర భారతికి బైకులతో ర్యాలీగా బయలు దేరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జీడీ నర్సింహ, సంఘ పాక ఏసోబు, బస్తీ నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ- బడంగ్‌పేట్
మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న బాలాపూర్ గ్రామంలో రంగారెడ్డి జిల్లా ఎమ్మార్పీఎస్ మాజీ అధ్యక్షులు బొర్ర రవి మాదిగ ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా మాదిగ దండోరా సోషల్ మీడియా ఇంచార్జి ఆనంద్ మాదిగ, మండల ఇంచార్జి తోట్ల శ్రీనివాస్ మాదిగ, మస్కూరి శ్రీశైలం మాదిగ, సీనియర్ నాయకులు తిమ్మని గిరి మాదిగ, నేరుడు శ్రీరాములు మాదిగ, ఇబ్రహీం అంజయ్య మాదిగ, ఆవుల కుమార్ మాదిగ, శ్రీధర్ మాదిగ, ఈర్లపల్లి కిష్టయ్య మాదిగ, ఆదిల అమ్రేష్ మాదిగ, చింతల చిన్న మాదిగ, శ్రీశైలం మాదిగ, డీకే నరసింహ మాదిగ, జనార్దన్ మాదిగ, దండోర సీనియర్ నాయకులు ఆనంద్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.



మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టాలి

- టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్ గుప్త



నవతెలంగాణ-నాగోల్
మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాలు, లైగింక దాడులను అరికట్టాలని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. హ్యూమన్ ఎగైనెస్ట్ రేప్ అండ్ డిస్క్రిమినేషన్ ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్‌లో ఆదివారం అవగాహన పరుగు నిర్వహించారు. సంజీవయ్య పార్క్ నుంచి పీపుల్స్ ప్లాజా వరకు జరిగిన 3కే, 5కే, 10కే రన్‌లను శ్రీనివాస్ గుప్త జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజు రోజుకూ మహిళలు, ముఖ్యంగా చిన్నారులపై లైగింక దాడులు, హత్యలు పెరిగి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సంస్థ చేస్తున్న కృషిని అభినందించారు. నేటి యువత డ్రగ్స్, గంజాయికి అలవాటు పడి ఈ పరిణామాలకు దారి తీస్తున్నాయని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గంజాయిని అరికట్టేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ప్రతీ పౌరుడు గంజాయి సాగు, సరఫరా, నిర్మూలనను సామాజిక బాధ్యతగా భావించి, అరికట్టేందుకు పోలీసులకు సహకరించాలని కోరారు. పాఠశాల, కాలేజీలలో విద్యార్థులపై దృష్టి సారించాలన్నారు. తల్లీదండ్రుల వద్ద కన్నా స్కూల్, కాలేజీలలో ఎక్కువ సమయం గడుపుతారు కనుక వారి ప్రవర్తనలో మార్పు వచ్చినట్లయితే తల్లీదండ్రులకు తెలియజేయాలని కోరారు. ఇటీవల కాలంలో చదువుకునే విద్యార్థులు గంజాయి, డ్రగ్స్ కేసుల్లో నేరస్తులుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జల్సాలకు అలవాటు పడిన యువత డబ్బుల కోసం నేరాలకు పాల్పడి, తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో యువతీ యువకులు, నిర్వాహకులు కే ఎస్ ఆర్ నాగరాజు, ధనుష్ మంజునాథ్, నరేష్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్ల సమస్యలు పరిష్కరించండి : ఎల్లయ్య



నవతెలంగాణ - వనస్థలిపురం
ప్రయివేట్ పాఠశాలలు, కాలేజీలలో బస్సులు నడుపుతున్న డ్రైవర్లకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్, బోనస్, జాతీయ సెలవులు, పండుగ సెలవులు ఇవ్వాలని ఎల్బీనగర్ సీఐటీయూ సర్కిల్ కన్వీనర్ ఆలేటి ఎల్లయ్య అన్నారు. వనస్థలిపురం డివిజన్‌లోని శ్రీ వెంకటరమణ కాలనీలో ప్రయివేట్ పాఠశాలలు, కాలేజీల డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ ప్రయివేట్ పాఠశాలలో వారి పిల్లలకు పదో తరగతి వరకు ఫ్రీ అడ్మిషన్స్ ఇవ్వాలన్నారు. ఈనెల 10న కార్మికుల కోరికల దినంగా రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు, ధర్నాలు చేసి కార్మికుల డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. బీజేపీ ప్రభుత్వం సెక్షన్ 106 - బిఎన్ఎస్‌లోని సబ్ సెక్షన్ 2 మినహా కొత్తగా అమల్లోకి వచ్చిన చట్టపరమైన చట్టాలను భారత్ అన్యాయ సహిత, భారతీయ నాగరికత సురక్ష సహిత, భారతయ సాక్ష్య అదినీయం 1 జులై 2024 నుండి అమలు కాబోతున్న చట్టాలను వ్యతిరేకించాలని అన్నారు. ఈ కొత్త చట్టాల ఆధారంగా అమాయకులు శిక్షకు గురయ్యే అవకాశం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయివేట్ పాఠశాలలు, కాలేజీలలో పనిచేసే డ్రైవర్లను వెంటనే ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కే శ్రీను, దేవయ్య, కే చిరంజీవి, కే వెంకటేష్, కే రమేష్, సిహెచ్ కృష్ణ, ఏ భాను, జి. రాము, డ్రైవర్లు పాల్గొన్నారు.

'విధులను బాధ్యతగా నిర్వహించినప్పుడే గౌరవం'



నవతెలంగాణ- బడంగ్‌పేట్
ప్రతి ఉద్యోగి తన విధులను బాధ్యతగా నిర్వహించినప్పుడే వారిని సమాజం గౌరవిస్తుందని బడంగ్‌పేట్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ చిగురింత నర్సింహారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ గ్రామంలోని కుండే కొమరయ్య జీహెచ్ఎంసీ శానిటరీ జవాన్‌గా పదవీ కాలం ముగిసిన సందర్భంగా.. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ చిగురింత నరసింహారెడ్డి ఆదివారం కొమరయ్య దంపతులను పూల మాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ పదవీ విరమణ పొందడం సహజమన్నారు. ఈ కార్యక్రమంలో విక్కీ శ్రీశైలం, వికే సత్యనారాయణ, విక్కీ కొండల్, రావుల మల్లేష్, గుండ్ల శ్రీకాంత్, గౌతమ్, శ్రీకాంత్, శీను, సాయి పాల్గొన్నారు.

'రాఘవేంద్ర నగర్' అసోసియేషన్ అధ్యక్షుడిగా బాల్‌రాజ్



నవతెలంగాణ - మీర్‌పేట్
మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రాఘవేంద్ర నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సిరూర్ బాల్‌రాజ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని అన్నారు. ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కాలనీ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులతో కలిసి..కాలనీ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి వినతి పత్రం అందజేశారు. వినతి అందజేసిన వారిలో ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్, కోశాధికారి రాంప్రసాద్, బీఆర్ఎస్ అధ్యక్షుడు అర్కల కామేష్ రెడ్డి, నాయకులు సిద్దాల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు చోరీ

నవతెలంగాణ - నాగోల్
ఓ మహిళ మెడలో నుంచి గుర్తు తెలియని ఇద్దరు దుండగులు బంగారు గొలుసును లాక్కెళ్లిన ఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగోలు డివిజన్ పరిధిలోని లక్ష్మీనరసింహా స్వామి కాలనీలో వాచ్మెన్‌గా పనిచేస్తున్న సుక్కమ్మ అనే మహిళ ఆదివారం ఓ శుభకార్యానికి వెళ్లి వస్తుండగా..ద్విచక్ర వాహనంపై ఇద్దరు గుర్తు తెలియని యువకులు ఆమె మెడలో ఉన్న మూడు తులాల బంగారు గొలుసును లాకెళ్లారు. దీంతో బాధితురాలు వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కాలనీల సమస్యలు పరిష్కరిస్తా : ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



నవతెలంగాణ - వనస్థలిపురం
కాలనీలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. వనస్థలిపురం తూర్పు కాలనీలు-22 వివిధ సమస్యల పరిష్కారంలో భాగంగా కమలా నగర్ నందు ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు సమస్యలను పలువురు కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుబజార్ దగ్గర ఉన్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తానని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. రోడ్ల మీద వ్యాపారం చేసుకునే వారి పొట్ట కొట్టకుండా వారితో రెండు, మూడు రోజులలో చర్చలు జరిపి.. ఎలా చేస్తే బాగుంటుందని మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. అలాగే రిజిస్ట్రేషన్ ఆఫీసు దగ్గర పార్కింగ్ సమస్యలు, హిజ్రాల సమస్యలు లేకుండా చూడాలని సమావేశానికి వచ్చిన పోలీస్ అధికారులను ఆదేశించారు. సీసీ కెమెరాల కోసం గతంలో దాదాపు 7 కోట్ల రూపాయలు కేటాయించినట్లు తెలిపారు. దాదాపు 128 కాలనీల యందు సీసీ కెమెరాలను పెట్టినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో హయత్ నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ యాదయ్య, ట్రాఫిక్ ఏసీపీ నవీన్ రెడ్డి, వనస్థలిపురం ట్రాఫిక్ సీఐ వెంకటేశ్వర్లు, వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ అశోక్ రెడ్డి, ఎస్ఐ ఏడుకొండలు, జేఏసీ సభ్యులు దీపావళి శ్రవణ్, గుత్తా లక్ష్మారెడ్డి, సుదర్శన్ రెడ్డి, నర్సింహారావు, శ్రీనివాస్, జగన్ మోహన్, దీపావళి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

దిల్‌సుఖ్ నగర్ సాయి సంస్థాన్ పాలకవర్గం ప్రమాణ స్వీకారం





నవతెలంగాణ - ఎల్బీనగర్
దక్షిణ షిరిడిగా ప్రసిద్ధిగాంచిన దిల్ సుఖ్‌నగర్‌లోని శ్రీ షిరిడి సాయి సంస్థాన్ ట్రస్ట్ నూతన పాలక మండలి ఆదివారం కొలువుదీరింది. దిల్ సుఖ్ నగర్ శ్రీ సాయిబాబా దేవాలయం ఏర్పడిన నాటినుండి ఎన్నడూ లేని విధంగా మొదటిసారి ఎన్నికలు లేకుండా నూతన పాలకమండలిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దిల్‌సుఖ్ నగర్ శ్రీ సాయిబాబా దేవాలయం ట్రస్ట్ పాలకమండలి నూతన చైర్మెన్‌గా శ్యాంకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన ఆధ్వర్యంలో పాలకమండలి సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. నూతన పాలకమండలిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం అభినందనీయమని ఎల్బీనగర్ శాసన సభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. ఈ ఏకగ్రీవానికి కృషిచేసిన మాజీ చైర్మెన్ గుండా మల్లయ్యను ఆయన చేసిన కృషిని పలువురు కొనియాడారు.

నూతన పాలకమండలి సభ్యులు వీరే..

చైర్మెన్‌గా బీవీ శ్యామ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా రఘు కుమార్, కోశాధికారిగా ఊర నరసింహా గుప్తా, వైస్ చైర్మెన్‌గా ఆర్ శివ శంకర్ రావు, పి.వీరప్ప, జాయింట్ సెక్రెటరీగా కోడి రాజశేఖర్, బి.కిరణ్ కుమార్, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా పద్మాకర్ ఆత్రే, యం. శ్యామల రావు, సాయి కృష్ణ షిండే, పి. కృష్ణవేణిలు, ప్రమాణ స్వీకారం చేశారు.

ట్రస్టీలను ఏకతాటి మీదికి తీసుకువచ్చిన గుండా మల్లయ్య

దిల్‌సుఖ్ నగర్‌లో శ్రీ సాయిబాబా దేవాలయం ఏర్పాటైన నాటినుండి ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి పాలకమండలి ఎన్నికలను నిర్వహిస్తూ పాలకమండలి చైర్మెన్‌లను, పాలకమండలి సభ్యులను ఎన్నుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. అయితే గతంలో పలుమార్లు ఎన్నికలు లేకుండా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు ప్రయత్నించినప్పటికీ సాధ్యం కాలేదు. అయితే గత రెండు సంవత్సరాలుగా చైర్మెన్‌గా వ్యవహరించిన గుండా మల్లయ్య తన పనితీరుతో అందర్నీ మెప్పించగలిగారు. దేవాలయం అభివృద్ధిలో ఎనలేని కృషి చేసిన మల్లయ్యకు మంచి పేరు ఉన్నది. దేవాలయం అభివృద్ధికి మల్లయ్య చైర్మెన్‌గా ఉంటూ విశేషమైన కృషి చేసి దేవాలయాన్ని దక్షిణ భారతదేశంలోనే దక్షిణ సాయిబాబా దేవాలయంగా పేరు ప్రఖ్యాతలు సంపాదించడంలో కీలకంగా వివరించారు. దీంతో ఈసారి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు ట్రస్టు సభ్యులందరినీ ఆయన ఒప్పించి ఏగతాటిపైకి తీసుకురాగలిగారు. దీంతో నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకోవడానికి సాధ్యపడింది. 2024 నుండి 2026 వరకు కొనసాగే పాలకమండలిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడంలో గుండా మల్లయ్య కృషిని వేలాది మంది భక్తులు మల్లయ్యను అభినందించారు. తాజా, మాజీ చైర్మెన్ గుండా మల్లయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాజీ చైర్మెన్లు బచ్చు గంగాధర్, వనం యాదయ్య, వనం రంగయ్య, ఇవి నాగేశ్వర్ రావు శర్మ, వి బాబురావు, వివి రవికుమార్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి నోచుకోని హెచ్ఎండీఏ లే అవుట్

- లే అవుట్ అసోసియేషన్ అధ్యక్షుడు పురుషోత్తం



నవతెలంగాణ-తుర్కయంజాల్
ఏండ్లు గడుస్తున్నా హెచ్ఎండీఏ లే అవుట్ అభివృద్ధికి నోచుకోలేదని, త్వరితగతిన లే అవుట్ లో అభివృద్ధి పనులను పూర్తి చేయాలని లే అవుట్ అసోసియేషన్ అధ్యక్షుడు పురుషోత్తం అన్నారు. ఈ మేరకు ఆదివారం అసోసియేట్ సభ్యులతో కలిసి ఆయన మాట్లాడారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ తొర్రూర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 383/1లో అప్పటి తెలంగాణ ప్రభుత్వం లే అవుట్ చేసి 3 విడతలుగా ప్లాట్లు విక్రయించిందని గుర్తుచేశారు. ప్లాట్లు కొనుగోలు చేసి ఏండ్లు గడుస్తున్నా లే అవుట్ అభివృద్ధికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. హెచ్ఎండీఏ నిబంధన మేరకు ప్లాట్లు కొనుగోలు చేసిన 18 నెలలో లే అవుట్‌లో విద్యుత్, తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ మౌలిక వసతులు పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ.. హెచ్ఎండీఏ అధికారులు ఇప్పటికీ పూర్తి చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. లే అవుట్‌ను అభివృద్ధి చేయాలని కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ ఇప్పటి వరకూ అభివృద్ధి చేయలేదని విమర్శించారు. నూతనంగా నియమితులైన హెచ్ఎండీఏ కమిషనర్ కలుగజేసుకొని త్వరితగతిన అభివృద్ధి పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

హెల్త్ క్యాంపులను వినియోగించుకోవాలి : దయానంద్ గౌడ్



నవతెలంగాణ-తుర్కయంజాల్
హెల్త్ క్యాంపులను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఇంజాపూర్ మాజీ సర్పంచ్ నోముల దయా నంద్ గౌడ్ అన్నారు. ఇంజాపూర్ గ్రామంలో నీలాద్రి హాస్పి టల్స్ వారి ఆధ్వర్యంలో ఇంజాపూర్ వార్డు కార్యాలయంలో ఆదివారం హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అవకాశాన్ని గ్రామ ప్రజలు సద్వి నియోగం చేసుకోవాలని కోరారు. ఈ క్యాంపులో పలువురు స్థానికులు ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర యువ నాయకులు నోముల కార్తీక్ గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరించిన మంత్రులు పొన్నం, కొండా



నవతెలంగాణ-సిటీబ్యూరో

శ్రీశ్రీశ్రీ నల్ల పోచమ్మ దేవి, మహంకాళి దేవి నటరాజ్ నగర్ సబ్జీ మండి బ్రోచర్‌ను ఆదివారం మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించారు. పూజా కమిటీ ప్రభుత్వం ద్వారా రూ.11లక్షల చెక్కును ఇద్దరు మంత్రులు కలిసి ఇచ్చారు. నందకిషోర్ పేట అధ్యక్షతన ఈ చెక్కును తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు అనిల్ యాదవ్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, హైదరాబాద్ కలెక్టర్, దేవాదాయ శాఖ కమిషనర్, ప్రధాన కార్యదర్శి కుడుముల రాకేష్, కోశాధికారి కట్ట శ్రీనివాస్, సలహాదారులు జలగరి వేణు, కట్ట నర్సింగ్‌రావు, ఆవిశెట్టి శ్యాంసుందర్, గాండ్ల నిరంజన్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

సమిష్టి కృషితోనే దోమల నివారణ సాధ్యం



నవతెలంగాణ-ఉప్పల్

దోమల నివారణకు అందరూ కృషి చేయాలని ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఉప్పల్ కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డి అన్నారు. ఆదివారం జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో దోమల అవగహన కార్యక్రమానికి జోనల్ కమిషనర్‌తో కలిసి కార్పొరేటర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంట్లో, ఇంటి ఆవరణంతో పాటు కాలనీలలో ఎక్కడా నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. నీటి నిల్వలోనే దోమలు ఆవాసాలుగా చేసుకొని జనాలకు నష్టాన్ని కలిగిస్తున్నాయన్నారు. దోమ కాటుతో మలేరి యా, చికెన్ గున్యా, డెంగీ, రోగాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో డీసీ ఆంజనేయులు , ఎంటామాలజిస్ట్ రజనీ ,అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్ నరేష్ రెడ్డి, బాకారం లక్ష్మణ్, సుక్క జీవన్, రాజు, సిల్వర్ ప్రేమ్ కుమార్, అరుణ్, సిల్వర్ నరసింహ. లక్ష్మణ్, మద్దూరి కుమార్, లక్ష్మణ్, తదితరులున్నారు.

రోడ్డు, డ్రయినేజీని పరిశీలించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-మల్కాజిగిరి

మౌలాలి డివిజన్ పరిధిలోని ఆర్టీసీ కాలనీలో నిర్మిస్తున్న రోడ్లు, డ్రయినేజీ పనులను మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి పరిశీలించారు. ఎమ్మెల్యే ఇటీవల మౌలాలి ప్రాంతంలో పర్యటించిన సందర్భంగా కాలనీవాసులు, బీఆర్ఎస్ నాయకులు తమ కాలనీలో రోడ్డు, డ్రయినేజీ సమస్యలను పరిష్కరించాలని మర్రిని కోరారు. దీంతో నూతన రోడ్డు, డ్రయినేజీ పైపులు వేయాలని జలమండలి ఇంజనీర్ శ్రీనివాస్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు. నూతన రోడ్లు వేసే ముందు జలమండలి అధికారులు, జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో కో ఆర్డినేట్ చేసుకుని పనులు చేయాలని, లేకపోతే ఇలాంటి సమస్యలే వస్తాయని వారికి సూచించారు. ఆదివారం ఆర్టీసీ కాలనీలో చేపట్టిన రోడ్డు, డ్రయినేజీ పైపులైన్లు వేయడంతో స్థానిక ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

నాచారంలో దోమల నివారణపై అవగాహన



నవతెలంగాణ-కాప్రా

దోమల నివారణకు ప్రతి ఒక్క రూ తమ చుట్టు పక్కల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంటమాలజీ ఎల్బీనగర్ జోనల్ ఎస్ఈ రజిని ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పరిసర ప్రాంతాల్లో నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలని, పూల కుండీలలో, పాత సామాన్లు ఉండే ప్రాంతాల్లో నీటిని ఎప్పటికప్పుడు తొలగించాలని అవగాహన కల్పించారు. ఆదివారం నాచారం డివిజన్‌లోని ఇందిరానగర్‌లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఎల్బీనగర్ జోన్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయి జన్ శేఖర్ పాల్గొని స్థానికులకు దోమల నివారణకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కాప్రా డిప్యూటీ కమిషనర్ ముకుంద రెడ్డి, కాప్రా ఏఎంవోహెచ్ ఎంటమాలజీ ఏఈ రమేష్, ఎంటమాలజీ సూపర్వైజర్ రమేష్ , నరసింహ, స్థానికులు పాల్గొన్నారు.

నాచారం డివిజన్‌లో.. ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ పర్యటన



నవతెలంగాణ-కాప్రా

నాచారం డివిజన్‌లో ఎల్బీనగర్ జోన్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఐఏఎస్ ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా నాచారం కార్పొరేటర్ శాంతి సాయి జన్ శేఖర్ నాచారం డివిజన్‌లో ఏడు నెలలుగా అభివృద్ధి పనులకు నిధులు మంజూరు కావడం లేదని, ముఖ్యమైన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. రాఘవేంద్ర నగర్‌లో వర్షపు నీరు నిలుస్తున్నదని తెలిపారు. పైపులైన్ పనులు సక్రమంగా చేయకపోవ డంతో సమస్య ఏర్పడిందని, సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాప్రా డిప్యూటీ కమిషనర్ ముకుంద రెడ్డి, నాచారం ఏఈ లింగారావు, బీఆర్ఎస్ నాయకులు సాయి జన్ శేఖర్, మేకల ముత్యంరెడ్డి, విఠల్ యాదవ్, భూపాల్ రెడ్డి, సంజన్న, కట్ట బుచ్చన్న గౌడ్, చంద్రశేఖర్, శ్రీధర్, యాదగిరి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో పిచ్చి మొక్కల తొలగింపు



నవతెలంగాణ-కాప్రా

కాప్రా డివిజన్ గాంధీనగర్‌లో ప్రభుత్వ ఎంపీయూపీఎస్ పాఠశాల ప్రాంగణంలో గడ్డి, పిచ్చి మొక్కలను జీహెచ్ఎంసీ శానిటేషన్ సిబ్బంది ఆదివారం తొలగించారు. పిచ్చి మొక్కలు పెరగడంతో దోమలు, ఇతర కీటకాలు విజృంభించి విద్యార్థులు, ఉపాధ్యాయులు అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఉందని ప్రధానోపాధ్యాయుడు రామ్‌రెడ్డి, కాప్రా డివిజన్ కార్పొరేటర్ స్వర్ణరా జ్ శివమణి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన కార్పొరేటర్ జీహెచ్ఎంసీ శానిటేషన్ సిబ్బందితో పిచ్చి మొక్కలను, గడ్డిని తొలగింప జేశారు. సమస్యను పరిష్కరించినందుకు కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణికి, శానిటేషన్ జవాన్ పీ. దశరథకు వారి సిబ్బందికి ప్రధానోపాధ్యాయులు, గాంధీనగర్ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు సత్యనారాయణ ధన్యవాదాలు తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన వీరశైవ సమాజం కమిటీ



నవతెలంగాణ-కాప్రా

కాప్రా వీర శైవ సమాజం నూతన కమిటీ అధ్యక్షుడు ప్యాట జ్ఞానేశ్వర్, గౌరవ అధ్యక్షులు యాపపురం విశ్వనాథం ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఆదివారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని ఏఎస్ రావునగర్ డివిజన్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను పరిచయం చేసుకుని ఆయనను శాలువాతో సత్కరించారు. అనంతరం కమిటీ సభ్యులను ఎమ్మెల్యే సత్కరించి వీరశైవుల సాధక బాధకాలు తెలుసు అని తెలిపారు. వీరశైవుల అభ్యున్నతికి సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గంగా ఈశ్వరయ్య, కోశాధికారి కత్తి శివానంద్, ఉపాధ్యక్షులు ఉత్పత్తి శ్రీశైలం, శివ, సిద్దేశ్వర్, సహాయ కార్యదర్శులు శంభు లింగం, కార్యనిర్వాహక కార్యదర్శులు శివకుమార్, ప్రవీణ్, జగదీష్, కొప్పునూరు రాజేష్, రవి, షాపూర్‌నగర్ వీరశైవులు నాగరాజు గౌడ, రుద్రకుమార్, అమర్నాథ్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

110వ వారం .. జ్ఞానమాల కార్యక్రమం



నవతెలంగాణ-కాప్రా

జమ్మిగడ్డ ప్రాంతంలోని బీజేఆర్ కాలనీలో జ్ఞానమాల టీం ఆధ్వర్యంలో ప్రతీ ఆదివారం చేపట్టే జ్ఞానమాల సమర్పణ కార్యక్రమం 110వ వారానికి చేరింది. మహాత్మా జ్యోతి రావుపూలే, డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్, జగ్జీవన్ విగ్రహాలకు జ్ఞానమాల టీం ఆర్గనైజర్ తాడూరి గగన్, నరేందర్ రావు, రవి నాయక్, దయానంద్, నాగేష్, ప్రకాష్, తదితరులు జ్ఞానమాల సమర్పించారు.

నారా లోకేష్‌ను కలిసిన మన్నె సుబ్రమణ్యం



నవతెలంగాణ-కాప్రా

ప్రముఖ సంఘ సేవకులు జీనియా హాస్పటల్ చైర్మెన్ మన్నె సుబ్రమణ్యం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌ను ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో యువగళం పేరుతో రాష్ట్రం నలుమూలల తిరిగి ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడానికి కృషి చేసి మంగళగిరి నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీతో విజయం సాధించడంతో ఆర్థిక శుభాకాంక్షలు తెలిపారు.



రవాణా శాఖ, బీసీ వెల్ఫేర్ శాఖ మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్‌ను చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. నవతెలంగాణ,కాప్రా

కనుమరుగైన మాజీ మంత్రి హవా..!

- పాలమ్మి.. పూలమ్మి గెలిచిన ఎమ్మెల్యే మల్లారెడ్డికి ఆందోళనకర పరిస్థితి
- అక్రమాలపై సర్కారు గురి.. ఆస్తులు కాపాడుకోవడానికే సరి
- ఒక్కొక్కరుగా దూరమైపోతున్న సన్నిహితులు, పార్టీ క్యాడర్
- పార్టీ మారేందుకు ప్రయత్నాలు చేసినా ఫలించడం లేదు

నవతెలంగాణ-బోడుప్పల్

ఒకప్పుడు మేడ్చల్ జిల్లా రాజకీయాలలో వెలుగు వెలిగిన మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డికి ఇప్పుడు అన్నీ షాక్‌లే తగులుతున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రిగా చెలామణీ అయిన మల్లారెడ్డి జిల్లాలో ఏక చత్రాధిపత్యాన్ని ప్రదర్శించాడు. కేసీఆర్, కేటీఆర్‌లకు సన్నిహితంగా ఉంటూ ప్రతిపక్ష పార్టీలపై తనదైన శైలిలో విమర్శలు చేసేవాడు. ఆయన ఏది మాట్లాడినా సామాజిక మాధ్యమాలలో వైరల్‌గా మారేది. 'నేను కష్టపడ్డా, పాలమ్మిన, పూలమ్మిన అంటూ చెప్పే డైలగైతే సోషల్ మీడియానే షేక్ చేసింది. అలాంటి మల్లారెడ్డి హవా కాంగ్రెస్ అధికారంలో రావడంతో కనుమరుగైపోతుంది.



గెలిచినా సుఖం లేకపాయే..

2014 ఎన్నికలలో మల్లారెడ్డి మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించాడు. అనంతరం రాష్ట్రంలో మారిన రాజకీయ పరిణామలతో బీఆర్ఎస్‌లో చేరారు. 2018లో మేడ్చల్ సిట్టింగ్ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డిని కాదని మల్లారెడ్డి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. అప్పటి ప్రభుత్వంలో కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రిగా పనిచేశారు. 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికలలో మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ బరిలో నిలింపింది. బీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రస్తుత మల్కాజిగిరి ఎమ్మెల్యే, మల్లారెడ్డి అల్లుడైన మర్రి రాజశేఖర్ రెడ్డిని దించింది. అధికార పార్టీ అభ్యర్థిపై రేవంత్ రెడ్డి విజయం సాధించడంతో జిల్లా రాజకీయాలలో ఒక్కసారిగా మార్పు మొదలైంది. ఇదే సందర్భంలో మల్లారెడ్డి, రేవంత్ రెడ్డికి మధ్య వైరం పెరిగింది. అది ఎంత వరకంటే మల్లారెడ్డి రేవంత్‌రెడ్డిని వ్యక్తిగతంగా దుషించే స్థాయికి చేరింది. రేవంత్ రెడ్డి తనను బ్లాక్ మెయిల్ చేస్తున్నారని తన కూతురు పెండ్లికి నేనే ఖర్చు చేశానని మీడియా ముందే విమర్శలు చేశాడు. అనంతరం మల్కాజిగిరి ఎంపీగా ఉన్న రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడు కావడం అనంతరం జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలో రావడం, రేవంత్ రెడ్డి సీఎం కావడంతో ఒక్క సారిగా పరిస్థితులు మారాయి.

2023 ఎన్నికలతో మారిన సీన్..

2023 ఎన్నికలలో రాష్ట్రంలో కాంగ్రెస్ గెలిచి రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాడు. అయితే రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్‌కు మెజారిటీ స్థానాలు వచ్చినా గ్రేటర్ హైదరాబాదులో మాత్రం బీఆర్ఎస్ తన అధిపత్యాన్ని కొనసాగించింది. ఈ క్రమంలోనే మల్లారెడ్డి అధికారాన్ని అడ్డం పెట్టుకుని చేసిన అక్రమాలపై కాంగ్రెస్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతు మల్లారెడ్డి ఆక్రమించిన భూములు, భవనాలపై దృష్టి సారించింది. కొన్ని చోట్ల కూల్చివేతలు కూడా చేశారు. ఈ పరిస్థితుల్లో మల్లారెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందినా సుఖం లేదంటూ తన సన్నిహితుల వద్ద అనేక సార్లు వాపోయినట్లు సమాచారం.

సన్నిహితులు దూరం దూరం..

మల్లారెడ్డి అధికారంలో ఉన్న సమయంలో తన నివాసం ఎప్పుడూ కీటకీలాడుతు ఉండేది. ప్రస్తుతం అధికారం లేకపోవడంతో మల్లారెడ్డి ఏం చెప్పినా పనులు అవుతలేవని ఆయనకు సన్నిహితంగా ఉండే ప్రజాప్రతినిధులు, పార్టీ లీడర్లు ఆయనకు దూరంగా ఉంటున్నారు. అదే క్రమంలో నియోజకవర్గంలోని పలువురు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్లు, చైర్మెన్లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, కీలకమైన సీనియర్ లీడర్లు పార్టీ మారారు. అంతేకాదు ఇంకా తనతో ఉంటే తమ రాజకీయ భవిష్యత్తు అంధకారంగా అవుతుందని దూరంగా ఉంటున్నారు.

చేరిక వద్దంటే వద్దు..

అధికారం పోవడంతో తాను చేసిన అక్రమాలు బయటకు వస్తాయని, తన వ్యాపారాలకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందనే భావనతో మల్లారెడ్డి బీఆర్ఎస్‌కు బై బై చెప్పి ఇతర పార్టీలోకి చేరాలని తీవ్రంగానే ప్రయత్నాలు చేశారు. కానీ అవేవీ ఫలించలేదు. ఇక రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ నేతలను కాదని కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌తో మంతనాలు జరిపారు. అయినా మల్లారెడ్డికి గేట్లు ఓపెన్ కాలేదు. ఎందుకంటే మల్లారెడ్డి మంత్రిగా ఉన్న సమయంలో ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డిని వ్యక్తిగతంగా అనేక దూషణలు చేయడమే ప్రధాన కారణంగా చెప్తున్నారు. అంతే కాదు మల్లారెడ్డి పార్టీలోకి వస్తే తాము అస్సలు ఒప్పుకోమంటూ మల్లారెడ్డిపై ఓడిపోయిన తోటకూర వజ్రేష్ యాదవ్, ఆయన అనుచరవర్గం వ్యతిరేకిస్తుంది. ఇక కాంగ్రెస్‌తో లాభం లేదనుకోని బీజేపీలో చేరడానికి ప్రయత్నాలు చేశారు. మరీ ఎమైందో ఎమో కానీ అక్కడ కూడా ఆయన చేరికను తీవ్రంగానే వ్యతిరేకంచినట్టు తెలుస్తోంది. ఇక ఇవన్నీ కాదని తాను రాజకీయ రంగ ప్రవేశం చేసిన టీడీపీ ఆంధ్రప్రదేశ్‌లో మళ్లీ అధికారంలోకి రావడంతో టీడీపీలో చేరి టీడీపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు చేపట్టాలని ప్రయత్నాలు చేశారు. కానీ అది ఇంకా పెండింగ్‌లోనే ఉంది.

ఆస్తులు కాపాడుకోవడం టాస్కే!

మల్లారెడ్డి మంత్రిగా ఉన్న సమయంలో తన విద్యా సంస్థలను విస్తరించడానికి అనేక అవకతవకలకు పాల్పడ్డారని ఆయనపై అనేక ఆరోపణలు వచ్చాయి. అంతేకాకుండా సుచిత్ర సమీపంలో మల్లారెడ్డి, మల్లారెడ్డి అల్లుడు తమ భూమిని కబ్జా చేశారని బాధితులు ఆందోళన చేయడంతో స్పందించిన రెవెన్యూ యంత్రాంగం దర్యాప్తు చేసి మల్లారెడ్డిదే తప్పని నివేదిక ఇచ్చింది. అంతేకాకుండా ఆయమ విద్యా సంస్థలు నడుస్తున్న బహుళ అంతస్తుల భవనాలలో అనేక అక్రమాలు ఉన్నాయని, చెరువులు, కుంటలు, బఫర్ జోన్‌లలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరిగాయంటూ ఫిర్యాదులు వచ్చాయి. మల్లారెడ్డిపై గుర్రుగా ఉన్న రేవంత్‌రెడ్డి ఆయన అక్రమాలపై ఉక్కు పాదం మొపడం ఖాయమనే టాక్ వినిపిస్తున్నది. ఇలాగే జరిగితే మల్లారెడ్డి తన ఆస్తులను కాపాడుకోవడం పెద్ద టాస్కే అని చెప్పాలి.

అభివృద్ధిలో పీర్జాదిగూడ ముందడుగు

- మౌలిక సదుపాయల కల్పనలో భేష్
- నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తాం
- కమ్యూనిటీహాల్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మేయర్ జక్క వెంకట్‌రెడ్డి

నవతెలంగాణ-బోడుప్పల్

మౌలిక సదుపాయల కల్పన, అభివృద్ధిలో రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలకు పీర్జాదిగూడ ఆదర్శంగా నిలిచిందని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 2వ డివిజన్ శ్రీ సాయి నగర్ కాలనీలో నూతన కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవానికి మేడ్చల్ శాసన సభ్యులు చామకూర మల్లారెడ్డి, మేయర్ జక్క వెంకట్‌రెడ్డిలు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ అభివృద్ధిలో దేశంలోని అన్ని రాష్ట్రాలకు దిక్సూచిగా నిలించిందన్నారు. 24 గంటలు నాణ్యమైన కరెంట్, ఫ్లై ఓవర్లు, ఐటీ, ఫార్మ, అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు అన్ని రంగాలలో అభివృద్ధి సాధించిందన్నారు. మిషన్ భగీరథ ద్వారా రిజర్వాయర్లు, ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించి ప్రతి గడపకు మంచి నీరు అందించిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. మేడ్చల్ నియోజకవర్గం అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ అధ్యక్షులు బండారి రవీందర్, ప్రధాన కార్యదర్శి రఘువర్ధన్ రెడ్డి, కార్పొరేటర్లు కొల్తూరి మహేష్, బచ్చ రాజు, మద్ది యుగేందర్ రెడ్డి, కౌడే పోచయ్య, మధుసూదన్ రెడ్డి, ఏంపల్ల అనంతరెడ్డి, దొంతిరి హరిశంకర్ రెడ్డి, నాయకులు లేతాకుల రఘుపతి రెడ్డి, అలవాల దేవేందర్ గౌడ్, జావీద్ ఖాన్, డివిజన్ అధ్యక్షులు బాలరాజు, వెంకన్న, శ్రీనివాస్, కిరణ్, మల్లం వెంకటేష్ గౌడ్, సాయి నగర్ అసోసియేషన్ అధ్యక్షుడు బింగి ఉపేందర్, ప్రధాన కార్యదర్శి ఆరుట్ల నవీన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మల్లాపూర్‌లో ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-కాప్రా

మల్లాపూర్‌లో కత్తి చిన్నమ్మ స్మారక ఉచిత వైద్య శిబిరాన్ని సునీత హెూమియోపతి అండ్ ఆయుష్ కేర్ క్లినిక్, అంబ్యేదర్‌యూత్ అసోషియేషన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ భవనంలో ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరాన్ని కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మల్లాపూర్ పరిసర కాలనీల ప్రజలు హెూమియోపతి వైద్య సేవలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో బాబు కత్తి, ఇతర వైద్యులు, సంఘం అధ్యక్షుడు వెంకట ప్రసాద్, కార్యదర్శి శంకర్, సుదర్శన్, నరసింహ, నరసింహ, వర్కింగ్ ప్రెసిడెంట జితేందర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రఘువరన్ ఉన్నారు. శిబిరంలో కీళ్ల వ్యాధులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

కుల రహిత సమాజంతోనే దేశాభివృద్ధి

- బహుజన రాజ్యధికార స్థాపనే లక్ష్యం
- మాజీ మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యులు శ్రీరాముల శ్రీనివాస్

నవతెలంగాణ-బోడుప్పల్

కుల రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అప్పుడే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని మావోయిస్టు పార్టీ మాజీ కేంద్ర కమిటీ సభ్యులు శ్రీరాముల శ్రీనివాస్ అన్నారు. ఆదివారం బోడుప్పల్‌లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి జ్ఞానమాల సమర్పించే కార్యక్రమంలో భాగంగా 281 వారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీరాములు శ్రీనివాస్ మాట్లాడుతూ కులరహిత సమాజమే అంబేద్కర్ ఏకైక లక్ష్యమని, స్వతంత్రం వచ్చి 75 ఏండ్లు గడిచినా ఇంకా కులాలు, మతాల పేరుతో చంపుకుంటున్నారని, భారత రాజ్యాంగం భారతీయులందరికీ సమానమైన హక్కులు విధులు కల్పించినప్పటికీ బడుగు బలహీన వర్గాలు ఇంకా అట్టడుగు స్థానంలోనే ఉన్నాయన్నారు. ధనికులు ఇంకా ధనవంతులవుతున్నారని, దళిత బహుజనులు ఏకమై రాజ్యాధికారం సాధించినప్పుడే అంబేద్కర్ కలలు సహకారం అవుతాయని పేర్కొన్నారు. అనంతరం నత్తి మైసయ్య మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలను సాధించడానికి నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో బహుజనుల రాజ్యాధికారం లక్ష్యంగా పనిచేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో భూ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు బుగ్గ మైసయ్య, నత్తి విజయ్ కుమార్, కమగల బాబు, కంచి సతీష్, సవరపు బయన్న, జై భీమ్ అజయ్, తదితరులు పాల్గొన్నారు.



న్యూ అంబేద్కర్ నగర్ కాలనీ కమిటీ ఎన్నిక

- నూతన అధ్యక్షుడు అబ్బగొని మహేష్ గౌడ్

నవతెలంగాణ - జవహర్ నగర్

కాలనీ అభివృద్ధికి, అయ్యప్ప, హనుమాన్ దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని న్యూ అంబేద్కర్ నగర్ కాలనీ నూతన అధ్యక్షుడు అబ్బగొని మహేష్ గౌడ్ అన్నారు. సోమవారం జవహర్ నగర్ మున్సిపల్ పరిధిలోని న్యూ అంబేద్కర్ నగర్‌లో కాలనీవాసుల సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అబ్బగొని మహేష్, ప్రధాన కార్యదర్శి గుండ్ల పృథ్వీరాజ్, కోశాధికారి బూడిద నరేందర్, ఉపాధ్యక్షులు సోమయ్య, మల్లేష్, శ్రావణ్, చంద్రమౌళి, సలహాదారులు ఉప్పునూతుల శ్రీనివాస్, బూడిద బాలరాజు, చిరంజీవి, శ్రీరాములు, అబ్దుల్లా, కార్యవర్గ సభ్యులుగా మధుకర్, దామోదర్ చారీ, బంగారయ్య, కృష్ణ, రాకేశ్, గోపి, ప్రశాంత్, హరీష్, సంతోష్ ఎన్నికయ్యారు.



కుమ్మరి బస్తీలో ఘనంగా బోనాల ఉత్సవాలు

నవతెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ పట్టణంలోని కుమ్మరి బస్తీలో దుర్గమ్మ తల్లి బోనాల ఉత్సవాలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుల సంఘం పెద్దలు, పట్టణ ప్రజల ఆధ్వర్యంలో ఆలయం వద్ద గావు, రంగం, సర్వగంప, పోతరాజుల విన్యాసాలు వంటి కార్యక్రమాలు నిర్వహించా రు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ మర్రి దీపిక నర్సింహారెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ ప్రజలు సుభిక్షంగా ఉండాలని వేడుకున్నట్టు తెలిపారు. ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కట్టమైసమ్మ కుమ్మరి బస్తీలో దుర్గమ్మ బోనాలు నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు అత్వెల్లి అర్చన సందీప్ గౌడ్, మర్రి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు రఘు, సత్యనారాయణ, మర్రి నర్సింహా రెడ్డి,సందీప్ గౌడ్,శ్రీనివాస్ గౌడ్,కుల సంఘాల పెద్దలు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.



ఉప్పల్‌లో ట్రాఫిక్ పోలీసులే శ్రామికులు

- శభాష్ ట్రాఫిక్ పోలీస్

నవతెలంగాణ-ఉప్పల్

ఉప్పల్‌లో ట్రాఫిక్ పోలీసులే శ్రామికులు అయ్యారు. ఉప్పల్, వరంగల్, ప్రధాన రహదారిపై గుంతలు పడటంతో ట్రాఫిక్ పోలీసులు ఆదివారం శ్రామికులుగా మారి ప్రజా శ్రేయస్సు కోసం రోడ్డుపై గుంతలను పుడ్చారు. ఈ సందర్భంగా ప్రజల ట్రాఫిక్ పోలీసులను అభినదించారు. గత కొంత కాలంగా రోడ్డు మొత్తం గుంతలుగా మారినా పాలకులు, అధికారులు పట్టించుకోవడం ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి, రోడ్డుకు మరమ్మతులు చేయాలని కోరారు.



ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు

నవతెలంగాణ- మేడ్చల్

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో ఆదివారం ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షుడు రవి మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవం, వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు నిర్వహించారు. మున్సిపల్ పరిధిలోని మినీ ట్యాంక్ బండ్ వద్ద ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ 30ఏండ్ల క్రితం కేవలం 6 మందితో ప్రారంభమై నేడు లక్షలాది మందితో ముందుకు సాగుతుందన్నారు. మాదిగలకే కాకుండా దేశంలో ఎవరికి అన్యాయం జరిగినా మాట్లాడే నాయకుడు మందకృష్ణ అని కొనియాడారు. వర్గీకరణ జరిగితేనే మాదిగలకు, ఉపకుల అందరికీ న్యాయం జరుగుతుందని మందకృష్ణ పోరాటం చేస్తున్నారని తెలిపారు. మందకృష్ణ ఆధ్వర్యంలో ఏబీసీడీ వర్గీకరణ సాధ్యం అవుతుందన్నారు. మందకృష్ణ మాదిగ 60వ జన్మదినం సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు భానుచందర్ మాదిగ, మహేష్, డప్పు నర్సింగరావు, డప్పు కృష్ణ, జనార్ధన్, శ్రీనివాస్, వెంకటేష్, మల్లికార్జున్ పాల్గొన్నారు.



పిల్లలు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలి

- సుఖినోభవంత్ ట్రస్ట్ ప్రతినిధులు ప్రభావతి, రవి ప్రసాద్
- ఉచితంగా బ్యాగులు, పుస్తకాలు పంపిణీ

నవతెలంగాణ - జవహర్ నగర్

పిల్లలు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని సుఖినోభవంత్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ప్రభావతి, రవి ప్రసాద్‌లు అన్నారు. ఆదివారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ 28వ డివిజన్ మథర్ థెరిస్సా కాలనీలో కాలనీ అధ్యక్షులు బూడిద వెంకటేష్ ఆధ్వర్యంలో సుఖినోభవంత్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు 60 మంది పిల్లలకు బుక్స్, బ్యాగ్‌లను ఉచితంగా పంపిణి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సావిత్రి జ్యోతి రావుపూలే, డాక్టర్ బి ఆర్ అంబేద్కర్, అబ్దుల్ కలామ్ జ్ఞాపకాలు పిల్లలకు వివరించారు. మీరు కూడా భవిష్యత్‌లో మంచిగా చదువుకొని డాక్టర్స్, ఇంజనీర్లు, అవ్వాలని, ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా నిచ్చారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు హారిక, వరలక్ష్మి, విజయలక్ష్మి, రాణి కౌర్, లక్ష్మి, మంజుల, రవి పాల్గొన్నారు.



నవతెలంగాణ

కోలన్ రాజశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ కొలన్ రాజశేఖర్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ ఇన్‌చార్జి కొలన్ హనుమంత్ రెడ్డి, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు కొలన్ శ్రీనివాస్ రెడ్డి అభిమానులు పాల్గొన్నారు. కొలన్ శ్రీనివాస్ రెడ్డి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రాజశేఖర్ రెడ్డి, హను హనుమంత్ రెడ్డికి, శ్రీనివాస్ రెడ్డిని శాలువాతో సత్కరించారు.

ముప్పా సుబ్బయ్యకు నివాళ్లర్పించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

వెస్ట్ జోన్ బిల్డర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ముప్పా సుబ్బయ్య మృతి చెందారు. విషయం తెలుసుకున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదివారం ఆయన నివాసానికి చేరుకుని ఆయన పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ సతీష్ అరోరా, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పాలిస్తీనా పై దాడులను ఖండించండి



- శాంతి సంఘం మేడ్చల్ అధ్యక్షుడు ఉమా మహేష్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

పాలిస్తీనా పై ఇజ్రాయెల్ చేస్తున్న దాడులను నిరసిస్తూ యుద్ధంను ఆపివేయ్యాలని, శాంతిని నెలకొల్పాలని కోరుతూ శాంతి సంఘం మేడ్చల్ అధ్యక్షుడు ఉమా మహేష్ ఆదివారం ఇందిరాపార్క్ వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిలుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, ప్రొఫెసర్ కోదండరాం, మాజీ ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, అప్ సుధాకర్, అరుణోదయ విమలక్క, మైనారిటీ చైర్మెన్ కొత్వాల్ ఒబెదుల్లా, సీపీఐ నాయకులు కెవిఎల్, సీపీఐ(ఎం) మల్లారెడ్డి లు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పాలిస్తీనా శరణార్థులుగా వచ్చిన ఇజ్రాయెల్ వారు నేడు పాలిస్తీనా ను మొత్తం భూమిని ఆక్రమించి.. జాత్యాహంకారంతో మొత్తం పాలిస్తీనా జాతిని అంతం చేస్తామనే లక్ష్యంతో పెద్ద ఎత్తున వారి నివాసాల పై, బడులు పై, ఆస్పత్రిల పై, ఐక్యరాజ్య సమితి ఏర్పాటు చేసిన శరణార్థ శిబిరాలపై బాంబు దాడులు చేయడం అన్యాయమని అన్నారు. ఇది కేవలం ఒక్క ప్రాంతానికి పరిమితం కాదని యుద్ధ ప్రభావం మొత్తం ప్రపంచ ప్రజలపై పడుతుందని పేర్కొన్నారు. కావున ప్రపంచ దేశాలు కలిసి ఇజ్రాయెల్ చేస్తున్న దాడులను ఆపేల చర్యలు తీసుకోవాలని దానికి భారత దేశం కూడా మద్దతు ఇవ్వాలని కోరారు. రానున్న రోజుల్లో పాలిస్తీనాకు సంఘీభావంగా అన్ని ప్రాంతాల్లో కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను సమీకరించాలని కోరారు.

వార్డు కార్యాలయం ముందు గుంతలమయంగా రోడ్డు

- ఈ రహదారి రింగు రోడ్డు కావడంతో నిత్యం వేల వాహనాలు ప్రయాణం
- ప్రజాప్రతినిధులు పట్టించుకోక పోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు

నవతెలంగాణ-దుండిగల్

మల్లంపేట్ వార్డు కార్యలయం ముందు రోడ్డు గుంతలు ఉండటం వల్ల ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేట్ వార్డ్ కార్యాలయం రోడ్ మల్లంపేట్ బస్సు స్టాండ్ వరకు రోడ్ వెడల్పు సంగతి ప్రక్కన పెడితే రోజు ఈ రోడ్ వెంట అనేక వాహనాలు బస్సులు, ట్రక్కులు, స్కూల్ వాహనాలు బైక్‌లు ఉదయం నుంచే ప్రయాణాలు కొనసాగిస్తారు. బాచుపల్లి నుంచి మల్లంపేట్ రోడ్ వెడల్పు ప్రతిపాదన ఒక్క అడుగు ముందుకు.. మూడు అడుగులు వెనక్కు అనేచందంగా కొనసాగుతుంది. బాచుపల్లి రోడ్ చేసే సరికి నెలలు కొనసాగి ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏకంగా రాస్తా రోకో తలపెడితే గానీ, కదలలేని కాంట్రాక్టర్ ఎట్టకేలకు బీటి రోడ్ మల్లంపేట్ రత్నదీప్ వరకు వేసి, మమా అనిపించిన విషయం తెలిసిందే.. అనంతరం మల్లంపేట్ బస్టాండు వద్ద ఇటీవల మొదలైన కంకరపౌడర్ వేస్తూ రోడ్ కొనస్తున్నారు. మరి వార్డ్ కార్యాలయం వద్ద ఆరోడ్డు వెడల్పు దేవుడెరుగు నిత్యం డ్రయినేజీ వ్యవస్థ అస్త వ్యస్థమయి, ఇప్పటికే అనేక మంది గుంతల మురుగు నీటిలో పడుచు ప్రమాదలభారిన పడ్డారు.



ఈ విషయమై దుండిగల్ కమిషనర్‌ను వివరణ కోరాగా..

ప్రధాన రోడ్డు, రోడ్డు రహదారుల శాఖ(ఆర్‌బీ)వారు చేయవలసి ఉంటుందని ఏదయినా పైప్ లైన్ విషయం మా భాద్యత ఉంటుందని, రోడ్ మొత్తం భాద్యత మాపై వేస్తే ఎలాగని తెలుయచేస్తుండగా, ఆర్‌బీ అధికారులు అటు వంక సైతం చూడక పోవడం శోచనీయం. ఇలా రెండు శాఖల అధికారుల సమన్వయం లేక ప్రతి రోజు ప్రజలు ఈ మురుగు నీటి కనీసం 20 గుంతలతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్న పరిస్థితి నెలకొంది. రోడ్డు వెడల్పు ఎప్పటికి అవుతుందో గానీ, మున్సిపల్ కమిషనర్ పరిధి కాదన్నప్పుడు రోడ్డు దుకాణదారుల మురుగు నీరు రోడ్డుకు వదిలివేస్తున్న అధికారులు, సిబ్బంది వారిని నియంత్రించే చర్యలు సైతం తీసుకోలేక చోద్యం చూడడం పై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఈ రోడ్డు వెంట వస్తే కదా.. ప్రజల ఇబ్బందులు తెలుస్తాయని, స్థానిక కౌన్సిలర్‌లు నిత్యం వారికి వాహనాదారుల ప్రమాదాలు కనపడటం లేదా అని ప్రజలు ప్రశ్నించారు. పై అధికారులు మున్సిపల్, ఆర్‌బీ అధికారులు వెంటనే ప్రజా ప్రయోజనాల దృష్ట్యా వెంటనే రోడ్డు శాశ్వత పరిష్కారం చేసి, ప్రజల ప్రమాదాలు నివారిస్తారని, మల్లంపేట్ ప్రజలతో పాటు అనేక వాహనాధారులు అధికారులకు కోరుకుంటున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



- ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని కుత్బుల్లాపూర్ హ్యాట్రిక్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. ఆదివారం కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సంక్షేమ సంఘాల సభ్యులు ఎమ్మెల్యే కలిసి, పలు వినతులు, ఆహ్వానాలు అందజేశారు. సమస్యలపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. రానున్న రోజుల్లో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరిత గతిన పూర్తి చేసి నూతన పనులను చేపడతామన్నారు.

కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నాం..

కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద 129 - సూరారం డివిజన్ కార్తీక్ నేచర్ స్పేస్ వెంచర్ వాసులు ఆదివారం కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్‌ని కలిసి, కాలనీలో నెలకొని ఉన్న అండర్ గ్రౌండ్ డ్రయినేజీ, సీసీ రోడ్డు సమస్యలను విన్నవించుకున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కార్తీక్ నేచర్ స్పేస్ వెంచర్లో మౌలిక వసతులైన అండర్ గ్రౌండ్ డ్రయినేజీ, సీసీ రోడ్డు పనులకు వ్యయ ప్రణాళికలను అధికారుల రూపొందించారని త్వరలోనే పనులకు శ్రీకారం చుడతామన్నారు. అంతేకాక నియోజకవర్గం లోని అన్ని ప్రాంతాలలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్తీక్ నేచర్ స్పెస్ వెంచర్ వాసులు కళ్యాణ్ రాజు, అనిల్ కుమార్, వెంకట్ రెడ్డి, పవన్, మూర్తి, తిరుపతి గోపాల్ రెడ్డి, నాగేశ్వర్ రావు, తదితరులు పాల్గొన్నారు.



ఫిట్‘లెస్’ బస్సులపై చర్యలు తీసుకోవాలి

- ఎస్ఎఫ్ఐ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్



నవతెలంగాణ-సిటీబ్యూరో/కాప్రా

జిల్లా వ్యాప్తంగా ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యలు 224 ఫిటినెస్ లేని బస్సులు నడుపుతున్నాయనీ, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్ డిమాండ్ చేశారు. ఈ విద్యాసంవత్సరం లో ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా ఆయా ప్రయివేటు, కార్పొరేట్ స్కూల్ బస్సులు రోడ్డుపై తిరిగేస్తున్నాయన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ముక్కు పిండి మరీ ఫీజులు వసూలు చేస్తున్నారు కానీ.. విద్యార్థులు తీసుకెళ్లే బస్సులకు మాత్రం సామర్థ్యపు పరీక్షలు చేయించకపోవడం సరికాదన్నారు. ఈ ఫిటినెస్ లేని బస్సుల్లో విద్యార్థులు ఎక్కినప్పుడు ఏమైనా ప్రమాదం జరుగుతే బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం విచ్చలవిడిగా ప్రయివేటు, కార్పొరేట్ విద్యా సంస్థలకు పర్మిషన్లు ఇవ్వడం వల్లనే ఆయా స్కూల్స్ యాజమాన్యాలు విచ్చలవిడిగా ఫిటినెస్ లేని బస్సులను రోడ్లపై తిప్పుతున్నాయన్నారు. అధికారులు చర్యలు మాత్రం అనుకునేంత స్థాయిలో ఉండటం లేదన్నారు. అప్పుడప్పుడు అధికారులు ఫిటినెస్ లేని బస్సులను పర్యవేక్షిస్తున్నా.. అనుకున్న స్థాయిలో తనిఖీలు చేయడం లేదన్నారు. పర్మిషన్, ఫిటినెస్ లేకుండా రోడ్లపై తిరుగుతున్న బడి బస్సులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే ఆయా పాఠశాలల్లో విద్యా సంస్థల వారీగా తనిఖీలు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫిటినెస్ చేయించుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్న ఆయా విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు.

అంగన్వాడి టీచర్స్, ఆయాల రిటైర్మెంట్ బెనిఫిట్స్‌పై జీవో విడుదల చేయాలి

- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వంగాల శ్రీనివాసులు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్/జగద్గిరిగుట్ట

ఐసీడీఎస్ కేంద్ర ప్రభుత్వం పథకంలో గత 50 సంవత్సరముల నుంచి అంగన్వాడీ టీచర్స్, ఆయాలు గౌరవేతనం పేరుతో శ్రమ దోపిడీకి గురి అవుతున్నారని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వంగాల శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రిటైర్మెంట్ బెనిఫిట్ చెల్లిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడిచిన పాత జీవోను రద్దు చేయకపోవడంతో అంగన్వాడి టీచర్లు ఆయాలు మానసిక ఆందోళన చెందుతున్నారని ఆయన తెలిపారు. జూలై 3న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో అంగన్వాడి అసోసియేషన్ ప్రతినిధి వర్గం మంత్రి సీతక్కను కలువగా టీచర్లకు రూ. 2 లక్షల , హెల్పర్ కు రూ.1 లక్ష ఇస్తామని మంత్రి హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ప్రభుత్వం వెంటనే రిటైర్మెంట్ బెనిఫిట్ జీవో విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అంగన్వాడీ టీచర్స్ , ఆయాలకు రిలీవింగ్ ఆర్డర్ ఇచ్చి వరకు విధులలో కొనసాగించి వారిని గౌరవంగా సన్మానించి , బెనిఫిట్ డబ్బులు వెంటనే బ్యాంకుల్లో జమ చేయాలని ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేయాలని ఆయన కోరారు. లేనిపక్షంలో రాష్ట్రంలోని అంగన్వాడి టీచర్లు ఆయాలు పోరాటాలు ఉద్యమాలు చేయడానికి సిద్ధంగా ఉన్నారని ప్రభుత్వాన్ని ఆయన హెచ్చరించారు.

కుత్బుల్లాపూర్‌లో ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవాన్ని కుత్బుల్లాపూర్ మున్సిపల్ సర్కిల్ చౌరస్తాలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జెండా ఎగరవేశారు. అనంతరం ఎమ్మార్పీఎస్ శ్రేణులు మంద కృష్ణ మాదిగ 60వ జన్మదిన వేడుకలను కేక్ కట్ చేసి, స్వీట్లు పంచి పెడుతూ .. సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ పార్టీ మేడ్చల్ మల్కాజ్గిరి ఉపాధ్యక్షులు రాసమల్ల యాదగిరి మాదిగ మాట్లాడుతూ... మూడు దశాబ్దాలుగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఎస్సీ వర్గీకరణ కోసం అలుపెరుగని పోరాటం చేస్తున్నారన్నారు. త్వరలోనే ఎస్సీ వర్గీకరణ సాధించబోతున్నామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధి సిలు వేరు శ్రీనివాస్ మాదిగ, జిల్లా యువసేన ప్రధాన కార్యదర్శి ఇసురం రమేష్ మాదిగ, జిల్లా మహిళా అధ్యక్షురాలు నడిమి దొడ్డి సలోమి, నిరంజన్, గడ్డం కురుమయ్య, జార్జ్ బీసీ నాయకుడు వెంకటేష్, మాదిగ జర్నలిస్టు ఫోరం నాయకులు బాబు తదితరులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలపై నిరంతరం ఎమ్మార్పీఎస్ పోరాటాలతో పాటు ఎల్లప్పుడు సేవ చేస్తుందని ఎమ్మార్పీఎస్ నాయకులు లింగయ్య,బాబు మాదిగ,ఎర్ర ఎంకన్నలు అన్నారు. ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజక వర్గం జగద్గిరిగుట్ట డివిజన్ చివరి బస్టాండ్ లో ఉన్న ఎమ్మార్పీఎస్ జెండాను ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు చిరంజీవి ఆధ్వర్యంలో వారు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఏర్పాటు చేసి 30 ఏండ్లు పూర్తయిన సందర్భంగా ఎమ్మార్పీఎస్ జెండా ఆవిర్భావం దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

అనంత ‘లా’ కాలేజీలో మూడవ ఇంట్రా మూట్ కోర్ట్ కాంపిటీషన్



నవతెలంగాణ-కూకట్‌పల్లి

న్యాయం కోసం పోరాడే యువ న్యాయవాదుల సందడితో అనంత న్యాయ కళాశాల మూడవ ఇంట్రా మూట్ కోర్ట్ మార్మోగింది. కోవిడ్ టీకాకు సంబంధించిన అప్పీల్ కేసు అంశంపై జరిగిన పోటీలో, 24 బృందాలుగా కళాశాల న్యాయవిద్యార్థులు పాల్గొన్నారు. ఈ రెండు రోజులుగా ఐదవ తేదీ, ఆరవ తేదీ జులైలో జరిగినా కార్యక్రమంలో, చివరిరోజు ముఖ్య అతిథిగా ఉస్మానియా యూనివర్శిటీ సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ జి.బి రెడ్డి డైరెక్టర్ పీజీఆర్ఆర్ సీడీఈ (ఓయూ) అనంత లా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రమతి, న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ డాక్టర్ జి.బి రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి పోటీలు న్యాయ విద్యార్థులకు మంచి అవకాశం అని అన్నారు. అంతేకాకుండా నూతన చట్టాలు బిఎన్ఎస్, బిఎన్ఎస్-ఎస్, బిఎస్ఎల ఆవిర్భావం, ఆవశ్యకతపై లోతైన అవగాహనను కల్పించారు. నూతన చట్టాలపై ప్రజలలో అవగాహన పెంచడం ఎంతో అవసరమని చెప్పారు.

అశోక్ రెడ్డి తిప్పని బృందం (ఇందిరా, రెయిాశ) అత్యుత్తమ ప్రతిభను చాటి, ప్రథమ విజేతగా నిలవడం తో పాటు ఉత్తమ మెమోరియల్ ‘లా ఆఫ్ మెమొరండమ్’ కు అశోక్ రెడ్డి ఎంపిక కాబడింది. సాయితరుణ్ నేతృత్వంలోని టీం (రవికుమార్, జ్ఞానేశ్వరి) రన్నర్‌గా, వందనను ఉత్తమ మ్యూటర్‌గా, ఉత్తమ రీసెర్చర్‌గా ఎం.నవ్యకాంత్‌లను న్యాయనిర్ణేతలు ప్రకటించారు. గెలుపొందిన వారిని ఘనంగా సన్మానించి అవార్డులను అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమతి మాట్లాడుతూ ఈ పోటీ న్యాయ విద్యార్థులలో, న్యాయ వ్యవస్థపై అవగాహన పెంచడమే కాకుండా, వారిలో మౌఖిక నైపుణ్యాలు, విశ్లేషణాత్మక సామర్థ్యాలను, మనోధైర్యం పెంపొందించడానికి ఒక వేదికగా నిలిచిందన్నారు. పోటీలో పాల్గొన్న వారికి సర్టిఫికేట్స్‌లను అందజేశారు.

న్యాయ చట్టాలపై

అవగాహన, వాద, ప్రతివాదాలతో వారు కనబరచిన మెలకువలతీరు, న్యాయ పరమైన చిక్కులను చేదించే విధానం, న్యాయమూర్తులను ఒప్పించిన విధానం, క్రమశిక్షణగా ప్రతివాదులను, వాదనలతో ఇరుకున పెట్టే తదితర అంశాలపై అందరిని కనుల విందు చేశాయి. అత్యుత్తమ ప్రతిభను చాటి ప్రథమ విజేతగా ఉత్తమ మెమోరియల్ అవార్డును దక్కించుకోవటం విశేషం అని అశోక్ రెడ్డి బృందం పై కళాశాల అధ్యాపక బృందం, కళాశాల విద్యార్థులు ప్రశంసల వర్షం కురిపించారు.

కాలనీ సమస్యలు త్వరగా పరిష్కరిస్తా..



- సమస్యలపై పాదయాత్రలో భాగంగా కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్

నవతెలంగాణ-కూకట్‌పల్లి

షిరిడి నగర్ కాలనీ సమస్యలు త్వరగా పరిష్కరిస్తామని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. ఆల్విన్ కాలని డివిజన్, ఆల్విన్ కాలనీ పరిధిలోని షిరిడి నగర్ కాలనీలో, విద్యుత్ డ్రయినేజీ నాలాకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని, షిరిడి నగర్ అసోసియేషన్ సభ్యులు డివిజన్ కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. కార్పొరేటర్ షిరిడి నగర్ కాలనీలో పాదయాత్ర చేసి సమస్యలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షిరిడి నగర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ మార్చాలన్న విషయాన్ని విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడామని, త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. అలాగే కాలనీ అసోసియేషన్ ఆఫీస్ నిర్మాణం, ఓపెన్ నాలా క్లీనింగ్, చిన్న కల్వర్ట్ పెండింగ్ వర్క్స్ చేయవలసి ఉందన్నారు. వీటిని కూడా సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి తొందరలో సమస్యలను పరిష్కరిస్తామని కాలనీ వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, శివరాజ్ గౌడ్, మోజెస్, కాలనీ అధ్యక్షులు సి హెచ్ శ్రీధర్, జెనరల్ సెక్రటరీ డి.మూర్తి, అమరెందర్ రెడ్డి, ప్రవీణ్ సింగ్, సురేష్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కాంగ్రెస్‌లో చేరడం పట్ల హర్షం



నవతెలంగాణ-కూకట్‌పల్లి

హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్ రావు కాంగ్రెస్‌లో చేరడం పట్ల టీపీసీసీ లేబర్ సెల్ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి కర్క నాగరాజు హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల హైదరాబాద్ ఎమ్మెల్సీ, ప్రభుత్వ మాజీ విప్ ఎంఎస్‌ప్రభాకర్ రావు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో... కాంగ్రెస్ పార్టీలో చేరడం పట్ల కర్క నాగరాజు,ప్రభాకర్ రావుని ఆయన నివాసంలో కలిసి, శాలువాతో సత్కరించారు. పూలబోకే అందించి శుభాకాంక్షలు తెలుపుతూ ఆనందాన్ని వ్యక్తంచేశారు. ప్రభాకర్ రావు మూడు సార్లు ఎమ్మెల్సీగా హైదరాబాద్ ప్రజలకు సేవలందించారని తెలిపారు. హైదరాబాద్ తొలి దళిత మేయర్‌గా తన తండ్రి చేసిన సేవలను ఆదర్శనంగా తీసుకొని రాజకీయాలలో రానిస్తూ తిరిగి తన సొంత ఇంటికి వచ్చినందుకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సప్పిడి భాస్కర్, అల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం గ్రేటర్ కార్యదర్శి సదామహేష్, జక్కుల అశోక్, కర్క మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



- మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

పేద ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించడం అభినందనీయమని మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి అన్నారు. ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆదివారం సుభాష్ నగర్ 130 డివిజన్, సూరారం కాలనీలోని రామ్ లీలా మైదానంలో "లైఫ్ స్పాన్ హాస్పిటల్ " మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సురేష్ రెడ్డి మాట్లా డుతూ... ప్రతి ఒక్కరు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని కోరారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలన్నారు. సంవత్సరానికి ఒక్కసారైనా వైద్యులను సంప్రదించి, వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ముఖ్యంగా డివిజన్ ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి మెడికల్ క్యాంపు సేవలను సద్వినియోగం చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో లైఫ్ స్పాన్ హాస్పిటల్ డాక్టర్లు, సిబ్బంది, బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు మంగ, విజయ్ రాజు గౌడ్, జహంగీర్, శంకర్, పార్టీ సీనియర్ నాయకులు, బస్తీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం అభినందనీయం



నవతెలంగాణ-కూకట్‌పల్లి

మూసాపేట్ వార్డు కార్యాలయంలో క్లావో ఈ ఎన్ టీ అండ్ వాస్కులర్ హాస్పిటల్ వారి సౌజన్యంతో.. డాక్టర్ సౌజన్య, డాక్టర్ మహేశ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈఎన్‌టీ ఉచిత వైద్య శిబిరంలో ఆస్పత్రి యాజమాన్యాన్ని, వైద్యులను మూసాపేట్ కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మూసాపేటలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో సైతం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని వారిని కోరిన వెంటనే నిర్వాహకులు అందుకు అంగీకరించడం హర్షణీయం అని పేర్కొన్నారు.

ప్రభుత్వ భూములు అన్యక్రాంతం చేస్తే ఉపేక్షించేది లేదు



- మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ప్రభుత్వ భూములను అన్యక్రాంతకం చేస్తే ఉపేక్షించేది లేదని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం జగద్గిరిగుట్ట డివిజన్ భూదేవి హిల్స్ ప్రాంతంలో బాలకృష్ణ అనే భూకబ్జా దారుడు పరికి చెరువు ఎఫ్.టి.ఎల్.ను స్మశాన, వాటికలను ఆక్రమించి ప్లాట్లుగా చేసి అమాయక ప్రజలకు అమ్ముతున్నాడనని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీంతో మండల ఆర్.ఐ.రజినీకాంత్‌తో పాటు స్థానికులతో కలిసి పరికి చెరువు ఆక్రమణలను పరిశీలించారు. సుమారు 500 కోట్ల విలువ గల ప్రభుత్వ భూమిని ఆక్రమించారని,స్మశాన వాటికలో ప్రయివేటుగా రోడ్లు వేసి, ప్లాట్లుగా చేసి లక్షల రూపాయలకి అమాయక ప్రజలకు అమ్మి సొమ్ము చేసు కుంటున్నాడని స్థానికులు వివరించారు. ఈ సందర్భంగా కూన మాట్లాడుతూ ప్రభుత్వ భూముల ఆక్రమణలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకొని, ప్రభుత్వ భూముల రక్షణకు కృషి చేయాలని ఆయన అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ భూముల పరిరక్షణకు కృషి చేస్తానని, చెరువులను కాపాడతానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ లక్ష్మారెడ్డి,సీనియర్ నాయకులు రషీద్, మోతె శ్రీనివాస్ యాదవ్, గణేష్, ఓరుగంటి నరేష్ గౌడ్, గుమస్తా మధుసూదన్, నరేందర్ రెడ్డి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ప్రయివేటు యూనివర్సిటీల బిల్లును ఉపసంహరించుకోవాలి'



నవతెలంగాణ-ఓయూ

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చే ఐదు ప్రయివేటు యూనివర్సిటీల బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొల్లెపల్లి స్వామి గౌడ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కొత్తగా వచ్చే ప్రయివేటు యూనివర్సిటీల వల్ల రాష్ట్రంలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేసే కుట్ర జరుగుతుందని ఆరోపించారు. ఇప్పటికైనా ఈ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలపై సీఎం రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే ఉపసంహరిం చుకొవాలన్నారు. శ్రీనిధి, గురునానక్ ,ఎంఎస్ఆర్, కావేరి, ఎస్ఐసీఎంఎఆర్ ప్రయివేటు యూనివర్సిటీల అనుమతులను తక్షణమే రద్దుచేసి ఈ బిల్లును వెనక్కి తీసుకోవాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వ యూనివర్సిటీలను బలు పేతం చేసే దిశగా పయనించాలని అధిక నిధులను కేటాయించి, నియామకాలు జరపాలని, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి తన చిత్తశుద్ధిని చాటుకోవాలని కోరారు

రవీందర్ రెడ్డికి ఓయూ డాక్టరేట్



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా యూనివర్సిటీ, ఇంజనీరింగ్ కళాశాల, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో బుక్కసాముద్రం రవీందర్ రెడ్డి డాక్టరేట్ పొందారు. వాసవి ఇంజనీరింగ్ కళాశాల, సి.యస్.ఇ విభాగ అధిపతి ప్రొ. టీ.ఆదిలక్ష్మి పర్యవేక్షణలో ఎ మెర్కె ట్రీ సైఫర్టెక్స్ పాలిసీ అట్రిబ్యూట్ బేస్డ్ ఎన్క్రిప్షన్ మోడల్ ఫర్ ప్రైవసీ ప్రెసర్వింగ్ ఆఫ్ హెల్త్‌కేర్ అట్రిబ్యూట్స్ " అనే అంశంపై పరిశోధనకు పీహెచ్డీ డాక్టరేట్ లభించింది. తన తల్లిదండ్రులు, కూతురు జిష్విఖకు అంకితం చేస్తునట్టుగా తెలిపారు. ఈ సంద ర్భంగా ఉస్మానియా విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి డా"ఎస్.రామచంద్రమ్ కి, ప్రొ"కె. శ్యామలకి కృతజ్ఞతలు తెలిపారు. పలువురు అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, కుటుంబసభ్యులు అభినందించారు.



చెస్ అసోసియేషన్‌లో అక్రమాలపై విచారణ జరపాలి

- మాజీ ఉపాధ్యక్షుడు మేజర్ శివప్రసాద్

నవతెలంగాణ - బంజారాహిల్స్

తెలంగాణ రాష్ట్ర చెస్ అసోసియేషన్ లో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించి దోషులను శిక్షించాలని ప్రభుత్వానికి చెస్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షుడు మేజర్ కె ఏ శివప్రసాద్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రంగారెడ్డి జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి ధన,సీనియర్ కోచ్ కందిరవి లతో కలిసి మాట్లాడారు. అసోసియేషన్‌లో జరుగుతున్న అవినీతి అక్రమాలతో నైపుణ్యవంతులైన క్రీడాకారులు క్రీడకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్రీడాకారులకు శిక్షణ ఇతర అవసరాల కోసం ఖర్చు చేయాల్సిన నిధులు దుర్వినియోగమయ్యాయని ఆరోపించారు.అసోసియేషన్ లో ఇప్పటికే సుమారు రూ. 2కోట్ల నిధులు దుర్వినియోగమైనట్టు ఆయన ఆరోపించారు. దీనిపై ఇప్పటికే తాము పోలీసులకు ఫిర్యాదు చేశామని చెప్పారు. ప్రతిష్టాత్మకమైన చెస్ అసోసియేషన్‌కు చెడ్డ పేరు తేవడమే కాక నిధుల దుర్వినియోగానికి పాల్పడటం యావత్ చెస్ క్రీడాకారులను తీవ్ర ఆవేదనకు గురి చేస్తున్నదన్నారు.దీంతో ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి నిధులు దారి మళ్ళకుండా చూడాలని ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు.

అడ్డగుట్టలో సీపీఐ(ఎం) బస్తీబాట

నగరంలోని అడ్డగుట్టలో సీపీఐ(ఎం) ఆదివారం బస్తీబాట నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించింది. ఈ సందర్భంగా పలువురు స్థానికులు సీపీఐ(ఎం) బృందానికి స్థానిక సమస్యలను తెలిపారు. వారి గోడును వెల్లబోసుకున్నారు.

- సికింద్రాబాద్ జోన్ కన్వీనర్ అజయ్ బాబు



నవతెలంగాణ-ఓయూ

నగర చివర్లలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కాంప్లెక్స్ లలో కరెంట్ , మంచినీరు, లిఫ్ట్, రోడ్ల సదుపాయం తక్షణమే కల్పించాలని,మధ్యలో ఆగిపోయిన ఇండ్ల నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేసి లబ్దిదారులకు అందించాలని, ఇందిరమ్మ ఇండ్ల లబ్ది దారులను గుర్తించాలని, పేదల ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వ సహాయం తక్షణమే అందించాలని సీపీఐ (ఎం) సికింద్రాబాద్ జోన్ కన్వీనర్ యం.అజయ్ బాబు కోరారు. పార్టీ పిలుపు మేరకు 2వరోజు అడ్డ గుట్టలో సీ సెక్షన్‌లో బస్తీబాట కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలని, కార్డుల మీద సన్న బియ్యం ఇవ్వాలని కోరారు. 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ అర్హులందరికీ అమలు చేయాలని, రూ. 500కే గ్యాస్ సిలిండర్ అందించాలన్నారు. ప్రభుత్వం చెప్పినట్టుగా వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు పింఛన్లు పెంచి వెంటనే ఇవ్వాలి వెంటనే ఇవ్వాలన్నారు.

బస్తీలో కలుషిత మంచినీరు, ప్రెషర్ వాటర్ తక్కువ సమయం ఇవ్వడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రయినేజీ సమస్యతో, రోడ్లన్నీ గుంతల మయంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోడ్లమీద డ్రయినేజీ పారడం గల్లీలలో పారడం నిత్య కతంగా మారిందన్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో గల్లి గల్లిన డ్రయినేజీ నీరుతో స్థానికులు అనారోగ్యాలకు గురవు తున్నట్టు తెలిపారు.కరెంట్ పలుమార్లు పోవడం వల్ల, పిల్లలు మహిళలు వద్దులు ఇబ్బంది పడుతు న్నారన్నారు. అడ్డగుట్ట బి సెక్షన్ లో పై సమస్యలతో పాటు అదనంగా మసీదు ముందు ఏరియా వర్షం నీరుతో నిండిపోతున్నదన్నారు. ఇండ్లలోకి వర్షం నీరు వస్తోందన్నారు. వచ్చే వరదలతో పాటు డ్రయినేజీ వాటర్ రావడం వల్ల మురికి కంపు కొడు తోందన్నారు. వర్షం వస్తే డ్రయినేజీ నీరు ఇండ్లల్లోకి వస్తుందని... ఎన్నిసార్లు అధికారులకు, రాజకీయ నాయకులు విన్నవించుకున్నా నిర్లక్ష్యంగా ఉన్నార న్నారు.సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఐ(ఎం) విజ్ఞప్తి చేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్. మల్లేష్, షేక్ ఫాతిమా, నర్సింగ్ రావు, ఎండీ పాషా, శంషాద్ బేగం, ఎండీ పాషా, మోహన్ బి. శ్రీనివాస్, ఎస్ జ్యోతి. శ్రీలత,పాల్గొన్నారు.



డిప్యూటీ మేయర్‌ను కలిసిన ఓయూ పరిధిలోని 6వ నెంబర్ క్యాంపు నివాసులు

నవతెలంగాణ-ఓయూ

కాలనీలోని పలు సమస్యలు సమస్యలు పరిష్కరించాలని ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఆరవ నెంబర్ క్యాంపు వాసులు ఆదివారం తార్నాక డివిజన్ లో డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు మోతె శోభన్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసారు.ఈ సందర్భంగా తమ ప్రాంతంలోని విద్యుత్, పారిశుధ్య, డ్రయినేజీ సమస్యల్ని పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు డిప్యూటీ మేయర్ స్పందిస్తూ వీలైనంత త్వరలో సంబంధిత అధికారులతో కలిసి పర్యటించి సమస్యలు పరిష్కారం అయ్యేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తూ, కృతజ్ఞతలు తెలిపారు.



ఖాజాగూడలో సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ప్రారంభం

నవతెలంగాణ-బేగంపేట్

తమ అభిమాన కస్టమర్ల జీవన శైలిలో వస్తున్న మార్పులకు అనుగుణమైన షాపింగ్ అవసరాలను తీర్చే దిశగా సౌత్ ఇండియా షాపింగ్ మాల్ వారు హైదరాబాద్ ఖాజగూడలో వారి 34వ షోరూమ్‌ను ప్రారంభించారు. కుటుంబంలోని అన్ని తరాల వారి అభిరుచులను దష్టిలో ఉంచుకుని వైవిధ్యభరిత వస్త్ర శ్రేణిని అందుబాటులోకి తీసుకువచ్చి, ఆహ్లాదకరమైన షాపింగ్ అనుభూతిని అందించే సౌత్ ఇండియా షాపింగ్ మాల్ వారి సరికొత్త షోరూమ్‌ను ప్రముఖ టాలీవుడ్ తార కుమారి అనుపమ పరమేశ్వరన్ జులై 7న శుభారంభం చేశారు. 'ఆషాఢమాసం నెంబర్ కిలో సేల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ " ఖాజగూడ లోని సౌత్ ఇండియా షాపింగ్ మాల్ వారి 34వ షోరూమ్ ఇక్కడ స్థానికంగా నివసిస్తున్న అన్ని తరాల, తరగతుల కుటుంబ సభ్యుల అభిరుచులకు అనుగుణమైన షాపింగ్ అవసరాలను తీర్చగలదని ఆశిస్తున్నాను. ఖాజగూడ వాసులు పండుగలకు, శుభకార్యాలకు ఇక్కడికి విచ్చేసి సౌత్ ఇండియా షాపింగ్ మాల్ వారి విక్రయ సేవలను, అత్యంత ఆకర్షణీయమైన తూకం పద్ధతిలో శారీస్ అమ్మకం అతి తక్కువ ధరలకే కొనవచ్చు. అన్ని రకాల వెరైటీ వస్త్రాలపై 66 శాతం వరకు డిస్కౌంట్ వంటి ఆఫర్లను తప్పక వినియోగించుకోగలరు' అని అన్నారు. అనంతరం సౌత్ ఇండియా షాపింగ్ మాల్ డైరెక్టర్ సురేశ్, అభినయ్, రాకేష్ ప్రెస్, కేశవ వారు మాట్లాడుతూ తమ అభిమాన కస్టమర్ల విస్తత షాపింగ్ అవసరాలను, వారి సంపూర్ణ సంతప్తిని దష్టిలో ఉంచుకుని తమ సంస్థ ప్రవేశపెడుతున్న వివిధ రకాల ఆఫర్లు, వైవిధ్యభరిత వస్త్రాభరణ శ్రేణి, తెలుగు రాష్ట్రాలలో చేపట్టబోతున్న భారీవిస్తరణ మొదలైన అంశాలను వివరించారు. ప్రతీ అంశంలోనూ నాణ్యతకు, విశ్వసనీయతకు పెద్ద పీట వేస్తూ, అంకితభావంతో కృషి చేయటం, పోటీ ధరలతో వస్త్రాభరణాలను అందించటంలో ముందుండటం తమ సంస్థ ధ్యేయమని పేర్కొన్నారు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయాలను, వివిధ రకాల పండుగలు, శుభకార్యాలను దష్టిలో ఉంచుకుని ఇప్పుడు భారీ డిస్కౌంట్‌తో సరికొత్తగా అతి పెద్ద ఆషాఢం సేల్ ను ప్రారంభించామని అన్నారు.

పేదలకు చేయూతనందించడం అభినందనీయం



- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ-బేగంపేట్

పేదలకు చేయూతను అందించడం అభినందనీయమని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం రాంగోపాల్ పేట డివిజన్ నల్లగుట్టకు చెందిన లక్ష్మికి ప్రైమ్ రి హబ్ సొల్యూషన్స్ కు చెందిన డైరెక్టర్ డాక్టర్ హారిక రూ. 22 వేల విలువైన వినికిడి పరికరాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా వెస్ట్ మారేడ్ పల్లిలోని నివాసంలో అందజేశారు. మక్తాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన హెల్త్ క్యాంపు లో వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు... లక్ష్మికి వినికిడి లోపం ఉందని, సమస్య పరిష్కారం కోసం వినికిడి యంత్రాన్ని వినియోగించాలని సూచించారు. ఆర్థికంగా అంత స్థోమత లేని లక్ష్మికి ప్రైమ్ రి హబ్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో వినికిడి యంత్రం అందజేసేందుకు ముందుకొచ్చి అందజేయడం పట్ల డాక్టర్ హారిక ను ఎమ్మెల్యే ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాంగోపాల్ పేట డివిజన్ అధ్యక్షుడు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, మక్తాల ఫౌండేషన్ అధ్యక్షుడు జలందర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

బస్తీల్లో పర్యటించిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ ఆదివారం బస్తీలలో పర్యటించారు. ఒకటో వార్డు లోని సంజీవయ్య వీకర్ సెక్షన్‌లో స్థానికులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. చిన్న తోకట సంజీవయ్య నగర్ బస్తీ లోని శ్రీదేవి పోచమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. సంజీవయ్య నగర్‌లో కమ్యూనిటీ హాల్ ని పరిశీలించారు. బస్తీ వాసులందరూ కలసి బస్తీ సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డ్రయినేజీ సమస్య, రోడ్ల ,నీటి సమస్యలన్నింటినీ పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జంపన్న ప్రతాప్,ఆనంద్ బాబు, బాణాల శ్రీనివాస్ రెడ్డి,ముప్పిడి మధుకర్,బలవంత్ రెడ్డి, హరికష్ణ,మారుతి, తదితరులు పాల్గొన్నారు అనంతరం బొల్లారంలోనిరాష్ట్ర మేకర్ సంఘం వారు ఏర్పాటు చేసిన సమావేశానికి ఎమ్మెల్యే హాజరయ్యారు వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అలాగే కమిటీ హాల్ నిర్మాణం ప్రహరీ కూడా తదితర సౌకర్యాలు కల్పిస్తామని.. ఇంకా బొల్లారం హాస్పిటల్ లో సౌకర్యాలను మెరుగుపరుస్తామనిస్థానికులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సమానత్వం, సమాజహితమే ఎమ్మార్పీఎస్ ఉద్యమ ఆశయం

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవింద నరేష్
- ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఓయూలో ఘనంగా మందకష్ణ మాదిగ జన్మదిన, ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-ఓయూ

సమాజ హితం కోసం సామాజిక , ఆర్థిక, రాజకీయ అసమానతలను నిర్మూలించి సమానత్వం సాధించడమే ఎమ్మార్పీఎస్ ఆశయమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవింద నరేష్ మాదిగ అన్నారు. ఆదివారం సికింద్రాబాద్ జాతీయ కార్యాలయంలో ,ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకష్ణ మాదిగ జన్మ దిన వేడుకలను ఎంఎస్ఎఫ్ ఓయూ అధ్యక్షులు మంద రాజు మాదిగ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మంద కష్ణ మాదిగ పుట్టిన రోజు కేక్ ను కట్ చేశారు.

అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవింద నరేష్ మాదిగ, ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షులు సి.యచ్. సోమశేఖర్ మాదిగ, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ మాదిగలు మాట్లాడారు. పాలకుల కుట్రలను చేధిస్తూ ఉద్యమ ద్రోహుల వెన్నుపోట్లను భరిస్తూ, స్వార్థపరుల కల్పించే అడ్డంకులను ఎదుర్కొంటూ ఎమ్మార్పీఎస్ ఉద్యమం 30 ఏండ్లుగా సజీవంగా నిలబడిందంటే మంద కష్ణ మాదిగ సమర్థవంతమైన నాయకత్వమే కారణమన్నారు.75 ఏండ్ల స్వతంత్ర్య భారతదేశంలో సుదీర్ఘంగా నడుస్తున్న అతి పెద్ద ఏకైక సామాజిక ఉద్యమం ఎమ్మార్పీఎస్ మాత్రమే అని అన్నారు. ఇన్నేండ్ల పోరాటంలో మాదిగ జాతికి ఆత్మగౌరవం, అస్థిత్వం, గుర్తింపుతో పాటు మొదటి దశలో ఎస్సీ వర్గీకరణ సాధించడం ద్వారా 25 వేల ఉద్యోగాలను ఎమ్మార్పీఎస్ అందించిందని అన్నారు. మానవతా దక్పథంతో గుండె జబ్బుల చిన్నారుల కోసం, వికలాంగులు వద్దులు వితంతువుల కోసం, తెలంగాణ అమరవీరుల కోసం, హత్యలకు లైంగికదాడులకు గురైన మహిళల కోసం ఇలా ఎన్నో పోరాటాలు చేసి వారి సమస్యలు పరిష్కరించడం జరిగిందన్నారు.మాదిగల కోసమే పోరాటం ప్రారంభించినా అన్ని వర్గాల సంక్షేమం కోసం పోరాటం చేస్తుందని తెలిపారు. సమాజంలో నెలకొని ఉన్న సామాజిక ఆర్థిక రాజకీయ అసమానతలను రూపుమాపి సాంఘిక సమానత్వం సాధించడమే ఎమ్మార్పీఎస్ ఉద్యమ గమ్యమని, సమాజహితం కోసం పునరంకితం అవుతామన్నారు. 29 ఏండ్లుగా ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని గుండెల్లో పెట్టుకొని కాపాడుకుంటున్న మాదిగ ప్రజలకు ఉద్యమానికి అండదండలు అందించిన అన్ని వర్గాల ప్రజలకు కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి పల్లెర్ల సుధాకర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామారపు శ్రీనివాస్ మాదిగ,రాష్ట్ర కార్యదర్శి బైరపోగు శివకుమార్ మాదిగ,విద్యార్థి సంఘాల నాయకులు వలిగొండ నరసింహ,వేల్పుల సంజయ్,జంగిలి దర్శన్, కోలపూరి చంద్రశేఖర్,వేదాంత్ మౌర్య, రమేష్ యాదవ్,మధు యాదవ్, ఎంఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు జన్నపాల మహేష్ మాదిగ,రాష్ట్ర సీనియర్ నాయకులు యడవెల్లి అజయ్ మాదిగ, నాగేంద్రం మాదిగ తదితరులు పాల్గొన్నారు.



బీఎస్పీ తమిళనాడు అధ్యక్షుడి హత్యను ఖండిద్దాం

- బహుజన విద్యార్థి సంఘాల నాయకులు

నవతెలంగాణ-ఓయూ

బీఎస్పీ తమిళనాడు అధ్యక్షుడు ఆర్మ్ స్ట్రాంగ్ హత్యను నిరసిస్తూ ఆదివారం ఓయు ఆర్ట్స్ కాలేజ్ వద్ద బహుజన్ స్టూడెంట్ జేఏసీ చైర్మెన్ అండ్ బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వేల్పుల సంజయ్ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. బహుజన నాయకుని హత్యను దేశవ్యాప్తంగా బహుజన సమాజం మొత్తం ఖండించాలని, బలహీన వర్గాలకు రాజ్యాధికారమే లక్ష్యంతో పోరాడుతున్న నాయకుడు ఆర్మ్ స్ట్రాంగ్ హత్య చేయడం దుర్మార్గమైన చర్యగా భావిస్తూ, దుండగులను కఠినంగా శిక్షించాలని, సీబీఐచే విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు ఎంఎస్ఎఫ్ నాయకులు కొమ్ము శేఖర్ అజయ్, ప్రవీణ్, రాజు, టీఎస్పీ చైర్మన్ చంద్రశేఖర్, డీబీఎస్ఏ నాయకులు జంగిలి దర్శన్, తగరపు నవీన్, భాస్కర్ , యుగంధర్, ప్రవీణ్,హరీష్ రవికుమార్, కృష్ణ, పాల్గొన్నారు.



జాతీయ చేనేత పట్టు వస్త్ర ప్రదర్శన ప్రారంభం

నవతెలంగాణ-బంజారాహిల్స్

జాతీయ చేనేత పట్టు వస్త్ర ప్రదర్శన ప్రారంభోత్సవం సందర్భంగా ఆదివారం బంజారా హిల్స్ శ్రీనగర్ కాలనీ సత్య సాయి నిగమాగమంలో ఏర్పాటుచేసిన ప్రదర్శనకు ప్రముఖ యూట్యూబర్, ఫన్ బకెట్ నాగ భార్గవి హాజరై చేనేతకారులను అందరూ ప్రోత్సహించాలని తెలియజేస్తూ నిర్వాహకులు జయేష్‌తో కలిసి ప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. భారతీయ సంస్కతిలో పట్టు,హ్యాండ్ లూమ్ వస్త్రో ఉత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందని, ఈ ఉత్పత్తులకు నేటికి వన్నె తగ్గలే దన్నారు. నేటి తరం యువతలో కూడా హ్యాండ్ లూమ్ ఉత్పత్తులను ఎంతో ఆదరిస్తు న్నారన్నారు . ప్రతి ఒక్కరూ చేనేత ను మరింత ఆదరించాలన్నారు. నిర్వాహకులు జయేష్ గుప్తా మాట్లాడుతూ... ఈ నెల 14వ తేదీ వరకు కొనసాగనున్న ప్రదర్శన లో దేశం లోని 14 రాష్ట్రాల నుంచి చేనేత కారులు , చేతి పని బందాలు తమ సిల్క్ హ్యాండ్ లూమ్ చీరలు, డ్రెస్ మెటీరియల్ వంటి 75 వేల రకాల వస్త్రో ఉత్పత్తులను అందుబాటులో ఉంచారని వివరించారు.

'ఎస్ఐను పొట్టనపెట్టుకున్న వారిని శిక్షించాలి'

నవతెలంగాణ-ఓయూ



భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట ఎస్ఐ శ్రీరాములు శ్రీనివాస్‌ను పొట్టన పెట్టుకున్న వాళ్లను కఠినంగా శిక్షించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని అల్ మాల స్టూడెంట్ అసోసియేషన్ ఉస్మానియా యూనివర్సిటీ అధ్యక్షులు నామ సైదులు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో ఒక పోలీస్ ఆఫీసర్ జీవితానికే గ్యారంటీ లేకుంటే సామన్యుల పరిస్థితి ఏంటి అని అన్నారు. ఇది ముమ్మాటికి ప్రభుత్వ హత్యేనన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెంటనే స్పందించి కులాంకర దోషులైన సీఐ జితేందర్ రెడ్డి, కానిస్టేబుల్లు, సన్యాసి నాయుడు,శుభాని, శేఖర్,శివ నాగరాజులను వెంటనే విధులు నుంచి తొలగించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'యశోద'లో అంతర్జాతీయ కాన్ఫరెన్స్ విజయవంతం



నవతెలంగాణ-బేగంపేట్

యశోద హాస్పిటల్స్ హైటెక్-సిటీలో 'ఐబీడీ (ఇన్ఫ్లమేటరీ బోవేల్ డిసీజ్)' చికిత్సలో అందుబాటులోకి వచ్చిన పురోగతులపై ఆదివారం నిర్వహించిన "అంతర్జాతీయ కాన్ఫరెన్స్ అండ్ లైవ్ వర్క్ షాప్" విజయవంతమైంది. ఈ అంతర్జాతీయ కాన్ఫరెన్స్ అండ్ లైవ్ వర్క్ షాప్ లో "ఇన్‌ఫ్లమేటరీ బ్వోటల్ డిసీజ్" చికిత్సలో అందుబాటులోకి వచ్చిన అత్యాధునిక వైద్య విదానాలను జాతీయ, అంతర్జాతీయ వైద్య నిపుణులతో ప్రత్యక్ష వర్క్ షాప్ అండ్ ఇంటరాక్టివ్ శిక్షణా సెషన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన 300 మందికి పైగా జాతీయ, అంతర్జాతీయ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యశోద గ్రూప్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్, డాక్టర్. జి.యస్. రావు మాట్లాడుతూ... నాణ్యమైన వైద్యం అందించేందుకు యశోద హాస్పిటల్స్ ఇలాంటి అంతర్జాతీయ సదస్సును నిర్వహించడం గర్వించదగ్గ విషయమన్నారు. ఐబీడీ (ఇన్ఫ్లమేటరీ బోవేల్ డిసీజ్) ప్రపంచవ్యాప్తంగా, ముఖ్యంగా భారతదేశంలోని దక్షిణాన వేగంగా పెరుగుతున్న ఇన్‌ఫ్లమేటరీ ప్రేగు వ్యాధి. భారతదేశంలో గత దశాబ్ద కాలంలో ఐబిడి కేసులు గణనీయంగా పెరిగాయన్నారు. ప్రపంచ వ్యాప్తంగా చూస్తే ప్రస్తుతం భారతదేశంలోనే అత్యధిక సంఖ్యలో ఐబీడీ కేసులు నమోదవుతున్నయన్నారు. రెగ్యులర్ లైఫ్ స్టైల్‌తో పాటు ఒత్తిడి స్థాయిలను తగ్గించుకోవడం వల్ల ఐబీడీ పేషెంట్లు వారి కొన్ని ఇబ్బందికర లక్షణాలను అధిగమించడానికి సహాయపడుతుందని యశోద గ్రూప్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్, డాక్టర్. జి.యస్. రావు తెలిపారు.

యశోద హాస్పిటల్స్ సోమాజిగూడ సీనియర్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్, ఐబిడి స్పెషలిస్ట్ డాక్టర్ కిరణ్ పెద్ది మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల్లో ఐబీడీ చికిత్సలో అత్యాధునిక చికిత్స విధానాలు అందుబాటులోకి వచ్చాయని, కొత్త మందులు, బయోలాజికల్ ఏజెంట్ల లభ్యతతో, ముందుగానే గుర్తించి చికిత్స చేస్తే, 90 శాతం కంటే ఎక్కువ మంది రోగులలో మంచి స్పందన సాధించవచ్చని వివరించారు. అంత: దృష్టితో కూడిన చర్చలు, సంచలనాత్మక పరిశోధన ప్రదర్శనలు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న నిపుణులను ఒకచోట చేర్చి అంతర్జాతీయ ఇన్‌ఫ్లమేటరీ బ్వోటల్ డిసీజ్ కాన్క్లేవ్ అద్భుతమైన విజయంతో నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్ లో పరిశోధన, రోగ నిర్ధారణ, చికిత్స అంతర్జాతీయ ఐబీడీ కాన్క్లేవ్ 1.0లో మేము చూసిన అద్భుతమైన స్పందన అని సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్, ఐబీడీ స్పెషలిస్ట్, సింపోజియం ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ కిరణ్ పెద్ది, అన్నారు. ఈ సింపోజియంలో 300 మందికి పైగా జాతీయ, అంతర్జాతీయ గ్యాస్ట్రోఎంటరాలజిస్టులు, సర్జన్లు ఈ సదస్సుకు హాజరుకావడంతో కార్యక్రమం విజయవంతమైంది. ఈ సదస్సుకు హాజరైనవారిలో ప్రముఖ అంతర్జాతీయ అధ్యాపకులు ఆస్ట్రేలియాకు చెందిన డాక్టర్ జాకోబ్ బెగస్ మరియు డాక్టర్ యూన్-క్యో ఆన్, సింగపూర్‌లోని ఏపీఏజీఈ ప్రెసిడెంట్ డాక్టర్ సీజే ఓయి, యూకే నుండి డాక్టర్ చార్లీ లీస్, డాక్టర్ షాజీ సెబాస్టియన్, యునైటెడ్ స్టేట్స్ నుండి డాక్టర్ దీపక్ పరక్కల్ ఉన్నారు.

ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఘటోత్సవం ప్రారంభం





నవతెలంగాణ-బేగంపేట

సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఘటోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. మహంకాళి దేవాలయం నుంచి కర్బలా మైదానం వద్దకు చేరుకోగా ఘటం ముస్తాబు చేసి అక్కడి నుండి నేరుగా ఉజ్జయిని మహంకాళి అమ్మవారి దేవస్థానానికి చేరుకుంటుంది. మహంకాళి దేవాలయంలో ఘటం పూజా కార్యక్రమంలో దేవదాయశాఖ మంత్రి కొండ సురేఖ, మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ గద్వాల విజయలక్ష్మి, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, దేవదాయ కమిషనర్ హనుమంతరావు, అడిషనల్ కమిషనర్ జ్యోతి ఘటం సంబంధించిన పూజలు నిర్వహించారు. అనంతరం పోతురాజుల విన్యాసాలు శివసత్తుల కోలాటాలు ఆకర్షణగా నిలిచాయి. మంత్రి కొండా సురేఖ పోతరాజులతో ఫోటో దిగారు. డివిజన్ అధ్యక్షుడు మల్లికార్జున్, దేవదాయ కమిషనర్ హనుమంతరావు దేవాలయంలో నత్యం చేశారు. ఆలయ ఈవో మనోహర్ రెడ్డి మంత్రులను శాలువాలతో సత్కరించారు. ఈసారి జాతర బ్రహ్మాండంగా జరుగుతుందని భక్తులకుఎటువంటి ఇబ్బందులు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని మంత్రులు తెలిపారు. దేవాలయంలో క్యూలైన్లను పరిశీలిస్తున్న నార్త్ జోన్ డీసీపీ సాధన రష్మి పెరమాల్, ఈవో మనోహర్ రెడ్డి, ఇన్స్పెక్టర్ పరశురాం, దర్శనం క్యూలైన్లు ఎలా వెళ్తాయి. భక్తుల ఎటు వైపు నుండి బయటికి వెళ్తారు. వివరాలు తెలుసుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు.





తీర్థ యాత్రలకు వెళ్లొచ్చేసరికి ఇల్లు గుల్లా..



నవతెలంగాణ-బోడుప్పల్

తీర్థ యాత్రలకు వెళ్ళి వచ్చే సరికి సదరు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని బంగారం, నగదు, వెండి చోరీకి గురైన సంఘటన మేడిపల్లి పీఎస్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. మేడిపల్లి డిటెక్టివ్ ఎస్ఐ లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని గ్రీన్ సిటీ కాలనీలో నివాసం ఉంటున్న బత్తుల రమేష్ కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 3న తీర్థ యాత్రలకు వెళ్లాడు. ఆదివారం ఉదయం 7 గంటల సమయంలో తిరిగి వచ్చే సరికి ఇంటి తాళాలు పగుల కొట్టి ఉండడంతో లోపలికి వెళ్లి చూడగా బీరువా తాళాలు పగుల కొట్టి అంత చిందరవందరగా ఉండడంతో వెంటనే 100కు డయల్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. బాధితుల ఫిర్యాదు మేరకు సంఘటన స్థలానికి పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బీరువాలోని నాలుగు తులాల బంగారం, కొంత నగదు, వెండి వస్తువులు చోరీకి గురైనట్టు ఇంటి యాజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

పోచమ్మ ఆలయ వార్షికోత్సవానికి హాజరైన మైనంపల్లి



నవతెలంగాణ-అల్వాల్

సాయి రెడ్డి నగర్ కాలనీలో పోచమ్మ తల్లి దేవాలయం ఆరో వార్షికోత్సవ ఉత్సవాలకు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు హాజరయ్యారు.వారికి ఆలయ నిర్వాహకులు సాదరంగా స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు. అమ్మ ఆశీస్సులు ఉండాలని కాలనీ కమిటీ మెంబర్లు అమ్మవారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో సాయి రెడ్డి నగర్ కాలనీ ప్రెసిడెంట్ దిలీప్, వైస్ ప్రెసిడెంట్ శ్రీలత రెడ్డి, జనరల్ సెక్రెటరీ విజయకుమార్, సహదేవుడు, ప్రతాపరెడ్డి, దివ్యవాణి, సంతోష రెడ్డి, లక్ష్మారెడ్డి, సాగర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, ఆలయ పంతులు నాగేశ్వర సాయి శర్మ, భక్తులు పాల్గొన్నారు.

అటు బోనాలు.. ఇటు మొహర్రం

- పాతబస్తీలో ఒకే సారి జంట పండుగలు..
- నేటి నుంచి షియా ముస్లింల సంతాప దినాలు..
- ఏర్పాట్లలో జీహెచ్ఎంసీ, విద్యుత్, జలమండలి..
- పోలీసుల ప్రత్యేక నిఘా, బందోబస్తు..



నవతెలంగాణ - ధూల్‌పేట్

నగరంలో ఒకే సారి జంట పండుగలతో పాతబస్తీలో పండగ వాతావరణం సంతరించుకుంది. అటు బోనాలు.. ఇటు మొహర్రం.. ఈ మాసంలో కలిసి వచ్చాయి. దీంతో జీహెచ్ఎంసీ, విద్యుత్, జల మండలి అధికారులు తగిన ఏర్పాట్లు కల్పిస్తున్నారు. ఇక్కడ ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో పండుగలు నిర్వహించేలా బందోబస్తు చర్యలు చేపట్టారు.

ఉత్సవాలు..

ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలతో ఆదివారం గోల్కొండ బోనాలు ఘనంగా జరిగాయి. దీంతో పాతబస్తీలో బోనాల పండగ వాతావరణం నెలకొంది. శనివారం నెలవంక కనిపించకపోవడంతో సోమవారం నుంచి మొహర్రం సంతాప దినాలు మొదలవుతున్నాయి. ఈ నెల 29 వరకు ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలతో నగరమంతా ఆధ్యాత్మిక వాతావరణం ఏర్పడుతుండగా.. మరో వైపు షియా ముస్లింలు సంతాప దినాలను కొనసా గించనున్నారు. దీంతో రెండు ఆధ్యాత్మిక కార్య క్రమాలకు నగరం వేదిక కానుంది. మొహర్రం సం తాప దినాలతో పాటు బోనాల ఉత్సవాలు ఒక రోజు తేడాతో కలిసి వస్తున్నాయి. నెల రోజుల పాటు బోనాల ఉత్సవాలు కొనసాగనుండగా.. మొహర్రం సంతాప దినాలు 68 రోజులు జరుగను న్నాయి.

నిజాం కాలం నుండి..

నగరంలో ఏ ఉత్సవాల నైనా ఇరు వర్గాల ప్రజలు కలిసి మెలసి నిర్వహిం చుకోవడం నిజాం కాలం నుంచి ఆనవాయితీగా వస్తోంది. హిందూ, ముస్లింల ఐక్యతను చాటి చెప్పే విధంగా నగరంలో ఉత్సవాలు జరుగుతాయి. పండుగలు ప్రారంభానికి నెల రోజుల ముందు నుండే ఇరు వర్గాల కమిటీల, పెద్దలతో చర్చలు నిర్వహించారు. సామరస్యంగా పండుగలు జరుపుకునే విధంగా కావలసిన సౌకర్యాలు, ఏర్పాట్లకు కృషి చేస్తారు. దీంతో ఎక్కడ ఎవరికి ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఎప్పటికప్పుడు స్పందించడానికి జీహెచ్ఎంసీ, పోలీసులు, జల మండలి, విద్యుత్ విభాగాల అధికారులు ఇప్పటికే తగిన ఏర్పాట్లు చేశారు.

నేటి నుంచి మొహర్రం సంతావ దినాలు..

హజ్రత్ ఇమాం హుస్సేన్ ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ షియా ముస్లిం ప్రజలు నిర్వహించే సం తాప దినాలు ఈ నెల 6న ఆకాశంలో నెల వంక కని పించకపోవడంతో ఈనెల 8 నుంచి మొహర్రం సం తాప దినాలను డబీర్ పుర దర్గాలో ప్రారబిస్తారు. డబీర్ పుర అలావాలో ఆలంలను ప్రతిష్ఠించి 1వ మొహర్రం నుంచి 10వ మొహర్రం వరకు మజ్లిస్, మాతం నిర్వహిస్తారు. ఆకాశంలో నెల కనిపించిన వెంటనే మరుసటి రోజు సంతాప దినాల్లో పాల్గొంటారు. సంతావ దినాల్లో భాగంగా పాతబస్తీ వీధుల్లో అంబారీతో 10వ మొహర్రం సామూహిక ఊరేగింపు కొనసాగిస్తారు.

పోలీసుల బందోబస్తు..

జంట పండుగలతో పాతబస్తీ సౌత్ జోన్, ఈస్ట్ సౌత్, వెస్ట్ సౌత్ జోన్ ల డీసీపీ ల పర్యవేక్షణలో ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. ముందస్తుగా సున్నిత, అతి సున్నిత ప్రాంతాల్లో ప్రత్యేక బలగాలతో నిఘా ఏర్పాట్లు నిర్వహించారు. ప్రశాంత వాతావరణంలో పండుగలు ఇరు వర్గాలు జరుపుకునేలా తగిన జాగ్రత్త చర్యలు చేపట్టారు.



పాతబస్తీలో విద్యుత్ అధికారుల విధులకు ఆటంకం

- విద్యుత్ చౌర్యంపై అడ్డుకున్న స్థానికులు

నవతెలంగాణ - ధూల్ పేట్

విద్యుత్ చౌర్యం తేల్చేందుకు వెళ్లిన విద్యుత్ అధికారులకు పాతబస్తీలో చేదు అనుభవం ఎదురైంది. విద్యుత్ చౌర్యంపై విధులు నిర్వహి స్తున్న అధికారులను స్థానికులు అడ్డుకుని, విధులను ఆటంకం కలిగించారు. పాతబస్తీ మీరాలం ఏఈ పరిధిలో గుంటల్ షా బాబా దర్గా ప్రాంతంలో విద్యుత్ చౌర్యంపై విజిలెన్స్ అధికారు లు స్థానిక విద్యుత్ అధికారులతో కలిసి ఆదివారం తనిఖీలు చేపట్టారు. చౌర్యానికి గురవుతున్న మీటర్లను తొలగించి వాటి స్థానంలో వేరే మీటర్లను అధికారులు ఫిట్ చేశారు. దీంతో స్థానిక బస్తీ వాసులు విద్యుత్ అధికారులను అడ్డుకున్నారు. విద్యుత్ చౌర్యానికి గురవుతున్న మీటర్లను మాత్రమే తొలగిస్తున్నామని అధికారులు చెప్పినా స్థానికులు వినకపోవడంతో అధికారులు చేసేదేమీ లేక వెను తిరిగారు.

- మళ్లీ ఫిట్..

విద్యుత్ చౌర్యానికి గురౌతున్నా మీటర్ల ను తొలగించి కొత్త మీటర్లు వేస్తే మళ్ళీ పాత మీటర్లు





పెట్టేంత వరకు ఆటంక పరిచారు. ఒకానొక దశలో విద్యుత్ అధికారుల పై దాడి చేసేంతగా అడ్డుకున్నారు. తొలగించిన మీటర్ల స్థానంలో తిరిగి పాత మీటర్లను ఏర్పాటు చేయించుకు నేంతవరకు అధికారులను కదలనీయలేదు. విద్యుత్ చౌర్యానికి గురవుతున్న మీటర్లను మాత్రమే తొలగిస్తున్నామని అధికారులు చెప్పిన ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో అధికారులు వెనుదిరిగారు.

విద్యుత్ అధికారులకు సహకరించాలి - డీఈ లింగయ్య

గుంటల్ షా బాబా దర్గా ప్రాంతంలో విద్యుత్ చౌర్యాన్ని నివారించేందుకు వెళ్లిన అధికారులను స్థానికులు అడ్డుకోవడం పై డీఈ లింగయ్య స్పందిస్తూ వినియోగదారులు విద్యుత్ అధికారు లకు సహకరించాలన్నారు. కొన్ని ప్రాంతాలలో విద్యుత్ చౌర్యం జరుగుతున్నట్లుగా గుర్తించి తనిఖీలు చేపట్టామన్నారు. విద్యుత్ అధికారులను అడ్డుకుంటూ వారి విధులకు ఆటంకం కలిగిస్తే విద్యుత్ యాక్ట్ ప్రకారం చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. వినియోగదారులకు విద్యుత్ సమస్యలు ఏమైనా ఉంటే నేరుగా తమను కానీ తమ సిబ్బందిని కానీ కలిస్తే సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అడ్డుకోవడం, విధులను అంటంక పరచడం సరికాదన్నారు. విద్యుత్ శాఖను అదానీ, అంబానీలకు అప్పగించడంతో వారు పాతబస్తీలో దొంగ కరెంటును అరికట్టేందు కు చర్యలు తీసుకుంటున్నారని వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదన్నారు. ఆదివారం చేపట్టిన తనిఖీలు విద్యుత్ అధికారులు సిబ్బంది మాత్రమే నిర్వహించారన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నవ తెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ జిల్లాలోని సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని భారతీయ జనతా మజ్దూర్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు సంతోష్ వేలూరి ప్రభుత్వాని కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మేడ్చల్ పారిశ్రామికవాడ,ఇతర ప్రాంతాల్లోని పరిశ్రమలలో 100 నుండి రెండు వేలమంది వరకు కార్మికులు పనిచేస్తున్న కేవలం కొద్దిమందికి మాత్రమే పీఎఫ్,ఈఎస్ఐ సౌకర్యం కల్పిస్తున్నారని అన్నారు. యజమాన్యాలు కార్మికులకు కనీస వేతన చట్టాన్ని సైతం అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.8 గంటలకు బదులుగా 12గంటలు పని చేయించుకొని సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం లేదని మండిపడ్డారు.డిజిటల్ యుగంలో సైతం కార్మికులకు నగదు రూపంలోనే జీతాలు చెల్లిస్తున్నారని గుర్తు చేశారు. వీటన్నిటిపై సంబంధిత కార్మిక శాఖ అధికారులు దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వికలాంగులకూ సమాన అవకాశాలు కల్పించాలి

- టీసీపీ వేవ్ సంస్థ యాజమాన్య ప్రతినిధి పవన్ గాది
- కింగ్‌కోఠి ప్రభుత్వాస్పత్రిలో వికలాంగులకు పరికరాలు అందజేత

నవతెలంగాణ-సిటీబ్యూరో

వికలాంగులు కూడా సమాజంలో అందరితో పాటు సమానావకాశాలు పొందాలనీ, అందు కోసం వారిని ఆదుకునేందుకు సహృదయులు ముందుకొస్తే వికలాంగులు ఎన్నో అద్భుతాలు సృష్టించగలరని టీసీపీ వేవ్ సంస్థ యాజమాన్య ప్రతినిధి పవన్ గాది తెలిపారు. టెక్నాలజీని ఉపయోగించి వికలాంగుల జీవితాల్లో మార్పు తేవాలన్నది తమ లక్ష్యమని ఆయన అన్నారు. కృత్రిమ అవయవాల ద్వారా ఇక్కడికొచ్చిన వికలాం గులు పూర్తిస్థాయి ఆత్మవిశ్వాసాన్ని పొందగలి గారనీ, ఇక్కడ అమర్చిన ప్రతి ఒక్క అవయవం వాళ్లందరి సామర్థ్యాలను మరింతగా వెలికితీసేలా ఉందని చెప్పారు. ఈ కార్యక్రమం అందించిన స్ఫూర్తితో మరింతమంది వికలాంగుల జీవితాలను



మార్చగలమన్న నమ్మకం తమకు కుదిరిందని ఆయన అన్నారు. శ్రీ భగవాన్ మహావీర్ వికలాంగ సహాయతా సమితి ఆధ్వర్యంలో గుర్తించిన 50 మంది వికలాంగులకు కత్రిమ కాళ్లు, వీల్‌ఛైర్లు, మూడుచక్రాల సైకిళ్లు, హ్యాండ్ కిట్లు, కాలిపర్స్, వాకర్ల లాంటి వాటిని టీసీపీ వేవ్ సంస్థ సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా అందించారు. కింగ్ కోఠిలోని ప్రభుత్వాస్పత్రిలో ఆదివారం ఉదయం జరిగిన ఈ కార్యక్రమంలో సంస్థ బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ స్వప్న వాయువేగుల మాట్లాడుతూ..పారాలింపిక్స్ లాంటి క్రీడల్లో భారతీయులు ఎంతో ప్రతిభ చూపిస్తున్నారనీ.. వికలాంగులకు కొంత సాయం అందించగలిగితే వాళ్లు సమాజంలో అందరితో సమానంగా ముందుకొచ్చి, గౌరవప్రదమైన జీవితం గడపగలరన్నారు. నిరుపేద నేపథ్యం నుంచి వచ్చిన ఈ 50 మంది సొంతంగా పరికరాలు సమకూర్చుకునే స్థితిలో లేనందున వారిని ఆదుకోవాలని శ్రీ భగవాన్ మహావీర్ వికలాంగ సహాయతా సమితి తమను సంప్రదించగానే వెంటనే ముందుకొచ్చినట్టు ఆమె తెలిపారు. సమితివారే స్వయంగా ఈ కృత్రిమ అవయవా లను తయారు చేసి ఇవ్వడం సంతోషకరమని చెప్పారు. రాబోయే రోజుల్లో 500 మంది వికలాంగులకు ఈ తరహా కృత్రిమ అవయవాలు, వీల్ ఛైర్లు, వాకర్లు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫిక్కి ఐటీ ఛైర్మెన్ మోహన్ రాయుడు, సీనియర్ పాత్రికేయుడు, రాజకీయ విశ్లేషకుడు డాక్టర్ సూరావఝుల రాము, డీసీఎస్ఐ సీఈఓ డాక్టర్ శ్రీరామ్, ప్రముఖ రుమటాలజిస్టు డాక్టర్ హమీద్ హుస్సేన్, సలహాదారు బుచ్చిబాబు, తదితరులు పాల్గొన్నారు.

దౌర్జన్యంగా తమ స్థలాన్ని ఆక్రమించుకుంటున్నారు .. న్యాయం చేయండి

నవతెలంగాణ-కాప్రా


చర్లపల్లి పారిశ్రామికవాడలోని తమ స్థలాన్ని ఆక్రమించుకుంటూ బెదిరింపులకు పాల్పడుతు న్నారని ఆర్ఆర్ ఇంజనీరింగ్ ఇండస్ట్రీస్ నిర్వాహ కులు ఆర్.రవికుమార్ ఆరోపించారు. చర్లపల్లి పారిశ్రామికవాడ ఫేజ్-2 ప్లాట్ నెంబరు 161 సమీపంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. బాలాజీ హీట్ రీడర్స్‌కు 538 గజాల స్థలం ఉందని, అయితే కంపెనీలోని ఓ డైరెక్టర్ జీపీ హోల్డర్ ఆనంద్ వద్ద 450 గజాల స్థలాన్ని వక్రైడ్ గ్లోబుల్ హెల్త్ కేర్ ప్రయివేట్ లిమిటేడ్ 2009లో కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకుందని తెలిపారు. అప్పడికే 50 చదరపు మీటర్ల స్థలం తాము జీపీఓ హోల్డర్ వద్ద తీసుకుని ఫోజిషన్‌లో ఉన్నామని



పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన పత్రాలు తమ వద్ద ఉన్నాయని, అయితే తమ స్థలాన్ని ఆక్రమించుకునేందుకు యాప్రాల్ ప్రాంతానికి చెందిన రాజశేఖర్ రెడ్డి రౌడీలతో వచ్చి జేసీబీతో తమ కంపెనీ ప్రహరీ గోడ కూల్చివేసి దౌర్జన్యం చేస్తున్నాడని ఆరోపించారు. ఈ స్థల వివాదం మల్కాజిగిరి కోర్టులో విచారణలో ఉండగానే తమ స్థలాన్ని ఆక్రమించి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం చర్లపల్లి ఇండస్ట్రీస్ అసోసియేషన్‌కు 30-12-2022 ఫిర్యాదు చేశామన్నారు. సదరు గ్లోబల్ హెల్త్ కేర్ సంస్థ ఎలాంటి ఫొజిషన్ లేకుండానే కొనుగోలు చేసి స్థలం తక్కువగా ఉందంటూ జీపీఓ హోల్డర్ వద్ద యాభై గజాల స్థలానికి సంబంధించిన డబ్బు తీసుకుని ఫొజిషన్‌లో ఉన్న తమ స్థలం ప్రహరీ గోడ కూల్చి వేసి తమ స్థలాన్ని ఆక్రమిస్తోందన్నారు. ఐలా కమిషన్ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే దౌర్జన్యంగా గత ఆదివారం జేసీబీలతో రౌడీలను వెంట బెట్టుకుని తమ స్థలాన్ని ఆక్రమించుకునేందుకు వచ్చారన్నారు. స్థలం సర్వేకు సహకరించకపోగా పక్కనే ఉన్న తమ కంపెనీని మూపిస్తానంటూ బెదిరిస్తున్నారని ఆరోపించారు. సంబంధిత అధికారులు తమకు న్యాయం చేయాలని కోరారు. లేని పక్షంలో న్యాయపరంగా పోలీసు ఉన్నతాధి కారులను ఆశ్రయిస్తామన్నారు.

చిత్ర పరిశ్రమలో జరుగుతున్న అన్యాయాలపై దృష్టి సారించండి

-ముఖ్యమంత్రికి సినీ టీవీ జూనియర్ ఆర్టిస్ట్ యూనియన్,సీఐటీయూ విజ్ఞప్తి..



నవతెలంగాణ - బంజారాహిల్స్

కళా రంగంపై ఆసక్తితో చిత్ర పరిశ్రమలోకి వచ్చి ఆర్థిక దోపిడికి గురవుతున్న జూనియర్ ఆర్టిస్టుల సమస్యలపై దృష్టి సారించాలని సీఎం రేవంత్ రెడ్డికి తెలుగు సినీ అండ్ టీవీ జూనియర్ ఆర్టిస్ట్ యూనియన్ విజ్ఞప్తి చేసింది. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో యూనియన్ నాయకులు కె. ఈశ్వర్ రావు, ఎం.వెంకటేష్,శంకురి రవీందర్‌లు మాట్లాడారు. చిత్ర పరిశ్రమలో వంచనకు గురవుతున్నది జూనియర్ ఆర్టిస్టులేనన్నారు. నిబంధనల ప్రకారం జూనియర్ ఆర్టిస్ట్‌కి రోజుకు రూ.900 చెల్లించాల్సి ఉండగా అది అమలు కావడం లేదన్నారు. సభ్యత్వం లేని వారిని షూటింగ్‌కు పంపుతూ ఏజెంట్లు అందిన కాడికి దోచుకుంటున్నారని ఆరోపించారు. దీంతో అసలైన కళాకారులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. చిత్రపురి కాలనీలో చిత్ర పరిశ్రమకు చెందిన 24 క్రాఫ్స్ వారికి ఇండ్లు కేటాయించాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా ఇతరులకు విక్రయిస్తున్నారని మండిపడ్డారు. దీంతో కళా రంగమే జీవితం అనుకునే కళాకారులకు నిరాశే మిగులుతుందన్నారు. చిత్రపురి కాలనీలో జరుగుత్ను అక్రమాలతో యావత్ సినీ కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. తమ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎస్ కె సుభాని, రాజు, రవి శంకర్, సత్యం, నరేష్, రవి తేజ పాల్గొన్నారు.

12
నవతెలంగాణ
హైదరాబాద్
సోమవారం | జులై 08, 2024 | www.navatelangana.com

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- అబిడ్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎల్ రవికుమార్



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

అబిడ్స్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ ఎల్ రవికుమార్ తెలిపారు. ఆదివారం అబిడ్స్ లోని ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ వాహనదారులు వాహనాల ఫిట్నెస్ సర్టిఫికెట్, పొల్యూషన్ సర్టిఫికెట్, ఆర్‌సీ, వాహనాలకు సంబం ధించిన ఇన్సూరెన్స్ తప్పక కలిగి ఉండాలన్నారు. సంబంధిత పత్రాలు లేనియెడల వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు అప్పగిస్తే కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేస్తామన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ చేసే వాహనదారులు. నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపే వారి వాహనాలను సీజ్ చేస్తామన్నారు. కొత్తగా వచ్చిన చట్టాలను తెలుసుకొని వాటిపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. మీ భద్రతే మాకు ముఖ్యం కాబట్టి ప్రతి వాహనదారుడు కచ్చితంగా నియమ నిబంధనలు పాటించాలని కోరారు.

నాయకులు సమన్వయంతో కలిసి పనిచేయాలి

- పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మణ్ యాదవ్



నవతెలంగాణ-అంబర్‌పేట

ప్రతీ కాంగ్రెస్ నాయకుడు, కార్యకర్త కృషి విభేదాలు పక్కన పెట్టి సమిష్టి కృషితో పార్టీ బలపోతం కోసం కృషి చేయాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మణ్ యాదవ్ అన్నారు. ఇటీవల ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన తోలుపునూరి కృష్ణ గౌడ్ ఆదివారం మర్యాద పూర్వకంగా ఆర్ లక్ష్మణ్ యాదవ్‌ను కలిశారు. ఇరువురు ఒకరికి ఒకరు సన్మానించుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అందే విధంగా ప్రతి కార్యకర్త, నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిసీసీ కార్యదర్శి లకుపతి యాదగిరి గౌడ్, లేబర్ బోర్డ్ వైస్ ఛైర్మెన్ నాగభూషణం తదితర నాయకులు పాల్గొన్నారు.

గోల్కొండ జగదంబ అమ్మవారికి బంగారు బోనం



నవతెలంగాణ-ధూల్‌పేట్/చాంద్రాయణగుట్ట

భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో గోల్కొండ శ్రీ జగదాంబ అమ్మవారికి ఆదివారం తొలి బంగారు బోనం సమర్పించారు. మేళ తాళాలతో అమ్మవారికి బంగారు బోనాన్ని జోగిని శ్యామల నృత్యం చేస్తూ భక్త జనుల సందోహలతో బయలు దేరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి దేవాలయంలో ఊరేగింపు ఉత్సవ కమిటీ చైర్మెన్ గాజుల అం జయ్య ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. కార్యక్రమంలో బంగారు మైసమ్మ గుడి చైర్మెన్ మధు యాదవ్, జగదాంబ టెంపుల్ చైర్మెన్ రాకేష్ తివారి, వెంకటేష్, ఉప్పుగూడమహంకాళి దేవాలయం చైర్మెన్ జనగామ మధుసూదన్, కేఎస్ ఆనంద్, బేల మాతేశ్వరి ముత్యాలమ్మ దేవాలయం చైర్మెన్ పొటేల్ సదానంద యాదవ్, హంసరాజ్ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

10న ఢిల్లీలో బోనాలు



నవతెలంగాణ-చాంద్రాయణగుట్ట

ఆషాఢమాసం బోనాలలో భాగంగా ఢిల్లీలో బోనాలు నిర్వహించడం ఆనవాయితీగా మారింది. ఈ మేరకు ఈ నెల 10న ఢిల్లీలో బోనాలు నిర్వహించనున్నారు. లాల్ దర్వాజా శ్రీ సింహవాహిని అమ్మవారి దేవాలయం నుంచి ఆలయ కమిటీ చైర్మెన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించి బంగారు బోనం తీసుకొని గుడి కమిటీ సభ్యులు ఢిల్లీ బయలుదేరారు. ప్రతి సంవత్సరం లాగానే ఢిల్లీలో సోమవారం తెలంగాణ భవన్లఓ ఫోటో ఎగ్జిబిషన్ నిర్వహిస్తారు. మంగళవారం ఘటాల స్థాపన బుధవారం ఇండియా గేటు వద్ద మేళా తాళాల మధ్య అంగరంగ వైభవంగా పోతరాజుల వీరంగాలతో నిర్వహించారు. సోమవారం సాయంత్రం ఐదు గంటలకు తెలంగాణ భవన్‌లో ఫోటో ఎగ్జిబిషన్ పలువురు ప్రముఖులు ప్రారంభిస్తారు. మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు ఇండియా గేటు వద్ద అమ్మవారి ఘటాల ఊరేగింపు గా తీసుకొని వచ్చి తెలంగాణ భవన్లో ప్రతిష్టాపన చేసి తదుపరి 11 గంటలకు అమ్మవారికి సమర్పిస్తారు. పోతరాజులకు స్వాగతం పలికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రముఖులు విచ్చేసి అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమం లో ఆలయ కమిటీ చైర్మెన్ చినబోయిన రాజేంద్ర యాదవ్, కన్వీనర్ జి అరవింద్ గౌడ్, జనరల్ సెక్రటరీ మారుతీ యాదవ్, ఏ చంద్రకుమార్, ట్రెజరర్ పోసాని సతీష్ ముదిరాజ్, కల్చరల్ సెక్రెటరీ వినోద్ కుమార్, పబ్లిసిటీ సెక్రటరీ శేషు, నారాయణ, ఆర్గనైజేషన్ సెక్రటరీ ఏ శ్రీనివాస్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే మాధవరెడ్డిని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే అందించి శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు మురహరి శీను, అశోక్ తదితరులు . -సుల్తాన్ బజార్



ఢిల్లీలో ప్రభుత్వ ప్రత్యేక అధికార ప్రతినిధిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన జితేందర్‌రెడ్డిని కాంగ్రెస్ నగర ఉపాధ్యక్షులు మహేష్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. -అంబర్‌పేట

బోనాల జాతర షురూ..

- గోల్కొండ జగదాంబికా అమ్మవారికి తొలి బోనం సమర్పించిన భక్తులు
- నగరంలో ఆషాఢ బోనాల జాతర ప్రారంభం
- నెలరోజుల పాటు కొనసాగనున్న జాతర







హైదరాబాద్‌లో ఆషాఢ మాస బోనాల సందడి షురూ అయ్యింది. గోల్కొండ కోటలో ఆదివారం బోనాల పండుగ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం జగదాంబిక అమ్మవారికి తొలి బోనం సమర్పించారు. అనంతరం జగదాంబిక, మహంకాళి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఊరేగింపుగా కోటపైకి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి గోల్కొండ కోటకు భక్తులు భారీగా తరలివచ్చారు. వేడుకలకు మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, స్పీకర్ గడ్డం శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్ హాజరై అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు.



నవతెలంగాణ-మెహిదీపట్నం

డప్పు చప్పుల హెూరు, శివ సత్తుల పూనకాలు, పోతురాజుల నృత్యాలు, యువత కేరింతలతో హైదరాబాద్‌లోని గోల్కొండలో బోనాల ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబించే ఈ ఉత్సవాలు గోల్కొండ కోటలోని జగదాంబికా అమ్మవారికి ఆలయ కమిటీ బంగారు బోనం సమర్పించడంతో షురూ అయ్యింది. నగరంలో నేటితో ప్రారంభమైన ఈ ఉత్సవాలు నెల రోజులపాటు జరగను న్నాయి. లంగర్ హౌస్ నుంచి తొట్టెల ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. చోటా బజార్ లోని పూజారి ఇంటిలోని అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి పట్టు వస్త్రాలు సమర్పిం చారు. తర్వాత ఈ ఊరేగింపు గోల్కొండ కోటలోని జగదాంబిక ఆలయం వరకు కొనసాగింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున మం త్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌లు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈనెల 21, 22వ తేదీలలో సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి ఉత్సవాలు, 28,29లలో లాల్ దర్వాజా బోనాలు జరగనున్నాయి.

గోల్కొండ బోనాల సందర్భంగా గోల్కొండ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచే కాకుండా చుట్టుపక్కల జిల్లాలైన సంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఈ వేడు కలలో పాల్గొన్నారు. గోల్కొండ బోనాలకు తరలి వచ్చే భక్తుల కోసం అధికారులు తగు ఏర్పాటు చేశారు. కోట ప్రారంభం నుంచి బోనాలు సమర్పించే ప్రాంతం వరకు మంచినీటి ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టినట్టు ఆలయ కార్య నిర్వహణ అధికారి శ్రీనివాసరాజు తెలిపారు. గోల్కొండ బోనాల సందర్భంగా పోలీసులు గోల్కొండ ప్రాంతంలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మరోవైపు ఆరోగ్యశాఖ అధికారులు ప్రత్యేకంగా హెల్త్ క్యాంపులు, అంబులెన్స్ సౌకర్యం కల్పించారు.

ట్రాఫిక్ మళ్లింపు...

గోల్కొండ కోట పరిసర ప్రాంతాల్లో నెల రోజుల పాటు ప్రతి ఆది, గురువారాల్లో ట్రాఫిక్ మళ్లింపు ఉండనుంది. కోటకు వచ్చే భక్తులు రామ్ దేవ్ గూడ మక్కాయ్ దర్వాజా నుంచి వచ్చి రామ్ దేవ్ గూడలో పార్కింగ్ చేయాలని అదనపు కమిషనర్ (ట్రాఫిక్) విశ్వప్రసాద్ తెలిపారు. లంగర్ హౌజ్ నుంచి గోల్కొండ కోటకు వచ్చే భక్తులు తమ వాహనాలను ఫతే దర్వాజా వద్ద పార్క్ చేయాలన్నారు. 7 టూంబ్స్ వైపు నుంచి వచ్చే వాహనాలను బంజారా దర్వాజ వద్ద ఆపాలని సూచించారు. కోటలో మొత్తం 650 మందితో పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. వీరిలో ఇద్దరు లా అండ్ ఆర్డర్ డీసీపీలు, ట్రాఫిక్ డీసీపీలు, ఏడుగురు ఏసీపీలు, 25 మంది సీఐలు, 55 మంది ఎస్సైలు, కానిస్టేబుళ్ల, హెూంగార్డులతో పాటు అశ్విక దళం, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బంది విధుల్లో ఉంటారు.





నాలాలలో పూడికతీత పనులు చేపట్టండి

- వరదల నుంచి బస్తీ వాసులను కాపాడాలి
- సీపీఐ(ఎం) నగర కమిటీ సభ్యులు ఆర్ వెంకటేష్
- ముషీరాబాద్ బస్తీలో బస్తీ బాట



నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ నియోజకవర్గం లో నాలాలలోని మట్టిని వెంటనే తొలగించాలని వర్షాకాలం వరదల నుండి బస్తీ వాసులను కాపాడండి అని సీపీఐ(ఎం) నగర కమిటీ సభ్యులు ఆర్ వెంకటేష్ డిమాండ్ చేశారు.ప్రజా సమస్యలపై సీపీఐ(ఎం) బస్తీ బాటలో భాగంగా ఆదివారం ముషీరాబాద్ డివిజన్ పరిధిలో జాంబవి నగర్, వినోబా నగర్, బాపూజీ నగర్ నాయకులు పర్యటించారు.ఈ సందర్భంగా పార్టీ నగర్ కమిటీ సభ్యులు ఆర్ వెంకటేష్, పద్మ మాట్లాడుతూ. జాంబవి నగర్, వినోబా నగర్ రెండు కాలనీల మధ్యలో ఉన్న నాళాలో గత సంవత్సరం నుండి పూడికతీత పనులు చేయకపోవడంతో వర్షాకాలం వస్తే రెండు కాలనీల ప్రజలు ఇల్లు ఎక్కడ మునిగిపోతాయి అనే భయంతో ఉన్నారన్నారు.. గత అనేక సంవత్సరాల నుండి వర్షాకాలానికి ముందే నాలాలోని పూడికను తీస్తున్న జిహెచ్ఎంసీ అధికారులు ఈ సంవత్సరం ఇప్పటివరకు పూడికతీత తీయకపోవడంతో ఓ చిన్నపాటి వర్షానికే రెండు బస్తీల్లోనే ఇండ్లల్లోకి నీళ్లు వస్తున్నాయి అని తెలిపారు. భారీ వర్షాలు పడితే కాలనీలు మొత్తం మునిగిపోయే ప్రమాదం ఉంది కాబట్టి వెంటనే నాలాలోని మట్టిని ఇతర వ్యర్థాలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు.జాంబవి నగర్ లోని నాలుగు బస్తీలలో రోడ్లు పూర్తిగా పాడైపోయి ఉన్నాయి అని.. ఈ బస్తీలలో నూతన రోడ్ల నిర్మించాలని, డ్రయినేజీ పైప్ లైన్ లను కొత్త వాటిని నిర్మించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలలో భాగంగా గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తామని చెప్పి బస్తీలలోని పేదలకు సగం మంది కూడా ఈ పథకం అందడం లేదు, వెంటనే ప్రభుత్వం అర్హులైనలందరికీ గృహజ్యోతి పథకాన్ని వర్తింపజేయాలని, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ పథకాన్ని కూడా అర్హులకు అందజేయాలని డిమాండ్ చేశారు. నాయకులు టి. మహేందర్, అన్నమ్మ , పుష్ప, దయాకర్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు



ఎన్టీఆర్ భవన్‌లో ఆదివారం ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపిన టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఏస్ రావు తదితరులు.
నవతెలంగాణ -సుల్తాన్ బజార్



బస్తీల్లో సమస్యలు స్వాగతం...

- సీపీఐ(ఎం) నగర కార్యవర్గ సభ్యులు దశరథ్

నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ నియోజకవర్గం లోని ప్రతి బస్తీలో సమస్యలు స్వాగతం పలుకుతున్నాయని వాటిని వెంటనే పరిష్కరించాలని సీపీఐ(ఎం) నగర కార్యవర్గ సభ్యులు దశరథ్ డిమాండ్ చేశారు. ఆదివారం నియోజకవర్గంలోని బోలాక్ పూర్ డివిజన్ యందు క్రాంతి నగర్ బస్తీలో సీపీఐ(ఎం) బస్తి బాట కార్యక్రమంలో భాగంగా బస్తీలో పర్యటిస్తూ ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దశరథ్ మాట్లాడుతూ. క్రాంతి నగర్ బస్తీలో గతంలో జీవో నెంబర్ 58 దరఖాస్తులు చేసుకున్నారని రెండు పర్యాయాలు ఆర్డిఓ ఎమ్మార్వో సర్వే చేశారని తెలిపారు. బస్తీ వాసులకు వెంటనే పట్టాలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పథకాలు అన్నీ పొందలేకపోతున్నారని అర్హులైన ప్రతి పేదవారికి సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు. బస్తీల్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలన్నారు. కరెంటు వైర్లు ఇండ్ల స్థలాలకు కాస్త దూరంగా వేయాలని ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ శాఖా కార్యదర్శిలు సిరికొండ శ్రీనివాస్,జే.నర్సింగ్ రావు , నాయకులు పి. వెంకటయ్య, యం.కృష్ణస్వామి, సార్ల శ్రీనివాస్, జి .కృష్ణ, టీ.శివ శంకర్, ఎం. లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ(ఎం) పెద్దపీట

- పార్టీ నగర నాయకులు మహేందర్
- అంబర్‌పేట్‌లో బస్తీబాట



నవతెలంగాణ-అంబర్‌పేట

ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ(ఎం) ఎల్లవేళలా నిరంతరం కృషి చేస్తుందని పార్టీ నగర నాయకులు మహేందర్ అన్నారు. ఆదివారం పార్టీ అంబర్‌పేట్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో బస్తీబాట స్థానిక సమస్యల పరిష్కారం కోసం వీకర్ సెక్షన్ కాలనీ, బతుకమ్మ కుంట, గంగాబౌలి, మల్లన్న గుడి, తదితర ప్రాంతాల్లో తిరిగి బస్తీ సమస్యలు ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డ్రయినేజీ సమస్య, మంచినీటి సమస్య, వీధిలైట్లు రోడ్ల సమస్య పాములతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, మురికి వాడలో చిన్న చిన్న రోడ్లు ఇండ్లు ఉండడంతో ఫంక్షన్ చేసుకోవాలంటే కమ్యూనిటీ హాల్ లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని సీపీఐ(ఎం) బృందానికి స్థానికులు గోడు వెల్లబోసుకున్నారు.

ఈ సందర్భంగా ఎం మహేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడు నెలలు పూర్తయినా ఇంతవరకు ఏ ఒక్క హామీ పూర్తిగా అమలు చేయలేదని తెలిపారు. మహిళలకు ఆర్టీసీ ఫ్రీ బస్ మినహాయిస్తే మహాలక్ష్మి పథకం కింద మహిళలకు రూ. 2500 ఆర్థిక సహకారం, ఉచిత కరెంటు, గ్యాస్ సబ్సిడీ రూ. 500, కల్యాణ లక్ష్మి, వృద్ధులకు రూ. 4000 పెన్షన్, వికలాంగులకు రూ. 6000 పెన్షన్ ఏవీ అమలు చేయలేదని తెలిపారు. వీటితోపాటు బస్తీల్లో అనేక సమస్యలు ఎదురవుతున్నాయని చెప్పారు.అనేక సంక్షేమ పథకాలకు తెల్ల రేషన్ కార్డుకు లింక్ చేయడంతో రేషన్ కార్డు లేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని, గృహలక్ష్మి పథకం కింద ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇంతవరకు వాటి మీద విధివిధానాలు రూపొందించలేదని, వేల మంది దరఖాస్తు చేసుకొని ఇందిరమ్మ ఇండ్ల కోసం కోసం ఎదురు చూస్తున్నారని, ఇప్పటికైనా కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలను తక్షణమే అమలు చేయాలని లేని పక్షంలో ప్రజలను పెద్ద ఎత్తున సమీకరించి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ అంబర్‌పేట్ జోన్ కమిటీ సభ్యులు జి. రాములు, బి. సుబ్బారావు నాయకులు శ్రీనివాస్, మల్లికార్జున్, గోపి తదితరులు పాల్గొన్నారు.

మాదిగల చిరకాల స్వప్నాన్ని అణిచివేస్తోన్న బీజేపీ

- పార్లమెంట్‌లో వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి
- ఎమ్మార్పీఎస్ 30 వ వార్షికోత్సవ వర్గీకరణ సాధన దీక్షలో వక్తలు



నవతెలంగాణ-ముషీరాబాద్

బీజేపీ ప్రభుత్వం మాదిగల చిరకాల స్వప్నాన్ని అణిచివేస్తున్నదని.. పార్లమెంట్లో వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టాలని.. అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ప్రకటించాలి అని ఎమ్మార్పీఎస్ 30 వ వార్షికోత్సవ వర్గీకరణ సాధన దీక్షలో వక్తలు డిమాండ్ చేశారు. ఆదివారం ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద ఎమ్మార్పీఎస్ 30వ వార్షికోత్సవం సంద ర్భంగా వర్గీకరణ సాధన దీక్ష నిర్వహించారు. ఈ దీక్షలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్ కృష్ణయ్య, ప్రొఫెసర్ కోదండరాం, ప్రజా గాయని విమలక్క, ఎస్సీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, హాజరై దీక్షకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ. కేంద్ర ప్రభుత్వం 100 రోజుల్లో వర్గీకరణ చేస్తానని 10 సంవత్సరాలు దాటిపోయినా వర్గీకరణ చేయకపోవడం వల్లనే మాదిగలు విద్యా ఉద్యోగ అవకాశాలు నష్టపోతున్నారని కేంద్రం మోసం వల్లనే వర్గీకరణ జాప్యం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. 30 సంవత్సరాలు వర్గీకరణ కోసం పోరాడుతున్న ఇంతవరకు పాలకులు నిర్లక్ష్యం కారణంగా వర్గీకరణ సాధించలేదన్నారు. మాదిగలను ఓట్ల కోసమే వాడుకున్నారు తప్ప ఏ రాజకీయ పార్టీ మాదిగల అభ్యున్నతికి కృషి చేయలేదన్నారు. తమ హక్కులు కోసం, మాదిగల వర్గీకరణ కోసం 30 ఏండ్లుగా పోరాటాలు చేస్తుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంబరాలకు హాజరవుతున్నారని మాదిగల గోసను ఎవరు పట్టించుకునే పాపాన పోలేదన్నారు.వర్గీకరణకు అన్ని రాజకీయ పార్టీలు ప్రజా సంఘాలు సంపన్న వర్గాల మద్దతు ఉన్నా వర్గీకరణ మాత్రం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీ తాము వర్గీకరణకు అనుకూలంగా ఉన్నామని చెబుతారని... ప్రభుత్వంలోకి రాగానే వర్గీకరణ విషయాన్ని పక్కదారి పట్టిస్తున్నారన్నారు.. బీజేపీ అధికారంలోకి రాగానే 100 రోజుల్లో వర్గీకరణ చేసి తీరుతామని చెప్పి హామీ ఇచ్చి పది సంవత్సరాలు గడిచిన ఇంతవరకు ఆ హామీని అమలు చేయలేదన్నారు.వచ్చే పార్లమెంట్ సమావేశాలలో వర్గీకరణ బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు.

ఎంపీ ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ.ఎస్సీల వర్గీకరణ డిమాండ్ కు బీసీలసంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. బీసీలు, ఎస్సీలు ఏకమై హక్కులు, అధికారం సాధించాలని పిలుపునిచ్చారు. దళిత బహుజనులు తమ పిల్లలను ఎట్టి పరిస్థితుల్లో చదువుకు దూరం చేయవద్దని వారిని చదివించి ఉన్నతులుగా తీర్చిదిద్దాలన్నారు. ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ.హక్కుల కోసం జరుగుతున్న పోరాటాలకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని.. తెలంగాణ ఉద్యమం ఎంత న్యాయమైనదో వర్గీకరణ ఉద్యమం కూడా అంతే న్యాయమైనదన్నారు. యువసేన రాష్ట్ర అధ్యక్షులు పొట్టపెంజర రమేష్ , కోర్ కమిటీ నాయకులు బల్లరి హుస్సేన్ , బంగారి శ్రీను, చిలకమారి గణేష్ , చిలుముల ఎల్లయ్య మాదిగ, పసులది యదగిరి, నాగునూరి వేణుగోపాల్ , ఈ దునూరి యాకయ్య పాలడుగు శ్రీను, పాలడుగు మేరీ మాదిగ , వరలక్ష్మి ,ఎంఆర్పీఎస్ నాయకులు పేర్ల మధు, రాజేష్ ఖన్నా , ఎంఎస్ఎఫ్ నాయకులు కొల్లూరి వెంకట్ , చందు, తిరుమల్, జీవన్, ధర్మారపు శ్రీకాంత్, నాగరాజు, సురేష్, శ్రీకాంత్,కిరణ్, మని, ఫనీ తదితరులు పాల్గొన్నారు.



'తెలంగాణలో తెలుగుదేశానికి పూర్వ వైభవం తీసుకొస్తాం'

నవతెలంగాణ-సిటీ బ్యూరో

తెలంగాణలో తెలుగుదేశానికి పూర్వ వైభవం తీసుకొస్తామని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు అరవింద్ కుమార్ గౌడ్, టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు సాయిబాబా తెలిపారు. ఆదివారం నగరంలో అరవింద్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ రెండు రాష్ట్రాలకు చెందిన ముఖ్యమంత్రులు విభజన హామీలపై మాట్లాడుకోవడం శుభ పరిణామం అని తెలిపారు. టీడీపీప్రధాన కార్యాలయంలో చంద్రబాబు నాయుడు నగర టీడీపీ నాయకులతో మాట్లాడుతూ కొత్త కమిటీలు నియమిస్తామని, పార్టీని బలపేతం చేస్తామని చెప్పారని తెలిపారు .40 ఏండ్ల సుదీర్ఘమైన రాజకీయ చరిత్రలో ఏమచ్చ లేని చంద్రబాబు నాయుడని అన్నారు. రాష్ట్ర రాజకీయాల్లోనే గాక జాతీయ రాజకీయాల్లో కూడా ప్రత్యేక గుర్తింపును చంద్రబాబు కలిగి ఉన్నారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఆయన చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లో ఇప్పటికీ నిలిచి ఉన్నాయన్నారు. హైదరాబాద్ నగరానికి చంద్రబాబు నాయుడుకి ఉన్న ప్రత్యేకమైన అనుబంధం సుదీర్ఘ కాలమైనదని, ఈనాటికీ చంద్రబాబు చేసిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల ఆనవాళ్లే కనిపిస్తాయన్నారు. తెలంగాణలో తెలుగుదేశానికి పూర్తి వైభవం తీసుకొచ్చేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని టీడీపీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పార్టీ ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ మృతికి సీఎం, డీజీపీలు బాధ్యత వహించాలి

- దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్



నవతెలంగాణ-హిమాయత్ నగర్

కుల వేధింపులకు మృతి చెందిన దళిత ఎస్ఐ శ్రీరాముల శ్రీనివాస్ మరణానికి రాష్ట్ర సీఎం ఎ.రేవంత్ రెడ్డి, డీజీపీలు బాధ్యత వహించి వారి పదవులకు రాజీనామా చేయాలని దళిత బహుజన పార్టీ (డీబీపీ) జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్ డిమాండ్ చేశారు. ఆదివారం హిమాయత్ నగర్ లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తీవ్రంగా కుల వేధింపులు తన మీద సర్కిల్ ఇన్‌స్పెక్టర్, స్టేషన్ సిబ్బంది గురి చేస్తున్నారని జిల్లా ఎస్పీ, రాష్ట్ర డీజీపీలకు మృతుడు ఫిర్యాదు చేసినా ఉన్నతాధికారులు పట్టించుకోలేదన్నారు.సీఎం రేవంత్ రెడ్డితో చెప్పి ఎస్ఐ ఉద్యోగం తీసివేస్తామని సీఐ బెదిరించినా ఉన్నతాధికారులు నిర్లక్ష్యం చేయడంతోనే నీతి, నిజాయితీతో విధులు నిర్వహించిన ఎస్ఐ చనిపోయారని ఆరోపించారు. ఎస్ఐ మరణానికి బాధ్యులైన సీఐ జితేందర్ రెడ్డి, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని, వారిని సర్వీస్ నుంచి డిస్మిస్ చేయాలని డిమాండ్ చేశారు.నేటికీ దళిత జాతులపై కుల వేధింపులు జరగడం అత్యంత దారుణమన్నారు. ఎస్ఐ మృతిని తట్టుకోలేక ఆయన మేనత్త సైతం చనిపోవడం అత్యంత బాధాకరమన్నారు.ఈ మరణాలకు రాష్ట్ర పోలీస్ విభాగం, ప్రభుత్వం పూర్తిగా బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు .సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో దళితులకు రక్షణ లేకుండా పోయిందని, రోజు రోజుకు చిన్నారులు, మహిళలపై లైంగికదాడులు, దాడులు, హత్యలు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. పోలీస్ శాఖలో సైతం కుల వేధింపులకు గురై దళిత అధికారులకు తమ ప్రాణాలకు ముప్పు ఉందన్నారు.బాధితుల కుటుంబానికి భరోసా కల్పించాలని, రాష్ట్రంలో కుల వేధింపులకు గురవుతున్న బాధితులు చనిపోవద్దని సూచించారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరం సతీష్ కుమార్, గ్రేటర్ అధ్యక్షులు ఎం.ప్రవీణ్, దళిత బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ ఇటికాల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

డీడీ కాలనీలో శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి పురస్కరించుకొని మొక్కలు నాటిన బీజేపీ సెంట్రల్ జిల్లా డాక్టర్ ఎన్ గౌతమ్ రావు, సీనియర్ నాయకులు గోవర్ధన్ రెడ్డి, డాక్టర్ హరి చరణ్, డాక్టర్ పుట్ట రంగయ్య తదితర నాయకులు.
నవతెలంగాణ-అంబర్‌పేట



'స్టోరీస్ బై చిల్డ్రన్'



తన్మయీ కలేబార్...

చిన్నతనంలో పెద్ద ఆలోచనలు లేకపోయినా యువతిగా బహుళజాతి కంపెనీల్లో పని చేయాలనుకున్నారు. కొంత కాలం చేసి కుటుంబ బాధ్యతల కోసం ఇంట్లోనే ఉండాల్సి వచ్చింది. అప్పుడే తన మేనల్లుడిని చూసి కథలపై ఆసక్తి పెరిగింది. అంతే పిల్లలను రచయితలుగా తీర్చిదిద్దే పెద్ద బాధ్యతను తన భుజాలకెత్తుకున్నారు. పిల్లల్లో రాయడం, చదవడం వంటి అలవాట్లను ప్రోత్సహిస్తూ వారిలోని సృజనాత్మకతను వెలికి తీస్తున్నారు. దానికోసమే స్టోరీస్ బై చిల్డ్రన్ అనే వేదికను ప్రారంభించారు. ఆ సంగతులేంటో మనమూ తెలుసుకుందాం...

కర్ణాటకలోని బెల్గాంకు చెందిన తన్మయి చిన్నతనంలో తన జీవితం గురించి పెద్దగా ఊహించుకోలేదు. 'నేను కళాశాల తర్వాత బహుళజాతి సంస్థలో పని చేయాలనుకున్నాను' అని ఆమె చెప్పారు. అనుకున్నట్టుగానే చదువు పూర్తయిన తర్వాత బెంగళూరులోని ఓ ఫైనాన్షియల్ సర్వీసెస్ కంపెనీలో రెండేండ్లు పని చేశారు. వివాహం తర్వాత తన్మయి భర్త ఓ స్టాక్ బ్రోకింగ్ కంపెనీతో పాటు విశాల్ ఫైనాన్షియల్ స్కూల్ అనే ఇన్‌స్టిట్యూట్‌ను కూడా ప్రారంభించారు. ఇద్దరూ దాదాపు మూడేండ్ల పాటు దాన్ని నడిపారు. అయితే ఆమె భర్త 2008లో ఫైనాన్స్ టీచింగ్ ప్రారంభించాలని కంపెనీ నుండి బయటకు వచ్చాడు. ఏడాది తర్వాత కుటుంబ బాధ్యతల రీత్యా తన్మయి కూడా ఈ వెంచర్ల నుండి వచ్చేశారు.

వెతకడం ప్రారంభించారు

2020 లాక్‌డౌన్ సమయంలో తన్మయి అంతర్గత కాలింగ్ గురించి తెలుసుకున్నారు. దీనికి ప్రేరణ ఆమె మేనల్లుడు ఈజిప్షియన్ నాగరికతపై రాసిన ఓ కథ. ఇది ఆమెకు బాగా నచ్చింది. దాంతో తన్మయి కూడా తన కథనాన్ని ప్రచురించడానికి ప్లాట్‌ఫారమ్‌ల కోసం వెతకడం ప్రారంభించారు. కానీ ఎక్కడా దొరకలేదు. 'చాలా మంది ప్రతిభావంతులైన యువ రచయితలు తమ పనిని ప్రదర్శించడానికి ఓ వేదిక లేదని నా అన్వేషణ ద్వారా గ్రహించాను. అందుకే నేనే వారి కోసం ఓ వేదిక సృష్టించాలని నిర్ణయించుకున్నాను' అని ఆమె చెప్పారు.

అతి తక్కువ మార్పులతో...

ప్రతి చిన్నారి కథలను జోడించడానికి, వాటి స్థితిని తనిఖీ చేయడానికి, కంటెంట్‌లో పాల్గొనడానికి వారి సొంత డాష్‌బోర్డ్‌ను ఏర్పాటు చేస్తాం. కథనాలను అప్‌లోడ్ చేసిన తర్వాత సమీక్ష కోసం వెళతాయి. ఈ ప్లాట్‌ఫారమ్‌లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఆంగ్ల గ్రాడ్యుయేట్లు, సాహిత్య ప్రియులు, గౌరవ వేతనాలపై పని చేసే 12 కంటే ఎక్కువ మంది సమీక్షకులు ఉన్నారు. ప్రతి కథ సమీక్ష కోసం ఒకరికి కేటాయించబడుతుంది. వారు ఆ కథను సమగ్రంగా పరిశీలిస్తారు. ఈ ప్రక్రియ తర్వాత చిన్న మార్పుల తర్వాత ప్రచురిస్తారు. 'కథను తక్కువ మార్పులతో ప్రచురించేందుకు ప్రాధాన్యం ఇస్తాము. ఎందుకంటే పిల్లల ఊహాశక్తి సారాంశాన్ని మేము సజీవంగా ఉంచాలనుకుంటున్నాం' అని తన్మయి చెప్పారు.

నాలుగు పుస్తకాలు

50 కథలతో ప్రారంభమైన ఈ వేదిక నేడు 1,800 కంటే ఎక్కువ ఆంగ్ల కథలను ఉచితంగా ప్రచురించే స్థాయికి ఎదిగింది. ప్రపంచం నలుమూలల నుండి వెయ్యి మంది విద్యార్థులు తమ వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకున్నారు. వీటిని ప్రతి నెలా పదివేల మంది వీక్షిస్తుంటారు. స్టోరీస్ బై చిల్డ్రన్ ఇప్పటి వరకు నాలుగు పుస్తకాలను ప్రచురించింది. ఆ నాలుగు షాజియా ఖాన్ రచించిన 'బియాండ్ ది బ్లూ స్కైస్', సజిని వరదరాజన్ రచించిన 'ది ఆర్కిటిక్ హోమ్‌కమింగ్', అపూర్వ విశ్వనాథ్ రచించిన 'ఎట్ ది ఓల్డ్‌కెన్స్', శ్రద్ధా అగర్వాల్ 'డెస్టినీ స్టెయిన్డ్'. ఈ పుస్తకాలు బెంగళూరులోని అన్ని సప్నా బుక్ హౌస్ స్టోర్‌లతో పాటు అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లో కూడా అందుబాటులో ఉన్నాయి. 'స్టోరీస్ బై చిల్డ్రన్ వెనుక ఉన్న కాన్సెప్ట్ ఏమిటంటే రాయడం, చదవడం వంటి అలవాట్లను ప్రోత్సహించి పిల్లల్లో సృజనాత్మకతను ప్రేరేపించడం' అని తన్మయి అంటున్నారు.

బ్రిటానియా మేరీ మైస్టార్టప్ కాంటెస్ట్‌లో

2021, ఆగస్ట్‌లో తన్మయి భర్త ఆమెను బ్రిటానియా మేరీ మైస్టార్టప్ కాంటెస్ట్‌లో పాల్గొనేలా ప్రోత్సహించారు. ఇది ఇంటి నుండి వ్యాపారాలు చేసే మహిళలు వారి వ్యవస్థాపక ప్రయాణాలను ప్రారంభించేలా ఉత్సాహ పరుస్తుంది. 'దీనికి నేను దరఖాస్తు చేసాను. జనవరి నెలలో నేను 50 మంది ఫైనలిస్ట్‌లలో ఉన్నానని తెలిసినప్పుడు చాలా ఆశ్చర్యపోయాను' అని ఆమె పంచుకున్నారు. స్టోరీస్ బై చిల్డ్రన్ పోటీలో ఐదవ స్థానంలో నిలిచి రూ.10 లక్షల బహుమతిని గెలుచుకుంది. అప్పటికే ఈ వేదిక కోసం ఆమె రూ.3.5 లక్షల ప్రారంభ పెట్టుబడి పెట్టారు. పాఠశాలల్లో కథ చెప్పే సెషన్‌లు, పోటీలకు స్పాన్సర్‌షిప్‌లు, కథా రచన వర్క్‌షాప్‌లు, ప్రకటనల కోసం వీటిని ఉపయోగించారు.

యువ రచయితల కోసం

కథలు, కవితలను ప్రచురించడమే కాకుండా స్టోరీస్ బై చిల్డ్రన్ కూడా ఒక క్లబ్‌ను నడుపుతోంది. ఇందులో ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుండి పిల్లలు పుస్తకాలు, సాహిత్యం గురించి చర్చించడానికి నెలకు ఓసారి ఆన్‌లైన్‌లో కలుసుకుంటారు. జీవితంలో చాలా కాలం తర్వాత మొదటి కలల వెంచర్‌ను నిర్మించుకున్న తన్మయి తన ఈ ప్రయాణంలో ఎంతోమంది సహకరించారని చెబుతున్నారు. 'మహిళా వ్యాపారవేత్తలు తమకు వచ్చే కష్టాలను అధిగమించడానికి, ఈ పాటికే వాటిని అధిగమించిన ఇతరులతో కనెక్ట్ అవ్వాలి. మేము ఇప్పుడు కేవలం యువ రచయితల కోసం లిటరేచర్ ఫెస్టివల్‌ని నిర్వహించాలని ప్లాన్ చేస్తున్నాం. మా అంతిమ లక్ష్యం యువ రచయితల కోసం ఓ ప్రపంచ కమ్యూనిటీని నిర్మించడం. ప్రపంచవ్యాప్తంగా పిల్లల సాహిత్యంలో మా వేదికను అగ్రగామిగా నిలపడం. ■

పిల్లల సాహిత్యం కోసం

తన్మయి 2020, నవంబర్‌లో పిల్లల సాహిత్యం కోసం 'స్టోరీస్ బై చిల్డ్రన్'ని ప్రారంభించారు. ఈ ప్లాట్‌ఫారమ్ 7 నుండి 18 ఏండ్ల మధ్య వయసు గల పిల్లలను కథలు రాసేలా ప్రోత్సహించడం, వాటిని ప్రచురించి కథల పట్ల వారిలో ప్రేమను పెంచాలనే లక్ష్యంగా పెట్టుకున్నారు. 'ఈ ఆలోచన పిల్లలలో రాయడం, చదవడం ప్రోత్సహించడానికి ఒక వేదికగా ప్రారంభమైంది. మొదటి నెలలోనే తగినంత మంది పిల్లలు తమ కథలను సమర్పించారు. తద్వారా 11-18 ఏండ్ల వయసు పిల్లల్లో పోటీలు, వార్షిక నవలా రచనా పోటీని నిర్వహించేందుకు దారితీసింది. పోటీల్లో గెలిచిన పుస్తకాలను పేపర్‌బ్యాక్‌లుగా ప్రచురించడం కూడా ప్రారంభించాము' అని తన్మయి చెప్పారు.





ఆరోగ్యమైన జీవనశైలితోనే...

ఆరోగ్యమైన జీవనశైలే మనకు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందిస్తుంది. రోజంతా ఉత్సాహంగా ఉండాలంటే ఆ రోజు మనం తీసుకునే తొలి ఆహారంపైనే ఆధారపడి ఉంటుంది. ఈ క్రమంలో శరీరానికి శక్తిని



అందించే పదార్థాలకు అధిక ప్రాధాన్యమివ్వాలి. పండ్లు, నట్స్ వంటివి తీసుకోవాలి. రోజూ ఉదయాన్నే ఏదైనా ఒక పండు లేదంటే , నానబెట్టిన కొన్ని బాదం పప్పులు, కిస్మిస్‌లను తీసుకోవాలి.

ఇలా తీసుకోవడం అలవాటుగా మార్చుకుంటే రోజూ యాక్టివ్‌గా ఉండటంతోపాటు ఆరోగ్యానికీ ఎంతో మంచిది. తాజా పదార్థాలు, పండ్లు, పీచు పదార్థం ఎక్కువగా ఉన్న ఆహారాన్ని తీసుకోవాలి. తృణధాన్యాల ఉత్పత్తులు, అలాగే రోజుకి 10 నుంచి 12 గ్లాసుల నీరు తాగడం కూడా ఆరోగ్యానికి మంచిది.

పోషకాహారం తీసుకోవడం, కంటి నిండా నిద్ర పోవడం, శరీరాన్ని చురుగ్గా ఉంచుకోవడానికి వ్యాయామాన్ని రొటీన్‌లో భాగం చేసుకోవాలి. పాల ఉత్పత్తులను తీసుకుంటే తక్కువ కొవ్వు, స్కిమ్డ్ రకాలను ఎంచుకోండి.

సమయం ఎక్కువ తీసుకున్నా సరే ఆహారాన్ని పూర్తిగా నమిలి తినాలి. బయటి ఫుడ్ కంటే ఇంట్లో వండిన భోజనం తినడం మంచిది. మీకు మీరే వంట చేసుకోండి. బయట తినడం తగ్గించండి. ■

కమ్యూనిస్టులు లేకుండా దేశం లేదు

(మొదటిపేజీ తరువాయి)

సంస్థలను బీజేపీ బానిసలుగా మార్చుకుందని ఆరోపించారు. మొన్నటి ఎన్నికల్లో బీజేపీకి ఆశించిన సీట్లు వచ్చి ఉంటే లౌకిక, ప్రజాస్వామ్య కులమతాలకు అతీతంగా అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగాన్ని మార్చేదని తెలిపారు. ఇండియా బ్లాక్ దీనికి సమర్థవంతంగా అడ్డుకట్ట వేసిందన్నారు. ఇది ప్రజాస్వామ్యశక్తుల విజయంగా అభివర్ణించారు. ప్రజల బతుకులు మారాలంటే విద్యా, వైద్యం, భూమి, ఉద్యోగ, ఉపాధి అందరికీ లభించాలన్నారు. కుల, మత తేడా లేకుండా అందరూ సమానంగా జీవించేలా చూడటమే కమ్యూనిస్టుల లక్ష్యమన్నారు. లింగయ్య మనసంత శుద్ధంగా ఆఫీస్ ఉందని కితాబునిచ్చారు. పార్టీ ఆఫీస్‌ను ఉపయోగించుకొని ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలని కాంక్షించారు.

జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రైతాంగ ఉద్యమం ఎక్కడ బలంగా ఉందో అక్కడ బీజేపీ ఓటమి చెందిందని అన్నారు. బీజేపీ పీడ వదలకపోతే దేశానికి భవిష్యత్తు లేదని చెప్పారు. లింగయ్య స్ఫూర్తితో పార్టీని ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ఇదో పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవంలా కాకుండా ఊరంతా పండుగ వాతావరణం నెలకొందన్నారు. ఎర్రజెండాను కప్పుకుని పోయినవాళ్లే నిజమైన కమ్యూనిస్టులని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రమ్, భూక్యా వీరభద్రం, కళ్యాణం వెంకటేశ్వరరావు, చింతలచెర్వు కోటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు యర్రా శ్రీనివాస్, ఎస్‌కే మీరాసాహెబ్, తుమ్మా విష్ణు, తుషాకుల లింగయ్య, ఎస్.నవీన్‌రెడ్డి, బత్తిని ఉపేందర్, బోడపట్ల సుదర్శన్, కొమ్ము శ్రీను, భూక్యా శ్రీనివాసరావు, సీపీఐ నాయకులు పగడాల మల్లేశ్, కార్పొరేటర్లు చామకూరి వెంకన్న, కూరాకుల వలరాజు, వీవీ పాలెం సొసైటీ చైర్మెన్ రావూరి సైదుబాబు, రైతుసంఘం నాయకులు ఉమ్మినేని కోటయ్య, పార్టీ గ్రామశాఖ కార్యదర్శి మొద్దినబోయిన మంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసీ హబ్‌గా హైదరాబాద్

(మొదటిపేజీ తరువాయి)

ఫార్మసీ హబ్‌గా మారినందుకు ఎంతో సంతోషంగా ఉందని చెప్పారు. భారతీయ ఫార్మా ఉత్పత్తులు నాణ్యతలో, అన్ని విధాలా ఉత్తమ మైనవని రుజువైందన్నారు. కరోనా కష్టకాలంలో యుద్ధ ప్రాతిపదికన ప్రపంచానికే వ్యాక్సిన్ తయారు చేసి ఇచ్చిన ఘనత మనదేశ ఫార్మా ఇండస్ట్రీకి దక్కిందని కొనియాడారు. దాదాపు 75 మిలియన్ డోసుల వ్యాక్సిన్లను 94 దేశాలకు, ఐక్య రాజ్య సమితికి చెందిన రెండు ఎంటీటీలకు అందజేయడంతో భారత్ విశ్వబంధుగా కీర్తి ఘడించిన విషయాన్ని గుర్తు చేశారు. దేశం నుంచి గతేడాది రూ.1.83 లక్షల కోట్ల ఫార్మా ఎగుమతులు జరిగాయనీ, ఒక్క అమెరికాకే రూ.67 వేల కోట్ల ఉత్పత్తుల(35 శాతం)ను చేరవేశామని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి చెప్పారు. త్వరలో మన దేశ ఆర్థిక వ్యవస్థ ఐదు ట్రిలియన్ డాలర్లకు ఎదగాలని ఆకాంక్షించారు. ఫార్మా యూనివర్సిటీ ఏర్పాటు అంశాన్ని ప్రధానమంత్రి మోడీ దృష్టికి తీసుకెళ్తానని హామీనిచ్చారు. వికసిత్ భారత్ లక్ష్య సాధన కోసం ఫార్మా పరిశ్రమ మద్దతు కావాలని కోరారు. 2027 నాటికి ప్రపంచంలోనే భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వం వెళ్తున్నదని చెప్పారు. పీఎం గతిశక్తి ద్వారా మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీనిచ్చారు. రవాణా రంగానికి తమ ప్రభుత్వం అతి ప్రాధాన్యం ఇస్తున్నదనీ, దేశంలో పెరిగిన విమానాశ్రయాలు, రైల్వే, హైవే నెట్‌వర్క్‌నే దానికి ప్రత్యక్ష ఉదాహరణ అని చెప్పారు. 2013-14లో 136 గిగా వాట్ల విద్యుత్ డిమాండ్ ఉండగా అది నేడు 224 గిగావాట్లకు పెరిగిందని వివరించారు. కాలం చెల్లిన 1562 చట్టాలను మోడీ సర్కారు రద్దుచేసిందని తెలిపారు. అవినీతి రహిత పాలన, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో గ్యారెంటీ ఇస్తున్నామని హామీనిచ్చారు. దేశీయ తయారీ రంగాన్ని ప్రోత్సహించడానికి రూ.15 వేల కోట్లను కేటాయించామని వివరించారు. రాబోయే బల్క్ డ్రగ్ పార్కుల్లో మౌలిక సదుపాయాలు కల్పించడానికి తమ ప్రభుత్వం ఆర్థిక సహకారం అందిస్తుందని హామీనిచ్చారు. భారతీయ ఫార్మా రంగం అంతర్జాతీయ ప్రమాణాలను అందుకునేలా ఫార్మాసూటికల్ టెక్నాలజీ అప్‌గ్రేడేషన్ అసిస్టెన్స్ స్కీం దోహదపడిందని చెప్పారు. దేశంలో 12 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షల వరకు వైద్యబీమా అందిస్తున్నామనీ, పీఎం జన ఔషధి కేంద్రాల ద్వారా ప్రజలకు 50 నుంచి 90 శాతం తక్కువ ధరలకు మందులు అందిస్తున్నామని వివరించారు.

ప్రభాకర్ భూమికి శాశ్వత పరిష్కారం చూపెడతాం

(మొదటిపేజీ తరువాయి)

సీఎం మల్లు భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన రైతు భోజడ్ల ప్రభాకర్ ఈనెల 1వ తేదీన తన భూమిని కొంతమంది ఆక్రమించు కున్నారని, ఆ విషయంపై పోలీస్‌స్టేషన్‌లో, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్న మనస్తాపంతో పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆదివారం ప్రొద్దుటూరులో ప్రభాకర్ కుటుంబాన్ని మల్లు భట్టి విక్రమార్క పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభాకర్ భార్య అనురాధ, కుమారుడు వేదవ్యాస్, కుమార్తె శ్రీజ, తండ్రి భద్రయ్యను మల్లు పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ క్రమంలో ప్రభాకర్ తండ్రి భద్రయ్య మాట్లాడుతూ.. తమ పట్టా భూమిని ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన చేపల సొసైటీ వారు తమ గ్రామస్తుల సహకారంతో ఆక్రమించుకున్నారని తెలిపాడు. పైగా తమ పట్టా భూమిలో జేసీబీల ద్వారా రోడ్డు వేశారని, ఈ విషయంపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయటానికి వెళితే.. తీసుకోలేదని వాపోయాడు. ఆ తర్వాత తహసీల్దార్ కార్యాలయానికి ఫిర్యాదు చేయటానికి వెళితే ఎవరూ పట్టించుకోలేదంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన పెంట్యాల పుల్లయ్య ద్వారా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లామని తెలిపాడు. తమకు పూర్తిస్థాయిలో పట్టాదారు పాస్ పుస్తకం ఉన్నా తమ భూమిని ఆక్రమించుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారని భద్రయ్య ఏడ్చుకుంటూ భట్టికి వివరించాడు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క స్పందిస్తూ.. ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. మీ భూమి మీకే శాశ్వతంగా వచ్చేలా చర్యలు తీసుకుంటామని స్పష్టమైన హామీ ఇచ్చారు. అనంతరం భట్టి విక్రమార్క విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభాకర్ ఆత్మహత్య చాలా బాధాకరమన్నారు. ప్రభాకర్ ఆత్మహత్యకు ప్రోత్సహించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభాకర్ భూమికి శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ముజామిల్ ఖాన్‌కు ఆదేశాలు ఇచ్చినట్టు చెప్పారు. ప్రభాకర్ పిల్లలు ఎంత వరకు చదువుకుంటే అంత వరకు ప్రభుత్వం పూర్తిగా సహాయ సహకారాలు అందిస్తుందని స్పష్టం చేశారు. భట్టి విక్రమార్క వెంట జిల్లా కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్, ఖమ్మం ఆర్డీఓ గుంటుపల్లి గణేష్, తహసీల్దార్ అనంతుల రమేష్, ఎంపీడీవో ఆర్.రామయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ ఉన్నారు.

తెలంగాణ నుంచి టీడీపీని వేరు చేయలేరు

(మొదటిపేజీ తరువాయి)

ప్రమాణ స్వీకారం చేశాక తొలిసారి హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ట్రస్ట్‌భవన్‌లో ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని వారికి దిశానిర్దేశం చేశారు. తెలుగు జాతిలాగే టీడీపీ కూడా అనేక సంక్షోభాలను ఎదుర్కొందనీ, ప్రతి సంక్షోభాన్ని అవకాశంగా మలుచుకుంటూ పార్టీ ఎదిగిందని చంద్రబాబు గుర్తు చేశారు. తెలంగాణలో అధికారం లేకున్నా కార్యకర్తలు పార్టీని వదల్లేదని కొనియాడారు. ఇక్కడి టీడీపీ శ్రేణులు ఏపీలో తన విజయానికి కృషి చేశారని అన్నారు. నన్ను ఏ కారణం లేకుండా జైల్లో పెట్టిన సమయంలో నగర వాసులు చూపించిన చొరవ మర్చిపోలేనని పేర్కొన్నారు. హైదరాబాద్ దేశంలో నెంబర్ వన్ కావడానికి ఆనాడు టీడీపీ సర్కార్ వేసిన పునాదులే కారణమని చెప్పారు. "తెలంగాణలో మేం నాలెడ్జ్ ఎకానమీకి నాంది పలికాం. నా తర్వాత కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు ఆ అభివృద్ధిని కొనసాగించాయి. ఫలితంగా పదేండ్లలో దేశంలోనే అత్యంత ధనవంతమైన రాష్ట్రంగా అభివృద్ధి చెందితే, ఏపీ అట్టడుగుకు పడిపోయింది. తెలంగాణ తలసరి ఆదాయం రూ. 3,80,754 కాగా, ఏపీ తలసరి ఆదాయం రూ.2,19,518 మాత్రమే.

రాష్ట్ర విభజన జరిగేటప్పుడు తెలంగాణ తలసరి ఆదాయంతో పోల్చితే 35 శాతం వ్యత్యాసం ఉంది. దాన్ని ఐదేండ్లలో 27.5 శాతానికి తగ్గించాను. ఆ తర్వాత ఏపీలో అధికారం చేపట్టిన జగన్ సర్కార్ రాష్ట్రాన్ని అధోగతి పాల్జేసింది. విభజన నష్టాల కంటే జగన్ పాలన వల్లే ఏపీ తీవ్రంగా నష్ట పోయింది" అని బాబు ఆందోళన వ్యక్తం చేశారు. ఇబ్బందుల్లో ఉన్న ఏపీని మళ్లీ గట్టెక్కించే బాధ్యత తీసుకుంటానని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. నాడు విజన్ గురించి మాట్లాడితే ఎగతాళి చేసిన వారే నేడు మెచ్చుకుంటున్నారని పేర్కొన్నారు. "విజన్ 2020 అంటే 420 అని మాట్లాడారు. 2047 నాటికి మన దేశం ప్రపంచంలోనే నెంబర్-1 గా ఉంటుంది. వికసిత్ భారత్‌లో నెంబర్ వన్‌గా తెలంగాణ, ఏపీ ఉంటాయి. ఉద్యోగాలు చేయడం కాదు, వాటిని ఇతరులకు ఇచ్చే స్థాయికి రావాలని తెలుగు ప్రజలను కోరుతున్నాను" అని అన్నారు. 2024లో 1995 సీబీఎన్‌ను చూస్తారన్న ఆయన, అప్పుడు ఎలా పనిచేశానో ఇప్పుడు అలాగే చేస్తానని పేర్కొన్నారు. రెండు రాష్ట్రాల మధ్యనున్న సమస్యలు పరిష్కరించుకుందామని తానే రేవంత్‌రెడ్డికి లేఖ రాశానని గుర్తు చేశారు. విడిపోయినా సమస్యలపై అన్నదమ్ముల్లా పోరాడి ఐకమత్యంగా ఉండాలని చంద్రబాబు పేర్కొన్నారు. కలిసి పని చేస్తే రెండు రాష్ట్రాలు లబ్ధి పొందుతాయని అన్నారు. రాజకీయాలు ఎలా ఉన్నా తెలుగు జాతి ప్రయోజనాలే ముఖ్యంగా ఉండేలా ఇరు రాష్ట్రాలు కృషి చేయాలని సూచించారు.

ఎవరికీ ఇవ్వని గౌరవం తెలుగు జాతి నాకిచ్చింది

"ఏ నాయకుడికీ ఇవ్వని గౌరవం తెలుగుజాతి నాకిచ్చింది. ఉమ్మడి ఏపీలో తొమ్మిదేండ్లు సీఎంగా ఉన్నాను. పదేండ్లు ప్రతిపక్ష నేతగా ఉన్నాను. నాకు మళ్లీ జన్మంటూ ఉంటే తెలుగు గడ్డపైనే పుడతాను. ఈ నేలపై నేను తిరగని ప్రాంతం లేదు. ఆదిలాబాద్ నుంచి శ్రీకాకుళం వరకు తెలియని ఊరు లేదు. మొన్నటి ఏపీ ఎన్నికల్లో వినూత్నంగా ఆలోచించా. యువతకు అవకాశాలు కల్పించాను. ప్రజలు కూడా బ్రహ్మరథం పట్టారు. తెలుగుదేశం చరిత్రలో ఇంతటి విజయం మునుపెన్నడూ చూడలేదు. వచ్చిన సునామీలో నాటి విధ్వంసకర ప్రభుత్వం కొట్టుకుపోయింది. ప్రజాస్వామ్యంలో రాజులు, నియంతలు లేరు. విర్రవీగితే ఎక్కడికి పంపాలో ప్రజలకు బాగా తెలుసు. ప్రజలకు సేవకులమే తప్ప. పెత్తందారులం కాదని ఎన్నికల్లో పలుమార్లు రుజువైంది. జీవితపు చివరి రక్తం బొట్టు వరకూ ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతాను"అని బాబు పేర్కొన్నారు. గతానికి భిన్నంగా జై హిందుస్తాన్, జై తెలంగాణ అంటూ ఆయన తన ప్రసంగాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ నేతలు అర్వింద్ కుమార్ గౌడ్, నందమూరి సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

కేరళలో డిజిటల్ విద్య భేష్

(మొదటిపేజీ తరువాయి)

అమలు చేసేందుకు ఫిన్లాండ్ సైతం ఆసక్తి చూపింది. కేరళను విజ్ఞాన, ఆర్థిక సమాజంగా మార్చేందుకు లిటిల్ కైట్ చర్యలు దోహదపడతాయని నివేదిక తెలిపింది. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీస్తుందని, సమస్యలను పరిష్కరించే నైపుణ్యాన్ని అందిస్తుందని వివరించింది. బాలికల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం ద్వారా స్టెమ్ క్షేత్రాల్లో లింగ అసమానతలను తొలగించడానికి కృషి చేస్తుందని చెప్పింది. అంతేకాక ఈ కార్యక్రమం కారణంగా ప్రైవేటు పాఠశాలలకు చెందిన అనేక మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరుతున్నారు. లిటిల్ కైట్ కార్యక్రమాన్ని అన్ని హైస్కూళ్లకు, ఉన్నత విద్యా స్థాయికి విస్తరించాలని యునిసెఫ్ అధ్యయనం సూచించింది. ప్రభుత్వ విద్యలో పెట్టుబడులు పెంచేందుకు స్థానిక సంస్థలు, సమూహాలను భాగస్వాములను చేయాలని కోరింది. లిటిల్ కైట్ కార్యక్రమం కోసం తొమ్మిది వేల రోబోటిక్ కిట్స్‌ను, శిక్షణను అందిస్తున్నందుకు కేరళను అభినందించింది. కైట్ కార్యక్రమం తన విజయ గాథలను ఇతర రాష్ట్రాలు, దేశాలతో పంచుకునేందుకు సిద్ధంగా ఉన్నదని యూనిసెఫ్ ఇండియాలో పనిచేస్తున్న సామాజిక విధాన నిపుణుడు డాక్టర్ అకిల రాధాకృష్ణన్ చెప్పారు. లిటిల్ కైట్ కార్యక్రమాన్ని ఇతర ప్రాంతాలకు విస్తరింపజేసేందుకు యూనిసెఫ్ భాగస్వామ్యాన్ని కోరుతున్నామని కైట్ సీఈఓ కె.అన్వర్ సాదాత్ తెలిపారు. అధ్యయన నివేదికను యూనిసెఫ్ వెబ్‌సైటులో ప్రచురించారు.

తక్కువ ఖర్చు..ఎక్కువ ఆయకట్టు

(మొదటిపేజీ తరువాయి)

తెచ్చి కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మించటం తప్ప మెయిన్ కాల్వలు, డిస్ట్రిబ్యూటరీలు, ఆయకట్టుకు నీటిని అందించే కాల్వలు నిర్మించకుండానే వదిలేసింది. అదే తరహాలో గత ప్రభుత్వం చేపట్టిన చాలా ప్రాజెక్టులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. ఇటీవల పలు దఫాలుగా ఈ ప్రాజెక్టులపై చర్చించిన ముఖ్యమంత్రి తక్కువ ఖర్చుతో పూర్తయ్యే ప్రాజెక్టులు, వీలైనంత తొందరగా సాగునీటిని అందించేందుకు వీలున్న ప్రాజెక్టులను చేపడితే రైతులకు మేలు జరుగుతుందనీ, అందుకు అవసరమైన అంచనాలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.

నేడు ఏపీకి సీఎం రేవంత్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించనున్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి వేడుకలను పురస్కరించుకుని మంగళగిరి సీకే కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే కార్యక్రమానికి ఉపముఖ్యమంత్రి భట్టి, మంత్రులు పొంగులేటి, కోమటిరెడ్డితో కలిసి సీఎం హాజరు కానున్నారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకోనున్నారు. అనంతరం మంగళగిరి చేరుకుని సాయంత్రం 5 నుంచి 6:30 గంటల వరకు వైఎస్‌ఆర్ జయంతి వేడుకల్లో పాల్గొంటారు. రాత్రి 7గంటలకు తిరిగి గన్నవరం విమానాశ్రయం నుంచి హైదరాబాద్ రానున్నారు.

బోనమెత్తిన గోల్కొండ

(మొదటిపేజీ తరువాయి)

ప్రవేశించారు. అనంతరం కోటపై ఉన్న జగదాంబిక మహంకాళి(ఎల్లమ్మ)కి బోనం సమర్పించారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు

అమ్మవారికి సమర్పించే బోనం ముందు కోలాటలు, పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలతో చేస్తున్న ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. లంగర్‌హౌజ్‌లో ప్రారంభమై శోభాయమానంగా సాగిన ఊరేగింపు గోల్కొండ కోటకు చేరిన తర్వాత అమ్మవారి విగ్రహాలను ఆలయంలో ఉంచి పూజలను నిర్వహించారు. గోల్కొండ బోనాల సందర్భంగా నగరంతో పాటు చుట్టుపక్కనున్న జిల్లాలైన సంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి భక్తులు ఈ వేడుకల్లో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం నుంచే కోటలోనే బోనం(ప్రసాదం) వండి, ఒడిబియ్యాలు సమర్పించారు. దీంతో కోటలోపల పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. గోల్కొండ బోనాలకు తరలి వచ్చే భక్తుల కోసం ప్రభుత్వ యంత్రాంగం తగిన ఏర్పాట్లు చేసింది. కోట ప్రారంభం నుంచి బోనాలు సమర్పించే ప్రాంతం వరకు తాగునీటికి ఏర్పాట్లు చేసింది.

హైదరాబాద్ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా బోనాల ఉత్సవాలు: మంత్రులు కొండా, పొన్నం

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారి నిర్వహిస్తున్న ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలను ప్రజలకు కనువిందు కలిగించేలా నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. గోల్కొండ శ్రీ జగదాంబిక మహంకాళి అమ్మవారి బోనాల మహెూత్సవాల్లో భాగంగా ఆదివారం లంగర్‌హౌజ్ చౌరస్తాలో నిర్వహించిన బోనాలు, తొట్టెల, రథం ఊరేగింపు కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి, ఎమ్మెల్యే దానం నాగేందర్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి కలసి పాల్గొని అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిర్వహిస్తున్న తొలి బోనాల్లో పట్టు వస్త్రాలను సమర్పించే అవకాశం మహిళగా తనకు రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ప్రశాంత వాతావరణంలో బోనాలు సమర్పించుకొని ఇండ్లకు చేరుకునేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని పోలీస్‌శాఖను ఆదేశించామని తెలిపారు. విద్యుత్, నీటి సౌకర్యం, వైద్య సేవలు అందించేందుకు సంబంధిత శాఖలను ఆదేశించామన్నారు. గతంలో నిర్వహించిన బోనాలను మరిపించే విధంగా ఈసారి 10 శాతం నిధులు పెంచి దేవాలయాలకు అందించినట్టు తెలిపారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. నెల రోజులుగా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో అధికారులతో అనేక సమావేశాలు నిర్వహించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ప్రభుత్వ పక్షాన సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్ సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టేలా బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఆదేశించారని తెలిపారు. ప్రభుత్వం ఎన్ని ఏర్పాట్లు చేసినా ప్రజల సహాయ, సహకారాలు కావాలన్నారు. ఈ సందర్భంగా మంత్రి పోతరాజులతో కలిసి నృత్యం చేశారు. డప్పు చప్పుళ్లు, పోతరాజుల విన్యాసాలతో కొండపైకి తొట్టెల రథం ఊరేగింపు జరిగింది. అనంతరం మంత్రులు సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి దేవాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్ , దేవాదాయ శాఖ కమిషనర్ హన్మంత రావు, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, ఆలయ కమిటీ చైర్మెన్ అరవింద్ మహేష్ కుమార్, పీస్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సైకలాజికల్ థ్రిల్లర్‌గా కలి


యువ హీరోలు ప్రిన్స్, నరేష్ అగస్త్య నటిస్తున్న సినిమా 'కలి'. ఈ చిత్రాన్ని కథా రచయిత కె.రాఘవేంద్ర రెడ్డి సమర్పణలో రుద్ర క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తోంది. శివ శేషు దర్శకత్వంలో నిర్మాత లీలా గౌతమ్ వర్మ తెరకెక్కిస్తున్నారు. సైకలాజికల్ థ్రిల్లర్ కథతో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసుకుంది. త్వరలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది.

ఈ నేపథ్యంలో ఆదివారం ఈ మూవీ టీజర్‌ను డైరెక్టర్ నాగ్ అశ్విన్ లాంచ్ చేశారు. 'టీజర్ ఇంట్రెస్టింగ్‌గా ఉండి ఆకట్టుకుందని, ఒక కొత్త కాన్సెప్ట్‌ను డైరెక్టర్ శివ శేషు తెలుగు ఆడియెన్స్ ముందుకు తీసుకొస్తున్నట్లు టీజర్‌తో తెలుస్తోందని నాగ్ అశ్విన్ చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.

'కలి పాత్ర నేపథ్యంతో సాగే ఇంట్రెస్టింగ్ సైకలాజికల్ థ్రిల్లర్ మూవీ ఇది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. త్వరలోనే సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం' అని చిత్ర సమర్పకులు కె. రాఘవేంద్రరెడ్డి చెప్పారు. నిర్మాత లీలా గౌతం వర్మ మాట్లాడుతూ, 'దర్శకుడు నాగ్ అశ్విన్ ఎంతో బిజీగా ఉన్నా మాకు టైమ్ ఇచ్చి టీజర్‌ను లాంచ్ చేసినందుకు థ్యాంక్స్' అని తెలిపారు. 'మైథాలజీ, సైకలాజికల్ థ్రిల్లర్ జోనర్స్ కలిపిన చిత్రమిది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందిస్తుంది' అని రచయిత, డైరెక్టర్ శివ శేషు అన్నారు.

నవచిత్రం

డబ్బింగ్‌లో బచ్చల మల్లి



అల్లరి నరేష్

హీరో అల్లరి నరేష్ నటిస్తున్న కొత్త సినిమా 'బచ్చల మల్లి'. 'సోలో బ్రతుకే సో బెటర్' ఫేమ్ సుబ్బు మంగదేవి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. 'సామజవరగమన, ఊరు పేరు భైరవకోన' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలను అందించిన హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా, బాలాజీ గుత్తా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సెప్టెంబర్‌లో ఈ సినిమాని విడుదల చేస్తామని మేకర్స్ ఇటీవలే అనౌన్స్ చేశారు. తాజాగా మేకర్స్ డబ్బింగ్‌ని ప్రారంభించారు. ఈ మూవీలో నరేష్ ఇంతకు ముందు ఎన్నడూ చేయని మాస్ క్యారెక్టర్‌లో ఆదరగొట్టబోతున్నారు. నరేష్‌ని డైరెక్టర్ సుబ్బు సరికొత్త అవతార్‌లో ప్రెజెంట్ చేస్తున్నారు. ఈ క్రేజీ ప్రాజెక్ట్ కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అల్లరి నరేష్ సరసన అమృత అయ్యర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో రోహిణి, రావు రమేష్, అచ్యుత్ కుమార్, బలగం జయరామ్, హరి తేజ, ప్రవీణ్, వైవా హర్ష తదితరులు ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు.

'సీతా రామం' చిత్రానికి మ్యూజిక్ ఇచ్చిన విశాల్ చంద్రశేఖర్ సంగీతం సమకూరుస్తుండగా, మానాడు, రంగం, మట్టి కుస్తి వంటి చిత్రాలకు పనిచేసిన రిచర్డ్ ఎం నాథన్ డీవోపీగా చేస్తున్నారు. ఛోటా కె ప్రసాద్ ఎడిటర్‌గా, బ్రహ్మ కడలి ప్రొడక్షన్ డిజైనర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.



కథ నమ్మి తీసిన సినిమా

> ఈ సినిమా మూడేళ్ళ జర్నీ. ట్రైలర్‌లో చూసినట్టుగా ఇది చాలా ఫన్ ఫిల్మ్. నభా, దర్శి ఈ సినిమా కోసం యాక్టింగ్ వర్క్ షాప్ చేశారు. నభా ఇందులో చాలా డిఫరెంట్‌గా కనిపిస్తారు. సరికొత్త దర్శిని చూడబోతున్నారు. వివేక్ సాగర్ అద్భుతమైన ఆల్బం ఇచ్చారు. సినిమా చాలా ఫ్రెష్ ఫీలింగ్ ఇస్తుంది.
>
> - డైరెక్టర్ అశ్విన్

ప్రియదర్శి, నభా నటేష్ లీడ్ రోల్స్‌లో, అశ్విన్ రామ్ దర్శకత్వం వహించిన యూనిక్ రోమ్-కామ్ చిత్రం 'డార్లింగ్'. ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై కె. నిరంజన్ రెడ్డి, శ్రీమతి చైతన్య నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 19న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం ఈ చిత్ర థియేట్రికల్ ట్రైలర్‌ను హీరో విశ్వక్ సేన్ గ్రాండ్‌గా లాంచ్ చేశారు.

ఈ ఈవెంట్‌లో విశ్వక్ సేన్ మాట్లాడుతూ, 'కళామాతల్లికి దర్శి అంటే ఇష్టం అనుకుంటా. 'బలగం, మల్లేశం' లాంటి సినిమాలు అందరికీ పడవు. రాసి పెట్టుండాలి. ఇప్పుడు తను 'డార్లింగ్'తో రావడం చాలా ఆనందంగా ఉంది. తాను గెలిస్తే నేను గెలిచినట్లనిపిస్తది. ఈ ట్రైలర్ చాలా ప్రామెసింగ్‌గా ఉంది. డైరెక్టర్ చాలా అద్భుతంగా తీశారు. ట్రైలర్ హిలేరియస్‌గా అనిపించింది. నభా యాక్సిడెంట్ నుంచి కోలుకుని, స్ట్రాంగ్ కమ్ బ్యాక్ ఇస్తోంది. ఇది చాలా మందికి స్ఫూర్తినిచ్చే అంశం. ఈ సినిమా ఖచ్చితంగా మంచి విజయాన్ని సాధిస్తుంది' అని తెలిపారు. 'డైరెక్టర్ అశ్విన్ వలనే 'డార్లింగ్'గా మీముందు ఉన్నా. 'డార్లింగ్' అనగానే ప్రభాస్ పేరు వస్తుంది. అలాంటి టైటిల్ పెట్టుకోవాలన్నా భయం భయంగా ఉండేది. అయితే కథని నమ్మి 'డార్లింగ్' అని టైటిల్ పెట్టుకున్నాం. నిరంజన్, చైతన్య సినిమాని చాలా గ్రాండ్‌గా నిర్మించారు. నభా ఎక్స్‌ట్రార్డినరీగా యాక్ట్ చేసింది. వివేక్ సాగర్ సూపర్ మ్యూజిక్ అందించాడు. అందరూ అద్భుతంగా వర్క్ చేశారు' అని హీరో ప్రియదర్శి చెప్పారు.

హీరోయిన్ నభా నటేష్ మాట్లాడుతూ,'ఈ మూవీ నాకు చాలా స్పెషల్. యాక్సిడెంట్ నుంచి కోలుకున్న తర్వాత ఎలాంటి సినిమా చేయాలని ఆలోచిస్తున్నప్పుడు ఈ కథ వచ్చింది. చాలా నచ్చింది. అశ్విన్ రాసిన క్యారెక్టర్ అద్భుతంగా ఉంది. 'హనుమాన్' సక్సెస్ డార్లింగ్‌తోనూ కంటిన్యూ అవుతుంది. దర్శితో నా కెమిస్ట్రీ చాలా కొత్తగా ఉంటుంది. ఇందులో డిఫరెంట్ దర్శిని చూస్తారు' అని తెలిపారు. 'ఇందులో ఎలాంటి కొత్త ఎలిమెంట్స్ చూపించామో థియేటర్స్‌కి వచ్చి ఆడియన్స్ చెప్పాలని కోరుకుంటున్నాం. కథని నమ్మి తీసిన సినిమా. అశ్విన్ చాలా అద్భుతంగా తీశాడు. అవుట్ పుట్ చాలా అద్భుతంగా వచ్చింది' అని నిర్మాత చైతన్య అన్నారు.

సరికొత్త నేపథ్యంతో తుఫాన్



విజయ్ ఆంటోనీ, మేఘా ఆకాష్

హీరో విజయ్ ఆంటోనీ నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'తుఫాన్'. ఇన్ఫినిటీ ఫిల్మ్ వెంచర్స్ బ్యానర్ పై కమల్ బోరా, డి.లలితా, బి.ప్రదీప్, పంకజ్ బోరా నిర్మిస్తున్నారు.

ఈ సంస్థ గతంలో విజయ్ ఆంటోనీ హీరోగా 'రాఘవన్, హత్య' చిత్రాలను నిర్మించింది. పొయెటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ జోనర్‌లో ఈ సినిమాను దర్శకుడు విజయ్ మిల్టన్ తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాను ఈ నెల 26వ తేదీన గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకురానున్నారు. ఈ నేపథ్యంలో ఈ చిత్ర ట్రైలర్ ఇంట్రడక్షన్ ఈవెంట్‌ను హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. నిర్మాత ధనుంజయన్ మాట్లాడుతూ, 'ఈ సినిమా టీజర్, ట్రైలర్ మీరంతా చూశారు. మీ అందరికీ నచ్చాయని అనుకుంటున్నా. ఈ సినిమా యాక్షన్, ఎమోషన్ వంటి అన్ని అంశాలతో అలరిస్తుంది' అని అన్నారు.

'నాకు ఈ మూవీ చేసే అవకాశం ఇచ్చిన నిర్మాతలకు, విజయ్ ఆంటోనీకి థ్యాంక్స్. భాష్యశ్రీ స్ట్రైట్ తెలుగు సినిమా అనేంత బాగా రచన చేశారు' అని డైరెక్టర్ విజయ్ మిల్టన్ చెప్పారు. హీరోయిన్ మేఘా ఆకాష్ మాట్లాడుతూ, 'నా కెరీర్‌లో ఒక స్పెషల్ మూవీ ఇది. ఈ సినిమాలో లవ్, రొమాన్స్, యాక్షన్, ఎమోషన్, మంచి సాంగ్స్ అన్నీ ఉన్నాయి' అని తెలిపారు. 'ఈ సినిమా నేపథ్యం కొత్తగా ఉంటుంది. విజయ్ మిల్టన్ ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించారు' అని హీరో విజయ్ ఆంటోనీ చెప్పారు.

ఎవరు..ఎందుకు?




వీటి ఎంటర్‌ప్రైజెస్ పతాకంపై రవి సిరోర్, నివిష్క పాటిల్ హీరో, హీరోయిన్లుగా ఎస్‌జిఆర్ దర్శకత్వంలో జి. వెంకటేష్ రెడ్డి నిర్మించిన చిత్రం 'ఎవరు ఎందుకు?'. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్ర ఫస్ట్ లుక్‌ని కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి ఆవిష్కరించారు.

అలాగే ఈ చిత్రంలోని లిరికల్ సాంగ్‌ని ప్రొడ్యూసర్ కౌన్సిల్ సెక్రటరీ ప్రసన్నకుమార్ విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్యామలాదేవి మాట్లాడుతూ, 'వెంకటరెడ్డి ప్రభాస్ ఫ్యాన్స్ హిందూపూర్ ప్రెసిడెంట్‌గా ఎప్పటినుంచో ఉన్నారు. ఆయన మా ఫ్యామిలీ మొత్తానికి అభిమాని. ఆయన నిర్మాతగా మారడం చాలా ఆనందంగా ఉంది. ప్రభాస్ ఫ్యాన్స్ నుంచి సినీ పరిశ్రమకు ఒక డైరెక్టర్ రావాలి, ఒక ప్రొడ్యూసర్ రావాలి, ఒక యాక్టర్ రావాలి. మాతోపాటు మా అభిమానులు అందరూ బాగుండాలి అని కోరుకుంటున్నాను' అని అన్నారు

'మా చిత్ర ఫస్ట్‌లుక్‌ని మా ఆరాధ్య దైవం కృష్ణంరాజు సతీమణి శ్యామల ఆవిష్కరించడం చాలా ఆనందంగా ఉంది. ఇదొక మంచి ఫ్యామిలీ ఎమోషన్ ఎంటర్టైనర్. చక్కటి మ్యూజిక్‌కి స్కోపు ఉన్న చిత్రం. ఈ చిత్రం డెఫినెట్‌గా అందర్నీ అలరిస్తుందని ఆశిస్తున్నాను' అని నిర్మాత వెంకటేష్ రెడ్డి చెప్పారు. చిత్ర డైరెక్టర్ ఎస్.జి.ఆర్ మాట్లాడుతూ, 'మా చిత్రాన్ని హిందూపూర్ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరించాం. ఇందులో ఉన్న మూడు పాటలను నేనే రాశాను. ఈ సినిమా అందర్నీ అలరిస్తుంది' అని తెలిపారు.

బడ్డీ.. రిలీజ్‌కి రెడీ



అల్లు శిరీష్

అల్లు శిరీష్ హీరోగా నటిస్తున్న కొత్త చిత్రం 'బడ్డీ'. గాయత్రి భరద్వాజ్, ప్రిషా రాజేశ్ సింగ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని స్టూడియో గ్రీన్ ఫిలింస్ బ్యానర్ పై కేఈ జ్ఞానవేల్ రాజా, అధన జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. శామ్ ఆంటోన్ దర్శకత్వం వహిస్తున్నారు. నేహా జ్ఞానవేల్ రాజా కో ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. యూత్ ఫుల్ లవ్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా తెరకెక్కింది. ఈనెల 26న ఈ సినిమా ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.

ఈ నేపథ్యంలో తాజాగా ఈ సినిమా నుంచి 'ఫీల్ ఆఫ్ బడ్డీ' లిరికల్ సాంగ్‌ని మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ పాటను హిప్ హాప్ తమిళ కంపోజ్ చేసి, ఐరా ఉడుపితో కలిసి పాడారు. సాయి హేమంత్ లిరిక్స్ అందించారు. 'చూసాలే ఊసాలే నాలో నీ కలనే...దాచాలే దాచాలే నాలో ఆ కలనే..అంటూ హార్ట్ టచింగ్‌గా ఈ పాట సాగుతూ అందర్నీ అలరిస్తోంది. హీరో అల్లు శిరీష్ ఇప్పటివరకు చేయనటువంటి పాత్రను ఇందులో చేశాను. వినూత్న కథాకథనాలతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ సినిమా కచ్చితంగా విజయం సాధిస్తుందనే ఆశాభావాన్ని మేకర్స్ వ్యక్తం చేశారు.

అజ్మల్ అమీర్, ప్రిషా రాజేశ్ సింగ్, ముఖేష్ కుమార్, అలీ తదితరులు నటించిన ఈచిత్రానికి ఎడిటర్ - రూబెన్, సినిమాటోగ్రఫీ - కృష్ణన్ వసంత్.

ఆటలు

అభిషేక్ అదరహో

- 46 బంతుల్లోనే 100 బాదిన చిచ్చరపిడుగు
- శివమెత్తిన రుతురాజ్, రింకూ సింగ్
- స్పిన్, పేస్‌కు జింబాబ్వే విలవిల

100 పరుగుల తేడాతో భారత్ ఘన విజయం

భారత చిచ్చరపిడుగు ఆకాశమే హద్దుగా చెలరేగాడు. ఐపీఎల్‌లో ప్రపంచ శ్రేణి పేసర్లను చితక్కొట్టిన చిన్నోడు.. హరారేలో జింబాబ్వే బౌలర్లను హడలెత్తించాడు. 46 బంతుల్లోనే శతకబాదిన అభిషేక్ వర్మ (100) హ్యాట్రిక్ సిక్సర్లతో సెంచరీ సాధించిన తొలి ఆటగాడిగా రికార్డు నెలకొల్పాడు. రుతురాజ్ గైక్వాడ్ (77), రింకూ సింగ్ (48) సైతం మెరవటంతో తొలుత భారత్ 234 పరుగుల భారీ స్కోరు చేసింది. బౌలర్లు సమిష్టిగా చెలరేగటంతో ఛేదనలో జింబాబ్వే 134 పరుగులకే చేతులెత్తేసింది. 100 పరుగుల తేడాతో భారత్ ఏకపక్ష విజయం సాధించింది. ఐదు మ్యాచుల టీ20 సిరీస్‌ను 1-1తో సమం చేసింది.

నవతెలంగాణ-హరారే

కుర్రాళ్లు ప్రతీకార పంజా విసిరారు. తొలి టీ20లో అనూహ్యంగా తడబాటుకు గురైన శుభ్‌మన్ గిల్ సేన.. మరుసటి రోజే పసికూనపై ప్రతాపం చూపించింది. బ్యాట్‌తో, బంతితో తిరుగులేని ప్రదర్శన చేసిన భారత్ 100 పరుగుల తేడాతో జింబాబ్వేను చిత్తు చేసింది. ఐదు మ్యాచుల టీ20 సిరీస్‌ను 1-1తో సమం చేసింది. అభిషేక్ శర్మ (100, 47 బంతుల్లో 7 ఫోర్లు, 8 సిక్స్‌లు) ధనాధన్ సెంచరీతో చెలరేగాడు. రుతురాజ్ గైక్వాడ్ (77 నాటౌట్, 47 బంతుల్లో 11 ఫోర్లు, 1 సిక్స్), రింకూ సింగ్ (48 నాటౌట్, 22 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్‌లతో కదం తొక్కారు. టాప్-4 బ్యాటర్లు రాణించటంతో భారత్ తొలుత నిర్ణీత 20 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 234 పరుగుల భారీ స్కోరు సాధించింది. రికార్డు ఛేదనలో జింబాబ్వే తేలిపోయింది. భారత పేసర్లు అవేశ్ ఖాన్ (3/11), ముకేశ్ కుమార్ (3/37) సహా స్పిన్నర్ రవి బిష్ణోయ్ (2/11) మాయజాలంతో జింబాబ్వే విలవిల్లాడింది. 18.4 ఓవర్లలో 134 పరుగులకే ఆలౌటైంది. వెస్లీ (43, 39 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), ల్యూక్ జాంగ్వే (33, 26 బంతుల్లో 4 ఫోర్లు), బ్రియాన్ బెనెట్ (26, 9 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్స్‌లు) రాణించారు. శతక వీరుడు అభిషేక్ శర్మ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు. భారత్, జింబాబ్వే మూడో టీ20 బుధవారం హరారే వేదికగా జరుగనుంది.

అభి.. ఆకాశమే హద్దు! : అరంగేట్ర మ్యాచ్‌లో డకౌట్‌గా నిష్క్రమించిన అభిషేక్ శర్మ (100) రెండో టీ20లో తనేంటో చూపించాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (2) నిరాశపరిచినా.. ఓ ఎండ్‌లో పవర్‌ప్లేలో ఓపిగ్గా నిలబడ్డాడు. ఇన్నింగ్స్ ఆరంభంలోనే ఓ సిక్సర్, రెండు ఫోర్లు బాదిన అభిషేక్.. పవర్‌ప్లేలో నెమ్మదించాడు. గిల్ వికెట్ అందుకు తోడైంది. దీంతో తొలి ఆరు ఓవర్లలో భారత్ 36 పరుగులే చేసింది. వ్యక్తిగత స్కోరు 28 వద్ద అభిషేక్‌కు జీవనదానం లభించింది. ఈ అవకాశం సద్వినియోగం చేసుకున్న అభిషేక్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. అప్పటి వరకు 24 బంతుల్లో 28 పరుగులే చేసిన అభిషేక్.. ఆ తర్వాతి 22 బంతుల్లో ఏకంగా 72 పరుగులు పిండుకున్నాడు. నాలుగు ఫోర్లు, మూడు సిక్సర్లతో 33 బంతుల్లో అర్థ సెంచరీ సాధించిన అభిషేక్.. వంద మార్క్‌ను ఏడు ఫోర్లు, ఎనిమిది సిక్సర్లతో 46 బంతుల్లోనే అందుకున్నాడు. టీ20 ఫార్మాట్‌లో భారత్ తరఫున మూడో వేగవంతమైన సెంచరీ సాధించిన రికార్డు సొంతం చేసుకున్నాడు. మసకద్జ ఓవర్లో హ్యాట్రిక్ సిక్సర్లతో కెరీర్ తొలి సెంచరీ పూర్తి చేసిన అభిషేక్.. క్రీజులో ఉన్నంతసేపు సునామీ సృష్టించాడు. రుతురాజ్ గైక్వాడ్ (77 నాటౌట్), రింకూ సింగ్ (48 నాటౌట్) ఆరంభంలో నెమ్మదిగా ఆడినా.. డెత్ ఓవర్లలో దంచికొట్టారు. రింకూ సింగ్ సిక్సర్ల వర్షం కురిపించగా.. రతురాజ్ బౌండరీలతో దండయాత్ర చేశాడు. ఈ ఇద్దరూ దూకుడు ఆడటంతో భారత్ 234 పరుగుల భారీ స్కోరు సాధించింది.

పేస్, స్పిన్ మాయ : టీ20ల్లో జింబాబ్వేపై అత్యధిక పరుగులు చేసిన జట్టుగా నిలిచిన టీమ్ ఇండియా.. బంతితోనూ ఆ జట్టు అదే స్థాయిలో వణికించింది. పేసర్లు ముకేశ్ కుమార్, అవేశ్ ఖాన్‌లు ఆరు వికెట్లు పడగొట్టగా.. స్పిన్నర్ రవి బిష్ణోయ్ రెండు వికెట్లతో మాయ చేశాడు. దీంతో 18.4 ఓవర్లలోనే జింబాబ్వే కుప్పకూలింది. 134 పరుగులకే పరిమితమైన ఆతిథ్య జట్టు.. 100 పరుగుల భారీ తేడాతో పరాజయం పాలైంది.



జింబాబ్వే తరఫున ఓపెనర్ వెస్లీ (43), బ్రియాన్ బెనెట్ (26) టాప్ ఆర్డర్‌లో ఆకట్టుకున్నారు. లోయర్ ఆర్డర్‌లో ల్యూక్ జాంగ్వే (33) జింబాబ్వేకు మూడెంకల స్కోరు అందించేందుకు చెమటోడ్చాడు. ఇన్నోసెంట (0), మేయర్స్ (0), క్లైవ్ (0)లు పరుగుల ఖాతా తెరువకుండానే నిష్క్రమించారు. కెప్టెన్ సికిందర్ రజా (4) తేలిపోయాడు.

స్కోరు వివరాలు :

భారత్ ఇన్నింగ్స్ : శుభ్‌మన్ గిల్ (సి) బెనెట్ (బి) ముజరబాని 2, అభిషేక్ శర్మ (సి) మేయర్స్ (బి) మసకద్జ 100, రుతురాజ్ గైక్వాడ్ నాటౌట్ 77, రింకూ సింగ్ నాటౌట్ 48, ఎక్స్‌ట్రాలు :7, **మొత్తం :** (20 ఓవర్లలో 2 వికెట్లకు) 234.

వికెట్ల పతనం : 1-10, 2-147.

బౌలింగ్ : బ్రియాన్ బెనెట్ 2-0-22-1, బ్లెసింగ్ ముజరబాని 4-1-30-1, తండాయ్ చతార 4-0-38-0, సికిందర్ రజా 3-0-34-0, ల్యూక్ జాంగ్వే 4-0-53-0, మేయర్స్ 1-0-28-0, మసకద్జ 2-0-29-1.

జింబాబ్వే ఇన్నింగ్స్ : ఇన్నోసెంట్ (బి) ముకేశ్ కుమార్ 4, వెస్లీ (బి) రవి బిష్ణోయ్ 43, బ్రియాన్ బెనెట్ (బి) ముకేశ్ కుమార్ 26, మేయర్స్ (సి) రింకూ సింగ్ (బి) అవేశ్ ఖాన్ 0, సికిందర్ రజా (సి) జురెల్ (బి) అవేశ్ ఖాన్ 4, కాంప్‌బెల్ (సి) రవి బిష్ణోయ్ (బి) వాషింగ్టన్ 10, క్లైవ్ (ఎల్బీ) రవి బిష్ణోయ్ 0, మసకద్జ రనౌట్ 1, ల్యూక్ జాంగ్వే (సి) గైక్వాడ్ (బి) ముకేశ్ కుమార్ 33, బ్లెస్సింగ్ (సి) వాషింగ్టన్ (బి) అవేశ్ ఖాన్ 2, చతార నాటౌట్ 0, ఎక్స్‌ట్రాలు : 11, **మొత్తం :** (18.4 ఓవర్లలో ఆలౌట్) 134.

వికెట్ల పతనం : 1-4, 2-40, 3-41, 4-46, 5-72, 6-73, 7-76, 8-117, 9-123, 10-134.

బౌలింగ్ : ముకేశ్ కుమార్ 3.4-0-37-3, అభిషేక్ శర్మ 3-0-36-0, అవేశ్ ఖాన్ 3-0-15-3, రవి బిష్ణోయ్ 4-0-11-2, వాషింగ్టన్ సుందర్ 4-0-28-1, రియాన్ పరాగ్ 1-0-5-0.


1 హ్యాట్రిక్ సిక్సర్లతో సెంచరీ సాధించిన తొలి ఆటగాడిగా అభిషేక్ రికార్డు సృష్టించాడు. 82 పరుగుల వద్ద ఉండగా.. 6, 6, 6తో అభిషేక్ శతకం పూర్తి చేశాడు.

3 టీ20 ఫార్మాట్‌లో వేగంగా సెంచరీ సాధించిన మూడో ఆటగాడు అభిషేక్ శర్మ. రోహిత్ శర్మ (35), సూర్యకుమార్ యాదవ్ (45) ముందున్నారు. అభిషేక్ 46 బంతుల్లో సెంచరీ సాధించాడు.

234 పొట్టి ఫార్మాట్‌లో జింబాబ్వేపై ఓ జట్టు సాధించిన అత్యధిక స్కోరు 234. హరారేలో భారత్ ఈ రికార్డు నెలకొల్పింది.

క్వార్టర్స్‌లో పావొలిని

వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్



లండన్ (ఇంగ్లాండ్) : వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ మహిళల సింగిల్స్‌లో టైటిల్ ఫేవరేట్స్ ఒక్కొక్కరుగా ఇంటిముఖం పడుతుంటే.. ఏడో సీడ్ జాస్మిన్ పావొలిని మాత్రం దూసుకెళ్తోంది. ఆదివారం జరిగిన ప్రీ క్వార్టర్‌ఫైనల్లో జాస్మిన్ పావొలిని వాకోవర్‌తో ముందంజ వేసింది. అమెరికా క్రీడాకారిణి, 12వ సీడ్ మడిసన్ కీస్ గాయంతో నిర్ణయాత్మక మూడో సెట్‌లో 5-5తో సమవుజ్జీగా ఉన్న దశలో పోటీ నుంచి తప్పుకుంది. తొలి సెట్‌ను 6-3తో పావొలిని నెగ్గగా.. రెండో సెట్‌ను టైబ్రేకర్‌లో 7-6(8-6)తో మడిసన్ కీస్ పైచేయి సాధించింది. స్పెయిన్ యంగ్ బుల్ కార్లోస్ అల్కరాస్ సైతం క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించాడు. పురుషుల సింగిల్స్‌లో మూడో సీడ్ అల్కరాస్ 6-3, 6-4, 1-6, 7-5తో విజయం సాధించాడు. ఫ్రాన్స్ ఆటగాడు హంబర్ట్‌పై నాలుగు సెట్ల మ్యాచ్‌లో గెలుపొందాడు. 14 ఏస్‌లు కొట్టిన అల్కరాస్ ఆరు బ్రేక్ పాయింట్లతో అదరగొట్టాడు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

రైల్వే లోకో పైలెట్ల సమస్యలను పార్లమెంట్‌లో ఎలుగెత్తుతాం

- రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ : లోకో పైలెట్ల దుస్థితిపై ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఆదివారం ఆవేదన వ్యక్తం చేశారు. లోకో పైలెట్ల హక్కులను, పని పరిస్థితులను మెరుగుపరిచేందుకు పార్లమెంట్‌లో ఇండియా ఫోరం తన గళాన్ని ఎలుగెత్తుతుందని చెప్పారు. 'ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వ హయంలో లోకో పైలెట్ల జీవితపు రైలు పూర్తిగా పట్టాలు తప్పింది' అని రాహుల్ గాంధీ ఎక్స్‌లో పోస్టు చేశారు. న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో ఇటీవల తాను లోకో పైలెట్లలతో మాట్లాడిన వీడియోను రాహుల్ పోస్టు చేశారు. రోజుకు 16 గంటలు వేడిగా ఉండే క్యాబిన్లల్లో లోకో పైలెట్లు పని చేయవల్సి వస్తోందని అన్నారు. 'కోట్లాది మంది ప్రయాణీకులు ఆధారపడే ఉద్యోగులకు తమ జీవితాలపైనే నమ్మకం లేదు. లోకో పైలెట్లకు పని గంటలపై పరిమితి లేదు. వారికి సెలవులు కూడా లేవు. మూత్ర విసర్జన వంటి కనీస సౌకర్యాలు కూడా లేవు' అని అన్నారు.

స్వీడన్‌లో తాతలకూ పేరెంటల్ లీవ్



స్టాక్‌హోమ్: పేరెంటల్ లీవ్ ఇంతవరకు తల్లిదండ్రులకే లభించడం చూశాం. ఇప్పుడు తాతలు కూడా పేరెంటల్ లీవ్ పొందే సౌకర్యం కల్పించింది స్వీడెన్ ప్రభుత్వం. పేరెంటల్ లీవ్‌లో ఉదారంగా ఉండే స్వీడన్ ఇప్పుడు మరింత ఉదారంగా వ్యవహరించింది. పసి పిల్లలను చూసుకునే తల్లి దండ్రులకు ప్రభుత్వం ఇచ్చే 16 మాసాలపాటు వేతనంతో కూడిన పేరెంటల్ లీవ్‌ను తల్లి దండ్రులిరువురూ షేర్ చేసుకోవడానికి మాత్రమే ఇప్పటివరకు అనుమతించేవారు. ఈ నెల ఒకటి నుంచి ఈ పేరెంటల్ లీవ్స్‌లో తల్లిదండ్రులకు మాత్రమే కాకుండా మూడవ పార్టీకి కూడా కేటాయించుకోవడానికి ప్రభుత్వం వీలు కల్పించింది. తల్లి 45 రోజులు, తండ్రి 45 రోజులు మొత్తం మీద 90 రోజుల దాకా పేరెంటల్ లీవ్స్‌ను తాతలకు, లేదా అత్త మామలకు, ఇంట్లో పిల్లల బాగోగులు చూసుకునే ఎవరికైనా ఆ తల్లి దండ్రులు కావాలనుకుంటే ఇచ్చుకోవచ్చు. ఈ మేరకు స్వీడన్ ప్రభుత్వం ఒక కొత్త చట్టాన్ని తీసుకొచ్చింది.

ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలు

- చార్‌ధామ్ యాత్ర వాయిదా

న్యూఢిల్లీ : ఉత్తరాఖండ్‌ను భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. ప్రధాన నదులన్నీ ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయి. పలు చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. రాష్ట్రంలోని 9 జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు భారత వాతావరణశాఖ ఆదివారం రెడ్ అలర్ట్ జారీ చేసింది. భారీ వర్షాల నేపథ్యంలో చార్‌ధామ్ యాత్రను వాయిదా వేసినట్లు గర్వాల్ కమిషనర్ వినయ్ శంకర్ పాండే తెలిపారు. చమోలీ జిల్లాలోని బద్రీనాథ్ నేషనల్ హైవేపై పలు చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

బీహార్‌లో పిడుగుపాటుకు ఒకే రోజు 10 మంది మృతి

పాట్నా : ఉరుములు మెరుపులతో కూడిన పిడుగుల వర్షం బిహార్ ప్రజల్ని భయకంపితుల్ని చేస్తోంది. గత రెండు వారాల్లో పిడుగులు పడి దాదాపు 40 మంది చనిపోయారు. తాజాగా మరో 10 మంది బలైపోయారు. ఆదివారం సాయంత్రం 5 గంటలకు గడిచిన 24 గంటల వ్యవధిలో వేర్వేరు చోట్ల పిడుగులు పడిన ఘటనల్లో 10 మంది చనిపోయినట్లు బీహార్ సిఎం నీతీశ్ కుమార్ కార్యాలయం వెల్లడించింది. నలంద జిల్లాలో ఇద్దరు మతిచెందగా.. వైశాలి, భాగల్‌పుర్, సహర్స, రోహ్తాస్, సరన్, జమూయి, భోజ్‌పుర్, గోపాల్‌గంజ్‌లలో ఒక్కొక్కరు చొప్పున ప్రాణాలు విడిచినట్లు పేర్కొంది. పిడుగుపాటు మృతుల కుటుంబాలకు ఒక్కొ కుటుంబానికి రూ.4 లక్షల చొప్పున పరిహారం అందజేస్తామని ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ప్రకటించారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలను ఆయన కోరారు.

కుల్గాంలో జంట ఎన్‌కౌంటర్లు

- ఇద్దరు భద్రతా సిబ్బంది..
- ఆరుగురు ఉగ్రవాదులు మృతి
- రాజౌరిలో జవాన్‌కు గాయాలు

జమ్ము : జమ్ముకాశ్మీర్‌లోని కుల్గాం జిల్లాలో ఆదివారం జరిగిన రెండు వేర్వేరు ఎన్‌కౌంటర్లలో ఇద్దరు భద్రతా సిబ్బంది, ఆరుగురు ఉగ్రవాదులు మరణించారు. అలాగే రాజౌరిలో జరిగిన ఉగ్రదాడిలో ఒక జవాన్ తీవ్రంగా గాయపడ్డారు. ఆరుగుర్ని చంపడం ఉగ్రవాదుల ఏరివేతలో ప్రధానమైన ముందడుగుగా జమ్ముకాశ్మీర్ డిజిపి ఆర్‌ఆర్ స్వైన్ పేర్కొన్నారు.. కుల్గాంలోని చినిగాం, మోటర్‌గామ్ ప్రాంతాల్లో ఉగ్రవాదులు ఉన్నారనే సమాచారం అందడంతో శనివారం నుంచి . పోలీసులు, సైన్యం సంయుక్తంగా గాలింపు చర్యలు చేపట్టాయని అన్నారు. తనిఖీలు చేస్తున్న భద్రతా సిబ్బందిపై ఉగ్రవాదులు ఒక్కసారిగా కాల్పులు జరపడంతో సిబ్బంది కూడా ఎదురు కాల్పులు జరిపారని డిజిపి తెలిపారు. చినిగాంలో ఒకరు, మోటర్‌గామ్‌లో ఒకరు మొత్తం ఇద్దరు సైనికులు ఎన్‌కౌంటర్లలో మృతి చెందినట్లు చెప్పారు. చనిపోయిన జవాన్లను లాన్స్ నాయక్ పర్దీప్ కుమార్, సిపాయి ప్రవీణ్ జంజల్ ప్రభాకర్‌గా గుర్తించారు. రాజౌరిలోని ఆర్మీ పోస్ట్‌పై ఆదివారం ఉగ్రవాదులు జరిపిన దాడిలో ఒక సైనికుడు తీవ్రంగా గాయపడ్డారు.

కూటమిలో 'నామినేటెడ్' పంపకాలు

- పదవులు కోరుతున్న జనసేన, బీజేపీ

అమరావతి : రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న నామినేటెడ్ పోస్టుల పంపకాలపై టీడీపీ కూటమిలో చర్చలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న వివరాలను సోమవారం ఉదయంలోపు అందించాలని సాధారణ పరిపాలనశాఖ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. వీటితోపాటు సొసైటీ, ప్రత్యేక బాడీల్లో ఉన్న పోస్టుల వివరాలు కూడా అందించాలని తెలిపింది. దీంతో కూటమిలోని పార్టీలు ఏ పార్టీకి ఎన్ని పోస్టులు ఇవ్వాలి, ఏ పోస్టులు ఎవరికి ఇవ్వాలి అనే అంశంపై కసరత్తు జరుగుతోంది. వివిధ శాఖల్లో సుమారు 95 కార్పొరేషన్ ఛైర్మన్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు సమాచారం. వీటిల్లో 25 ఛైర్మన్ పోస్టులు జనసేన కోరినట్లు తెలిసింది. అయితే జనసేనకు, బీజేపీకి ఎన్ని కేటాయిస్తారనేది తెలియాల్సి ఉంది. 2014-19 టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో బీజేపీకి, జనసేనకు ఎలాంటి కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు ఇవ్వలేదు. జనసేన కూడా ప్రత్యక్షంగా ఎన్నికల్లో పోటీ చేయకపోవడంతో ఈ ప్రస్తావన కూడా రాలేదు. ఇప్పుడు కూటమిలో ఎవరికి ఏం కేటాయిస్తారనేది వేచిచూడాల్సి ఉంది. టిడిపిలో నామినేటెడ్ పోస్టులు కోరుతున్న వారిలో ఆశావహులు భారీగానే ఉన్నారు. మూడేళ్ల వరకు ఎమ్మెల్సీ పోస్టులు కూడా ఖాళీ అయ్యే అవకాశం లేదు. కేవలం ఐదు ఖాళీలు మాత్రమే వచ్చే ఏడాది రానున్నాయి. మాజీ మంత్రులు, సీనియర్ నాయకులు కూడా నామినేటెడ్ పోస్టులను దక్కించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే టిడిపి కార్యాలయంలో ఆశావహుల నుంచి దరఖాస్తుల స్వీకరణ జరుగుతోంది. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో పార్టీకి ఎవరు ఎలా పనిచేశారన్న అంశం ప్రాతిపదికగా అంతర్గతంగా ర్యాంకులు ఇవ్వాలని యోచిస్తోంది. ఇందుకు అనుగుణంగా పదవుల్లో అవకాశం ఇవ్వాలని చూస్తోంది. ఆశావహుల నుంచి వచ్చిన దరఖాస్తులను తొలుత టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ స్క్రూటినీ చేస్తారని టీడీపీ నాయకులు చెబుతున్నారు. అనంతరం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు తుది నిర్ణయం తీసుకుంటారని అంటున్నారు.

కేసుల విచారణలో మరింత జాప్యం

- కొత్త క్రిమినల్ చట్టాలపై న్యాయ నిపుణుల ఆందోళన
- పాత వాటికే కొత్త పేర్లు, చిక్కులు చేర్చారని విమర్శ

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా ఇప్పటికే అపరిష్కృత కేసులు గుట్టలుగుట్టలుగా ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చామని చెబుతున్న భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బిఎన్ఎస్ఎస్), భారతీయ న్యాయ సంహిత (బిఎస్ఎన్), భారతీయ సాక్ష్య అధినియం (బిఎస్ఎ)తో కేసుల విచారణ మరింత జాప్యం జరుగుతుందని ప్రముఖ న్యాయవాది ఇందిరా జైసింగ్ వంటి న్యాయ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బిఎస్ఎన్ఎస్, బిఎస్ఎన్, బిఎస్ఎ ప్రభుత్వం చెబుతున్నట్లుగా కొత్తగా రూపొందించిన చట్టాలేమీ కాదు. వలస పాలకుల కాలం నాటి పాత చట్టాలలోని దాదాపు తొంభై ఐదు శాతం నిబంధనలనే కొత్త చట్టాలలో ఉంచారు. ఒక్క మాటలో చెప్పాలంటే కొత్త చట్టాలు పాత చట్టాలకు ప్రతిరూపాలేనని నిపుణులు తేల్చేశారు. కాకపోతే కొన్ని కొత్త చిక్కు ముడులు చేర్చి..పేర్లు మాత్రం మార్చారు. హిందూత్వ అజెండాలో భాగంగానే చట్టాల పేర్లను హిందీ-సంస్కృత భాషల్లోకి మార్చారు. దీనివల్ల న్యాయ వ్యవస్థకు కొత్త చిక్కులు తెచ్చిపెట్టినట్లు అయ్యింది.



ఇందిరా జై సింగ్
ప్రముఖ న్యాయవాది



నిపున్ సక్సేనా
సుప్రీంకోర్టు న్యాయవాది



అసిఫ్ ఆలీ
కేరళ మాజీ డిజిపి

వాటిపై పాత చట్టాల ప్రకారమే విచారణ

నూతన చట్టాలు ఈ నెల 1వ తేదీన అమలులోకి వచ్చాయి. నేషనల్ జ్యూడీషియల్ గ్రిడ్ అంచనాల ప్రకారం ఆ రోజుకు దేశంలోని వివిధ న్యాయస్థానాలలో 3.6 కోట్ల క్రిమినల్ కేసులు పెండింగులో ఉన్నాయి. వీటిలో 3.4 కోట్ల కేసులు జిల్లా, తాలూకా కోర్టులలో అపరిష్కృతంగా ఉన్నవే. హైకోర్టులలో 17 లక్షలు, సుప్రీంకోర్టులో 18,122 కేసులు పెండింగులో ఉన్నాయి. ఈ కేసులన్నీ పాత చట్టాల ప్రకారం నమోదైనవేనని, 10 నుండి 12 సంవత్సరాలుగా విచారణలో ఉన్నాయని, కాబట్టి పాత చట్టాల ప్రకారమే వీటిపై విచారణ జరిపి తీర్పులు ఇవ్వాల్సి ఉంటుందని సుప్రీంకోర్టులో ప్రముఖ న్యాయవాది అయిన ఇందిరా జైసింగ్ తెలిపారు. అయితే కథ అక్కడితోనే ముగిసిపోలేదు. 'పాత చట్టాల ప్రకారం విచారణ జరిపినప్పుడు సమస్య మరింత పెరుగుతుంది. ఎందుకంటే వీటిపై పునరాలోచన జరపాలన్న డిమాండ్ ముందుకు రావచ్చు. ఈ నెల 1వ తేదీకి ముందు విచారణలో ఉన్న ప్రతి కేసులోనూ పాత చట్టాలే తమకు మేలు చేస్తాయని నిందితులు భావిస్తే వారు వాటి ప్రకారమే తమ కేసులను విచారించాలని కోరతారు. అయితే అదే సమయంలో పోలీసులు నూతన చట్టాల ప్రకారం విచారణ జరపాలని కోరవచ్చు. ఈ చిక్కుముడిని ఎవరు విప్పుతారు? అందుకు ఎంతకాలం పడుతుంది?' అని ఇందిరా ప్రశ్నించారు.

అన్నీ చిక్కుముడులే

నూతన చట్టాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసిన నిపున్ సక్సేనా కూడా ఇందిరా జైసింగ్ అభిప్రాయాలతో ఏకీభవించారు. ఆయన మరికొన్ని సమస్యలను కూడా ముందుకు తెచ్చారు. 'కొత్త చట్టాలతో విచారణ జరిపితే అది మరింత జాప్యానికి కారణమవుతుంది. ఎందుకంటే అవి స్వభావపరంగా అస్పష్టంగా ఉన్నాయి. ఈ నెల 1వ తేదీతో నిందితుడి పోలీస్ రిమాండ్ పూర్తయిందని అను కుందాం. అప్పుడు పోలీసులు ఏమంటారు? బిఎన్ఎస్ఎస్‌లోని సెక్షన్ 187 లేదా రిమాండ్ చట్టం ప్రకారం నిందితుడిని మరికొంత కాలం రిమాండులో ఉంచాలని వారు కోరతారు. నిందితుడు మాత్రం దీనికి అంగీకరించడు. జూలై 1వ తేదీకి ముందు విచారణలో ఉన్న కేసులను సీఆర్‌పీసీ కిందనే పరిష్కరించాలని బిఎన్ఎస్ఎస్‌లోని సెక్షన్ 531 చెబుతోంది. అయితే ఇది కూడా పెద్దగా ఉపయోగపడదు. ఎందుకంటే రిమాండ్ గడువు ఆ తేదీకి ముగిసే కేసులకు మాత్రమే అది వర్తిస్తుంది. ఏదో ఒక నిర్ణయం తీసుకునేందుకు కాల పరిమితి పెండింగులో ఉంటే అప్పుడు ఏ చట్టాన్ని వర్తింపచేస్తారు? చట్టపరమైన మార్గదర్శకం లేనప్పుడు ఏ చట్టాన్ని వర్తింపచేయాలో న్యాయమూర్తే నిర్ణయించాల్సి ఉంటుంది' అని ఆయన చెప్పారు.

సిఆర్‌పిసి కొనసాగాల్సిందే

న్యాయ వ్యవస్థలో భాగంగా పాత చట్టాలను ఎలా కొనసాగిస్తారని నిపున్ సక్సేనా ప్రశ్నించారు. 'ట్రయల్ కోర్టులో క్రిమినల్ కేసు విచారణకు సగటున ఐదు నుండి ఏడు సంవత్సరాలు పడుతుంది. నిందితులు, సాక్షులు, స్వాధీనం చేసుకున్న పత్రాలు, వస్తువుల సంఖ్య ఎక్కువగా ఉంటే విచారణకు మరింత సమయం పడుతుంది. సిఆర్‌పిసి కింద నమోదైన కేసులో అప్పీలు కానీ, రివిజన్ పిటిషన్ కానీ వస్తే దాని ప్రకారమే విచారణ కొనసాగించాలి తప్ప బిఎన్ఎస్ఎస్ కింద కాదని బిఎన్ఎస్ఎస్‌లోని సెక్షన్ 531 చెబుతోంది. అంటే దిగువ కోర్టు నుండి అత్యున్నత న్యాయస్థానం వరకూ వచ్చే అప్పీళ్లు, రివిజన్లపై సిఆర్‌పిసి కిందే విచారణ జరుగుతుంది. ఈ విచారణలు పూర్తి కావాలంటే మరో 20 సంవత్సరాలు పడుతుంది. కాబట్టి మ్యాజిక్ మంత్రదండంతో సిఆర్‌పిసిని చెరిపివేయలేము. అది చివరి కేసు పరిష్కారమయ్యేంత వరకూ...అంటే మరో 20-30 సంవత్సరాలు మనుగడలోనే ఉంటుంది' అని ఆయన వివరించారు.

పోలీసులకూ తలనొప్పే

కొత్త చట్టాలు పోలీసులకు సైతం తలనొప్పులు తెచ్చిపెడతాయి. వాటిలోని నిబంధనలను పాటించేందుకు ప్రభుత్వాలు సంసిద్ధంగా లేవని కేరళ మాజీ డిజిపి అసిఫ్ ఆలీ చెప్పారు. 'రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన చట్టం ప్రకారం...అని అనేక నిబంధనల్లో రాశారు. ఇది మరింత గందరగోళానికి దారితీస్తుంది. ఎందుకంటే ప్రత్యేక పరిస్థితులకు సంబంధించిన కేసుల విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చట్టాలను రూపొందించలేదు. ఓ క్రమాన్ని కూడా నిర్దేశించలేదు' అని ఆయన వివరించారు. కొత్త చట్టాలు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ గురించి చెబుతున్నాయని, అయితే అనేక పోలీస్ స్టేషన్లలో దాని అమలుకు అవసరమైన మౌలిక సదుపాయాలు లేవని గుర్తు చేశారు. 'జీరో ఎఫ్ఐఆర్‌లు అమలులోకి వస్తే అన్నీ ఆన్‌లైన్ ద్వారానే జరుగుతాయి. అయితే ఈ దేశంలో ఎన్ని పోలీస్ స్టేషన్లకు ఆ సౌకర్యం ఉంది? అలాంటి సౌకర్యాలను ఎలా ఉపయోగించుకోవాలో ప్రజలకు తెలుసా?' అని ప్రశ్నించారు. ఏదైనా కేసులో స్వాధీనం చేసుకున్న పత్రాలను డిజిటలీకరించడం గ్రామాలు, పట్టణాలలో పనిచేస్తున్న పోలీసులకు తెలియదు. వారికి ఆ సాంకేతిక పరిజ్ఞానం ఉండదు.

సంప్రదింపులేవి?

నూతన క్రిమినల్ చట్టాలను రూపొందించడానికి ముందు వాటిపై ప్రభుత్వం విస్తృత స్థాయిలో సంప్రదింపులు జరపలేదు. కనీసం పార్లమెంటులో అయినా సభ్యులందరి అభిప్రాయాలు తీసుకోలేదు. హడావిడిగా బిల్లును ఆమోదింపజేసుకున్నారు. చట్టాలు చేసేటప్పుడు వాటి కారణంగా భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలను ముందుగానే గుర్తించి, తగిన చర్యలు తీసుకుంటే ఇలాంటి ఇబ్బందులు తలెత్తవు.

పుంగనూరులో ఇండోర్ స్టేడియం నేలమట్టం

- ప్రతీకార చర్యలా?
- అక్రమ కట్టడాలని కూల్చేశారా?

పుంగనూరు : చిత్తూరు జిల్లా పుంగనూరు పట్టణంలో ఏళ్ల తరబడి ఉన్న ఇండోర్ స్టేడియంను శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రెండు హిటాచీలతో నేలమట్టం చేశారు. ఎంపిటి రోడ్డు జాతీయ రహదారి పక్కలో ఉన్న ఇండోర్ స్టేడియం గత 30 ఏళ్లగా పట్టణంలో ఉన్న అన్నివర్గాల వారు ఉపయోగించుకుంటున్నారు. ఈ ఇండోర్ స్టేడియంలో షటిల్, స్నూకర్స్, క్యారమ్స్, చెస్ లాంటి క్రీడలకు వినియోగించుకుంటున్నారు. ఉన్నఫలంగా ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా షటిల్ కోర్టును నేలమట్టం చేయడంతో పట్టణంలో ఈ వార్త దావనంలో అల్లుకుంది. ప్రతీకార చర్యలో భాగంగా జరిగిందా! లేక అక్రమ కట్టడాలని ప్రభుత్వ అధికారులు ఏమైనా కూలదోసారా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అర్ధరాత్రిలో జరిగిన ఈ విధ్వంసకర సంఘటనను పట్టణ ప్రజలు, క్రీడాకారులు ముక్తకంఠంతో ఖండిస్తున్నారు. సుమారు ఈ స్టేడియంలో 150 మంది దాకా షిఫ్ట్ పద్ధతిలో షటిల్ ఆడేవారు. పోలీసులు, వైద్యులు, న్యాయవాదులు, ప్రభుత్వ ఉద్యోగులు ఉదయం సాయంత్రం వేళల్లో ఈ షటిల్ కోర్టుకు వెళ్లేవారు. టికెటి స్థలంలో 30 ఏళ్ల క్రితం ఏడు గుంటలు



జాగాలో (7623 చదరపు అడుగులు) అప్పటి ప్రభుత్వ అధికారులు అనుమతితో షటిల్ కోర్టుగా ఏర్పాటు చేసుకుని ఆటలకు ఉపయోగిస్తున్నారు. ఆ తర్వాత సుమారు రూ.80 లక్షలు ఖర్చుచేసి ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేసుకున్నారు. పిల్లలకు ఉచిత శిక్షణ కూడా ఇండోర్ స్టేడియంలో ఇచ్చేవారు.

షటిల్ ఫ్రెండ్స్ అసోసియేషన్ అని ఏర్పాటు చేసుకొని దీని ద్వారా కార్యక్రమాలు నిర్వహించేవారు. ఇండోర్ స్టేడియం నేలమట్టం చేయడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయపరంగా ఏమైనా చేశారా, లేక షటిల్ కోర్టు ఉన్న స్థలం డికెటి కావడంతో దాని వెనుక వైపు ఉన్న స్థల యజమాని ఏమైనా చేశారా అని పలువురు అనుమానాలు వ్యక్తపరుస్తున్నారు. ఈ సంఘటనపై పోలీసులకు ఫ్రెండ్స్ సెటిల్ అసోసియేషన్ అధ్యక్షులు, ప్రముఖ దంత వైద్యనిపుణులు డాక్టర్ శరన్ కుమార్ ఫిర్యాదు చేశారు.

గాజాలో ఆకలి విపత్తు

- ఆహారం దొరక్క 5లక్షల మంది విలవిల
- 10వ నెలకు చేరిన ఇజ్రాయిల్ దాడి



గాజాసిటీ: అమెరికా, ఇతర పశ్చిమ దేశాల మద్దతుతో గాజాలో ఇజ్రాయిల్ దాడులకు ఆదివారంతో తొమ్మిది నెలలు పూర్తయ్యాయి. ఈ దాడి ఫలితంగా గాజాలో 5 లక్షల మంది ప్రజలు ఆకలి విపత్తును ఎదుర్కొంటున్నారని ఐరాస ఏజెన్సీలు చెబుతున్నాయి.భీకర వైమానిక దాడులు ఇప్పుడు పదవ నెలలోకి ప్రవేశించాయి. ఇప్పటివరకు 38,098 మంది చనిపోయారు. మరో 87, 705 మంది గాయపడ్డారు. వీరిలో ఎక్కువ మంది మహిళలు, పిల్లలు. ఈ దాడి గాజాలో 90 శాతం మంది పాలస్తీనీయులను శరణార్థులుగా మార్చింది.ఇళ్లు,ఇతర మౌలిక సదుపాయాలను నాశనం చేసింది.పాలస్తీనా భూ భాగం అంతటా పోరాటం ఉధృతంగా ఉండడంతో హింసను ఆపడానికి తాజా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇటీవల దోహాలో ఖతార్ మధ్యవర్తిత్వంలో ప్రారంభమైన సంధి చర్చల్లో తన ప్రతినిధి బృందం పాల్గొంటుందని ఇజ్రాయిల్ తెలిపింది. నెతన్యాహు ప్రతినిధి మాట్లాడుతూ, కాల్పుల విరమణ, బందీల విడుదల ఒప్పందం ఎలా ఉండాలనేదానిపై కొన్ని అస్పష్టతలున్నాయని అన్నారు. వచ్చే వారం ఇజ్రాయిల్ ప్రతినిధి బృందం దోహాకు వెళ్లనున్నట్లు ఆ ప్రతినిధి తెలిపారు.

పూరీలో జగన్నాథ రథయాత్ర ప్రారంభం



పూరీ : వేలాదిగా తరలివచ్చిన భక్తుల మధ్య పూరీలో జగన్నాథ రథయాత్ర ఆదివారం ప్రారంభమయింది. వేరువేరు రథాల్లో కొలువుతీరిన జగన్నాథుడు, బలభద్రుడు, దేవి సుభద్రలను పూరీ శంకరాచార్య స్వామి నిశ్చలానంద సరస్వతి తన శిష్యులతో దర్శించుకున్న తరువాత, పూరీ రాజు బంగారు చీపురుతో రథాలను శుభ్రం చేసిన తరువాత సాయంత్రం 5:20 గంటలకు ఈ యాత్ర ప్రారంభమయింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఒడిశా గవర్నర్ రఘుబర్ దాస్, ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌లు రథం యొక్క తాళ్లను లాగి ఈ యాత్రను ప్రారంభించారు. ముందుగా బలభద్రుడు, తరువాత దేవి సుభద్రా, జగన్నాథుడి రథాలు సాగుతాయి. జగన్నాథుడి ఆలయం నుంచి 2.5 కిలోమీటర్ల దూరంలో ఉన్న గుండిచా ఆలయం వరకూ ఈ యాత్ర సాగుతోంది. రథాల ముందు కళాకారుల బృందాలు పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ ముందుకు సాగాయి. వేలాది మంది 'జై జగన్నాథ్' అంటూ నినాదాలు చేస్తూ రథయాత్ర వెంటసాగారు. ఈ రథయాత్ర కోసం పూరీ పట్టణానికి దాదాపు 10 లక్షల మంది తరలివచ్చి ఉంటారని అంచనా. అలాగే, 53 ఏళ్ల తరువాత ఈ రథయాత్రను రెండు రోజుల పాటు నిర్వహించనున్నారు. కేవలం రథయాత్ర ప్రాంతంలోనే 180 ప్లాటూన్ల (ఒక ప్లాటూన్‌లో 30 మంది సిబ్బంది ఉంటారు) సిబ్బందిని మోహరించినట్లు పూరీ ఎస్‌పి పినాక్ మిశ్రా తెలిపారు. కృత్రిమ మేథస్సు ఆధారిత సిసిటివి కెమెరాలను పూరీ వ్యాప్తంగా ఏర్పాటు చేసినట్లు ఏడీజీ (శాంతిభద్రతలు) సంజయ్‌కుమార్ తెలిపారు. పూరీ పట్టణంతో పాటు సముద్ర తీరం వెంబడి మొత్తం 46 అగ్నిమాపక యంత్రాలను ఏర్పాటు చేసినట్లు అగ్నిమాపక శాఖ డిజి సుధాంశు సారంగి తెలిపారు. అలాగే అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో యాత్రీకులపై నీళ్లు చిలకరించినట్లు చెప్పారు.

రథయాత్రలో అపశృతి

- ఊపిరాడక ఒకరి మృతి..పలువురికి గాయాలు

రథయాత్రలో అపశృతి చోటు చేసుకుంది. రథం లాగుతుండగా భారీ జనం మధ్యలో ఒక భక్తుడు ఊపిరాడక ప్రాణాలు కోల్పోయాడు. మృతుడ్ని ఇంకా గుర్తించలేదు. దాదాపు 300 మందికి స్వల్పగాయలైనట్లు సమాచారం. గాయాల పాలైన వారిని స్థానిక ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. గాయపడిన వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

గవర్నర్ ఆదేశాలు పాటించలేదంటూ కొల్‌కతా కమిషనర్, డిసిపిపై వేటు

న్యూఢిల్లీ : పశ్చిమ బెంగాల్‌లో గవర్నర్ రాజ్ కొనసాగుతోంది. గవర్నరు కార్యాలయ ఆదేశాలను పాటించలేదనే అభియోగాలతో కొల్‌కతా పోలీసు కమిషనర్ వినీత్ గోయల్, డిసిపి ఇందిరా ముఖర్జీలపై కేంద్ర హోంమంత్రిత్వ శాఖ క్రమ శిక్షణా చర్యలకు దిగింది. గవర్నర్ కార్యాలయంపై అవాస్తవాలను ప్రచారం చేయడమే అందుకు కారణమని కేంద్ర హోంమంత్రిత్వశాఖకు చెందిన అధికారులు పేర్కొన్నట్లు కథనాలు వెలువడ్డాయి. సిపి, డిసిపిలు ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ప్రవర్తించారని.. అందుకు గల కారణాలను వివరిస్తూ గవర్నర్ సివి ఆనంద్ బోస్ కేంద్ర మంత్రిత్వ శాఖకు నివేదికను సమర్పించారు. లోక్‌సభ ఎన్నికల అనంతరం జరిగిన హింస బాధితులతో కలిసి అసెంబ్లీలో ప్రతిపక్ష (బిజెపి) నేత సువేందు అధికారి తనను కలిసేందుకు వచ్చినప్పుడు పోలీసు సిబ్బంది వారిని అనుమతించలేదు. రాజ్‌భవన్‌లో పోలీసు సిబ్బంది ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని గవర్నర్ ఆదేశాలను లెక్క చేయడం లేదని పేర్కొన్నారు. వారి ప్రవర్తన ఆల్ ఇండియా సర్వీసెస్ నియమాలు, ప్రోటోకాల్ మాన్యువల్‌కు అనుగుణంగా లేవని గవర్నర్ నివేదికలో పేర్కొన్నారు. ఈ నివేదికను పరిశీలించిన కేంద్ర హోంశాఖ.. ఆ ఇద్దరు అధికారులపై క్రమశిక్షణ చర్యలకు సిద్ధమైంది. ఇందుకు సంబంధించిన పత్రాలను ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి పంపించినట్లు సమాచారం. అయితే, ఇప్పటివరకు తమకు ఎలాంటి సమాచారం అందలేదని వినీత్ గోయల్, ఇందిరా ముఖర్జీలు పేర్కొనడం గమనార్హం.

ఫ్రాన్స్‌లో ఆధిక్యంలో లీపెన్

- గట్టి పోటీ ఇస్తున్న న్యూ పాపులర్ ఫ్రంట్
- రెండో రౌండ్‌లో స్వల్పంగా పెరిగిన పోలింగ్



పారిస్: ఫ్రాన్స్ పార్లమెంటు రెండో రౌండ్ ఎన్నికలకు సంబంధించి ప్రాథమికంగా అందిన సమాచారాన్ని బట్టి మెరైన్ లీపెన్ నేతృత్వంలోని నియో ఫాసిస్టు పార్టీ నేషనల్ ర్యాలీ (ఆర్ఎన్) ఆధిక్యంలో ఉంది. అయితే, 577 సీట్లు ఉన్న పార్లమెంటులో సాధారణ మెజార్టీకి అవసరమైన 289 స్థానాలు ఏ పార్టీకి లేదా కూటమికి దక్కే సూచనలు కనబడడం లేదు. ఒక ఫాసిస్టు పార్టీ అధికారానికి దగ్గరగా రావడం రెండో ప్రపంచ యుద్ధం తరువాత ఇదే మొదటిసారి. ఇయు ఎన్నికల్లోనూ ఫ్రాన్స్ నుంచి అది అతిపెద్ద పార్టీగా అది నిలిచింది. ఇమ్మిగ్రెంట్ హిస్టీరియాను రెచ్చగొట్టడం ద్వారా జీవనోపాధి, అధిక ధరలు వంటి సమస్య నుంచి ప్రజల దృష్టిని మళ్లింపజేసింది. లీపెన్ పార్టీ ఫాసిస్టు ఎజెండాకు ప్రత్యామ్నాయంగా సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య పరిరక్షణ వంటి అంశాలతో ముందుకొచ్చిన న్యూ పాపులర్ ఫ్రంట్ (ఎన్‌పిఎఫ్) ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసింది. కమ్యూనిస్టు పార్టీ, సోషలిస్టు పార్టీ, గ్రీన్స్, ఫ్రాన్స్ అన్‌బౌండ్ వంటి వామపక్ష ప్రగతిశీల శక్తులతో కూడిన పాపులర్ ఫ్రంట్ మొదటి రౌండ్‌లో 28.1 శాతం ఓట్లతో రెండవ స్థానంలో నిలిచింది. నేషనల్ ర్యాలీ తో పోల్చితే ఓట్ల తేడా కేవలం 5శాతం మాత్రమే. రెండవ రౌండ్‌లో పాపులర్ ఫ్రంట్ తన ఓటింగ్ బలాన్ని కొంత మేర పెంచుకుంది. అధ్యక్షుడు ఇమానియెల్ మాక్రాన్ నాయకత్వంలోని రినైజాన్స్ పార్టీకి రెండో రౌండ్‌లోనూ పరాభవం తప్పలేదు.మాక్రాన్ పార్టీకి ఫ్రెంచ్ ప్రజలు గట్టిగానే బుద్ధి చెప్పారు. ఉక్రెయిన్ యుద్ధానికి దళాలు, నిధులు సమకూర్చిన మాక్రాన్, దేశీయంగా పొదుపు చర్యల పేరుతో సామాజిక సంక్షేమంపై ఎడాపెడా కోత పెట్టారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా 2018-19లో యెల్లో వెస్ట్ ఉద్యమం పెద్దయెత్తున సాగింది. 577 సీట్లు ఉన్న ఫ్రాన్స్ పార్లమెంటులో మొదటి రౌండ్‌లో 76 మంది ఎన్నిక కాగా, మిగతా 506 స్థానాలకు రెండో రౌండ్‌లో ఎన్నికలు జరిగాయి. పార్లమెంటులో సాధారణ మెజార్టీ సాధించాలంటే కనీసం 289 సీట్లు రావాలి. ఈ మ్యాజిక్ పిగర్‌ను ఏ పార్టీ లేదా కూటమి సాధించే స్థితి కనబడడం లేదు. పోలింగ్ సరళి చూస్తే మొదటి రౌండ్ కన్నా రెండో రౌండ్‌లో కొంచెం ఎక్కువ ఓట్లు పోలయ్యాయి. ఉదయం 7 గంటల నుంచి రాత్రి 8 వరకు పోలింగ్ జరిగింది. మధ్యాహ్నానికి 26.68శాతం, సాయంత్రం 5 గంటలకు 59.71 శాతం ఓట్లు పోలైనట్లు ఆంతరంగిక శాఖ తెలిపింది.

రాజస్థాన్ బీజేపీలో ముసలం

- మంత్రి పదవికి సీనియర్ నేత గుడ్‌బై

జైపూర్ : రాజస్థాన్ బీజేపీలో ముసలం పుట్టింది. సీనియర్ నేత కిరోడీ లాల్ మీనా మంత్రి పదవికి రాజీనామా చేశారు. తూర్పు రాజస్థాన్‌లోని ఏడు లోక్‌సభ స్థానాల్లో ఏ ఒక్క దానిని బీజేపీ కోల్పోయినా మంత్రి పదవికి రాజీనామా చేస్తానని చెప్పానని, అయితే నాలుగు స్థానాల్లో పార్టీ ఓడిపోవడంతో రాజీనామా చేశానని మీనా తెలిపారు. అయితే మీనా పైకి ఎన్ని చెబుతున్నప్పటికీ ఆయన రాజీనామాకు వేరే కారణాలు కన్పిస్తున్నాయి. పార్టీ నాయకత్వం తనను పట్టించుకోవడం లేదని ఆయన భావిస్తున్నారు. మీనా రాజీనామాను ఇంకా ఆమోదించలేదు. ఢిల్లీకి రావాలని పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా కబురు పంపారు.పార్టీ నాయకత్వంపై మీనా చాలా కాలం నుండి కినుక వహిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో తన సోదరుడికి టిక్కెట్ నిరాకరించడం ఆయనను బాధించింది. తన వయసు వారే అయిన ఇద్దరు నాయకులకు ఉప ముఖ్యమంత్రి పదవులు కట్టబెట్టి తనకు మొండిచేయి చూపడం కూడా ఆయనకు ఆగ్రహం కలిగించింది. మీనా ఆరుసార్లు ఎమ్మెల్యేగా పనిచేశారు. రెండుసార్లు లోక్‌సభకు, ఒకసారి రాజ్యసభకు ఎన్నికయ్యారు. క్యాబినెట్‌లో మీనాకు వ్యవసాయ శాఖ ఇచ్చారు. సాధారణంగా ఈ శాఖను నిర్వహించే మంత్రికే గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖలు కూడా అప్పగిస్తారు. అయితే ఆ రెండు శాఖలనూ వేరే వారికి అప్పగించారు. రాజస్థాన్‌లో ఇప్పటికే వసుంధర రాజెను బీజేపీ నాయకత్వం పక్కన పెట్టింది. తన అడుగులకు మడుగులొత్తే భజన్ లాల్ శర్మను ముఖ్యమంత్రిని చేసింది.